# అనన్య

## నవల

## కెపెస్వ





శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 53






## 1

"అనన్యా! అనన్యా!"

కొండ కోనలు పిలుస్తున్నాయి.

ఆ పిలుపు ఇంకెవ్వరికీ వినిపించడంలేదు.

ఒక్క అనన్యకే వినిపిస్తోంది.

గుండె చప్పుడులో మంద్ర స్థాయిలో సుతిమెత్తగా మృదుమధురంగా ప్రతిధ్వనిస్తోంది ఆ పిలుపు.

"అనన్యా! ఐ లవ్ యూ!.."

కొండ కోనల పురాతన వైభవమూ ఆర్తీ దాగున్నాయి ఆ పిలుపులో "అనన్యా!"

కొండ కోనల కిందనుంచి ప్రతిధ్వని గొంతులోపలి గొంతు లోంచి దూసుకొస్తోంది.

"అనన్యా! నువ్వెవరో నాకు తెలుసు. నేనెవరో నీకు తెలుసా?.."

అదే ప్రతిధ్వని చిత్రవిచిత్రంగా మాటలు మారి వేరే రకంగా వినిపిస్తోంది.

"అనన్యా! నువ్వెవరో నాకు తెలియదు. నేనెవరో నీకూ తెలియదు.. కదూ?"

తెలుసు అన్న వెంటనే గుండె లయ తప్పి తెలియదు అని కొట్టుకుంటోంది. తెలియదు. ఎవరో నువ్వెవరో నాకు తెలియదు. నువ్వెవరో ఎందుకు నన్ను పిలుస్తున్నావో తెలియదు. ఎందుకు నన్ను కలవరిస్తున్నావో నన్ను ఎక్కడికి లాగుతున్నావో తెలియదు.

నన్నిలా లాగుతున్న నువ్వు ఎవరు? ఇంతకీ ఎక్కడున్నావు? ఎలా ఉంటావు?

నువ్వు కేవలం ఒక మగాడివా?

నా కోసమే ఎదురు చూస్తున్న అనాది పురుషుడివా?

నాలోని స్త్రీత్వం అణువణువూ ఎదురు చూస్తున్నది నీకోసమేనా?

నువ్వెవరు? ఎక్కడివాడివి? ఎవరూ? ఎక్కడా?

******

ఊటీలో షూటింగ్ స్పాట్.

టూరిస్టులు ఉల్లాసంగా చూస్తున్నారు.

'ఓ' టీవీ ఛానల్ కెమెరా అనన్యను అనుసరించి వస్తోంది. టీవీ కెమెరాలోకి చూస్తూ నవ్వుతూ చెపుతోంది అనన్య...

"అందాల ఊటీలో అసంఖ్యాకమైన షూటింగులు జరిగిన చోటు ఇదే అందుకే దీన్ని షూటింగ్ స్పాట్ అంటారు. ఎన్నో సినిమాల్లో పాటల చిత్రీకరణ ఈ గుట్ట మీదే జరిగింది. ఇక్కణ్ణుంచి చూస్తే ఊటీ చుట్టుపక్కల సుదూరంగా ఉన్న కొండలు కోనలూ అత్యద్భుతంగా కనిపిస్తాయి. ఈ గుట్టపైకి నడిచి ఎక్కలేని వాళ్ళు ఇదిగో ఇలా గుర్రం ఎక్కివెళ్ళొచ్చు.."

అప్పటికప్పుడే గుర్రం ఎక్కింది అనన్య. అద్దెకి గుర్రం స్వారీ ఏర్పాటు చేసేవాళ్ళు చాలామంది ఉన్నారక్కడ.

అనన్యని గుర్రం ఎక్కించిన అబ్బాయి హాయిగా పళ్ళికిలించి టీవీ కెమెరా లోకి చూసి నవ్వుతూనే ఉన్నాడు.

టీం మేనేజర్ సుధాకర్ ఇక గుట్ట ఎక్కలేక దారిలోనే కూచుండిపోయాడు.

కెమెరామన్ ఖాన్‌కి మాత్రం డ్యూటీ తప్పదు.

అనన్య సూచనల మేరకు షూట్ చేస్తూ వస్తున్నాడు.

షూటింగ్ స్పాట్‌కి పైకి చేరుకునే సరికి వేరే ప్రపంచానికే వెళ్ళిపోయినట్లయింది. అది ఊదా రంగు మబ్బుల దర్బారు.

మబ్బులు గుత్తులు గుత్తులుగా వేళ్ళాడుతున్నాయి. దూరాన కొండలు నీలిగా గడ్డకట్టి పచ్చగా మెరుస్తూ ఎండ చారలు కదలినప్పుడల్లా రత్నాల కుప్పలైపోతున్నాయి.

ఎటుపడితే అటు విచ్చలవిడిగా పరుచుకున్న పచ్చదనం నీలాకాశాన్ని వెక్కిరించే భూదేవి దరహాసంలా ఉంది.

గుర్రం దిగి మైదానంలో అటూ ఇటూ పరుగెత్తింది అనన్య.

"స్టెడీ ప్లీజ్ స్టెడీ.." అంటున్నాడు ఖాన్ కెమెరా అడ్జెస్ట్ చేసుకోలేక.

"వద్దులే ఖాన్! కటాఫ్" అని చిన్నపిల్లలా చేతులు సాచి అల్లిబిల్లిగా తిరుగుతూ ఉండిపోయింది అనన్య"ఎంత లవ్‌లీగా ఉందిక్కడ! వావ్!.."

ఎన్నెన్నో సుందర దృశ్యాల్ని కెమేరాలో బంధించిన వీడియో గ్రాఫర్ ఖాన్ అక్కడ ప్రకృతి వైభవానికి చలించిపోయాడు.

"ఎన్నిసార్లు తీసినా ఈ సీన్‌లు పూర్తిగా తియ్యడం ఎవడి తరం?" అని గొణుక్కుంటూ ఆపకుండా కెమేరాని చుట్టూ తిప్పుతూ ఉండిపోయాడు.

కొండలు మబ్బులు లోయలు నీడలు పచ్చదనంతో రెచ్చిపోతున్న ప్రకృతిని చూస్తూ మైమరచి పోతున్నారు టూరిస్టులు.

మంకీ క్యాప్‌లు తొడుక్కున్న పిల్లలు కేరింతలు కొడుతున్నారు. చేతిలో చెయ్యివేసుకుని నడుస్తున్న వృద్ధ దంపతులు పాతరోజుల వసంతాల్ని గుర్తుచేసుకుంటున్నారు.

అంతలో ఒక యువజంట ఎవరేమనుకుంటే మాకేం లెక్క? అన్నట్టు హఠాత్తుగా అక్కడే చప్పున గట్టిగా కౌగిలించుకుని ఆ కౌగిలి చెదరకుండా అలాగే గుండ్రంగా చాలాసేపు తిరుగుతూ ఉండిపోయారు. ఆ పారవశ్యాన్ని చూసి కొంతమంది "వావ్!" అంటూ ఆనందంగా చప్పట్లు కొట్టారు.

ఎవరో వదిలిన బెలూన్లు హాయిగా ఎగిరిపోయాయి.

ఎక్కణ్ణుంచో ఎవరో తీస్తున్న కూని రాగం గాలిలో తేలి వస్తూ మాధుర్యంతో వణికిపోతోంది. టూరిస్ట్ బృందంలో ఎవరో గాని ఉండబట్టలేనట్టు మురళి వాయిస్తున్నారు.

"స్టెడీ మేడం" అంటున్నాడు ఖాన్ కెమెరాను అనన్య మీద ఫోకస్ చేసి.

ముదురు నీలం రంగు జీన్స్ మీదకి ఫుల్ స్వెట్టర్‌ని ఇంకా పూర్తిగా లాక్కుని సరిచేసుకుంది అనన్య. కెమేరాలోకి చూస్తూ మనసారా నవ్వింది.

'ఓ' టీవీ ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేసే నవ్వు అది. సహజ సుందరమైన ఆ నవ్వుకే వేలాది మంది అభిమానులు ఉన్నారు.

"మనందరికీ ఆకాశమే ఒక గొడుగు అనిపిస్తుంది కదూ ఇక్కడ? ఊటి చోద్యమేమి చెపుము.. అని పాడుకున్నారు మన మహాకవి గురజాడ అప్పారావుగారు.. ఆయన కన్యాశుల్కం నాటకం ఎక్కువ భాగం రాసింది ఇక్కడేనట.. తరతరాలుగా కవులకూ కళాకారులకూ ఊటీ మహా గొప్ప ఇన్‌స్పిరేషన్. అయితే అందాల ఊటీ రాను రాను సహజ సౌందర్యాన్ని కోల్పోతుందని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు. ఓకే మనం ఈ షూటింగ్ స్పాట్ నుంచి ఇంకో చోటికి వెళదాం అక్కడ ఇంకా బ్యూటిఫుల్‌గా ఉంటుంది.."

కెమెరా ఆఫ్ చేసుకుని హమ్మయ్య అని చతికిల పడ్డాడు ఖాన్. "ఇక్కడే బావుంది. ఎక్కడికీ వెళ్ళాలని లేదు" అన్నాడు.

సరిగ్గా అప్పుడే మేనేజర్ సుధాకర్ ఆయాసపడుతూ పైకొచ్చాడు. చుట్టూ దృశ్యాల్ని తనివి తీరా చూస్తూ "వావ్! ఫెంటాస్టిక్!" అంటూ సిగరెట్టు వెలిగించాడు. "ఊటీకి మూడు రోజులు ఏం సరిపోతుంది? కనీసం ఆర్నెల్లయినా కావలి" అంటూ వెల్లకిలా పడుకుని ఆకాశంలోకి చూశాడు.

"అందుకేగా అనన్య సొంతంగా వేరే ప్లాన్ పెట్టుకుందీ.." అన్నాడు ఖాన్.

"క్లెవర్ గర్ల్.." అన్నాడు సుధీర్.

అనన్య మనసులో వేరె రొద మొదలయింది.

మళ్ళీ మొదలయింది.

******

అనన్య క్లవర్ గర్ల్ అనే అనుకుంటారు అందరూ.

కాని నేను నిజంగా క్లవర్ గార్లేనా?

అనన్య ఈజ్ బ్యూటిఫుల్ గర్ల్. అందాల రాశి. నవ్వుల మోహిని. నయన చకోరి. ఆ మాటలు అబద్ధం కాదు. మూడేళ్ళుగా టీవీ ఛానల్‌లో పాపులర్ యాంకర్‌గా ఉండటమే నిదర్శనం.

కాని అనన్యా నువ్వు అంత క్లవర్ గర్ల్‌వి కావు. నువ్వు క్లవర్ అయితే వాసుని అంత దగ్గరగా రానిచ్చేదానివి కావు. అసలతన్ని నమ్మేదానివే కావు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వాసు మనసు కూడా సాఫ్ట్‌గా ఉంటుందని భ్రమపడేదానివే కాదు. హైదరాబాద్ అంతా నీకోసమే పిక్నిక్ స్పాట్ అయినట్టు అతనితో చక్కర్లు కొట్టేదానివికాదు. చిన్న స్నేహం గట్టి ప్రణయమౌతుందని ఆశపడేదానివి కాదు.

అనన్యా నీకు అన్నీ తెలుసు. అన్నీ తెలుసు అనుకున్నప్పుడే ఏమీ తెలియదని ఋజువైపోతుంది. అదే ఘోరం.

ఉద్యోగం నీకో సమస్యేకాదు. కాలేదు. అందం తెలివీ అద్భుతమైన మాటకారి తనం టీవీ యాంకర్‌గా జిగేల్ మనిపించే కెరీర్‌కి స్వాగత ద్వారాలు తెరిస్తే.. సరిగ్గా అప్పుడే మనస్సు మాత్రం మధురోహలతో ఊగిపోవాలా?

పెళ్ళి నీకో సమస్య కాదు. కానేకాదు. కాని ప్రేమ, ప్రణయం అనురాగ బంధం... అవీ నువ్వు కోరుకున్న అద్భుత వరాలు.

సరిగ్గా వాసు గంధర్వ కుమారుడిలా వచ్చి ప్రణయ లోకంలోకి స్వేచ్ఛా విహారంగా తీసుకెళ్ళాడు. మబ్బుల దారిలో నక్షత్ర తోరణాలూ, గిటార్ సంగీతాలూ, జలతారు వెన్నెల వానలూ....

అతన్ని నమ్మడం తప్పయిందా? నీ తప్పులేదు. అతనితో ఎలా ఉన్నా ఏం చేసినా తప్పేలేదు అనిపించిన అద్భుత క్షణాల్లో ఎంత ఘోరమైన అపశ్రుతి దొర్లింది!

నిజమేమిటంటే నీ మీద అతనికి నమ్మకం లేకపోయింది.

ఆ రోజు సాయంత్రం సినిమా తర్వాత డిన్నర్ తర్వాత అతనితో అతని అపార్ట్‌మెంట్‌కి వెళ్ళడం తప్పయిందా? అదివరకు ఎన్నిసార్లు వెళ్ళలేదు? కాని ప్రణయం పాకాన పడేటప్పుడు కుదిరే ఏకాంతం వేరు.

అడవిలో ఉన్న అనాఘ్రత పుష్పం లాంటి సోయగం అతని చేతి స్పర్శకు పులకరించిపోవాలని ఆరాటపడిన మాట వాస్తవమే.

అనన్యా నువ్వు మనసారా ప్రేమించిన ముగ్ధప్రేమికురాలివి. అతను దగ్గరకు తీసుకున్నప్పుడు నీకు ఎటువంటి సంకోచం లేకపోయింది.

నీ మనసెప్పుడో అతని పరం అయిపోయిందే అనుకున్నావు. మనసె అతనికి స్వంతమైన తరువాత శరీరాన్ని ఆపి ఏం ప్రయోజనం?

కానీ నీ స్థైర్యాన్ని చూస్తూ అతనన్నమాటే నిప్పుల కొరడాలా నిలువెల్లా కాల్చికొట్టింది.

"కన్నెపిల్లే కావాలని నేనేం అనుకోలేదులే.."

"వ్వాట్?"

"ఈ కాలం ఎందరమ్మాయిలు వర్జిన్స్‌గా ఉంటారు?"

"ఊ.. స్టుపిడ్!.."

నువ్వు విదిలించి కొట్టావా? అతనే విరుచుకుపడిపోయాడా? విరుచుకు పడిపోయింది నీ మనసే కదా? నిప్పుల కొరడా శరీరం లోపలే ఎలా చీల్చేసింది కాల్చేసింది!

మూడేళ్ళ స్నేహం ముక్కలయింది. ముత్యాల మోహాల పల్లకీ కూలిపోయింది. మబ్బులదారి మాడిపోయింది.

అనన్యా! వాసూ ఏమయ్యాడు? ఎన్నిసార్లు ఫోన్ చేశాడు? గుమ్మంలో వ్రేళ్ళాడాడు!

కటాఫ్! అయిపోయింది!

ఫేడౌట్! అంతా అయిపోయింది!

ఎపిసోడ్ ముగిసిపోయింది.

ప్రేమలేదు, అనురాగం కుదరదు. ప్రణయం అంత ముగ్ధ మనోహరం కాదు. అతిలోకమైన ప్రేమానుభవం నూటికో కోటికో ఏ ఒక్కరికో గాని అందరికీ రాదు. ప్రేమ వద్దు. ఇప్పట్లో పెళ్ళే వద్దు మగవాడి మాటే వద్దు. అలా అనుకున్నావే గాని అనన్యా ఊటీ ఊసెత్తగానే మనస్సుకు కొత్త రెక్కలు వచ్చాయి. అప్పుడెప్పుడో వాసు మంచి హైస్పిరిట్‌తో పాడేపాట అవలీలగా కవ్వించలేదూ?

చెలి నగుమోమే చంద్రబింబమై పగలే వెన్నెల కాయగా... అంటూ నీ చెంపలు సుతి మెత్తగా తన అరచేతుల్లో పొదవి పట్టుకునే వాడు వాసు.

పాత పాటే అయినా ఎంత బ్యూటిఫుల్ ఎక్స్‌ప్రెషన్.... సఖి నెరి చూపుల చల్లదనంతో జగమునె ఊటీ చేయెగా... అంటూ వారగా ముఖం వాల్చి అరమోడ్పు కళ్ళతో నీ ముఖంలోకి చూస్తూ మనసారా మైమరుపును అభినయించేవాడు. జగమునె ఊటీ చేయగా... జగమునె ఊటీ చేయగా...

వావ్!...

వాసు వెళ్ళిపోయాడు వేణుగానం వెళ్ళిపోయింది. కాని ఆ పాట ప్రతిధ్వని ఊటీ అంతా ఊగుతూ ఊరిస్తోంది.

వాసూ వెళ్ళిపోతే జీవితం ఆగిపోదు.

***జీవితం అంటే ఇంకా మిగిలి ఉండడమే. ఎప్పటికప్పుడు వస్తుండడమే ప్రవహిస్తూ ఉండడమే.*** ప్రేమ వచ్చినా వెళ్ళిపోయినా జీవితం మాత్రం ఉంది.

జీవితం మజిలీ మీద మజిలిగా సాగుతుండగా మళ్ళీ ప్రేమ రావచ్చు మళ్ళీ వలపు వలలో చిక్కుకోవచ్చు. ఇది శాశ్వత శిశిరం కాదు సుమా కాదు. అనన్యా ఇది వసంతం! మళ్ళీ వసంతం!

నిన్ను నువ్వే దగా చేసుకోవాలనుకున్నా వసంతగానం ఆగదు. ఒక్క ఊటీచాలు నీ కలల్ని తట్టిలేపడానికి. నిలదీసి నిజం చెప్పమనడానికి!

నిజం చెప్పు... నీకు ప్రేమ వద్దా?

కావాలి కాని.... ఇక్కడేముంటుంది.. ఈ కొండల్లో కోనల్లో అడవుల్లో?

ఏయ్ అనన్యా అల్లరి పిల్లా! ఎంత ఆశ ఉందో అంత ధైర్యం కూడా ఉంది వెర్రి ఆశ. మొండి ధైర్యం. డ్యూటీ మీద బ్యూటీ అనన్య ఊటీలో ఇంకా ఇంకా ఉండాలని ఎందుకు అనుకుంది?

ఏదో ఆశ. అడవి దారుల అవతలి నుంచి ఏ ఆశకో ప్రతిధ్వనిలా వినిపిస్తోంది నేపథ్య స్వరం...

***గుర్తు తెలియని చోట గుర్తు తెలియని వ్యక్తి పరిచయం కావచ్చు. అతనే జీవిత సర్వస్వం అయిపోవచ్చు. దటీజ్ ది మేజిక్ ఆఫ్ లవ్!***

"అనన్యా! అయ్ లవ్ యూ!..."

కాని ఇదంతా భ్రమ అనన్యా.

నువ్వు నమ్మకు

నిన్ను నువ్వు మళ్ళీ మోసం చేసుకోకు.

వద్దంటే వద్దు. ప్రేమ రద్దంటే రద్దు.. అంతే!

****

"చూడండి మేడమ్! మనమిప్పుడు డైరెక్ట్‌గా ఆకాశంలోకి వెళుతున్నాం.." అన్నాడు డ్రైవర్ సుబ్రమణ్యం ఉత్కంఠ భరితంగా.

నిజమే. దొడ్డబెట్ట వెళ్ళేరోడ్డు ఆకాశానికి నిచ్చెన వేసినట్టే ఉంది. ముందుకు చూస్తే సఫారీ వాహనం బానెట్ సరాసరి మబ్బుల్లోకి వెళుతున్నట్టు అనిపిస్తోంది. నిండుగా వంపు తిరిగిన రోడ్డు ఎప్పటికప్పుడు కనుమరుగవుతోంది. అంచు కనిపించడం లేదు. బానెట్ ముందు దూసుకొస్తున్న దూది పర్వతల్లాగా మబ్బులు. అంతే! టీం మేనేజర్ సుధాకర్ అప్రతిభుడై చూస్తున్నాడు. ఖాన్ కెమెరాకు పని చెబుతూనే ఉన్నాడు.

ఉత్సాహంగా ఉరకలేస్తూ వస్తున్న టూరిస్టు వాహనాలు ఆ ప్రాంతంలో జాగ్రత్తగా సంచరిస్తున్నాయి. దొడ్డబెట్టు రోడ్డు ప్రమాదాల నిలయం. అదుపు తప్పితే అటో ఇటో లోయలోకే పయనం.

కొండ కొమ్మని మబ్బులే జయించాయి అన్నంత మసగ్గా ఉందక్కడ. పొగమంచులో ముందూ వెనుకా తెలియడంలేదు.

వివిధ వాహనాల్లో జట్లు జట్లుగా చేరుకున్న టూరిస్టులు ఆ శిఖరాగ్రంలో ప్రకృతి సౌందర్యంలో కరిగి పోతున్నారు. అక్కణ్ణుంచి చూస్తే దూర దూరల్లో కొండలన్నీ మబ్బుల కింద ఒదిగి పోయిన మధుర స్వప్నాల్లా ఉన్నాయి.

ఖాన్ కెమెరా సరిచేసుకోగానే ఇదివరకే చదువుకున్న నోట్స్ గుర్తుచేసుకుంటూ కెమెరాలోకి చూస్తూ చెప్పింది అనన్య...

"నీలగిరి పర్వత శ్రేణుల్లో అన్ని పర్వతాల్లోకీ ఎత్తయిన పర్వతం ఇదే. రెండు వేల అడుగుల పైనుంచి చూస్తే అదిగో అక్కడ కర్నాటక సరిహద్దు దాక విస్తరించిన నీలగిరులు కనిపిస్తున్నాయి. ఇదిగో ఇటువైపు కేరళ సరిహద్దుల్ని తాకుతున్న పర్వతాల్ని చూడొచ్చు..."

అనన్య మాటల్ని అనుసరిస్తూ కెమెరా 'పాన్' చేస్తూ నెమ్మదిగా కదిపాడు ఖాన్.

"దొడ్డబెట్ట అంటే ఎత్తయిన కొండ అని అర్థం.. ప్రస్తుతం సెప్టెంబర్ లో ఇది ఊటీకి సెకండ్ సీజన్. ఎండ బాగా పడేకాలం.. కాబట్టి మనం ఇక్కడికి సులభంగా రాగలిగం కాని అక్టోబర్ తర్వాత మంచు వాతావరణంలో ఇక్కడికి రావడం చాలా కష్టం. మంచి కురిసి రోడ్డు బ్లాక్ అవుతుంది. పొగమంచు వల్ల దారే కనిపించదు. మామూలు సీజన్‌లో కూడా పొద్దు పోయాక ఈ ప్రాంతంలోకి రావటానికి టూరిస్టులు జంకుతారు. ఎందుకంటే వన్యమృగాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఇంతటి ప్రకృతి వైభవంతో పరమ ప్రశాంతంగా ఉండే నీలగిరి పర్వత శ్రేణులు రానురాను ప్రశాంతతను కోల్పోతున్నాయని పర్యావరణ నిపుణులు వాపోతున్నారు. ఊటీ కూనూర్ కోటగిరి పట్టణాలతో బాటు నీలగిరి పర్వత శ్రేణుల్లో ఉన్న వందలాది చిన్న గ్రామాల్లో తరతరాలుగా ఉంటున్న స్థానికులు కూడా ఇక్కడ ప్రశాంత వాతావరణం దెబ్బతింటోంది అంటున్నారు. దొడ్డబెట్ట చూశాం కదా.. మనమిక్కణ్ణుంచి వేరే స్పాట్‌కి వెళదాం..."

జాగ్రత్తగా షూట్ చేసీ చేసీ మెడ నొప్పి వచ్చింది ఖాన్‌కి. చలికి తట్టుకోలేక సిగరెట్టు మీద సిగరెట్టు ఊదేస్తున్నాడు సుధాకర్.

దొడ్డబెట్ట వాతావరణం ఎంత ప్రమాదకరమైనదో అప్పుడే తెలిసి వస్తోంది అనన్యకు.

తలంతా ఏమిటో జిల్లున చల్లబడినట్టు అయింది. ఏమీ తోచకుండా ఉంది. మెదడు మొద్దుబారింది. కూడా వచ్చిన లేడీ అసిస్టెంట్ నీల ఫ్లాస్కులోంచి అందరికీ కాఫీలు అందించింది.

"హబ్బో.. ఇదేం స్పాటండీ బాబూ..." అంటూ సఫారీ స్టార్ట్ చేశాడు సుబ్రమణ్యం.

అతనయితే అంతసేపూ బండి దిగనేలేదు. వెచ్చగా మఫ్లర్ చుట్టుకుని బండిలోనే కూచున్నాడు.

"నువ్వూ పైకి రావాల్సింది.. వండ్రఫుల్ సీనరీ మిస్ అయ్యావు.." అని అనన్య అంటూ ఉండగా ఆమె వైపు అదోలా చూశాడు సుబ్రమణ్యం.

ఆ చూపేమిటో అనన్యకు అర్థంకాలేదు.

"మేడం... మీరేమిటి?.... పైకి వెళ్ళిన కాస్సేపటికి మళ్ళీ కిందకి వచ్చారు కదా? బండ్లో ఏదైనా మరిచిపోయారేమో అనుకున్నాను. కాని మీరు బండి దగ్గరికి రాలేదు. ఏంటో నేను గమనించలేదు.. అదేంటి అలా వచ్చివెళ్ళిపోయారూ?"

సరిగ్గా అప్పుడే ఖాన్ సుధాకర్‌తో సిగరెట్లు ఇచ్చిపుచ్చుకోవడం గురించి ఏదో బేరం మాట్లాడుకుంటున్నాడు. కాబట్టి వాళ్ళు ఈ సంభాషణని పట్టించుకోలేదు.

"అదేంటి అలా వచ్చి వెళ్ళిపోయారూ?" అన్న సుబ్రమణ్యం మాట అసలు అర్థం కాలేదు అనన్యకి.

"నేనా? నేనెప్పుడొచ్చను కిందకి? మఫ్లర్ చుట్టుకుని నిద్రపోతే పట్టపగలే కలలొస్తాయా..." అని అతని వైపు అనుమానంగా చూస్తూ "ఏమైనా గొంతులో పడిందా?" అంది సీరియస్‌గా.

సుబ్రమణ్యం అప్పుడప్పుడు గుప్ చుప్‌గా మందు కొడుతుంటాడు. ముఖ్యంగా చలి వాతావరణంలో ఆపుకోలేడు. కాని కంట్రోల్‌లో ఉంటాడు. గుట్టు చప్పుడవదు. అదంతా ఓకే.

"సారీ మేడం.. నేనే పొరపడ్డా నేమో.. ఏంటో మరి.." అంటూ మఫ్లర్ విడదీసి తల గోక్కుంటూ "ఏదేమైనా ఈ ఏరియాలో అంతా కన్‌ఫ్యూషన్ అండీ!..." అని గొణుక్కున్నాడు.

ఆ మాట తొందరలోనె గుర్తుచేసుకోవలసి వస్తుందని అనన్య అప్పుడు అనుకోలేదు.

✡✡✡

## 2

**అనన్యా! మళ్ళీ ప్రేమ అసాధ్యం కాదు.**

అందాల ఊటీలో ఎవరైనా విదేశీ టూరిస్టు పరిచయం కావచ్చు. స్వదేశీ అయితేనేం? ఒక గొప్ప ఆర్టిస్టు లేదా ఫోటోగ్రాఫర్ లేదా కవి, రచయిత.. ఎవరో ఒక ఆదర్శ వ్యక్తి ప్రకృతి ఒడిలో కొత్త అర్థాన్నీ పరమార్థాన్నీ అన్వేషిస్తూ తారట్లాడుతూ తారసపడవచ్చు.

ఏం అనన్యా? ఇదేం అసాధ్యమా?

ఒక భగ్న ప్రేమికుడే కావచ్చు. జీవితం మీద విరక్తి పుట్టి వెర్రిగా కొండ కోనల వెంట తిరుగుతున్న ఒంటరి జీవి కావచ్చు. ఎవరో ఒక స్వాప్నికుడు ఒక ఆదర్శజీవి మరో జీవి సాహచర్యం కోసం తపించి పోతున్న ఆర్తజీవి కావచ్చు.

పొడవు పొడవుగా ఉన్న నీలగిరి చెట్ల దారిమలుపులో ఎదురు కావచ్చు. శ్రీగంధం చెట్ల వాసనల మధ్య నుంచి చిత్రంగా నడిచి రావచ్చు.

దిగులు నిండిన ఆ కళ్ళలో నిన్ను చూడగానే దివ్యమైన ఆనందం చిమ్ముకు రావచ్చు.

అనన్యా ఇదేమీ అసాధ్యం కాదు.

హనీమూన్ జంటలు వెచ్చవెచ్చటి కౌగిళ్ళలో కలల్ని పండించుకునే మధుర మోహన స్వప్నసీమ ఊటీ. ఒక కొత్త ప్రణయం ఇక్కడే ఎందుకు పుట్టదు? అతనెవరో ఈ పాటికి ఇక్కడే ఉండొచ్చు. నీలాగే ప్రేమ కోసం ఉండొచ్చు.

ఎత్తుగా ఠీవిగా చేతులు సాచి అతను నీకోసమే నడిచి వస్తున్నాడు.

అతను చేరువ కాగానే నువ్వు తల వాల్చేస్తావు. అతని ముఖమైనా సరిగ్గా చూడలేవు. అతను మాత్రం నీకు బాగా దగ్గరగా వచ్చేసి వెచ్చటి ఊపిరితో నిన్ను కమ్మేశాడు. నీ ముఖం మీదికి అతని పెదవులు వాలుతున్నాయి.

తల విదిలించుకుని ఉలిక్కిపడి లేచింది అనన్య. అడవీ లేదు చెట్లూ లేవు. కౌగిలిస్తున్న ప్రేమికుడు లేడు.

టపటపమని వాన శబ్దం వినిపించింది. ఎప్పుడు మొదలయింది వాన? జివ్వున చలిగాలి బ్లాంకెట్ మడతల్ని చీల్చుకుని చొచ్చుకు వస్తోంది. పక్కనే ముడుచుకుని పడుకున్న అసిస్టెంట్ నీల ఇంకా వణికిపోతూ మూలిగింది.

ప్రేమికుడు లేడు. ఎప్పుడొస్తాడో మరి.

చలికి భయపడి అలాగే ఒదిగి పడుకుంది అనన్య. మెరుపులో మెరుపు మెరుస్తోంది.

కిటికీ అద్దం మీద జల్లులు జారుతున్నాయి.

మెరుపు మెరిసినప్పుడు మాత్రమే కనిపిస్తున్న ఆ జల్లులు జారిపోతున్న కలలేమో అనిపిస్తున్నాయి...

✡✡✡

"అమ్మో! ఇప్పుడు పులి వస్తే ఎలాగ?" అంది అసిస్టెంట్ నీల భయపడిపోతూ.

మదుమలై అడవుల్లోకి దూసుకు పోతోంది సఫారీ. జీప్‌లోంచే ఆనందంగా దృశ్యాల్ని షూట్ చేస్తున్నాడు కెమెరామన్ ఖాన్. అధ్వాన్నంగా ఉన్న తారురోడ్డు. కీకారణ్యం. చెట్ల నీడలే దట్టమైన చీకట్లు కమ్మి చల్లదనాన్ని చిమ్ముతున్నాయి. అక్కడా ఇక్కడా ఎండ పొడలు పడుతున్నాయి.

లోయ అంచున రోడ్డు మలుపులో సఫారీ ఆపించి చెంగున దిగి మైక్ చేత్తో పుచ్చుకుంది అనన్య.

ఆమె మీదికి కెమెరా ఫోకస్ చేశాడు ఖాన్. తడుముకోకుండా కెమెరాలోకి చూస్తూ చెప్పుకుపోతోంది అనన్య..

"...నీలగిరి పర్వత శ్రేణుల కింద వందల కిలోమీటర్ల మేర విస్తరించింది ఈ మదుమలై అటవీ ప్రాంతమే. అయితే సరిగ్గా ఈ అడవి మధ్యలోనే అత్యాధునికమైన శాస్త్రపరిశోధనా కేంద్రం నెలకొల్పాలనే ప్రణాళిక సిద్ధమైంది. అదే ఇండియన్ న్యూట్రినో ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ వల్ల శాస్త్రపరిశోధనల రంగంలో ఇండియా ప్రతిష్ఠ చెప్పలేనంతగా పెరుగుతుందంటున్నారు. ఈ ప్రాజెక్ట్ కేంద్రం కోసం ఈ ప్రాంతంలో చాలా పెద్ద సొరంగం ఒకటి తవ్వాల్సి ఉంది.

భారీ ఎత్తున జరిగే ఈ నిర్మాణ కార్యక్రమం వల్ల మధుమలై అటవీ ప్రాంతంలో చాలా చోట్ల వన్యప్రాణులకు విపరీతమైన ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు అంటున్నారు. ఇప్పటికే ఈ అడవుల్లో తిరిగే వాహనాల మీద అప్పుడప్పుడూ ఏనుగులూ పులులూ దాడిచేస్తుంటాయి. గత రెండేళ్ళలో ఏనుగుల దాడుల్లో పాతిక మందిపైగా చనిపోయారు. న్యూట్రినో ప్రాజెక్ట్ కోసం సొరంగం తవ్వడం మొదలు పెడితే పులులు కూడా డిస్టర్బ్ అవుతాయి. అవి డిస్టర్బ్ అయితే..."

అని చెబుతున్న అనన్య హఠాత్తుగా మాటలు ఆపేసింది. కాళ్ళకింద భూమి కదిలిపోయిందా అన్నట్టు ఆమె ముఖంలో కలవరపాటు గడ్డకట్టింది. ఆమె వైఖరి అర్థంకాని ఖాన్ వ్యూఫైండర్ నుంచి కళ్ళు తిప్పి చూశాడు.

డ్రైవర్ సుబ్రమణ్యం, మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ నీల.. అయోమయంగా చూస్తున్నారు. అనన్యను వాళ్ళు ఎప్పుడూ అలా చూళ్ళేదు. అందరూ నెమ్మది నెమ్మదిగా ఆమె చూపు వెంటే చూపులు తిప్పి చూశారు.

నిశ్శబ్దంగా భూమి చీలిపోతే చూస్తూ చూస్తూ ఎవరు మాత్రం ఎలా స్పందించగలరు?

సఫారీ వాహనం పైకి అప్పుడే ఎక్కి నిలబడుతోందొక పెద్దపులి. ఠీవిగా నిదానంగా బానెట్ మీదకి ఎక్కి నిలబడి నాలుక ముందుకు సాచి నెమ్మదిగా మూతి తుడుచుకుంటోంది.

పచ్చటి నల్లని చారలతో నిగనిగలాడే సౌష్టవంతో అందంగా భీకరంగా ఉంది పెద్దపులి.

అందరి గొంతులూ ఒక్కసారి మూగబోయాయి. మంత్రం వేసినట్టు ఎక్కడివాళ్ళక్కడ నిలబడి పోయారు. కదిలితే భయం. అడుగు వేస్తే భయం. తల తిప్పినా భయమే. ఎటుపోవాలి? ఏం చెయ్యాలి? ఎవరితో చెప్పాలి? అందరూ కూడబలుక్కుని ఏమైనా చెయ్యడానికి అవకాశంలేదు.

ఎవరో ఒకరు ఏదో ఒకటి చేస్తే అలా ఫాలో అయిపోవచ్చునని ప్రతివాళ్ళూ అనుకోవడమే. కాలం క్రూరంగా నిర్ధాక్షిణ్యంగా గడ్డకట్టిన క్షణాలు అవి.

నోటిలో మాటలు నోటిలోనే ఆపేసిన అనన్య నెమ్మది నెమ్మదిగా చూపు తిప్పి ఖాన్‌కు చిన్నగా సైగ చేసింది. అది గ్రహించిన ఖాన్ మొండి ధైర్యంతో కెమెరాను అలాగే ఒడుపుగా తిప్పుతూ పులిమీదకి ఫోకస్ చేశాడు.

పులి వీళ్ళందర్నీ గమనించిందా?

అది సఫారీ వాహనం పైకి ఎందుకు ఎక్కింది? మనుషులు వాహనం దగ్గరికి వస్తే పచ్చిగా నమిలి ఫలహారం చేద్దామనుకుందా?

ఖాన్ ప్రాణాలకు తెగించి పులిని షూట్ చేస్తుండగా అనన్య మెల్లగా సుధాకర్‌కు చేత్తో సైగ చేసింది. ఆపదల్లో మనిషి మెదడు మామూలు కన్నా చురుగ్గా పనిచేస్తుంది.

అనన్య సైగను గమనించిన సుధాకర్ తనకు చేరువలో ఉన్న ఎండు కొమ్మను నెమ్మదిగా అందుకుని రోడ్డు అవతలకి సాధ్యమైనంత దూరానికి విసిరేశాడు. ఎత్తుగా ఎగిరి వెళ్ళిన ఆ కొమ్మ చెట్ల మీద వాలి అక్కణ్ణుంచి జారి పొదల్లోకి చప్పుడు చేస్తూ దొర్లిపడింది.

ఆ శబ్దం వినబడగానే పులి హఠాత్తుగా మెడతిప్పి అటువైపు చూసింది. సమయస్ఫూర్తితో డ్రైవర్ సుబ్రమణ్యం ఒక్క ఉదుటున సఫారీ దగ్గరికి పరుగెత్తి లాఘవంగా డోర్ తీసి లోపలికి ఎక్కాడు.

ప్రాణాలు పైపైకే ఎగిరిపోతున్న భయంతో నీల, సుధాకర్ కూడా సఫారీ చేరుకున్నారు.

అంతటి విపత్కర పరిస్థితిలో కూడా ఖాన్ షూట్ చేస్తూ చేస్తూనే సఫారీ దగ్గరకి చేరుకుని ఇంకా స్థిమితంగా పొదల వైపు ఫోకస్ చేశాడు.

విజయోత్సవంతో ఉత్కంఠతో అనన్య జీప్ దగ్గరికి వచ్చేసింది గాని వెంటనే ఎక్కెయ్యకుండా మళ్ళీ మైక్ చేత బుచ్చుకుని పోజ్ ఇస్తూ కెమెరాలోకి చూసి మాట్లాడింది.

"..మదుమలై అడవుల్లో ఇటువంటివి సర్వ సాధారణం. పులులు ఉండే ప్రాంతంలోకి మనము వచ్చాం. అవి మన ఇంటికీ మన ఊరికీ రాలేదు. వాటిని హాయిగా బ్రతకనివ్వాలంటే మనం అవి ఉండే ప్రాంతాల్ని అనవసరంగా డిస్టర్బ్ చెయ్యకూడదు... ఈ పులి చూశారా ఎంత ఠీవిగా ఎంత గంభీరంగా ఈ అడవిలో సంచరిస్తోందో.." అంటూ అనన్యధీర గంభీరంగా నవ్వేసింది గాని అంతలో ఖాన్ గావుకేక పెట్టాడు."... అనన్యా.. స్టాపిట్.. పులి మళ్ళీ వచ్చేస్తోంది.. కమాన్.."

క్షణాల్లో మళ్ళీ వాతావరణం ఉత్కంఠ భరితమైపోయింది. చెట్లలో మెరుపు మెరిసినట్లు పొదల్లోంచి పులి ఛెంగున ఇవతలికి దూకడం చూడగానే సుబ్రమణ్యం సర్రున జీప్ స్టార్ట్ చేశాడు.

"అనన్యా... కమాన్.. ఎక్కెయ్యి.. క్విక్.. రా.." అని అందరూ కేకలేశారు. కాని అందరూ అలా కేకలు వెయ్యాల్సింది కాదు.

ఇదివరకు పులి బానెట్ మీద ఉన్నప్పుడు అందరూ ఎలాగ నిశ్శబ్దంగా ఉండి తర్వాత తెలివిగా దాని దృష్టి మళ్ళించారో ఇప్పుడూ అలాగే మొదట నిశ్శబ్దంగా ఉండాలిసింది.

అయితే సఫారీ స్టార్ట్ చేసిన శబ్దంతో పాటు అందరూ కేకలు వేసిన శబ్దం పులి దృష్టిని చెదరగొట్టాయి.

రెండుమూడడుగుల్లో జీప్ దగ్గరికి చేరుకోబోయిన అనన్య తొట్రుపడుతూ ఉన్నచోటే ఆగి పులివైపు చూసింది.

సరిగ్గా అప్పుడే పులి ఇంకెటువైపూ చూడక కేవలం అనన్య వైపే సూటిగా చూసింది.

భీకరంగా తల ఎగరేసి పెద్దగా గాండ్రించింది.

ఆ శబ్దం తల ఎగరేసి అడివంతా ప్రతిధ్వనించింది.

అనన్యా నువ్వు అయిపోయావ్ నీ జీవితం ఇంతటితో ముగిసింది దేవుణ్ణి ప్రార్ధించుకో అంతా అయిపోయింది.. అనిపించిన క్షణంలోనే అనన్య స్థాణువులా నిలబడిపోయింది. పులి మరోసారి గాండ్రిస్తూ వెనుక కాళ్ళ మీదకిందకు వంగుతూ వెనక్కి తగ్గి ముందుకు లంఘించడానికి సిద్ధమయింది.

మెరుపులు చీలినట్లు అనన్య మెదడులో కరెంటు కొట్టింది.

చావుబతుకుల సంధిరేఖ మీద భయం నశించింది. తెగింపు విజృంభించింది.

ప్రాణభయంతో పారిపోవలసిన అనన్య అటూ ఈటూ పరిగెత్తకుండా ఒక్కసారిగా ఊపిరి బిగపట్టి పులికేసి నెమ్మదిగా అడుగులు వేసింది. ధిక్కరింపుగా పులికళ్ళలోకి ఉరుముతూ చూసింది.

కాలం ఆగిపోయిన ఆ క్షణంలో పులికి ఏమయిందో తెలియదు. అది ముందుకు ఎగిరి దూకకుండా ఆగిపోయి చిత్రంగా మెడ వాల్చి అనన్య కేసి ఎగాదిగా చూసింది. మళ్ళీ గాండ్రించింది.

ఇక చచ్చిపోయానే అనుకుంటూ అనన్య తొణుకూ బెణుకూ లేకుండా పులివైపు ఇంకో అడుగు వేసింది. జంకూ గొంకూ లేకుండా ఇంకో అడుగు వేసింది.

మరుసటి క్షణం పెద్దపులి గబుక్కున పక్కకు తిరిగి మెరుపులా దూకి పొదల్లోకి వెళ్ళిపోయింది. ఆకులు గలగలమన్న శబ్దం అంతకంతకూ దూరమైపోయింది. గడ్డకట్టిన దృశ్యం కరుగుతున్నట్టుగా చాలాసేపటికి ఒక్కొక్కరూ కదిలారు. అప్పటికి సొమ్మసిల్లిపోతున్న అనన్య మీద నీళ్ళు చల్లారు.

"థేంక్ గాడ్." అంటున్న అనన్యను అందరూ చిత్రంగా చూశారు.

✡ ✡ ✡

"మేడం గారున్నారు.. ఇంక ఏ పులి వచ్చినా భయంలేదు" అంటూ ఉత్సాహంగా జీప్‌ని ఊటీ ఘాట్ రోడ్‌లో మలుపులు తిప్పుతూ దూకిస్తున్నాడు సుబ్రమణ్యం.

"నమ్మలేని అద్భుతమే జరిగింది. అయినా సరిగ్గా సమయానికి ఆ సీన్‌ను ఖాన్ షూట్ చెయ్యలేకపోయాడు... అదే భాధగా ఉంది" అన్నాడు సుధాకర్.

"మైండ్ పని చెయ్యలేదు" అన్నాడు ఖాన్ విచారంగా "మేడం గారికి మాత్రం మైండ్ అద్భుతంగా పనిచేసింది. కాని ఇక్కడ ఇలా జరిగిందన్నా ఎవరూ నమ్మరు. అనన్య మేడం గారి ధైర్యసాహసాలకి ఎటువంటి అవార్డు ఇచ్చినా తక్కువే.." అన్నాడు పులికించిపోతూ.

"ఏమిటో అప్పుడలా అనిపించింది.. చేసేశాను కానీ... పులికి ఎదురు వెళ్ళాలనే ఆలోచన నాకెందుకు వచ్చిందో ఎలా వచ్చిందో.. నాకు తెలియదు మరి.." అంటూ పులి సన్నివేశంలో ప్రతిక్షణాన్నీ నెమరు వేసుకుంది అనన్య.

"ఫెంటాస్టిక్! ఫెంటాస్టిక్!" అని గొణుగుతూనే ఉన్నాడు సుధాకర్. అంతకు మించి ఇంకేమనాలో ఏ మనుకోవాలో అతనికి తెలియడంలేదు.

ఉండి ఉండి సిగరెట్ ఊదుతూ ఖాన్ ఉన్నట్టుండి నవ్వుతూ "ఈ సందర్భంగా నాకో పిట్టకథలాంటిది గుర్తొస్తోంది.. చెబితే మేడంగారు కోప్పడతారేమో.." అన్నాడు.

"ఆఁ చెప్పక పోతేనే కోప్పడతాను.. కమాన్ చెప్పెయ్యి .. లేకుంటే పెద్దపులిని కేకేసి పిల్చి నీ మీదికి ఉసిగొల్పుతాను.." అంది అనన్య బెదిరింపుగా.

"అనగనగా ఒక సర్కస్ కంపెనీ.." అంటూ పిట్టకథ మొదలుపెట్టాడు ఖాన్.

..ఆ సర్కస్ కంపెనీలో రింగ్ మాష్టర్ ఉద్యోగం ఖాళీ పడింది. పులుల్నీ సింహాల్ని పూర్తిగా కంట్రోల్ చేస్తూ కావలసినట్టు ఆడించే పని రింగ్ మాష్టర్‌దే

కొరడా ఝుళిపిస్తూ క్రూర జంతువుల్ని ఆడిస్తుంటే చూసే వాళ్ళకు అద్భుతంగా అమానుషంగా ఉందనిపిస్తుంది కాని రింగ్ మాష్టర్‌కు చాలా రిస్క్ ఉంటుంది. మొత్తానికి ఈ సర్కస్ కంపెనీలో రింగ్ మాష్టర్ ఉద్యోగానికి చాలా దరఖాస్తులు వచ్చాయి. అన్నీ పరిశీలించాక ఇద్దరు అభ్యర్థుల్లో ఒకతను పాతికేళ్ళ యువకుడు. ఇంకొక అభ్యర్థి పాతికేళ్ళ యువతి.

ఇద్దర్నీ పెద్ద సింహం బోను దగ్గరకి తీసుకెళ్ళారు. అప్పుడే అడవి నుంచి పట్టుకొచ్చినట్టు అతి భీకరంగా ఉంది బోనులో సింహం. అది చిన్నగా మూలుగుతుంటేనే సర్కస్ గుడారం ప్రతిధ్వనిస్తోంది.

"ఒంటరిగా బోనులోకి వెళ్ళి ఈ సింహాన్ని కంట్రోల్ చెయ్యడమే ఫైనల్ టెస్ట్!" అన్నాడు ఇంటర్వ్యూ డైరెక్టర్. "ముందు ఎవరు వెళతారు?" అని అడిగాడు.

"నేను వెళతాను!" అని ముందుకొచ్చింది పాతికేళ్ళ యువతి. "గుడ్ లక్" అంటూ కొరడాను ఆమెకు అందించబోయాడు గాని ఆ అమ్మాయి చిరునవ్వుతో తిరస్కరించింది. అందరూ అవాక్కయి చూస్తుండగా బోను తలుపు తెరిపించుకుని ఠీవిగా నిర్భయంగా లోపలికి అడుగుపెట్టింది.

జూలు విదిలిస్తూ తలాడించి గురక పెట్టినట్టు మూలిగింది సింహం. చూస్తున్నవాళ్ళకి గుండెలు అవిసిపోయాయి. ఆ అమ్మాయి ధోరణి ఏమీటో అర్థంకాక అందరూ అలా కళ్ళప్పగించి చూస్తున్నారు.

నిర్భయంగా నిశ్చలంగా ఆ అమ్మాయి ఆ సింహం వైపే చూసింది.

సింహం కళ్ళలోకే సూటిగా చూస్తూ చకచకా తన ఒంటిమీద బట్టలన్నీ తీసేసింది. ఒక్కనూలుపోగు కూడా లేకుండా పూర్తిగా నగ్నంగా నిలబడి రెండుచేతులూ పైకెత్తి సింహాన్ని ఆహ్వానిస్తూ నవ్వింది. ఆమె నగ్నశరీర లావణ్యం ఒక్కసారిగా మెరుపు కొట్టినట్లయింది.

గర్జించబోయిన సింహం హఠాత్తుగా చూపూ ఊపూ మార్చేసి ఆ అమ్మాయి నగ్న సౌందర్యాన్ని అలా నిశ్చలంగా చూసీ చూసీ నెమ్మదిగా నాలుక సాచి ఆమె పాదాల్ని స్పృశిస్తూ ఉండిపోయింది.

ఆ అమ్మాయి చిరునవ్వు నవ్వుతూ సింహం జూలు పట్టి చిన్నగా మెత్తగా లాగుతూ దాన్ని ముద్దు చేసి ఆడించింది.

అదంతా చూస్తున్న సర్కస్ కంపెనీ సిబ్బంది అవాక్కయిపోవడమే కాదు ఇంకా ఏమిటేమిటో అయిపోయారు. ఇంటర్వ్యూ డైరెక్టర్ నెమ్మదిగా తేరుకుని ఉద్యోగం కోసం వచ్చిన యువకుణ్ణి ఎగాదిగా చూసి "నువ్వేమంటావ్?" అని అడిగాడు.

పిట్టకథ చెపుతూ ఆగాడు ఖాన్. "నిండైన పరువంలో ఉన్న అమ్మాయి తన నగ్న సౌందర్యంతో సింహాన్నయినా లొంగదీయగలదు అనే నానుడి అప్పుడు నిజంగా నిజమైంది అనుకుందాం.. మరి ఆ యువకుడు ఏమయి ఉండాలి?" అన్నాడు.

"ఇంకేం జాబ్ అతనికి?... అతనికేం హోప్ లేదు.." అన్నాడు సుధాకర్.

"బోనులోకి వెళ్ళే ధైర్యం అతనికి ఉండదు కాబట్టి.. నాకు ఈ ఉద్యోగం వద్దుసార్.. అని వెళ్ళిపోయి ఉంటాడండీ..." అన్నాడు సుబ్రమణ్యం.

"మరంతే కదా!" అని గొణిగింది అనన్య. కాని ఆమెకు అనుమానంగానే ఉంది. ఈ కథలో ఏదో కుట్ర ఉందనిపించింది. "మరంతే కాదు కదా!" అని సన్నగా నవ్వాడు ఖాన్.

"నువ్వేమంటావ్!" అని ఇంటర్వ్యూ డైరెక్టర్ అడిగేసరికి ఆ యువకుడు బోనులోని భీకర సింహం వంకా నగ్నసౌందర్యం వైభవంతో విజయ గర్వంతో వెలిగిపోతున్న యువతి వంకా మార్చి మార్చి చూశాడు.... అని చెబుతూ ఖాన్ జీప్ లో అందరివైపూ మార్చి మార్చి చూసి రిమోట్ కంట్రోల్ బాంబ్‌కి స్విచ్ నొక్కుతున్నట్టు చెప్పాడు..

"నేను వెళతాను బోనులోకి.. ముందు ఆ సింహాన్ని అవతలికి తీసుకెళ్ళిపొండి.." అని అరిచాడు ఆ యువకుడు! ..

కొద్ది క్షణాల అయోమయం తరువాత జోక్ పేలింది. సఫారీ నవ్వుల్తో ఊగిపోయింది. "సారీ మేడం.." అన్నాడు ఖాన్ చిన్నగా. అనన్య ముఖం ఎర్రబడింది. కాని ఆ ముఖంలో గర్వం అతిశయం దాగలేదు.

"అదికథేగాని... ఇందాకా మీరు.. బట్టలు తీసేసేంత పనేమీ లేకుండానే.. పెద్దపులిని కంట్రోల్ చెయ్యడం కళ్ళారా చూశాం.. రియల్లీ మీరుచాలా గ్రేట్ అంటే వెరీ గ్రేట్".

ఊటీ దగ్గర పడుతుండగా అనన్య ఆ వేళ జరిగినదంతా తలుచుకుంటూ జనాంతికంగా చెప్పింది....

"పులికి ఎదురు తిరిగానూ అంటే ఆ క్షణం నాకలా చెయ్యొచ్చు అనిపించింది.. పులికి కూడా భయం బుల్లెట్ల వర్షం కురుస్తుంటే జర్నలిస్టులూ ఫోటోగ్రాఫర్లూ డ్యూటీ చెయ్యాలి... చేస్తారు... పులికి ఎదురు తిరగడం కూడా నా డ్యూటీ అనిపించింది. అంతే... కాని ఎదురు తిరిగినా లాభం లేదనిపించే పరిస్థితి వస్తే ఎవరైనా భయపడాల్సిందే. అటువంటప్పుడు నేనూ భయపడతాను..."

"కమాన్ అనన్యా! నువ్వు తిరుగులేని హీరోయిన్‌నివి... నువ్వెప్పుడూ ఎవరికీ భయపడవు!"

అన్నాడు మేనేజర్ సుధాకర్.

"చెప్పలేం. పులి క్రూర జంతువని తెలుసు. మనిషి దాన్ని పట్టేస్తాడు బోనులో పెట్టేస్తాడు. ఏదో రకంగా దాన్ని లొంగదీస్తాడు. కాని క్రూరత్వాన్ని మనసులో దాచుకుని మన పక్కనే ఉండి.. ఏ క్షణంలో ఎలా దాడి చేస్తాడో తెలీదు.. అందుకే నేను ఎప్పటికైనా మనిషికే భయపడతాను" అంది అనన్య.

"వావ్! కరెక్ట్!" అన్నారు అందరూ.

కరక్టే కదా?

✡ ✡ ✡

# 3

**ఊటీ కలెక్టర్** కార్యాలయంలో ఊపందుకున్నది వివాదం.

పర్యావరణ పరిరక్షణ సమితి ప్రతినిధులు ఒక వైపు. న్యూట్రినో ప్రాజెక్ట్ అధికార ప్రతినిధులు మరోవైపు.

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటైంది. చర్చలు సామరస్యంగా జరగాలని అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. అయినా ఆవేశకావేషాలు దాగడం ఏదు. స్పెషల్ కవరేజి కోస్మ వచ్చిన మీడియా ప్రతినిధులు చకచకా పనిలోకి దిగిపోయారు.

'ఓ' టీవీ ప్రతిష్ఠను ఇనుమడింప జేసే కవరేజ్‌లో ఈ సమావేశం క్లయిమేక్స్ లాంటిది కాబట్టి ఒక్క డీటెయిల్ కూడా వదలకుండా షూట్ చేస్తున్నాడు కెమెరామన్ ఖాన్. అతనికి సమయస్ఫూ ర్తితో సూచనలు అందిస్తున్నాడు టీం మేనేజర్ సుధాకర్. అంతా గమనిస్తూ పాయింట్స్ నోట్ చేసుకుంటోంది యాంకర్ అనన్య.

పర్యావరణ ప్రతినిధి ఒక పెద్దమనిషి అరిచి అరిచి ఆవేశంగా చెప్పాడు:

"మీరు ఎన్నయినా చెప్పండి. మధుమలై అడవుల్లో న్యూట్రినో ప్రాజెక్ట్ పెడితే అడవి జంతువుల బ్రతుకు దుర్భరమై పోతుంది. ఇప్పుడు మనం ఆ దారిలో కారులో వెళ్ళినా నడిచే వెళ్ళినా ప్రాణ స్నేహితుల్లా దారికి అటూ ఇటూ నిలుచుని స్వాగతం చెపుతుంటాయి అడవి ఏనుగులు. న్యూట్రినో ప్రాజెక్ట్ కోసం సొరంగం తవ్వడం మొదలుపెడితే ఆ డ్రిల్లింగ్ వల్ల వచ్చే అదురుడు శబ్దాలకు అడవిలో ఏ జంతువూ నిద్రపోవడం కుదరదు. అది వస్తే మనం అదిరిపడి వీధిల్లోకి పరుగెడతాం. మరి అన్నెం పున్నెం ఎరుగని అడవి జంతువులు ఏం చేస్తాయి? పోతుంది. వాటి దినసరి జీవితం డిస్టర్బ్ అవుతుంది. జంతువులన్నీ కకావికలై పరిగెడతాయి. మనుషులు కనబడితే దాడిచేస్తాయి. తొక్కేస్తాయి. చంపేస్తాయి. సొరంగం తవ్వినంత కాలం లారీలూ ట్రక్కులూ వందల సంఖ్యలో వస్తూ పోతూ ఉంటే శింగార ప్రాంతం నుంచి మైసూర్ రోడ్డు దాకా మదుమలై అడవులన్నీ అదిరి గ్రామాల మీద దాడి చేసినా ఆశ్చర్యం లేదు. ఇన్ని విధాలా ప్రమాదాలు ఉన్న ఈ ప్రాజెక్టును మొదలు పెట్టక పోవడమే క్షేమం. మనుషులకూ జంతువులకూ అందరికీ క్షేమం. అందుకే ఈ ప్రాజెక్టును మేము వ్యతిరేకిస్తున్నాం. కాదని ప్రాజెక్టు మొదలుపెడితే మేము ఆందోళన చేస్తాం. ఉద్యమం లేవదీస్తాం. నిరాహార దీక్షలు చేస్తాం. అంతేగాని శింగార దగ్గర సింగారంగా ఉన్న అడవుల్ని మాత్రం నాశనం కానివ్వం.. ఆం.."

పర్యావరణ ప్రతినిధి ఆవేశాన్ని అడ్డుకుంటూ న్యూట్రినో అధికారి ఇంకా గొంతు పెంచాడు. "ఇదెక్కడి ఘోరమండీ? ఇదేమీ మనుషులకూ జంతువులకూ పోటీకాదు. ఎప్పుడో నూటయాభై సంవత్సరాల క్రితం ఊటీకి రోడ్డు వెయ్యలేదా? అటు మెట్టుపాళెం నుంచి ఊటీ దాకా రైల్వే లైను కోసం కొండల్ని కొట్టలేదా? సొరంగాలు తవ్వలేదా? బ్రిడ్జీలు కట్టలేదా? ఇటు మైసూరు వైపు నుంచి గూడలూరు దాకా ఘాట్‌రోడ్ వెయ్యబట్టి కదా మైసూర్ నుంచి చక్కగా ఊటీకి వస్తున్నాం? గుడలూరు క్రాస్ నుంచి కొత్త ఘాట్ రోడ్‌లో రాత్రింబవళ్ళూ మనం వెహికల్స్‌లో వెళుతున్నాం. జింకలూ మనల్ని పలకరిస్తున్నాయి.. ఏం మునిగిపోయిందండీ? మదుమలైలో శింగార ప్రాంతంలో న్యూట్రినో ప్రాజెక్టు పెడితే అంతర్జాతీయంగా శాస్త్ర పరిశోధనల రంగంలో ఇండియా ప్రతిష్ఠ పెరుగుతుంది. సొరంగం కోసం మనమేమీ కొత్త రోడ్లు వెయ్యడంలేదు. ఉన్న రోడ్లే వాడుకుంటున్నాం. అదీగాక ఇండియాలో ఈ ప్రాజెక్ట్ పెట్టడానికి అటు నైనిటాల్‌లో ఓ ప్రాంతం ఇక్కడ మదుమలైలో శింగార ప్రాంతం.. ఈ రెండే అనువైనవి. నైనిటాల్‌లో మంచుకొండలలో సొరంగం తవ్వడం చాలా ప్రమాదకరం. అక్కడ సొరంగం తవ్వుతూ పోతే తవ్విన చోటు కేవలం ఇరవైనాలుగు గంటల్లో పైకప్పూ పక్కన గోడలూ లేదా ఇనుప దిన్నెలూ దన్ను పెట్టి ఆపాల్సి వస్తుంది. లేదా మంచు కొండలు కాబట్టి సొరంగం కూలిపోతుంది. ఎంత ప్రమాదమో ఆలోచించారా? ఇక్కడ మదుమలైలో ఆ ప్రమాదమేమీ లేదు. సొరంగం తవ్వుతూ నింపాదిగా పైకప్పు ఆర్చి పని చూసుకోవచ్చు అన్నీ ఆలోచించి ఇక్కడ ప్రాజెక్టు ఖరారు చేశామే గాని ఇదేమీ ఆషామాషీ వ్యవహారం కాదు. తెలిసీ తెలియకుండా దీన్ని వ్యతిరేకించడం భావ్యం కాదు.."

అధికార ప్రతినిధి అలా మాట్లాడుతూ ఉండగానే పర్యావరణ బృందం నుంచి ఒక మహిళా ప్రతినిధి తాచుపాములా లేచింది.

"ఏమిటి మీరనేది? తెలిసీ తెలియక ఎవరు మాట్లాడుతున్నారు? ఒకే ఒక్కమాట నేనడుగుతాను చెప్పండి... మీరేవో ప్లాన్లూ మ్యాప్‌లూ చూసీ చూపించీ మాట్లాడుతున్నారు.. మీ ప్రాజెక్టు ప్రతినిధులెవరైనా ఇంతవరకూ శింగార ప్రాంతంలో అడవుల్లోకి ఏ ఆర్భాటం లేకుండా మామూలుగా వెళ్ళి చూశారా? చెప్పండి.."

ఆ మాటలతో అధికార ప్రతినిధులు గతుక్కుమన్నారు. ఏం చెప్పాలో తెలియక తత్తర పడ్డారు.

"మేం ఈ పోస్టింగ్‌కు కొత్తగా వచ్చాం. మా వాళ్ళు ఇంతకు ముందు పని చేసిన వాళ్ళు ఆ అడవుల్లోకి వెళ్ళే ఉంటారు. వెళ్ళకుండా ఎలా ఉంటారు?" అన్నాడు సూట్ వేసుకున్న అధికారి గంభీరంగా

మహిళా ప్రతినిధి ఊరుకోలేదు. మరింత ఊగిపోయింది. "ఇవే మరి బూటకం మాటలంటే, మీరు విమానంలో కోయంబత్తూరు లేదా బెంగుళూరులో దిగి ఇక్కడికి కారులో అలా వచ్చి ఇలా చూసి వెళితే సరిపోదు. మదుమలై అడవుల్లో చిన్న చిన్న పల్లెల్లో నిరాడంబరంగా బ్రతుకుతున్న మనుషుల మధ్య రెండురోజులుండి చూడండి. ఏనుగులో పులులో దాడిచెయ్యకుండా ఉండాలంటే మనం ఎలా ఉండాలో ఎలా ఉండకూడదో తెలుస్తుంది. కొండల మధ్య ఘాట్ రోడ్ వెయటం వేరూ.. కొండల కింద అడుగు భాగంలో పది కిలోమీటర్ల పొడవునా సొరంగం తవ్వడం వేరూ... తెలిసి తెలియక మాట్లాడేది మేమా మీరా? కొంచెం మెదడు పెట్టి ఆలోచించండి సార్.."

"ఆ పని మీరు చెయ్యండి.."

"మాకు మెదళ్ళున్నాయ్.. మేము ఆలోచించే మాట్లాడుతున్నాం... ఎటొచ్చీ మీ సంగతే కొంచెం సందేహంగా ఉంది.."

దాంతో గొడవైపోయింది. వీడియో కెమెరాలు అటూ ఇటూ కదిలాయి. మైక్‌లు మరీ బిజీ అయిపోయాయి. సమావేశం రసాభాస అయే ఘట్టంలో కలెక్టర్ జోక్యం చేసుకుని అందరినీ సమాధాన పరిచి శాంతింప జేశాడు.

ఈ మీటింగ్‌లో ఏం తేలిందీ అంటే ఏమీ తేల లేదని తేల్చారు. తల బొప్పి కట్టింది తప్ప తలనొప్పి తగ్గలేదు.

కలెక్టర్ ఇతర అధికారులతో తగ్గు స్వరంలో మంతనాలు జరిపాడు. వెంటనే ప్రకటన చేశాడు.

"ఓకే! ఈ సమావేశం ప్రస్తుతానికి ముగిస్తున్నాం. ఇప్పటి చర్చల వివరాలన్నీ ప్రభుత్వానికి పంపుతాను. మీడియాతో కూడా చర్చ జరుగుతుంది. మళ్ళీ మరోమారు సమావేశమై ఇంకా వివరంగా చర్చిద్దాం. ప్రాజెక్టు ప్రారంభం కావడానికి ఇంకా టైముంది కాబట్టి ఆలోగా మళ్ళీ సమావేశమౌదాం. అంత వరకూ శెలవు.."

సమావేశం ముగిసి అందరూ రణగొణగా మాట్లాడుకుంటూ వెలుపలికి వస్తుంటే మీడియా ప్రతినిధులు వాళ్ళకన్నా ముందు బైటపడ్డారు. కొందరు రిపోర్టర్లు ప్రతినిధుల్ని వేరు వేరుగా ఇంటర్వ్యూ చెయ్యడానికి సిద్ధమయారు. 'ఓ' టీవీ ప్రోగ్రామ్ వేరు. ప్రతినిధులు వెలుపలికి వస్తున్న నేపథ్యంలో ఖాన్ కెమెరా ఫోకస్ చెయ్యగా అనన్య మైక్ పుచ్చుకుని మాట్లాడింది:

"డియర్ వ్యూయర్స్!" నీలగిరి పర్వత శ్రేణుల్లో న్యూట్రినో ప్రాజెక్ట్ మీద ఓ టీవీ స్పెషల్ ప్రోగ్రాంకి ఇది క్లైమాక్స్ ఘట్టం. ఈ ప్రాజెక్ట్ మీద ప్రజాభిప్రాయ సేకరణలో మీ వంతు పాత్ర మీరు పోషించండి... వెంటనే మీ సెల్ ఫోన్ అందుకోండి. మదుమలై అడవుల్లో న్యూట్రినో ప్రేజెక్ట్ పెట్టవచ్చు అని మీరు భావిస్తే ఎస్ అనీ పెట్టకూడదు అని మీ అభిప్రాయం అయితే నో అనీ టైప్ చేసి మాకు ఎస్.ఎం.ఎస్ చెయ్యడి. మీరు మాకు ఎస్.ఎం.ఎస్ చెయ్యాల్సిన నంబర్..."

టీమ్మేనేజర్ సుధాకర్ గొప్ప బరువు తీరినట్టు నిట్టూర్చాడు.

"ఎక్సలెంట్! వెల్ డన్! అనన్య అండ్ ఖాన్!.. యూ హేవ్ డన్ ఎ గ్రేట్ జాబ్!.."

"హ్హా!" అంటూ కెమెరా దించాడు ఖాన్. నాలుగు రోజులుగా చెయ్యి నొప్పిపట్టింది. వదల్లేదు. కాని తృప్తిగా ఉంది. "వన్ ఆఫ్ మై బెస్ట్!" అన్నాడు.

"అనన్యా! యూ ఆర్ ఫెంటాస్టిక్! ఈ ప్రోగ్రామ్‌తో మన రేటింగ్ పెరిగిపోతుంది.." అన్నాడు సుధాకర్. వెంటనే అతని ముఖ కవళికలు మారిపోయాయి.

బిజినెస్ ముగిశాక వెంటనే ఇల్లు చేరుకోవాలనే బిజినెస్‌మన్ లక్షణం అది. క్షణమైనా అక్కడ ఉండదలచడం లేదు. "ఈ చలికి ఎలా తట్టుకున్నానో భగవంతుడికే తెలియాలి... కమాన్.. లెట్స్ గెట్ డౌన్.." అంటూ సఫారీ దగ్గరకెళ్ళాడు.

"మనం వెళ్ళిపోతాం గానీ మేడంగారు ఒక్కరూ ఉండిపోతారుగా.. ఆమెకు మాత్రం ఈ ట్రిప్ హాలిడే ఇన్ డ్యూటీ..." అన్నాడు ఖాన్ అసూయగా.

సఫారీ దగ్గర డ్రైవర్ సుబ్రమణ్యం వెంటనే కనిపించలేదు. అతని కోసం వెతుక్కుంటూ ఉండగా షాపు గంటకి పార్కింగ్‌లో ఓ మూల నుంచి వచ్చాడు. అటువైపు పార్క్ చేసి ఉన్న ఓ తెల్లటి ఇండికా కార్ డ్రైవర్‌తో ఏదో హడావుడిగా మాట్లాడి మరీ వచ్చాడు.

సఫారీ బైలుదేరిన కాస్సేపటికి అనన్యకు చాలా వికారంగా అనిపించింది. ఎందుకో వెంటనే తెలిసింది. డ్రైవర్ వైపు కొద్దిగా వాలేసరికి స్పష్టంగా అర్థమైంది.

"ఏం కొట్టావు?" అని అడిగింది చిన్నగా.

"అబ్బే.. అదేం లేదు మేడం... ఇండికా డ్రైవర్ మనోడే. ఆంధ్రావోడే... హైదరాబాదోడే.. కాస్సేపు ఇండికాలో కూచున్నానా.. మేం కబుర్లు చెప్పుకున్నామండి" అన్నాడు సుబ్రమణ్యం నసుగుతూ.

"కబుర్లు చెప్పుకుంటే ఇలా.. వాసనొస్తుందా సుబ్బూ?.."

"ఆం భలేవారండి.." అని మూతి ముడుచుకున్నాడు సుబ్రమణ్యం.

కాస్సేపటికి హోటల్ కొచ్చాక అనన్య తప్ప మిగతా అందరూ హైదరాబాద్ తిరుగు ప్రయాణానికి చకచకా సిద్ధమయ్యారు.

వాళ్ళు వెళ్ళిపోతుంటే అనన్యకు దిగులనిపించలేదు.

మనసుకు కొత్త రెక్కలు వస్తున్నట్టే అనిపించింది. కొత్తగా గమ్మత్తుగా సరికొత్త సంగీతం వినిపించినట్లయింది. మరి కొత్త సంకేతాలా? అవి ఎలా ఉంటాయో తెలియదు. ఏదో మలుపు ఏదో మెరుపు కావాలి. అనన్యా అనన్యా అదే కదూ నీ నిరీక్షణ? అదేకదూ నీ అన్వేషణ?

********

పులి కళ్ళలోకి తీక్షణంగా చూసింది అనన్య. భీకరంగా తల విదిలించి ఎర్రటి గుహలాంటి నోరు తెరిచి గాండ్రించింది పులి. క్షణంలో మీదపడుతుంది. చంపేస్తుంది. ఎలాగూ చచ్చిపోతాను తెగించి చచ్చిపోవచ్చు అనుకుంటూ పులి మీదకే దూకింది అనన్య.

అంతలో అనన్య క్షణం ఆలస్యం చెయ్యకుండా ఒంటిమీద బట్టలన్నీ ఒకటొకటీ తీసి విసిరేసింది. నగ్నంగా నిలబడి పులి కళ్ళలోకి ఇంకా నిర్భయంగా నిర్లక్ష్యంగా చూసింది. పులి వెనక్కి తగ్గింది. ఉన్నట్టుండి మళ్ళీ గాండ్రిస్తూ అనన్య మీదికి దూకింది. పంజా దెబ్బ పడింది. రెండు పంజాలు గుండెల మీద పడ్డాయి. యౌవన గిరుల్లాంటి ఎద సొంపులు పులి పంజా దెబ్బకి రక్తం చిమ్మాయి. పులి మీసాలు అనన్య గొంతు మీద పడ్డాయి. కోరలు కసుక్కున దిగబడుతున్నాయి. విలవిలలాడుతూ కొట్టుకుంటోంది అనన్య. ఎవరూ లేరు. ఎవరూ రారు. దేవుణ్ణి ప్రార్థించే క్షణంలో కళ్ళుమూసుకుంది. శ్వాస ఆగిపోతోంది. అయితే శ్వాసతో ఇంకో శ్వాస కలిసింది. అది పులి శ్వాస మరోలా మారింది. జంతువు శ్వాస మనిషి శ్వాస అయింది. కమ్మేస్తోంది.

మృత్యువులాంటి చల్లదనం బదులు వెచ్చటి మత్తులో ఏదో తియ్యదనం కలిసింది.

ఎద మీద దిగబడ్డ పులిగోళ్ళు శరీరాన్ని చీల్చేసి కూడా ఇంకా కదులుతున్నాయి. వీణ మెట్ల మీద నొక్కుతున్నట్టు సరిగమలు ఆలపిస్తున్నాయి. తను చచ్చిపోయి వేరే లోకంలో మేలుకుంటోంది.

పులికాళ్ళు మగమనిషి చేతుల్లా ఉంటాయా? చుట్టేస్తాయా? బంధించేస్తాయా? పులికి ప్రేమ తెలుసా? లాలన తెలుసా? తెలుగు తెలుసా? ఇంగ్లీషు తెలుసా? తన పేరు కూడా తెలుసా? "అనన్యా.. అయ్ లవ్ యూ.." అంటుందా పులి?

దిగ్గున లేచి కూచుంది అనన్య. జివ్వున చలిగాలి బ్లాంకెట్ మడతల్ని చీల్చుకుంటూ దూకింది. హోటల్ రూం వెక్కిరిస్తోంది. అడవి లేదు. పులి లేదు.

కిటికీ అద్దం గుండా దూరంగా అద్భుత దృశ్యం కనిపిస్తోంది.

ఊటీ లేక్ అలల మీద మసక వెన్నెల సుతిమెత్తగా మెరుస్తోంది.

గుండె శబ్దం చెవుల్లో కొట్టుకుంటోంది.

వారం రోజులు శెలవు ఎందుకు పెట్టింది? ఊటీలో ఒంటరిగా ఉండడం అవసరమా?

భయం కాదు. దిగులు కాదు. అర్థంకాని శూన్యం. ఏం కావాలో తెలిసినా ఏమీ దొరకని చోట ఎందుకు ఉండాలి?

ఇంతకీ తనకేం కావాలి? ఒక మగాడా? ప్రియుడా? భర్తా? స్నేహితుడా?

ఎవరు కావాలి? ఏం కావాలి?

ప్రేమా? పెళ్ళా? సెక్సా? థ్రిల్లా?

అడవిలో పులి.. కలలో పులి... అంతేనా? ఇంకేమీ దొరకదా?

*******

మత్తు వదలని చలితో పోరాడుతూ ప్రొద్దున్నే చకచకా తయారయి రూం నుంచి బైటపడింది అనన్య. రిసెప్షన్‌లో వాకబు చేసింది.

టూవీలర్ అద్దెకు కావాలి. ఎక్కడ ప్రయత్నించాలి? అని అడిగింది. ఊటీలో అలా టూవీలర్ అద్దెకు దొరకడంకష్టమే. అయినా ప్రయత్నించి చూడండి... అంటూ రెండు మూడు అడ్రస్‌లు చెప్పాడు రెసెప్షనిస్టు. ఆటో చేసుకుని వెళ్ళింది అనన్య. ఆటోలకి మీటర్లు లేవు. ఛార్జీలు ఎక్కువే. ఆటోవాళ్ళకి తెలుగు రాదు. తమిళం లేదా మలయాళం. హిందీలో మేనేజ్ చెయ్యొచ్చు. రెండు మూడు చోట్లా దొరకలేదు గాని నాలుగో షాపు దగ్గర ఎలాగో సెటిల్ అయ్యింది. బజాజ్ కవాసాకీ దొరికింది. అదీ ఓ మెకానిక్‌ది. అద్దెలకి తిప్పే అలవాటు లేదు. అయినా మీరు లేడీ కాబట్టి సాయం చేస్తున్నట్టే ఇస్తున్నానంతే అని బోలెడు కండిషన్లు చెప్పాడు. డ్రైవింగ్ లైసెన్సు, పాస్ పోర్టు తీసి తన దగ్గర పెట్టుకున్నాడు.

కొండలూ గుట్టల రోడ్డు మీద రయ్యిమని సాహస యాత్ర మొదలు పెట్టింది అనన్య. చాలా ఉత్కంఠంగా అనిపించింది. చూసినవే మళ్ళీ చూసింది అయినా భలే సరదా అనిపించింది.

బొటానికల్ గార్డెన్ నుంచి రేస్‌కోర్స్ రోడ్‌కి వెళ్ళి రైల్వే స్టేషన్ దగ్గర రౌండ్లు కొట్టింది. మళ్ళీ ఛారింగ్ క్రాస్‌కి వచ్చి దుర్గా హోటల్‌లో టీ తాగింది. ఊటీలో టీ మజాయే వేరు.

కూనూర్ రోడ్డంట వెళుతూ లవ్ డేల్ జంక్షన్ దగ్గర ఆగిపోయింది. లవ్‌డేల్ అనే పేరే మ్యూజిక్‌లా పని చేసింది.

దూరంగా లోయలో చెట్ల మాటు నుంచి బొమ్మరిల్లులా కనిపిస్తున్న చర్చి బురుజు కేసి చూస్తే కనువిందుగా అనిపించింది.

ఒక దానితో ఒకటి పోటీ పడి నిక్కి నిక్కి ఆగిపోయిన కొండల మధ్య కనుమలోకి మెలికలు తిరిగే రోడ్డు వెంట దూసుకు పోతుంటే ఎండ పొడ తగ్గి చలువలు కమ్మేశాయి.

చిన్నపిల్లలు ఆడుకునే బొమ్మరైలులా అప్పుడే లవ్‌డేల్ స్టేషన్‌లో వచ్చి ఆగింది ఊటీ రైలు. చిన్నాపెద్దా తేడాలేకుండా అందరూ కేరింతలు కొడుతున్నారు. కదిలి వెళుతున్న రైలును చూస్తుంటే ఉల్లాసం ఉత్సాహం అన్నీ కలల్లోకి దూసుకు పోతున్నాయనిపించింది.

లవ్‌డేల్ దాటి వెళ్ళగలిగినంత దూరం వెళ్ళింది అనన్య. ఎకరాలకి ఎకరాలు టీ తోటలు, మల్బరీ, సరుగుడు చెట్లు, అక్కడా ఇక్కడా ఒక్కోచోట పది పదిహేను ఇళ్ళు. అవీ పెంకుటిళ్ళు.

ఆకుల మధ్య బ్రతికేస్తున్న ఆకుల్లాంటి కూలీలు.

ఎవరూ ఎక్కడికీ పోరు. ఎక్కడి ఆనందం అక్కడే ఉంది. ఆనందం ప్రతి మనిషి మనస్సులోనే ఉంది.

ఈ కూలీలు అమెరికా వెళ్ళాలని ఎందుకు అనుకోరు?

మోటార్ సైకిల్ మీద దూసుకు పోతున్న అనన్యని వింతగా చూశారు గ్రామస్తులు. వెర్రి కాకపోతే ఈ తోటల్లో తనకేం దొరుకుతుందని?

ఎవరైనా ఒంటరి విదేశీ టూరిస్టు యువకుడు కారు చెడిపోయి అక్కడే తారసపడితే తను మోటార్ సైకిల్‌లో లిఫ్ట్ ఇస్తే ఎంత బావుంటుంది!

చిన్న పరిచయంతో ఒక మధురమైన రొమాన్స్ మొదలు కావచ్చు. అతనితో తను అమెరికా వెళ్ళొచ్చు. అతను జర్మన్ అయితే తనూ జర్మనీ వెళ్ళొచ్చు..

యూకలిప్టస్ ప్లాంటేషన్ దగ్గర ఎదురైన పెద్దమనిషిని తమిళంలో వాకబు చేసింది.

వచ్చిన దారంట వెళ్ళకుండా అటు నుంచే కూనూర్‌కి దారి ఉంది. ఆ కొత్తదారిలో నిర్భయంగా రయ్యిమని దూసుకుపోయింది అనన్య. ఇది పద్ధతి లేని పిచ్చి గాని ఇందులో మజా ఉంది. పులి ఎదురైనా ఎదుర్కొనే దమ్ము ఉంది. కమాన్ అనన్యా గో ఎ హెడ్ అని దూసుకుపోయింది అనన్య.

కూనూర్ చేరుతుండగా పెద్ద టీ ఎస్టేట్ దగ్గర టూరిస్ట్ వాహనాలు ఆగి ఉన్నాయి. తనూ వెళ్ళి కాసేపు సేద దీరింది ఆ ఎస్టేట్ లోనే టీ ఫ్యాక్టరీ ఉంది. మామూలుగా టీ ఫ్యాక్టరీల దగ్గరికి టూరిస్టుల్ని రానివ్వరు. కాని ఈ ఫ్యాక్టరీ యాజమాన్యం ఒక సదుపాయం కల్పించింది. ఎస్టేట్‌లో ఒక పక్కన చిన్న రెస్టారెంట్ నడుపుతున్నారు. ఆ టీ ఎస్టేట్ లో కూచుని అక్కడే పడిన టీ ఆకుతో అక్కడికక్కడే తాజా టీ తాగడం మహత్తరమైన అనుభూతి.

వేడి వేడి ఆవిరి గాలి శిల్పాల్లా లేచి చెదురుతున్న కప్పునుంచి మజామజాగా టీ తాగుతుండగా సరిగ్గా తనముందే వచ్చి కూచున్న ఓ యువతిని చూసి ఉలిక్కిపడింది అనన్య.

ఒళ్ళు జలజరించింది.

ఈ టీ తాగి కళ్ళు తిరిగాయా అనిపించింది. క్షణం తమాయించుకుని మళ్ళీ పరకాయించి చూసింది అనన్య.

ఎదురు అద్దం ఏదీ లేదు.

టీ ఎస్టేట్‌లో రెస్టారెంట్ దృశ్యం అలాగే ఉంది. అద్దం లేదంటే లేదు. కాని తను అద్దంలో చూసుకున్నట్టే ఉంది.

ఏదో ఇంద్రజాలం జరిగిందా? తనలోంచి ఇంకో తను లేచి వెళ్ళి తనకెదురుగా కూచుందా?

ఇంతకీ ఎదురుగా ఉంది తనేనా? ఇంకొకరా?

ఖచ్చితంగా తెలుస్తోంది. ఎదురుగా తను లేదు. ఎలా ఉంటుంది? ఇదేమైనా డబుల్ యాక్షన్ సినిమానా? ఎదురుగా ఇంకో అమ్మాయి ఉంది.

కాని ఆ అమ్మాయి అచ్చంగా తనలాగే ఉంది.

తనే అనిపిస్తోంది. ముమ్మూర్తులా తనే అనిపిస్తోంది..

✡✡✡

# 4

**"హాయ్ అనన్యా!" పలకరింపుతో** అదిరి పడింది అనన్య. "మీరెవరో నాకు తెలుసు నేనెవరో మీకు తెలీదు" అనే వ్యాఖ్యానంతో కలవరపడి చూసింది.

"చిత్రంగా లేదూ? నేను అచ్చం మీలాగే ఉన్నాను" అంటే ఇంకేమంటుంది అనన్య?

"ఇంకో చిత్రం ఏంటంటే నా పేరు చిత్ర!"

మెరుపు మీద మెరుపు. షాక్ మీద షాక్. మెరుపు ఆడపిల్ల రూపు వచ్చినట్టు తళుక్కున మెరిసి నవ్వుతూ షేక్ హాండ్ ఇచ్చింది చిత్ర.

ఆ చెయ్యి తగిలేసరికి ఏదో తెలియని లోకంలోకి వెళ్ళిపోయింది అనన్య. తనకు తనే షేక్‌హాండ్ ఇచ్చుకుంటోందా? ఇదెలా సంభవం?

"ఇంతకీ మీరూ?.." అన్నదే కాని అనన్యకి అసలేం చెప్పాలో తెలియలేదు. చెప్పడానికేముంది? ఈ అమ్మాయి ఎవరు? తనెవరు?

ఏదో వింత నాటకంలో దృశ్యం మారినట్లుందే గాని ఇది నిజజీవితంలా లేదు. జీవితంలో నిజంలా లేదు.

"డోంట్ వర్రీ యూర్.. మనం టీ తాగుతూ మాట్లాడుకుందాం" అంటూ చొరవగా తనకో టీ తెచ్చుకుని అనన్యకు ఇంకో టీ అందించింది చిత్ర.

"టీ..ఇన్ ఊటీ! వావ్.. వండ్రఫుల్!.. చిత్ర విత్ అనన్య.. ఇది ఇంకా అద్భుతం కదూ?"

అప్పుడే తేలిపోయింది అనన్యకి.

తను శ్రమపడాల్సిన పనిలేదు. వెర్రిమొర్రిగా ఊహించుకోవలసిన అవసరంలేదు. చెప్పేదేదో ఆ చిత్రే చెప్పేస్తుంది. తను కేవలం వినిపెడితే సరి.

అలా అనుకుందేగాని మెదడులో సినిమా రీలులా దృశ్యాలూ ఊహలూ తిరిగిపోతూనే ఉన్నాయి. ప్రశ్నలూ జవాబులూ ఢీ కొట్టి మాయమై పోతున్నాయి.

మూడేళ్ళ క్రితం లండన్ వెళ్ళి పోయిన మమ్మీని గుర్తుచేసుకుంది. అంతకు ముందెప్పుడో తను ఇంటర్ లో ఉండగానే మమ్మీ నుంచి విడిపోయిన డాడీని గుర్తుచేసుకుంది. లండన్‌లో మమ్మీ మళ్ళీ పెళ్ళిచేసుకుంది. కొత్త డాడీ ఫోటో తన ఈ మెయిల్‌లో చూసుకుంది అంతే. పాత డాడీ మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడని విన్నది. జర్మనీలో ఉన్నాడన్నారు. అంతకు మించి ఏమీ తెలియదు. మమ్మీకి అక్కచెల్లెళ్ళు ఎవరూ లేరు. పాత డాడీకి ఒక అక్కయ్య ఉందిగానీ ఆమెకు ఆడపిల్లలు లేరు. ఇక దగ్గర బంధువుల్లో ఎవరి పిల్లలకైనా తన పోలికలు ఉండే అవకాశం ఉందా అంటే అస్సలు లేదు. మరి ఈ చిత్ర అచ్చుగుద్దినట్టు తనలాగే ఎలా ఉంది?

అనన్య ఆలోచనల్ని అలాగే చదివేస్తున్నట్టు "డోంట్ వర్రీ టూ మచ్.. మన మధ్య బంధుత్వం ఉండే ఛాన్స్ లేదు" అని నవ్వుతూ చెప్పింది చిత్ర.

"మీరు 'ఓ' టీవీ యాంకర్ అనన్య కాబట్టి మీరెవరో నాకు తెలుసు. మీకు వేలాది అభిమానులు ఉండొచ్చుగాని మిమ్మల్ని చూడాలని నాలాగా తహ తహలాడే వాళ్ళు మాత్రం ఎవ్వరూ ఉండరు.. విధి బలీయం... అంటూ పాత డైలాగులు చెప్పడం ఎందుకుగాని ఇలా మిమ్మల్నిక్కడ ఊటీలో కలుసుకోవడం మాత్రం రియల్లీ ఫెంటాస్టిక్ అండ్ వెరీగ్రేట్.."

"ఓకే! నైస్ టు మీట్ యూ.." అని మెల్లగా తేరుకుంటూ నవ్వేసింది అనన్య.

చుట్టూ టూరిస్టులు కళపెళగా కదులుతున్నారు. వాహనాలు వస్తున్నాయి పోతున్నాయి. చలిగాలిలోంచే వెచ్చటి ఎండ దూసుకు వస్తోంది. ఎదురుగా కొండ చరియ మీద పచ్చటి టీ తోటమీద నల్లటి మబ్బునీడ బద్ధకంగా కదులుతోంది.

అద్దంలో తన నీడ లాంటి చిత్రవైపు కుతూహలంగా చూసుకుంటూ డబుల్స్ మీద తన పరిజ్ఞానాన్ని బైటపెట్టింది అనన్య. "ప్రపంచంలో మనిషిని పోలిన మనుషులు ఏకకాలంలో కనీసం ఏడుమంది ఉంటారట... మనిద్దరం కలిసి మనలాంటి మిగతా ఐదు మంది కోసం వెదికితే ఫెంటాస్టిక్‌గా ఉంటుంది.." అంది అనన్య. "మనం ఇలా మాట్లాడుకుంటూ ఉండగానే మన లాంటి మూడో అమ్మాయి యధాలాపంగా ఇక్కడికొచ్చేస్తే ఇంకా బాగుంటుంది.." అంది.

రహస్యాన్ని అదిమి పెట్టలేనట్టు నవ్వింది చిత్ర. "కాని నేను అంత ఈజీగా మిమ్మల్ని కలుసుకోలేదు.. నిజానికి నేను మిమ్మల్ని ఫాలో చేశానని చెప్పాలి.. ఊటీలో మీ స్పెషల్ కవరేజీ.. మీ యాంకరింగ్.. వీటి గురించి నాకు ఐడియా ఉంది.." అంటూ నెమ్మదిగా గొంతు తగ్గించి చెప్పింది.." నేను కొంచెం టెన్షన్‌లో ఉన్నాను.. మీరు నాకో చిన్న హెల్ప్ చెయ్యాలి .. ప్లీజ్.. కాదనకండి... సాయం చిన్నదేగాని మీకు నేను జీవితాంతం రుణపడి ఉంటాను.." అంది చిత్ర.

ఒక్కముక్కా అర్థంకాక తికమకపడింది అనన్య. ఫాలో చెయ్యడమేమిటి? సాయం అడగడమేమిటి? రుణపడి ఉండటం ఏమిటసలు? ఇదంతా ఎందుకిలా జరుగుతోంది?

ఒంటరి ఆడపిల్ల ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. అపరిచితులతో మరీ జాగ్రత్తగా ఉండాలి. సాయం చెయ్యడమంటే సవాలక్ష ఆలోచించుకోవాలి.

మెదడులో ఆలోచనల చక్రం స్పరున తిరుగుతూ ఉండగానే అలవోకగా నవ్వేస్తూ.. "చెప్పండి.. నేను ఏం చెయ్యాలి మీకు?" అంది అనన్య.

జర్నలిస్టుననే ధీమా. టీవీ యాంకర్‌ని నా వెనుక మీడియా ఉంది అనే ధైర్యం. పెద్దపులి కళ్ళలోకైనా సూటిగా చూడగలిగే సాహసం ఇవన్నీ ఉన్న అనన్యకు భయమేమిటి? బెదురేమిటి?

"చెపుతాను.. అంతా చెపుతాను గానీ అంత టైములేదిప్పుడు..." అంటూనే చిత్ర హేండ్ బ్యాగ్ లోంచి సెల్ ఫోన్ తీసి ఏదో నంబర్ డయల్ చేసి "హావీజిట్? ఓకేనా?..." అని ఆగి ఆగి వింటూ "ఓకే.. ఓకే" అంటూ కట్ చేసేసింది.

చాలా కంట్రోల్‌లో ఉంది గాని చిత్ర ఎంతో టెన్షన్‌ని అణుచుకుంటోంది. "అంతా చెపుతాను కాని ఇక్కడ కాదు.. మీరిక్కణ్ణుంచి హోటల్‌కే కదా వెళతారు? లంచ్ మనం మీ హోటల్‌లోనే చేద్దాం.. సరిగ్గా గంటలో నేను మీ రూంకి వస్తాను.. అంతా అక్కడే మాట్లాడుకుందాం... ప్లీజ్ మీరు రూంలోనే ఉండండి.." అని చిత్రలేచి వెళ్ళిపోబోతూంటే అయోమయంగా చూసింది అనన్య.

"హే వాటీస్ దిస్? నా కసలే కన్‌ఫ్యూషన్‌గా ఉంటే ఇంకా కన్‌ఫ్యూస్ చేస్తున్నారు.." అంటున్న అనన్య కేసి అనునయంగా చూసింది చిత్ర.

"ప్లీజ్ బేర్ విత్ మీ డియర్.. నేను నీకు అక్కలాంటి దాన్ని లేదా చెల్లెలాంటి దాన్ని.. నాకు సాయం చెయ్యడం నీకు ఇంకా గ్రేట్ ఫీలింగ్ ఇస్తుందే గాని నీకేం ఇబ్బంది ఉండదు?.. ఓకే.."

"నేనిప్పుడే హోటల్‌కి వెళ్ళకపోతే?"

"ప్లీజ్ నా కోసం వెళ్ళు.. జర్నలిస్టువి కదా ఆ మాత్రం క్యూరియాసిటీ ఉంటుందిలే తప్పకుండా వెళ్తావు... నా కోసం వెయిట్ చేస్తూ ఉంటావు.. హోటల్ లేక్‌వ్యూ కదూ?... డోంట్ వర్రీ అలాంటివి తెలుసుకోవడం చాలా ఈజీ. సీయూ.." అంటూ చకచకా వెళ్ళిపోయింది చిత్ర.

చాలాసేపు అలాగే అక్కడే ఉండిపోయి ఇంకో టీ తాగింది అనన్య. ఇదో కమ్మటి సువాసన. వేడివేడిగా చప్పరిస్తూ తాగాక కాస్సేపటికి మెదడంతా తాజా ఆలోచనలు తిరుగుతున్న అనుభూతి. టీలో ఏదో మహత్యం ఉందనుకుంటూ అక్కణ్ణుంచి కదిలింది అనన్య.

అవునూ తను ఉన్నది లేక్‌వ్యూ హోటల్ అని చిత్ర అంత ఖచ్చితంగా ఎలా చెప్పింది? కొంపదీసి చిత్రకూడా అదే హోటల్‌లో ఉందా? తను ఆమెకు చెయ్యగల సాయం ఏమిటసలు?

ఇలా ఆలోచించుకుంటూ బైక్ స్టార్ట్ చేసిన అనన్యకి మనసు పరిపరివిధాల పోయింది. ఊటీలో తను ఆగిపోయింది ఎందుకు? ఇందుకేనా? ఇంకేమైనా ఉందా?

ఏమో! మళ్ళీ చిత్ర హఠాత్తుగా ఎక్కడో తారసపడవచ్చు. అప్పుడైనా తప్పేట్టులేదు. అన్నిటికీ మించి తనూ ఆ అమ్మాయీ ఒక్కలాగే ఉండటం విచిత్రం.

ఈ చిత్రకథ ఇంకే మలుపు తిరుగుతుందో వేచి చూడాల్సిందే చిత్రను కలిసి తీరాల్సిందే! ఏమో ఎవరు చెప్పగలరు? ఈ పిట్టకథ ఎలాంటిదైనా ఒక టీవీ ఎపిసోడ్‌కి పనికి రావచ్చునేమో!..

ఇలా అనుకుంటూ టీ ఎస్టేట్ నుంచి బైక్‌లో స్పరున వెళ్ళిపోయింది అనన్య. అయితే కొన్ని నిముషాల క్రితమే తన నుంచి విడిపోయిన చిత్ర అనే అమ్మాయి టూరిస్టుల సందడి మధ్య ఎటు వెళ్ళి ఎటు మాయమైందో ఆమె గమనించలేదు.

క్షణాల క్రితమే అక్కణ్ణుంచి కదిలి వెళ్ళింది తెల్లటి ఇండికా కారు. ఆ కారు వెనుక సీటులోంచి చిత్ర తన కదలికల్ని గమనిస్తూ వెళ్ళిందని అనన్యకు తెలీదు.

*******

కాలం ఇంద్రజాలం చేస్తుందని నమ్మింది అనన్య. అందుకే ఊటీలో ఆగింది. జివ్వునలాగే చలిలో స్వప్నాల దుప్పటిలాంటి యౌవన వైభవంతో రాకుమారుడులాంటి నచ్చిన మగాడు దొరుకుతాడని వెర్రిగా ఆశపడింది. ఆధారం లేని ఆశ. అయినా అందమే ఆధారం. ఆనందమే ఆధారం. స్వప్న పురుషుడు తారసపడినా పడకపోయినా అటువంటి మహత్తరమైన అనుభూతి కోసం కలలు కనడానికి ఊటీ కన్న గొప్ప ప్రాంతం ఎక్కడ ఉంటుంది?

ఇంద్రజాలం జరక్కపోయినా ఏదో అద్భుతం జరుగుతుందన్న ఆశతో మేలుకున్నాక నిద్రపోయినా జీవితం ఎంత రసరమ్యంగా ఉంటుంది? కలలే లేకుంటే యౌవనంలో మాధుర్యం ఏముంది?

హోటల్ రూం చేరుకోగానే పోర్టబుల్ డీవీడీ ప్లేయర్ ఆన్ చేసుకుని పాశ్చాత్య సంగీతం హోరులో కలల్ని ఇంకా వెచ్చజేసుకుంది అనన్య. "యు ఆర్ మై హార్ట్ బీట్.. యు ఆర్ మై నేకెడ్ డ్రీమ్..." అంటూ హృదయాన్ని చీల్చుకుంటూ ఆర్తితో పాడుతోంది ఓ యువతి.

మై హార్ట్ బీట్ .... అనన్యా!.. ఏదీ నీ హార్ట్ బీట్? ఏమంటోంది నీ హార్ట్ బీట్?

రాకుమారుడు తారసపడతాడు అనుకుంటే ఈ విచిత్ర సంఘటన ఏమిటి?

చిత్రవిచిత్రంగా నీలాంటి అమ్మాయే ఇంకో మెరుపు తీగలా మీదపడడమేమిటి? ఆ అమ్మాయి పేరు చిత్రకావడం చిత్రమా విచిత్రమా?

ఇంద్రజాలం జరగాలనుకుంటే నువ్వు అనుకున్నదే జరుగుతుందా? ఇంద్రజాలికుడి టోపీలోంచి కుందేలు పిల్లవస్తుందనుకున్నావు నువ్వు. ఇప్పుడు పావురం వచ్చింది. ఏదైనా ఇంద్రజాలమే కదా?

సో.. టేకిటీజీ.

ఎలా వచ్చిందాన్ని అలా స్వీకరించు. దీంట్లో ఏం మజా ఉందో థ్రిల్ ఉందో అనుభవించు. ఆనందించు అనన్యా యు ఆర్ ఎ క్లెవర్ గర్ల్.

"హాయ్ అనన్యా.. మై స్వీట్.." అంటూ చిత్ర దూసుకురావడంతో ఉలిక్కిపడింది అనన్య. తట్టకుండా లోపలి కొచ్చేసిన చిత్రకు బొత్తిగా మంచీ మర్యాదా తెలీదనే విషయం కూడా అనన్యకు స్ఫురించలేదు. కాని లోలోపల ఆశ్చర్యపోతూనే ఉంది.

టీ ఎస్టేట్‌లో చిత్రను కలుసుకోవడం ఒక పగటి కల అన్నా నమ్మే పరిస్థితిలో ఉందిప్పుడు.

ఈ చిత్ర ఇప్పుడు సరదాగా కొన్ని జోక్స్ చెప్పి నవ్వించి నవ్వేసి "ఇద్దరం ఒక్కలా ఉండడంతో థ్రిల్ అయి.. ఏదో పనుందని చెప్పి వచ్చానుగాని.. నిన్ను కలుసుకోవడం తప్ప మరేం పనిలేదు. .. సీయూ.. బై!" అని వెళ్ళిపోతే ఇంకా సంతోషంగా ఉంటుంది అనన్యకు.

కాని చిత్ర అంత సులభంగా వదల్లేదు. ఏదో సొంత ఇంటికి వచ్చినట్టు రూం అంతా అటూ ఇటూ తిరిగింది. తన వస్తువులే ఏవో అక్కడ మరిచి పోయి వెళ్ళినట్టు వార్డ్‌రోబ్ తీసి మూసీ టేబుల్ సొరుగు లాగీ సర్దీ... అలాగే మాటల్లోనే పనులు కానిచ్చేసింది. ఏ మొహమాటమూ లేనట్టు రూం సర్వీస్‌కి ఫోన్ చేసి నానారకాల ఐటమ్స్ లంచ్‌కి చెప్పేసింది.

నిజానికి అనన్యకి కోపం రావాలి. కాని ఎందుకని కోపం రావడం లేదో అనన్యకే అర్థం కావడంలేదు. నివ్వెర పోవడం అవాక్కయి పోవడం అంటే ఇదే అని అర్థమవుతోంది.

లంచ్ ఎవరు ఎవరికి ఇప్పిస్తున్నారో తెలియడం లేదు. చిత్రలో అయస్కాంతంలాంటి ఆకర్షణ ఉంది. అనన్యకు అనుక్షణం తెలుస్తూనే ఉంది... తనలో కూడా అటువంటి ఆకర్షణ ఉందా అని ఆశ్చర్యం వేస్తూ ఉంది. మరుసటి క్షణం స్పష్టంగా తెలిసిపోతూ ఉంది. పెద్దపులి కళ్ళలోకి సూటిగా చూసి నిలబెట్టేసిన సమ్మోహన శక్తి సామాన్యమైనదా? ఈ శక్తి చిత్రలోనూ ఉంది. తనలోనూ ఉంది. అయితే మనుషులు ఒకలాగే ఉండవచ్చుగాని వ్యక్తిత్వం కూడా ఒక్కలాగే ఒక్కలాగే ఉండడం మరీ ఆశ్చర్యం కలిగిస్తూ ఉంది.

"అనన్యా! నువ్వు నాకు చెయ్యాల్సిన సాయం చాలా చిన్నది. అది నువ్వు మాత్రమే చెయ్యగలవు. అదీ ఇక్కడే కాస్సేపట్లోనే చెయ్యాలి" అని చిత్ర చెపుతుంటే మరింత ఉత్కంఠగా చూసింది అనన్య. "భలే సస్పెన్స్ పెడుతున్నావ్.. ఇంతకీ ఏం చెయ్యాలి నేను?"

"సింపుల్!.. కాస్సేపు నువ్వు.. నేను.. అయిపోవాలి.."

"వాట్?"

"ఎస్! కాస్సేపు... అంటే ఒక గంటసేపు.. లేదా గంటన్నర సేపు.. మహా అయితే రెండు గంటలసేపు.. నువ్వు నాలాగా నటించాలి... అంతే! ఈ లోగా నేను ఓ ఆపదలోంచి బైటపడతాను.. నీకేమీ రిస్క్ లేదు.. ప్రామిస్!"

అనన్యకు పొలమారింది. ఆమె తలమీద చిన్నగా తట్టి నీళ్ళు అందించింది చిత్ర. "కూల్ డౌన్! అంతగా అదిరి పడాల్సిందేమీ లేదు... జస్ట్ ఎ సింపుల్ హెల్ప్.."

"నాకంతా.. కన్‌ఫ్యూజింగ్‌గా ఉంది."

"హా.. అవును.. నేను అసలు విషయం చెపితే నీకంతా అర్థమవుతుంది. మరీ వివరాలు అవసరం లేదుకాని సాధ్యమైనంత టూకీగా చెపుతాను" అంటూ చెప్పుకొచ్చింది చిత్ర.

"బిలీవిట్ అనన్యా! నేనో అనాథని! తెలివి తేటలు వచ్చేసరికి కలకత్తాలో అనాథాశ్రమంలో ఉన్నాను. దూరపు బంధువులో మరెవరో గాని నన్ను అనాథాశ్రమంలో చేర్చారట. తెలుగమ్మాయినే అన్నారు. అందుకే తెలుగు మనుషులతో జట్టుకట్టాను. స్కూల్ ఫైనల్ తర్వాత చిన్న చిన్న ఉద్యోగాలతో నెట్టుకొచ్చి ఓ మహిళా ఉపాధి కేంద్రంలో చేరాను. పేదరికం అంచులు చూస్తూనే బి ఎస్సీ డిగ్రీ చదివాను. తర్వాత కంప్యూటర్ కోర్సులు చేశాను. ఢిల్లీలో ఉద్యోగం చేశాను. అనుకోకుండా మంచి ఉద్యోగం తగిలి హైదరాబాద్ వచ్చాను. ఒంటరి ఆడపిల్ల.. అందునా అందమైన ఆడపిల్ల సొసైటీలో నెగ్గుకు రావడం ఎంత కష్టమో తెలుసుకదా? పట్టుదలతో నీతిగా నిజాయితీగా బ్రతుకుతూ కెరీర్ మీదే దృష్టిపెట్టి అంచెలంచలుగా ఎదిగాను. సాఫ్ట్‌వేర్ ఉద్యోగంతో అమెరికా వెళ్ళి స్థిరపడాలనేది నా స్వప్నం. ఆ ప్రయత్నాల్లోనే ఉండగా అనుకోకుండా నా కలలకు బ్రేక్ పడింది. ఆ బ్రేక్ పేరు వీరూ. వీరూ పూర్తిపేరు వీరేంద్ర.."

"ఓ! .. లవ్ స్టోరీ" అంది అనన్య అప్రయత్నంగా.

"లవ్ లేని స్టోరీలు ఉంటే ఆశ్చర్యమే అనన్యా!" అంది చిత్ర పేలవంగా నవ్వుతూ. "ఏదో రకమైన ప్రేమే జీవితాన్ని శాసిస్తుంది. నవ్విస్తుంది. నలిపి నాశనం చేస్తుంది.."

"సరే చెప్పు.. ఎవరా ధీరేందర్? ఏమా ప్రేమ కథ?"

"హైదరాబాద్ లో అత్యంత సంపన్నులైన పారిశ్రామిక వేత్తలలో హీరాచంద్ ఫ్యామిలీ ఒకటి.."

"ఎక్కడో విన్నట్టే ఉంది"

"హీరాచంద్ ఫ్యామిలీ గురించి హైదరాబాద్‌లో కన్న ఇండియాలో కన్న విదేశాల్లోని పారిశ్రామిక వర్గాలకే ఎక్కువగా తెలుసు. ఎందుకంటే దేశ స్వాతంత్ర్యం తర్వాత రోజుల నుంచి ఆధునిక పద్ధతుల్లో వ్యాపార వాణిజ్యాలు మొదలు పెట్టిన హీరాచంద్ ఎక్కువగా ఎగుమతులు దిగుమతులపైన దృష్టిపెట్టాడు. బిలీవ్ మీ డియర్.. వాళ్ళకి హైదరాబాద్‌లో ఒకే ఒక్క అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ ఉంది. కాని బిజినెస్ ఆఫీస్‌లన్నీ జర్మనీ లోని ఫ్రాంక్ ఫర్ట్‌లోనూ ఉన్నాయి. అంతర్జాతీయ వాణిజ్యరంగంలో హీరాచంద్ పేరు తిరుగులేని సమ్మోహనాస్త్రం .."

"వావ్! అయితే వీరూ అనబడే వీరేంద్ర ఒక రాజకుమారుడన్నమాట.." అంటూ ప్రేమగాథకు మనస్సులోనే రూపకల్పన చేసుకుంది అనన్య. "యువరాజు వీరేంద్ర ఒక మామూలు మధ్యతరగతి అమ్మాయి అయిన చిత్రను ప్రేమించాడన్నమాట.. కథ కొత్తదేమీకాదు.. కాబట్టి కష్టాలు కొత్తవి అయిఉండవు.. సో?..."

లంచ్ ముగిసింది. ప్లేట్లు సర్ది పక్కన పెట్టేసి చేతులు తుడుచుకుంటూనే చెప్పింది చిత్ర.

"నీ ఊహ కరెక్టేకానీ ప్రేమ ఒక్క రకమే అయినా ప్రేమ వల్ల కష్టాలు రకరకాలు. ప్రేమ అంటే రకరకాల నరకం!" అంటూ తెగించినట్టు నవ్వింది... "ఎలా ఉంది కొటేషన్?"

"తర్వాత చెప్పు మరి.."

"ఏం చెప్పను అనన్యా? వీరూ నవమన్మథుడు లాంటి రాకుమారుడు. ఆస్తి అంతస్తూ హోదా వీటన్నిటితో పాటు చదువూ తెలివితేటలూ పుష్కలంగా ఉన్నాయి. ఏ ఆడపిల్ల అయినా వెంటనే మనస్సు పారేసుకునేంత అందగాడు. అయితే నేనంత సులభంగా మనస్సు పారేసుకోలేదు.. ఎందుకంటే ఇద్దరి మధ్యా భూమికీ ఆకాశానికీ ఉన్నంత అంతరం ఉంది. సుదూర తీరాల్లో నేలా ఆకాశమూ కలిసేట్టు భ్రమ కలగవచ్చుగాని అవి ఎప్పటికీ కలవవు. కలవాలని కలగనడం తప్పు కూడా. ఒక పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ వాళ్ళిచ్చిన పార్టీలో నేను అనుకోకుండా వీరూని చూశాను. పార్టీలో ఆడపిల్లల కళ్ళన్నీ వీరూ మీదే ఉన్నాయి. అతను చాలా రిజర్వ్‌డ్‌గా ఉండే వ్యక్తి. అతని

దృష్టిలో పడాలని అందాల రాణులైనా పోటీపడతారు. కాని అతని దృష్టి ఎవరి మీదా నిలవదు. నా అదృష్టమో దురదృష్టమో వీరూ కళ్ళు నామీద పడ్డాయి. ..."

"వావ్.. అది అదృష్టమేగా.."

"నమ్మలేని అదృష్టం.. భరించలేనంత అదృష్టం... చివరికి అదే అయింది దురదృష్టం.."

"ఎందుకలాగ?"

"అదృష్టం లాగే మొదలయింది మా పరిచయం. తొలిచూపులోనే నేను అతనికి పూర్తిగా నచ్చేశాను. నాకేమైందో నాకే తెలీదు,. మరుసటి రోజు సాయంత్రం అతని కారులో లాంగ్ డ్రైవ్ లో ఉన్నాను. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ నా చుట్టూ తిరుగుతోందీ అనిపించింది. ఇదే ప్రేమ. ఇదే ప్రేమ కాకుంటే ఇంకేదీ ప్రేమ కాదు అనిపించింది. జీవితమంతా వేధించిన పేదరికం తల్లిదండ్రులు లేని అనాథ బ్రతుకూ అమెరికాలో గొప్ప ఉద్యోగంలో తిరుగులేని కెరీర్‌లో ఎదగాలనే స్వప్నం.... ఇవేవీ గుర్తురాలేదు నాకు.. మా మధ్య ఉన్న అగాధం కూడా బాధించలేదు. నేనతని కోసం ఎగబడలేదు. అతనే నాకోసం దిగి వచ్చాడు. అంతా అతనే చేశాడు. నా ఊహల్నీ కలల్నీ నా జీవితాశయాల్నీ పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకున్నాడు... నీ గతం నీ కుటుంబ పరిస్థితీ నీ అంతస్తూ అన్నీ నాకు అనవసరం. నువ్వే నాకు కావాలి. నువ్వులేకుంటే నాకింక లైఫే ఉండదు అనేవాడు. అంతస్తుల అంతరం గురించి నేను ప్రస్తావిస్తే అస్సలు పట్టించుకోలేదు."

"రియల్లీ గ్రేట్! "

"ఎస్!.. రియల్లీ గ్రే ట్... వీరూ ఈజ్ రియల్లీ స్వీట్ అండ్ గ్రేట్! అన్ని ప్రేమల్లో ప్రేమికులెప్పుడూ గ్రేట్! కాని కుటుంబాలూ సొసైటీ.. ఇవే పెద్ద విలన్‌లు.. అవునా?"

"హుఁ.." అని నిట్టూర్చింది అనన్య. "సో.. వాళ్ళ పెద్ద వాళ్ళు ఒప్పుకోలేదు. ప్రేమకథ అడ్డం తిరిగింది. అంతేనా?"

"అంతే అయితే హాయిగా ఉండేది. మా ప్రేమ కథ అంత సింపుల్‌గా అడ్డం తిరగలేదు.. తిక్క తిక్కగా మెలికలు పడింది.."

"ఎలాగా?"

"రారాజులాంటి హీరాచంద్ ఈ ప్రేమ వ్యవహారాన్ని చాలా విచిత్రంగా డీల్ చేశాడు. అతన్ని పెద్దమనిషి అనాలో విలన్ అనాలో నాకిప్పటికీ తెలీదు. కొడుకు ఓ అమ్మాయిని ప్రేమించానూ, పెళ్ళి చేసుకుంటానూ అంటే ఒక తండ్రిగా హీరాచంద్ ఆనందించాడు అభినందించాడు. కాని ఆస్తి అంతస్తుల్లో ప్రపంచ విజయాల్ని బేరీజు వేసే వ్యాపార వేత్తగా ఈ ప్రేమ వ్యవహారాన్ని వ్యతిరేకించాడు. నేనే గనక వాళ్ళ అంతస్తుకు సరితూగే కుటుంబం నుంచి వచ్చి ఉంటే హీరాచంద్‌కు ఎటువంటి ఆక్షేపణా ఉండేది కాదు. రాజ్యం రాజ్యం సామ్రాజ్యం. అదీ వాళ్ళ ఈక్వేషన్. నేను వాళ్ళ త్రాసులో బొత్తిగా తూగను నేను కేవలం ఒక నలుసును. ఈగను, దోమను ఎలా తూగుతాను? అయితే హీరాచంద్‌లో ఒక తండ్రికీ ఒక ధనాధిపతికీ మధ్య ఘోరమైన సంఘర్షణ జరిగి ఉండాలి. అన్నీ ఆలోచించుకున్నాక ఆయనే తీర్పు చెప్పాడు. హీరాచంద్ ఫ్యామిలీ నుంచి వీరూ విడిపోవాలి. వీరూకు విడిగా ఆస్తిపాస్తులూ వ్యాపారాలూ ఏర్పాటు చేస్తారు. తర్వాత హీరాచంద్ ఫ్యామిలీతో వీరూకు ఎటువంటి సంబంధాలూ ఉండవు. వీరూ నన్ను హాయిగా నిరభ్యంతరంగా పెళ్ళి చేసుకోవచ్చు. స్వయంగా హీరాచంద్ దగ్గరుండి పెళ్ళిజరిపిస్తాడు. అయితే పెళ్ళి తర్వాత తండ్రీ కొడుకులకిక ఎవరి దారి వారిదే."

"ఓ గాడ్! అదేం పరిష్కారం?" అంది అనన్య విస్తుపోతూ."హీరాచంద్ విలన్ కాక పెద్దమనిషి ఎలా అవుతాడు? ప్రేమించి పెళ్ళిచేసుకున్నందుకు కొడుక్కి ఆస్తి పంచి ఇచ్చేసి వదిలించుకుంటాడా?"

మళ్ళీ పేలవంగా నవ్వింది చిత్ర. "నిజంగా హీరాచంద్ పెద్దమనిషే. పెద్ద మనసున్న తండ్రే! ఆస్తిపాస్తులూ వ్యాపారాలూ అన్నీ పూర్తిగా ఆయన స్వార్జితమే. ప్రేమలో పడి కుటుంబ ప్రతిష్ఠనూ పరిధినీ తగ్గించిన కొడుక్కి ఆయన ఆస్తిపాస్తుల్లో చిల్లిగవ్వ

ఇవ్వకపోయినా వీరూ ఆయన్ని చెయ్యగలిగేదేమీ లేదు. తండ్రి తీర్పు న్యాయమైనదే అని వీరూ ఒప్పుకున్నాడు. కాని దాన్ని అమలు చేయడం వీరూకే ఇష్టంలేదు.."

"ఎందుకని?"

"అనన్యా! ప్రేమే జీవితం అని ప్రేమికులు కలవరిస్తారు గాని ప్రేమ అంటే ఒకే తీరూ ఒకే మోస్తరూ కాదు. ఆడదానికి ప్రేమ వేరు. మగవాడికి ప్రేమ వేరు. పురుషుడికి ప్రేమ అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే. స్త్రీకి మాత్రం అదే జీవిత సర్వస్వం. వీరూ దాన్నే నిజం చేశాడు..."

"ఏం చేశాడు? నిన్ను వదులుకున్నాడా?"

తట్టుకోలేని విషయాలు గుర్తుచేసుకున్నట్టు నిస్పృహగా నిట్టూర్చింది చిత్ర. "వీరూ దేన్నీ వదులుకోలేడు. తండ్రి కావాలి. ఫ్యామిలీ కావాలి. వ్యాపార సామ్రాజ్యం కావాలి. నేనూ కావాలి. దేనికోసం దేన్నీ వదులుకోలేని వత్తిడి కింద వీరూ పిచ్చివాడయ్యాడు..."

"ప్రేమా పిచ్చీ రెండూ ఒకటే అని ఊరికే అన్నారా?"

"నో!... నువ్వు సరిగ్గా వినడంలేదు... సరిగ్గా అర్థం చేసుకోవడంలేదు అనన్యా!.." అంటూ అనన్య కళ్ళలోకి సూటిగా చూస్తూ ఒక్కోమాటా ఒత్తిపలికింది చిత్ర ".. ప్రేమకూ ఫ్యామిలీకీ మధ్య నలిగి వీరూ నిజంగా పిచ్చివాడయ్యాడు! అక్షరాలా పిచ్చివాడే అయ్యాడు. తీవ్రమైన డిప్రెషన్‌తో అతను రెండుసార్లు ఆత్మహత్యా ప్రయత్నం చేసి లక్కీగా బైట పడ్డాడు. మతి స్థిమితం కోల్పోయాడు. ఇవాళ.. ఇప్పుడూ.. నిజంగా పిచ్చాసుపత్రిలో ఉన్నాడు.."

"వాట్?... అంత బలహీనుడా అతను?"

"ప్రేమ ఒక మహా శక్తి. అది మహాబలవంతుల్ని కూడా పసిపాపల్ని చేసి ఆడిస్తుంది. అదే వీక్‌నెస్ అవుతుంది కూడా. వీరూ మతిభ్రమించి పిచ్చాసుపత్రిలో చేరడంలో హీరాచంద్ ఫ్యామిలీ ప్రమేయం ఎంత ఉందో నా ప్రమేయం కూడా అంతే ఉంది. అది తలుచుకుంటేనే దిగులవుతుంది.." అంటూ చిత్ర చెపుతున్న వివరాలు వింటుంటే అనన్యకు మతిపోయినంత పనయింది.

ముమ్మొర్తులా తనలాంటి అమ్మాయే తన ఎదురుగా కూచుని ప్రేమ కథతో మొదలుపెట్టి పిచ్చి గురించి గాథ చెపుతుంటే మనసంతా పిచ్చి పిచ్చిగా తయారవకుండా ఏమవుతుంది?

✡ ✡ ✡

## 5

**"పిచ్చివాణ్ణి చూసి లోకం జాలి పడితే,లోకాన్ని చూసి పిచ్చివాడు జాలి పడతాడు.** అయితే ప్రేమలో పడి పిచ్చాసుపత్రిలో చేరిన ప్రేమికుణ్ణి చూసి జాలిపడే లోకం అతని ప్రియురాల్ని మాత్రం తీవ్రంగా అసహ్యించుకుంటుంది.." అంటూ రుద్ధ కంఠంతో తన గాథ చెప్పుకొచ్చింది చిత్ర.

"ఓ.. చూడబోతే ప్రేమలో పడి నువ్వు నరకాన్ని రుచి చూసినట్టుంది.." అంది అనన్య సానుభూతిగా.

"అవును అనన్యా వీరేంద్ర పిచ్చాసుపత్రిలో పడేసరికి నాకు లోకం చీకటైపోయింది. హీరాచంద్ ఫ్యామిలీకి నేను మరీ క్రూరమైన రాక్షసినైపోయాను. అతను నన్ను పెళ్ళిచేసుకుని కుటుంబం నుంచి కొన్ని ఆస్తిపాస్తులతో వేరు పడిపోయినా వాళ్ళంత బాధపడే వాళ్ళుకారేమో అనిపించింది"... అంటూ ఉద్వేగంతో ఊగిపోయింది చిత్ర. "వీరూ రెండు సార్లు ఆత్మహత్యా ప్రయత్నం చేశాడన్నాను

కదూ.. మొదట నిద్రమాత్రలు ఓవర్ డోస్ చేసుకున్నాడు... ఇంకోసారి బ్లేడుతో చెయ్యి కోసేసుకుని రక్తం కార్చేసుకున్నాడు. రెండు సార్లూ ఇంట్లో ఎవరో చూడ్డం సకాలానికి వెళ్ళడమే పెద్ద సీన్‌లు అయిపోయాయి. ఈ దశ తర్వాత వీరూ మాదక ద్రవ్యాలకు బానిసయ్యాడు. ఏ మోతాదుకు వెళ్ళాడో తెలియదుగాని హఠాత్తుగా మేనియాక్ డిప్రెషన్‌లో పడి పూర్తిగా దారి తప్పిపోయాడు. సరిగ్గా అప్పుడే అతనిమీద ఇంకా వత్తిడి పెరిగింది.. అదీ నా వల్లే.."

"నీ వల్లా? ఏమైంది?"

"నా కలలు పండినట్టు అమెరికాలో మంచి ఉద్యోగానికి పిలుపు వచ్చింది. పెద్ద జీతంతో బాటు ఆకర్షణీయమైన ఎలవెన్స్‌లు ఆఫర్ చేశారు. అంతకు ముందు ఎన్నోసార్లు నా కెరీర్ గురించి వీరూతో మాట్లాడితే అతను సీరియస్‌గా పట్టించుకునే వాడు కాదు. నాకు నువ్వు కావాలి. నువ్వు ఎక్కడ ఉద్యోగం చేసినా ఫరవాలేదు. అది నీ ఇష్టమేగాని చెయ్యకుంటే నష్టమేమీ లేదు. నీ అమెరికా ఉద్యోగం మన పెళ్ళికేమీ అడ్డం కూడా కాదు. నేనెలాగూ ఎప్పుడు పడితే అప్పుడు అమెరికా వస్తూనే ఉంటాను కదా.. అన్నాడు. అయితే పిచ్చాసుపత్రిలో పేషెంట్ అయిన వీరూని అలా గాలికి వదిలేసి నేను అమెరికా వెళ్ళిపోయి జాబ్‌లో చేరడం సబబు అనిపించలేదు. అతని పరిస్థితి ఎప్పుడు మామూలు అవుతుందో ఎవరూ చెప్పలేకపోయారు. నా జీవితం గురించి నేను సరిగ్గా ఆలోచించుకుంటే అతన్నీ అతని ప్రేమనూ వదిలేసి హాయిగా అమెరికా వెళ్ళిపోవాలి. అంతే. ఆ పని నేను వెంటనే చెయ్యలేకపోయాను. ఎందుకంటే వీరూ తొందరగా కోలుకోవాలంటే నా సాహచర్యం అవసరమని డాక్టర్లు చెప్పారు.."

"ఓ!.. చాలా ఇరుకున పడ్డావన్నమాట.." అంది అనన్య చిత్ర పరిస్థితిని ఖచ్చితంగా ఊహించుకుంటూ. "వీరూకు ఎప్పుడు నయమౌతుందో తెలీదు... నీ అమెరికా ఉద్యోగం నీ కోసం ఉంటుందో లేదో తెలీదు. ఏది ఏమైనా హీరాచంద్ ఫ్యామిలీ నిన్ను ఆదరించదని తెలిసిపోతూనే ఉంది.."

"వీరూ పిచ్చివాడై అదృష్టవంతుడైపోయాడు. పిచ్చి పట్టక పోవడమే నా దురదృష్టం.." అంది చిత్ర మరింత క్రుంగి పోయి. "అందుకే ఈ ప్రేమ అంటేనే డేంజర్ అనిపిస్తుంది. హీరాచంద్ ఫ్యామిలీ నన్ను ఎంతగా అసహ్యించుకునేదో నేను వీరూ కోసం హాస్పిటల్‌కు వెళ్ళిన ప్రతిసారీ మొహాన మంట కొట్టినట్టు అర్థమయ్యేది. వాళ్ళింటి ఆడవాళ్ళూ బంధువులూ నన్ను ఈసడించి మాట్లాడేవాళ్ళు... వీరూ శూన్యంలోకి చూసేవాడు. పిచ్చిగా కళ్ళు తిప్పేవాడు... పసి పిల్లాడిలా అతను తెల్లగా నవ్వితే ఒళ్ళు జలదరించేది.. అతను మాట్లాడితే.. అతికీ అతకని ఆ మాటలకు అర్థం ఉండేది కాదు. అయితే రోజులో ఓ గంటో రెండుగంటల పాటో అతను మామూలుగా ఉండేవాడు. పిచ్చివాడైనా మామూలుగా ఉండే ఆ టైమును లూసిడ్ ఇంటర్వెల్ అంటారు. అటువంటప్పుడు నేను గనుక అక్కడే ఉంటే వీరూ ఎంతో ఆశగా ప్రేమతో పలకరించేవాడు. ఒక్క నాతోనే అతనంత నిర్మలంగా మాట్లాడతాడు. మిగతా ఎవరితో గాని అతనంత శాంతంగా మాట్లాడడు. ఇదంతా గమనించారు డాక్టర్లు. చివరికి ఎప్పటికైనా అతన్ని మామూలు మనిషిని చెయ్యాలంటే ఒక్క నావల్లే సాధ్యమౌతుంది అన్నారు. అయితే అది ఎప్పటికి అవుతుందో చెప్పలేమన్నారు. ఈలోగా అమెరికా కంపెనీ నాకిచ్చిన జాబ్ ఆఫర్ వెనక్కి తీసుకుంది. ఇంకో కంపెనీకి అప్లై చేస్తే నెలరోజుల్లోగా వచ్చి చేరమని వీసా పంపారు. నేను సందిగ్ధంలో పడిపోయాను. నా జీవితం ఏం కావాలి? ఎటుపోవాలి? ముందసలు నేనూ నా జీవితం స్థిరపడితే తర్వాత ప్రేమా పెళ్ళీ గురించి ఆలోచించవచ్చు అనిపించింది.."

"యస్! దటీజ్ కరెక్ట్!" అంది అనన్య. "సో.. నువ్వు వీరేంద్రను అదే పరిస్థితిలో పిచ్చాసుపత్రిలో వదిలేసి అమెరికా వెళ్ళిపోవాలనుకున్నావ్! జాబ్ సాధించుకోవడం ఒక లక్ష్యం అయితే హీరాచంద్ ఫ్యామిలీ ఈసడింపుల్ని తప్పించుకోవచ్చు.."

"అవును అనన్యా! అదే నా ఆలోచన. కానీ నేను కనిపించకుండా వెళ్ళిపోతే వీరూ ఏమవుతాడనేది చాలా పెద్ద గడ్డు సమస్య. అయినా మనసు రాయి చేసుకుని ప్రేమను ప్రేమికుణ్ణి పక్కన పెట్టేసి అమెరికా వెళ్ళిపోదామనే నిర్ణయించుకున్నాను. అయితే నేను బొత్తిగా

ఊహించని రీతిలో .. హీరాచంద్ ఫ్యామిలీయే దీనికి అడ్డుపడింది. మా వాణ్ణి పిచ్చివాణ్ణి చేసి హాస్పిటల్‌లో పడేసి నీ అంతటి నువ్వు వెళ్ళిపోతే ఎలాగ? అని నిలదీశారు.."

"మరేం చెయ్యగలవుట నువ్వు? నీ దారిన నువ్వు వెళ్ళిపోతే .... వాళ్ళేం చెయ్యగలరట? నిన్ను కట్టుకున్న భార్య అయినా భర్తకు మతి స్థిమితం తప్పితే విడాకులు తీసుకోవచ్చునని చట్టం చెపుతోంది కదా? నీ కథ పెళ్ళిదాకా వెళ్ళలేదు... పెళ్ళికి వాళ్ళు పెట్టిన లిటిగేషన్ వల్లకదా అతనికి మతి తప్పింది? నీ బ్రతుకు నువ్వు బ్రతక్కుండా వాళ్ళెలా ఆపగలరు? ఎవరైనా ఎలా ఆపగలరు?" అంది అనన్య ఆవేశంగా.

"ధీరూ ఆపాడు!" అని చిత్ర హఠాత్తుగా చెప్పి ఆగటంతో ఉలిక్కిపడింది అనన్య. "వాట్? ధీరూనా? ధీరూ ఎవరు?"

"ధీరూ ఎవరూ అంటే మబ్బులో మెరుపు! అనుకోకుండా పడే పిడుగు! ఎవరికీ అంతు బట్టని వ్యక్తి ఎక్కడైనా హఠాత్తుగా ప్రత్యక్షమై కథ అడ్డం తిప్పే వ్యక్తి... ధీరూ! పూర్తిపేరు ధీరేంద్ర... వీరేంద్ర తమ్ముడే ధీరేంద్ర.."

"వావ్! చిత్రా.. నువ్వు చాలా గొప్పకథకురాలివి! కథలో సరైన అదును చూసి మలుపు పెడుతున్నావ్! వీరేంద్రకు ధీరేంద్ర అనే తమ్ముడు ఉన్నాడని నువ్వు ఇంతవరకూ చెప్పనేలేదు.." అంది అనన్య విస్మయంగా.. "అయితే ఈ ధీరూ అనబడే ధీరేంద్ర... హీరాచంద్ ఫ్యామిలీలో రెండో యువరాజు అన్నమాట."

"అహ.. యువరాజు సేనాపతి అంటూ మనం ధీరూను బేరీజు వెయ్యలేం. ఆమాటకొస్తే హీరాచంద్ ఫ్యామిలీలో ధీరూ ఒక చిత్రవిచిత్ర వ్యక్తి! కొరకరాని కొయ్య! అతను ఫలానా రకం అని అర్థం చేసుకోవడం ఎవరివల్లా అయేపని కాదు.." అంటూ ఉన్నట్టుండి వాచ్ చూసుకుని టెన్షన్ అణిచిపెట్టుకుంటూ చెప్పసాగింది చిత్ర...

"హీరాచంద్ ఫ్యామిలీలో ధీరూ ఒక అరాచక వ్యక్తి. అతని గురించి మంచి కన్నా చెడే ఎక్కువ ప్రచారంలో ఉంది. స్కూల్ ఫైనల్ రోజుల నుంచి చెడు అలవాట్లు చెడు తిరుగుళ్ళతో రాటు దేలిపోయాడు. తగువులు పోట్లాటలు మామూలే. డబ్బూ అంతస్తూ తెచ్చిన ధీమాతో అతను దాదాపు రౌడీ ఎలిమెంట్‌గా పెరిగాడు. ఇంట్లో పెద్దల మాట విన్నట్టే వింటాడు గాని ఇల్లు దాటాక యధారాజ్యంగా ఇష్టం వచ్చిన పని ఇష్టం వచ్చినట్టు చేసుకుపోతాడు. ఫ్యామిలీ వ్యాపారాలు వ్యవహారాలు ఏమాత్రం పట్టనట్టే ఉంటాడు గాని వాటిల్లో ఏ సమస్య అయినా వస్తే వీరూ హఠాత్తుగా ప్రత్యక్షమై సమస్య తెచ్చిన వాళ్ళని మొహం పగలగొట్టి పరిస్థితి చక్కజేస్తూ ఉంటాడు. దేశవిదేశాల్లో చాలా చోట్ల రాజకీయ ముఠాలతోనూ అండర్ వరల్డ్‌తోనూ అతనికి చాలా దగ్గర సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటారు. అమ్మాయిల్ని వేధించిన కేసుల్లో ధీరూ రెండు మూడు సార్లు వార్తలకెక్కాడు. ప్రత్యర్థులపై దాడి కేసులు లెక్కలేనన్ని. అయితే కేసులన్నీ ఎప్పటికప్పుడు రద్దయి పోతుంటాయి. చెయ్యాలనుకుంటే అతను ఏమైనా చేసేస్తాడు. ముందూ వెనుకా చూడడు.. ధీరూ.. ది టఫ్‌గై!"

"సో.. ధీరూ వల్లే నీకు ప్రాబ్లం.."

"అవును అనన్యా! అంతుపట్టని మొండి మనిషి ధీరుకి అన్నయ్య వీరూ అంటే ప్రాణం! ఫ్యామిలీ ప్రతిష్ఠ అంటే తిరుగులేని వ్యామోహం.. పట్టుదల!..వీరూ విషయం పక్కన బెట్టి నేను అమెరికా వెళ్ళిపోదామని ప్లాన్ చేసుకుంటుంటే హఠాత్తుగా ఊడిపడ్డాడు ధీరూ!... సరాసరి నా అపార్ట్‌మెంట్‌కి వచ్చి వార్నింగ్ ఇచ్చాడు!.."

"వావ్!.. సినిమా సీన్‌లా ఉంది..."

"భయపెట్టేశాడు అనన్యా! ఒక మనిషి అంత మర్యాదగా అంత నిర్దాక్షిణ్యంగా మాట్లాడాలడని నేనెప్పుడూ ఊహించలేదు..." తలుచుకుంటూనే వణికిపోయింది చిత్ర.

"ఏమన్నాడు ధీరూ?"

"ఏమన్నాడా నిట్టనిలువునా మాటలతో చీల్చేశాడు. మిస్ చిత్రా నీలాంటి వాళ్ళన్నా నువ్వన్నా నాకేమాత్రం గౌరవం లేదు. కాని మా అన్నయ్య నాకు దేవుడు. ఆ దేవుడే ఇష్టపడ్డాడు కాబట్టి నువ్వు దయ్యానివైనా పిశాచానివైనా వదిన స్థానంలో ఉంచి గౌరవిస్తాను నమస్కరిస్తాను. కాని అదే దేవుళ్ళాంటి అన్నయ్యకు ద్రోహం చేసి వెళ్ళిపోయావో.. నాలోని దయ్యాన్ని పిశాచాన్నీ నువ్వు చూస్తావు. అన్నాడు. అన్నయ్యకు పూర్తిగా నయమయ్యే దాకా నువ్వెక్కడికీ వెళ్ళకూడదు... వెళ్ళడం లేదు.. వెళ్ళావో.. ఖబడ్దార్!.. అని హెచ్చరిక చేశాడు ధీరూ.."

"ఓ గాడ్! అలా ఎలా అడ్డుకోగలడు? నువ్వు పోలీసులకు కంప్లెయింట్ ఇవాల్సింది.. నువ్వేం చదువూసంధ్యా లేని దానివా? అవసరమైతే ఎంతవరకైనా వెళ్ళొచ్చు.. హోం మినిష్టర్‌కు టెలిగ్రాం పంపొచ్చు.." అనన్య దూకుడుగా స్పందిస్తుంటే వెర్రిగా నవ్వింది చిత్ర.

"అవేవీ పనిచెయ్యవు అనన్యా! ధీరూ ఫోర్స్ ఏమిటో తెలీక.. అతను నాకు హెచ్చరిక చేసి వెళ్ళిన రోజు సాయంత్రమే నేను బెంగుళూరు వచ్చేద్దామని ట్రైచేశాను.. స్టేషన్‌లో మాటు వేసిన ధీరూ మనుషులు నన్ను అటకాయించి బలవంతంగా వ్యాన్ ఎక్కించి అపార్ట్‌మెంట్‌లో తెచ్చిపడేశారు. నా మీద ఎప్పుడూ నిఘా ఉంటుందనీ.. పారిపోయే ప్రయత్నం చేస్తే కాళ్ళూ చేతులూ విరిచేస్తామనీ బెదిరించారు.."

"నువ్వు హీరాచంద్ కు చెప్పాల్సింది. ఫ్యామిలీకి పెద్ద కదా.. మరీ ఇంత ఘోరాన్ని ఆయనైనా ఒప్పుకోడు కదా.."

"లాభం లేదు అనన్యా!.. హీరాచంద్ దాకా నేను వెళ్ళే అవకాశం లేదు. అదీగాక.. రోజూ ధీరూ మనుషులు నాకోసం రావడం.. బలవంతంగా హాస్పిటల్‌కు తీసుకెళ్ళడం.. నేను వీరూతో కాస్సేపు గడపడం ఇదో తప్పని సరి తంతు అయిపోయింది. అరిచి అల్లరి చేస్తే నా జీవితమే అప్రతిష్ఠ పాలవుతుంది కాబట్టి మౌనంగా భరించాల్సి వచ్చింది. అయితే ఈ దుస్థితి నుంచి తప్పించుకోవడం ఎలాగా అని వారం రోజుల పాటు నిర్మలంగా ఆలోచించి.. ఓ పథకం వేసుకున్నాను.."

"ఓ.. నువ్వేం తెలివితక్కువ దానివా? కమాన్ ఎలా బైటపడ్డావు?" అంది అనన్య ఉత్కంఠను దాచుకోలేక.

"ముందసలు వీరూ నుంచి పారిపోయే ఉద్దేశ్యమే లేనట్టు ప్రవర్తించాను. అతనికి ఎంత తొందరగా నయమౌతుందా అని డాక్టర్లని ఆరా తీయడం మొదలెట్టాను. హాస్పిటల్ల ఆవరణలోనే ఉన్న గుడిలో ప్రత్యేక పూజలు చేస్తూ వీరూకు బొట్టు పెట్టేదాన్ని.. ప్రసాదం ఇచ్చేదాన్ని. నిజంగా ఏదైనా అద్భుతం జరిగి వీరూ ఈలోగా.. హీరాచంద్ బంధువులు.. ముఖ్యంగా ధీరూ మనుషులు కూడా.. నేను ధీరూను ఇక వదిలివెళ్ళను అని నమ్మే స్థితికి వచ్చాక.. ఒకరోజు తెల్లవారు ఝామున అపార్ట్‌మెంట్ నుంచి బైటపడి.. సిటీదాటి బస్సులు మారి.. బెంగుళూరు వచ్చేశాను. బెంగుళూరులో జయనగర్‌లో నాకో ఫ్రెండ్ ఉంది.. వాళ్ళ ఫ్లాట్‌లో ఆశ్రయం పొందాను.. ఇక అమెరికా ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకున్నాను. విమానం టిక్కెట్టు కన్ఫర్మ్ అయి.. నేనిక బైలుదేరతాననగా .. కథ అడ్డం తిరిగింది అనన్యా.. ఘోరంగా అడ్డం తిరిగింది.."

ఇక అంతా అర్థమైనట్టు ఊపిరి పీల్చుకుంది అనన్య. మెల్లమెల్లగా సీన్ అంతా కళ్ళముందు కదిలింది. "ధీరూ పసిగట్టేశాడు కదూ? నిన్ను వెతుక్కుంటూ బెంగుళూరు వచ్చేశాడు కదూ?"

"అవును అనన్యా! హైద్రాబాద్‌లో ధీరూ ఎటువంటి ఎన్‌క్వైరీలు చేశాడో గాని నా బెంగుళూరు ఫ్రెండ్ ఎడ్రస్ సరిగ్గా పట్టేశాడు. అయితే చిన్నపాటి అదృష్టం నన్ను కాపాడింది. నేను షాపింగ్‌కి వెళ్ళి వచ్చేసరికి అప్పుడే ధీరూ తన అనుచరులతో మా అపార్ట్‌మెంట్స్ దగ్గర స్కార్పియో కారు నుంచి దిగుతున్నాడు. లిఫ్ట్‌దాకా వెళ్ళిపోయిన దాన్ని నేను వెంటనే ఆగిపోయి మెరుపు వేగంతో వెనుదిరిగి వచ్చేశాను. పారిపోవాలి.. వెంటనే పారిపోవాలి అనే ఆలోచన తప్ప ఎక్కడికి ఎలాగ పారిపోవాలో తెలియదు. బస్సెక్కి మైసూర్ వచ్చేశాను. టూరిస్ట్ ప్లేస్ కదా ఊటీ అయితే బెస్ట్ అని ఇక్కడికి వచ్చేశాను. నాకిక్కడ ఎవరూ లేరు. నేను మళ్ళీ నా బెంగుళూరు ఫ్రెండ్‌కి కూడా

ఫోన్ చెయ్యలేదు. ఆ అమ్మాయిని ధీరూ వేధించే ప్రమాదం ఉంది. నేనెలాగైనా బెంగుళూరు వెళ్ళిపోయి అమెరికా ఉద్యోగం తాలుకు రికార్డులూ విమానం టిక్కెట్టూ తీసుకుని.. విమానం ఎక్కేస్తే చాలు.. అయ్ విల్ బీ సేఫ్!"

"దట్స్ కరెక్ట్!"

"నేను ఊటీ వచ్చి మూడు రోజులైంది. ఒక గెస్ట్ హౌస్‌లో దిగాను. కానీ ఆ సాయంత్రమే తెలిసింది.. ధీరూ ఊటీలో ఉన్నాడు.. నాకోసం వెదుకుతున్నాడు.. నేను ఊటీ వచ్చానని అతనెలా పసిగట్టాడో అంతుపట్టని విషయం. అతని పద్ధతులు అతనికి ఉంటాయి అనుకున్నాను అంతే, అతనూ అతని అనుచరులూ ఊటీలో అంగుళం అంగుళం నాకోసం నిఘావేశారు. రేచుక్కల్లా కాచుకున్నారు. నేను పూటకో మకాం మారుస్తూ తప్పించుకుంటున్నాను. ఒక్కగంటసేపు.. మహా అయితే రెండు గంటల పాటు ధీరూ దృష్టిని మళ్ళించగలిగితే.. నేను ఊటీ వదిలిపోగలను.. సరిగ్గా నేనిలా అయోమయంలో ఉన్నప్పుడే. నువ్వు ఊటీలో ఉన్నట్టు తెలిసింది..

నువ్వు గమనించలేదు అనన్యా.. షూటింగ్ స్పాట్‌లో మొట్టమొదటి సారిగా నిన్ను చూశాను. తర్వాత కలెక్టర్ ఆఫీసు దగ్గర నేను నీ పక్కనుంచే వెళ్ళాను. నా సమస్యకు దేవుడే ఒక పరిష్కారం పంపాడనిపించింది. చాలా ఈజీ. చాలా సింపుల్.. కాస్సేపు నువ్వు నాలాగా కనిపిస్తే చాలు.. నేనెలాగైనా ఊటీ వదిలి వెళ్ళిపోతాను. బస్సు ప్రయాణమైనా టాక్సీలో వెళ్ళినా జస్ట్ టూ అవర్స్.. రెండు గంటల్లో నేను తెలివిగా మాటల్లో పెడితే చాలు .. అతని మనుషులకు వెంటనే మెసేజ్ వెళుతుంది.. తక్షణం నా మీద నిఘా చెదిరిపోతుంది. నేను నిర్భయంగా వెళ్ళిపోతాను.. జస్ట్.. కాస్సేపు.."

చెప్పి చెప్పి అలిసిపోయి అభ్యర్థనగా చూస్తున్న చిత్ర వైపు నిశ్చలంగా చూసింది అనన్య. కాలం ఆగిపోయింది. ఏం చెయ్యాలి ఇప్పుడు?

అనన్య లోపలి గొంతు మూగబోయింది. ఏం చెయ్యాలి అనన్యా ఏం చెయ్యాలి? ఏం చెయ్యమంటుంది చిత్ర? ఎలా చెయ్యమంటుంది?

అనన్య మనసులో సున్నితపు త్రాసు ఊగుతోంది. చెయ్యాలా వద్దా? ఎందుకు చెయ్యాలి? చేస్తే ఏమౌతుంది? చెయ్యకపోతే ఏమౌతుంది?.. అనుకుంటూనే ఆ మాటని పైకి అడిగేసింది అనన్య...

"కమాన్ చిత్రా!.. కొన్నిగంటల క్రితందాకా.. అంటే టీ ఎస్టేట్‌లో నువ్వు నా దగ్గర కొచ్చేదాకా నువ్వెవరో నాకు తెలీదు. రెండు రోజులుగా నువ్వు నన్ను ఫాలో చేస్తూ నా సాయం కోసం ఎదురు చూస్తున్నానన్నావు. వెరీ ఫైన్! మనిద్దరం అచ్చుగుద్దినట్టు ఒకలాగే ఉన్నాం అనే కారణం వల్లే నువ్వు నన్ను సాయం అడగడానికి ఆస్కారం కలిగింది. అంతే!" అంటూ ఒక్కో పాయింటూ బేరీజు వేసి చెప్పింది అనన్య "నేను పోనీ.. నేను అతన్ని ఎలాగో ఎదుర్కుంటాను అనుకో.. ఈ మొత్తం వ్యవహారంలో నాకు అంతుపట్టని సందేహం ఒకటుంది.." అంటూ ఒక్కోమాటా విడదీసి స్పష్టంగా అడిగింది. "నేను గనక నీకు తారసపడలేదనుకో .. అప్పుడేంటి? ఏమౌతావు? ఇప్పుడైనా నేను నీకు హెల్ప్ చెయ్యడానికి ఒప్పుకోననుకో... అప్పుడు మాత్రం ఏమౌతుంది? ఎలా ధీరూ నుంచి బైటపడేదానివి? వేరే దారి ఏదో ఉంటుంది కదా!"

"లేదు!" అంది చిత్ర ఖచ్చితంగా. "వేరేదారి అంటూ ఏదీ లేదు. నువ్వు నన్ను కాపాడే పరిస్థితి ఇలా ఏర్పడకపోతే.. ధీరూకు నేను దొరికిపోవడం ఖాయం! నేను మొండి కేసి ఎదురు తిరిగినా పెద్ద సీన్ చేసినా అతను నా మొహాన యాసిడ్ కొట్టడం ఖాయం!"

"వాట్?" అదిరిపడింది అనన్య. "యాసిడ్ దాడి చేసేంత రాక్షసుడా వాడు?" అంది ఒంట్లో రక్తం కుతకుతమని ఉడికిపోతుండగా.

"అవును.. ఇట్లాంటి తీవ్ర పరిస్థితుల్లో మనుషుల్ని బెదిరించడానికి ఒక్కోసారి ప్రతీకారం తీర్చుకోవడానికీ ధీరు యాసిడ్ దాడి చేస్తాడని చాలామంది చెప్పారు. అతని జేబులో యాసిడ్ బాటిల్ ఉంటుందంటారు.. నీ అనన్యా!.. నాకు వేరే దారంటూ ఉండదు..

నేనంటూ ధీరూకు దొరికితే మారుమాటలేకుండా అతన్తో బాటు హైదరాబాద్ వెళ్ళాల్సిందే.. రోజా పిచ్చాసుపత్రికి ట్రిప్పులు వేస్తూ వీరూకు ఎప్పుడు నయమౌతుందో తెలియని అగమ్య పరిస్థితిలో అందరి అవమానాలూ భరిస్తూ మగ్గిపోవాల్సిందే! లేదంటే ధీరూకు వళ్ళు మండి నా మొహాన యాసి కొట్టి వెళితే మొహమే పోతుందో నేనే పోతానో." అంటుండగానే చిత్ర గొంతు రుద్ధమై పోయింది.

ఎంతో ధీరోదాత్తురాలిలాగా కనిపించిన చిత్ర అంత బేలగా అయిపోతుందని అనన్య ఊహించలేదు.

చిత్ర ఏడుస్తూంటే అద్దంలో తను ఏడుస్తున్నట్టే అనిపించింది. అనన్య మనసులో సున్నితపు త్రాసు ఊగి ఊగి ఆగిపోయింది.

ఎస్! అనన్యా నువ్వు చేస్తున్నావు. ఈ పని చేస్తున్నావు. పెద్దపులినే దిరించే దమ్మున్న నీకు ఈ చచ్చుపుచ్చు రౌడీ ఫెలో ఒక లెక్కకాదు.

జర్నలిస్ట్ అనన్య. టీవీ యాంకర్ అనన్య. సొగసూ తెలివీ కలగలిసిన అద్భుత శక్తి అనన్య. పిశాచంలాంటి మగాణ్ణయినా పిలక పట్టి ఆడించే నేర్పు ఉంది.

"కానీ చిత్రా.. గంటా రెండు గంటలూ కాదు.. కనీసం మూడు గంటలపాటైనా నేను ధీరూ ఎటెన్షన్ని తప్పించగలగాలి. .. ఇంతకీ నీ ఐడియా ఏమిటి? ఏం చెయ్యాలి నేను?" అంటుండగానే చిత్ర తన వెంట తెచ్చిన బ్యాగ్ లోంచి డ్రెస్ తీసి అందించింది.

"సింపుల్.. ముందు మనిద్దరం బట్టలు మార్చుకుందాం.. నాకో జత బట్టలు ఇవ్వు.. నేను నీ జీన్స్ అండ్ షర్ట్ వేసుకుంటా.. నువ్వు నా పంజాబీ డ్రస్లోకి మారిపో.. హెయిర్ స్టయిల్లో మేకప్లో చిన్న చిన్న మార్పులున్నాయి కదూ.. చేసుకుందాం.."

"ఓకే!" అంది అనన్య నిశ్చయంగా. లోపలి గొంతుకి అప్పుడు కొత్త తెగింపు వచ్చింది.

కమాన్ అనన్యా! ఏది ఎలా అవుతుందో అలా కానివ్వు. ఈ అమాయక ప్రేమికురాలిని ఆపద నుంచి రక్షిస్తే అదో థ్రిల్! అదో గొప్ప!

..అనుకుంటూనే డ్రస్ మార్చుకుని మేకప్కు నగిషీలు దిద్దుకుంది అనన్య. "ఇంతకీ నేను ధీరూని ఎలా కలుసుకోవాలి? ఎక్కడ కలుసుకోవాలి?" అంది సందిగ్ధంగా.

చకచకా బ్యాగ్లూ వస్తువులూ మార్చి సర్దుతోంది చిత్ర. వేషాలు మారడానికి ఏమేం చెయ్యాలో ఆమె ముందుగానే పూర్తిగా ఆలోచించి పెట్టుకున్నట్టు అర్థమౌతోంది. "అనన్యా! నేనయితే ఇందాక మార్కెట్ దగ్గర జనంలో మాయమైపోయి ఈ హోటల్కి రాగలిగాను గాని.. బైట ఏ మెయిన్ రోడ్ మీదయినా ధీరూగాని ధీరూ మనుషులు గాని డేగ కళ్ళతో వెదుకుతుంటారు... ముందసలు మనం హేండ్ బ్యాగ్స్ కూడా మార్చుకోవాలి.."

తప్పనిసరిగా హేండ్ బ్యాగ్స్ ఎందుకు మార్చుకోవాలో అనన్యకు అర్థం కాలేదు. అయినా కాసేపట్లో మునిగేదేం ఉండదనుకుంటూ చిత్ర హేండ్ బ్యాగ్ తను తీసుకుంది.

చిత్ర అనన్యగా మారి చాలా ఊరటపడింది.

"నువ్వేం టెన్షన్ పడనవసరం లేదు. అనన్య అంటేనే డేరింగ్ అండ్ డాషింగ్ కాబట్టి నువ్వేం వర్రీ అవవు.. నాకు తెలుసు. ఈ చెల్లెలికి నువ్వు చేసే సాయం మాత్రం జీవితాంతం గుర్తుంటుంది.." అంటూ చిత్ర తన బుగ్గమీద ముద్దుపెడుతుంటే తనను తానే ముద్దుపెట్టుకున్నట్టు అనిపించింది అనన్యకు.

ఒక గులాబీ అద్దంలో తన ప్రతిబింబాన్నే ముద్దుపెట్టుకుంది. అంతే.

"జీవితంలో మళ్ళీ మనం కలుసుకోలేకపోవచ్చుగాని అనన్యా.. నేను అమెరికా వెళ్ళాక ఎలాగైనా నిన్ను కాంటాక్ట్ చేస్తాను. ఫోన్ చేస్తాను" అని నంబర్ నోట్ చేసుకుంది చిత్ర.

"ఇక నువ్వు చెయ్యాల్సిందేంటంటే.." అంటూ చిత్ర చెప్పిందంతా జాగ్రత్తగా విని గుర్తుపెట్టుకుంది అనన్య. "ఓకే. అయ్ విల్ డూ.. గుడ్‌లక్!" అని రూం నుంచి బైటపడింది.

హోటల్ గేటు దాటి రోడ్డుమీది కొచ్చాక మాత్రం ఉన్నట్టుండి భయమనిపించింది.

అనన్యా! వాటీజ్ హేపెనింగ్?

ఏమౌతోంది నీకు?

●●●

## 6

**పులి కంటె గిలి చెడ్డది.**

ధీరూ ఎవరో తెలీదు గాని ఎటు నుంచి వచ్చి మీద పడతాడో అన్న భయమే పెద్దది.

భయం భయంగానే అడుగులు వేస్తూ ఆ భయం ఏ మాత్రం పైకి తెలియ నివ్వకుండా చుట్టూ వాతావరణాన్ని పరిశీలిస్తూ మెయిన్ రోడ్ మీది కొచ్చింది అనన్య.

చిత్ర చెప్పిన గాథను పూర్తిగా నమ్మింది. చిత్రకు సాయం చెయ్యాలనే సంకల్పంతో వేషం మార్చుకుని రంగంలోకి దూకింది. కాని ఏ మూలో చిన్నపాటి అనుమానం ముల్లులా గుచ్చుకుంటూ మెర మెరలాడు తూ బాధిస్తోంది.

పారిపోయే వ్యక్తుల్ని పట్టుకోవడం పోలీసులకూ గూఢచారులకూ కూడా అసాధ్యమౌతూ ఉంటుంది కదా అటువంటిది హైదరాబాద్ నుంచి బెంగుళూరికీ, ఊటీకీ చిత్రను ఫాలో చేస్తూ ధీరేంద్రవచ్చాడంటే ఎలా నమ్మాలి?

అతనితో బాటు ఎలాంటి వ్యక్తులు ఎందరు ఉండాలి? సినిమాల్లో చూపించేట్టు అండర్ వరల్డ్ అనబడే చీకటి స్మామ్రాజ్యం తాలూకు రౌడీలో గూండాలో ధీరూ వెంట తిరుగుతూ ఉన్నారా?

వాళ్ళ కళ్ళు డేగ కళ్ళు కావచ్చు. జల్లెడ పట్టినట్టు వాళ్ళు నిఘా వేస్తూ ఉండవచ్చు. అయినా ఒక తెలివైన ఆడపిల్ల వాళ్ళ కళ్ళుగప్పి పారిపోవడం పెద్ద కష్టమా?

ఎండపొడ ఎప్పుడు తగ్గిందో గాని వాతావరణం మసకేసింది. మబ్బులు పొర్లు కొస్తున్నాయి. సన్నటి తుంపర రాలుతోంది. చకచకా ఫుట్ పాత్ ఎక్కి నడుస్తోంది అనన్య. టూరిస్టుల సందడి ఎక్కువగా ఉంది. చేతిలో చెయ్యేసి నడుస్తున్న జంటల్ని చూస్తుంటే అసూయ కలిగింది.

అనన్యా నువ్వు ఊటీలో ఉండిపోయింది ఎందుకు? ఏ రాకుమారుడో తగులుతాడని. కొత్త పరిచయంతో జీవితంలో రసవత్తరమైన కొత్త అధ్యాయమేదో మొదలవుతుందని. మధుర స్వప్నంలాగా మొదలయే పరిచయం మహత్తర ప్రణయమౌతుందని. ఓ పిచ్చికల. వెర్రివ్యామోహం. జీవితానందం కోసం చిన్న ఛాన్స్ తీసుకోవచ్చునని.

అయితే ఇప్పుడెందుకని ఛాన్స్ తీసుకోవాల్సి వస్తోంది? ఆపదలో ఉన్న ఓ అమ్మాయిని రక్షించాలని నువ్వే ఆపదలో పడతావని భయంలేదా? భయం లేక పోగా ఏ ఆపదైనా ఎదుర్కొని అవలీలగా బయట పడగలననే ధీమా ఉంది కదూ?

జివ్వున వీస్తున్న గాలికి ముడుచుకు పోయి నడుస్తున్న అనన్య టక్కున ఆగిపోవాల్సి వచ్చింది.

ఎదురుగా రెండు కాళ్ళు అడ్డుపడ్డాయి. అటూ ఇటూ కదలవు. లెదర్ బూట్స్ పైన కరుగ్గా ఉన్న జీన్స్!

"హాయ్ చిత్రా!" అన్న పదునైన గొంతుతో ఉలిక్కిపడింది అనన్య.

అనన్యా! నువ్విప్పుడు చిత్రవి. మరిచిపోయావా? నువ్వే చిత్రవి!

"ఓ.." అంటూ తలెత్తిన అనన్య ఎదురుగా ఉన్న చాకులాంటి బాకు లాంటి యువకుణ్ణి చూసి అదిరిపడింది. చెవుల్లో వెయ్యి జలపాతాల హోరుతో ఘోష మొదలయింది ఆ ఘోషలో "ధీరూ" అనేపేరు ప్రతిధ్వనించింది. బహుశా ఆ పేరే ఆమె పెదవుల మీద సుతిమెత్తగా ఓ ఛాయలాగా చారలాగా కదిలిందో ఏమో అతనది గమనించాడో ఏమో?

"ఎస్!. ధీరూ హియర్!" అన్నాడు కవ్వింపుగా.

చూపులు కలిశాయి. మంచులో మంటలు రేగాయి. ఊటీ చల్లదనం ఒక్కసారిగా వేడెక్కిపోయింది. అనన్య గుండెల్లో కొండల మధ్య మెలికలు తిరిగే ఊటీ రైలు గుబగుబలాడుతూ కదిలింది.

"హౌ ఆర్ యూ.. చిత్ర?"

భాషలు చెప్పలేని భావాలు ఆ మాటలో మెలికలు తిరిగాయి. అంత చల్లటి వాతావరణంలో కూడా అనన్యకు గొంతు తడి ఆరిపోయింది. ఒక్క ఉదుటున అక్కణ్ణుంచి పారిపోవాలని అనిపించింది. ఎటూ కదలలేనట్టు ఉన్న చోటే బిగుసుకు పోయింది.

అయోమయంగా అతని వైపు చూస్తూ చూపుల్లో ప్రశ్నార్థకాలు సంధించింది. ఏమీ తెలీనట్టు అతనెవరో తెలీనట్టు. అది పూర్తిగా నటన కాదు. నిజానికి మామూలు నటన కాదు. నటనలో నటన మెలికలు పడిన విచిత్ర సంఘటన. అతని గురించి చిత్ర చెప్పిందంతా గుర్తుంది. అతను ఇతనేనా అని పోల్చుకోవడానికి క్షణాలు దొర్లాలి.

ఈలోగా అతనికేమీ అనుమానం రాకూడదు. తను చిత్రే అనుకోవాలతను. తను చిత్ర కాదని అతనికి ఏమాత్రం అనుమానం వచ్చినా కథ పూర్తిగా అడ్డం తిరిగిపోతుంది.

అసలైన చిత్ర అతన్ని హఠాత్తుగా చూసి బెదిరిపోవాలి గాని అతన్ని గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తున్నట్టు కనిపించకూడదు.

దొరికిపోయిన చిత్రగా తను పూర్తిగా నటిస్తున్నట్టే అతనికి అనిపించాలి.

"అదేంటి? గుర్తుపట్టలేదా? నేనూ.. ధీరూని.." వెక్కిరింత, కసి, విజయ గర్వం ఆ గొంతులో పోటీపడి ప్రతిధ్వనించాయి.

"హాయ్ ధీరూ!." అనేసి వెంటనే మనసులో విలవిలలాడిపోయింది అనన్య.

అసలైన చిత్ర ధీరూని "హాయ్ ధీరూ!" అని పలకరిస్తుందా? అలా పలకరించడం సహజంగా ఉంటుంది.

ఇందాకా హోటల్‌లో చిత్ర చెప్పిన ముందు జాగ్రత్తల్లో ముఖ్యమైన పాయింట్లయితే ఉన్నాయి గాని చిన్న చిన్న వివరాలు చిత్ర ప్రస్తావించలేదు.

చిత్రకు ధీరూతో ఉన్నది కేవలం శత్రుత్వమే. వాళ్ళ మధ్య కనీస మర్యాద లైనా ఉంటాయా? "హాయ్ ధీరూ.." అంటే లేని చనువు నటించినట్లు అయిపోదా?

అనన్య మెదడు స్వరున వేడెక్కిన క్షణాలు అవి.

ఇటువంటి తడబాట్లని యుక్తిగా దాటేసుకు రావాలి అనుకుంటూ "ఇదేంటి ధీరూ?.. నువ్వు ఇక్కడ. ఊటీలో?" అంటూ ప్రశ్నార్థకంగా ఆగింది.

ఆమె వైపు నిశ్చలంగా గుచ్చి గుచ్చి చూస్తూ "అది నే నడగాల్సింది కదూ చిత్రా?... నువ్వేమిటి?" ఇక్కడ.. ఊటీలో?" అన్నాడు ధీరూ మాటకు మాట పోటీగా.

ఇద్దరి ధోరణీ ఒక్కటే. అలవోకగా వచ్చినట్టు అనుకోకుండా ఎదురైనట్టు.

సరిగ్గా అప్పుడే అనన్య మనసులో స్టాప్ వాచ్ పని చెయ్యడం మొదలైంది. టిక్ టిక్‌మంటోంది.

ధీరూని కనీసం రెండు గంటల పాటు ఆపి ఉంచితే చాలు చిత్ర ఊటీ నుంచి కొండ కోనలు దిగి వెళ్ళి పోతుంది. నిరభ్యంతరంగా వెళ్ళిపోతుంది. క్షేమంగా వెళ్ళిపోతుంది.

క్షణాల్లో గాభరా తగ్గిపోయింది. తెలివి మామూలుకు వచ్చింది. మెదడు ఇప్పుడు తీక్షణంగా చురుగ్గా పని చేస్తోంది.

ధీరూ తారసపడడం తను చిత్రే అనుకోవడం పలకరించడం అన్నీ సజావుగా జరిగిపోయాయి.

చిత్ర చెప్పింది కరెక్టే.

ఇందులో ఎటువంటి ప్రమాధం లేదు.

తనని చిత్ర అని నమ్మేసిన ధీరూని ఇంకాస్సేపు అదే నమ్మకంలో ఉంచడం అసాధ్యమేమీ కాదు.

ధీరూ మనిషే పులి కాదు. ఇతన్ని కంట్రోల్ చెయ్యడం ఓ సమస్య కాదు. కాకూడదు.

సరిగ్గా ఈసరికి అటు చిత్ర హోటల్ రూం నుంచి బైట పడి ఉంటుంది. చడీ చప్పుడూ లేకుండా ఊటీ నుంచి వెళ్ళిపోయే ప్రయత్నంలో ఉంటుంది.

కానీ ధీరూ అనుచరులు ఎటు వైపైనా మాటు వేసి ఉంటే చిత్ర వాళ్ళ దృష్టిలో పడితే కథలో మరో మెలిక పడుతుంది. ఇద్దరు చిత్రలు దొరికితే డబుల్ యాక్షన్ బట్ట బయలు అయిపోతుంది.

దానికి పరిష్కారం ఏమిటి? కొంచెం టైము గడవడమే.

ధీరూ దృష్టి పూర్తిగా మళ్ళించాలి అనుకుంటూ అనన్య చాలా ఈజీగా ఉల్లాసంగా నవ్వేస్తూ "చూడబోతే ప్రపంచం చాలా చిన్నది అనిపిస్తోంది ధీరూ.. ఎటు వెళ్ళినా నువ్వూ నేను ఎదురవుతూ ఉంటాం.." అని ఏ మాత్రం కపటం లేనట్టు అతని కళ్ళల్లోకి చూసి "సారీ అనుకోకుండా ఇలా వచ్చేశాను. నా చిన్ననాటి ఫ్రెండ్ ఇక్కడే ఊటీలో సెటిల్ అయ్యింది. తనకు యాక్సిడెంట్ అయింది. ఫోన్ కాల్ రాగానే ఉన్న ఫళాన వచ్చేశాను.. ఇంతకీ మీ అన్నయ్య ఎలా ఉన్నాడు?" అని అడిగింది.

ఏమీ మాట్లాడకుండా నిశ్చలంగా చూశాడు ధీరూ. ఓ గాడ్. తన మాటల్లో ఏదైనా తేడా ఉందా? తను చిత్రకాదని కనిపెట్టేశాడా? అని గాభరా పడింది అనన్య. కాని గాభరా పడనవసరంలేదు. తన కట్టుకథ అతను ఎలాగూ నమ్మడు. నమ్మినా నమ్మకున్నా నటన కొనసాగాల్సిందే కదా? "మాట్లాడవేం ధీరూ.. మీ అన్నయ్య వీరూ ఎలా ఉన్నాడు?" అంది కొంచెం ఆదుర్దా కనబరుస్తూ.

"మీ అన్నయ్య వీరూ.." అనడం కరెక్ట్ కాదా? చిత్ర చెప్పిన కథలో సరిగ్గా అడుగుపెట్టాలని అలా అందే గాని అనన్యకు సందిగ్ధం వదలడంలేదు. అసలైన చిత్ర వీరూని ఉద్దేశించి ఎలా మాట్లాడుతుందో సరిగ్గా తెలీదు. అటూ ఇటూ కాకుండా ఊహించుకోవాలి. అంతే!

ఇంతకీ వీరూ ఉన్నది హాస్పిటల్ లోనే గాని అది మెంటల్ హాస్పిటల్.

వీరూకి ఎలా ఉంది అనడం కరెక్టు కాదు.

వీరూ ఎలా ఉన్నాడు అనడమే కరెక్టు.

అమ్మయ్య నేను సరిగ్గానే డీల్ చేస్తున్నాను అనుకుంది అనన్య. కాని అలా అనుకుంటున్నట్టు పైకి తెలియకూడదు. పైగా దొరికిపోయిన దొంగలా నటించడమే కష్టం. కావాలని దొరికిపోయిన దొంగకు మరీ కష్టం.

"హి ఈజ్ ఫైన్. అయ్ మీన్. వెరీ ఫైన్.." అంటూ చురుగ్గా చూశాడు ధీరూ. "నువ్వొచ్చేస్తే అన్నయ్య పరిస్థితి ఎలా ఉంటుందో నీకు తెలీదా! ఓకే. అంతా మాట్లాడుకుందాం. అలా రెస్టారెంట్‌లోకి వెళ్ళి కూచుందామా?"

"ఓకే" అంటూ అతని వెంటే నడుస్తూ చాలా యధాలాపంగా అడిగింది అనన్య. "ఊటీకి నువ్వు ఒక్కడివే వచ్చావా ధీరూ?"

నాకు తెలుసు. నీ వెనక ఓ గ్యాంగ్ ఉంది. ఒక డేంజర్ బ్యాచ్ ఉంది. అని అరవాలనిపించింది. కంట్రోల్ చేసుకుంది. మనస్సులో టిక్ టిక్ మమటున్న స్టాప్ వాచ్ మీద దృష్టి పెట్టుకుంది. లంచ్ తర్వాత తను హోటల్ నుంచి బైటికొచ్చినప్పుడు టైం రెండున్నర అయి ఉంటుంది. ఇప్పుడు సరిగ్గా మూడయింది. కనీసం అయిదు గంటలదాకా ధీరూతో ఉండాలి. ధీరూ తనతోనే ఉండేట్టు చూసుకోవాలి.

బీప్ బీప్ మంటూ శబ్దం వినిపించేసరికి చురుక్కున గమనించింది అనన్య. పార్కింగ్ ప్లేస్‌లో ఉన్న నల్లటి స్కార్పియోను రిమోట్ తో అన్‌లాక్ చేశాడు ధీరూ. అతని కార్ అన్నమాట.

చిత్ర చెప్పిందా? చెప్పలేదా? సరిగ్గా గుర్తులేదు. కార్ డోర్ తీసి లోపల ఏవో కెలికి వెదికి మళ్ళీ లాక్ చేశాడు ధీరూ. అనన్యకు సరిగ్గా వినిపించలేదు.

ఫోన్‌లో అతను చాలా చిన్నగా మాట్లాడాడు.

నవ్వుకుంటూ ఊహించుకుంది అనన్య. డిటెక్టివ్ కథలోలా ఉంది. ధీరూ తన అనుచరులతో మాట్లాడి ఉంటాడు. "హల్లో బాయ్స్ .. చిత్ర దొరికింది.. అవునవును.. నాకే దొరికిపోయింది. కాబట్టి మీరిక రిలాక్స్ అవండి. నేను మళ్ళీ ఫోన్ చేస్తాను" అని ఎవరితోనో చెప్పి ఉంటాడు.

పక్క నుంచి  చూస్తున్న అనన్యకు అతని ముఖంలో విజయ గర్వం స్పష్టంగా కనిపించింది. అప్పుడే గమనించింది. అతనిలో ఓ కరుకుదనం ఉంది. రాతిబొమ్మలో ఉండే కరుకుదనం అది. ఇతనో కదిలే రాతిబొమ్మ.

ఓరి మూర్ఖుడా నువ్వు రాయివో బండవో గాని నీ విజయ గర్వానికి అర్థంలేదు. నీకు దొరికింది నీవు వెదుకుతున్న చిత్ర కాదు. చిత్ర కాని చిత్ర. కాస్సేపటికి అసలు విషయం తెలిసే ఏమవుతుందో తెలుసా? రాతి బొమ్మలా ఉన్న నువ్వు ఒక్కసారిగా గాలి తీసిన బెలూన్‌లా అయిపోతావు.. అనుకుంటూ అతని వెంట రెస్టారెంట్ లో అడుగుపెట్టింది అనన్య.

ఆ తర్వాత క్షణాలు నిమిషాలు కలలో ఇంద్రజాలంలా దొర్లిపోయాయి. ఎవరిది నటన? ఎవరిది నటన కాదు? ఎత్తు మీద పై ఎత్తుల్లా మాటలు నడిచాయి. దొరికి పోవడం ఇద్దరికీ ఇష్టంలేదు.

"సారీ ధీరూ.. ఎవరికీ చెప్పకుండా ఇలా వచ్చేశాను.. అదీగాక నా సెల్ ఫోన్ పాడైపోయింది. నీకు తెలుసుగా ఊటీలో సిగ్నల్ అందదు. నీ నంబర్ సరిగ్గా గుర్తులేదు." అంది అనన్య అతుకులు గతుకులుగా సంజాయిషీ ఇస్తూ "ధీరూ ఓకే కదు? అయాం రియల్లీ వెరీ సారీ"

"దట్స్ ఓకే" అని తేలిగ్గా నవ్వేశాడు ధీరూ.

లోపల అగ్నిపర్వతాలు పగులుతున్నా పైకి అంత హాయిగా ఎలా నవ్వగలడు? చిత్ర చెప్పింది రైటే. ఇతను చాలా లోపలి మనిషి. గట్టి మనిషి.

"పాపం మీ ఫ్రెండ్‌కి యాక్సిడెంట్ అయింది కదా. ఆ టెన్షన్ లో హఠాత్తుగా వచ్చేశావు. దానికేం గాని. ఎలా ఉంది మీ ఫ్రెండ్‌కి? ఇంతకీ యాక్సిడెంట్ ఎలా జరిగింది?" అన్నాడు ధీరూ. నువ్వేం చెప్పినా నేనెలాగూ నమ్మనులే అన్న భావం స్పష్టంగా ధ్వనించింది అతని మాటల్లో.

"నా చిన్నప్పటి ఫ్రెండ్ ఇక్కడే సెంట్రల్ అగ్రికల్చరల్ ఇనిస్టిట్యూట్‌లో పని చేస్తోంది. పెళ్ళయిందిలే కోయంబత్తూర్ నుంచి వస్తుండగా కార్ యాక్సిడెంట్ అయింది. భర్తే డ్రైవ్ చేస్తున్నాడు. లక్కీగా ఇద్దరూ ప్రాణాలతో బైటపడ్డారు. వాళ్ళ బంధువులు అందరూ వచ్చారులే.. బాగానే చూసుకుంటున్నారు.." అని కట్టు కథ ఇక పెంచడం మంచిది కాదని తుంచేసింది అనన్య.

టేబుల్ మీదికి ఏవో స్నాక్స్ వచ్చాయి.

అతను ఏం ఆర్డర్ చేశాడో ఏం వచ్చాయో కూడా గమనించలేదు. బర్గర్లూ పిజ్జాలు బొత్తి ఇష్టం ఉండదు. అయినా టైం గడవడానికి వాటిని రుచి చూస్తూ కూచుంది.

తేనె పూసిన కత్తిలా ఉన్న ధీరూ హఠాత్తుగా నిజరూపం బైట పెట్టేసి "సరే పద హైదరాబాద్ వెళదాం.." అంటే కథ వేడెక్కిపోతుంది.

వస్తానని ఇప్పుడే బయలుదేరడం కుదరదు.

రానని మొండి కేస్తే అతను కరుగ్గా వ్యవహరించవచ్చు. ఒక ఫోన్ కాల్‌తో తన గ్యాంగ్ మెంబర్స్‌ని అక్కడికి రప్పించి తనని కిడ్నాప్ చేసుకుని స్కార్పియోలో తీసుకెళ్ళిపోవచ్చు.

అదంతా ఒక పెద్ద సీన్ కావచ్చు. పబ్లిక్ ప్లేస్‌లో అందరి దృష్టినీ ఆకర్షించే సీన్ పెట్టుకోవడం ధీరూకి ఇష్టం ఉండదు. కాని తప్పని సరి అయితే అంత పనీ చెయ్యడానికి అతను వెనుకాడకపోవచ్చు.

సాధ్యమైనంత వరకు అతనితో నైస్‌గా ఉంటూ కాలక్షేపం చెయ్యడమే బెస్ట్ అనుకుంది అనన్య.

"ఇప్పుడు ఐస్ క్రీం బావుంటుందా?" అంది ఏ మాత్రం మొహమాటంలేని స్నేహం నటిస్తూ.

ధీరూ ముఖంలో ఆశ్చర్యం స్పష్టంగా కనిపిస్తోంది. అన్నయ్యను వదిలేసి పారిపోయిన చిత్ర ఇంత నిర్మలంగా ఎలా ఉండగలదు? తనకు దొరికిపోయి కూడా ఇంత ఈజీగా ఎలా నవ్వగలదు?

"ఊటీలో ఐస్ క్రీం.. ఫెంటాస్టిక్‌గా ఉంటుంది. కాని తర్వాత కాఫీ తాగితేనే మజా" అంటూ బేరర్‌ని పిలిచి ఆర్డర్ చెప్పాడు.

అతని మనస్సులో ఏం తిరుగుతోందో అంచనా వేసుకుంటోంది అనన్య. పైకి మాత్రం కాలక్షేపం కబుర్లు దొర్లించేసింది.

ఐస్‌క్రీం చప్పరిస్తూ తన ఫ్రెండ్‌కి యాక్సిడెంట్ అయిన తీరూ హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ వివరాలు అన్నీ చెప్పుకొచ్చింది. తర్వాత కాఫీ సిప్ చేస్తూ "వావ్ గ్రేట్ ఐడియా ధీరూ. ఐస్ క్రీం తర్వాత వేడి కాఫీ. రియల్లీ గ్రేట్. ఇంతకీ నువ్వు ఊటీకి ఎందుకు వచ్చినట్టో చెప్పనే లేదు." అంది కొంచెం కవ్వింపుగా.

ధీరూ పిచ్చివాడా? భయస్తుడా? నటనకు కూడా ఒక లిమిట్ ఉండాలన్నట్టు మొండిగా తలెగరేసి "తెలీదా? నిన్ను వెదుక్కుంటూనే వచ్చానిక్కడికి" అన్నాడు. "ఎలా ట్రేస్ చేశానని అడక్కు, నా పద్ధతులు నాకుంటాయి. తెలుసుకదూ? ఏం చెయ్యాలనుకున్నాగాని నా పద్ధతిలో నేను చేస్తాను" అన్నాడు వత్తి పలుకుతూ.

ఆ మాటతో అనన్యకు ఒక్కసారిగా కాళ్ళు చల్లబడినట్టు అయింది. మెత్తటి మాట వత్తి పలికి అంతగా భయపెట్టవచ్చని అనుకోలేదు. చిత్ర చెప్పిందంతా ఒక్కసారి చెవుల్లో మారు మోగింది. ధీరు అంటే డేంజర్. మాట చెల్లించుకోవడానికి ఏమైనా చేస్తాడు. అతని దగ్గర యాసిడ్ బాటిల్ ఉండే ఉంటుంది.

"సారీ ధీరూ. నేను ఫోన్‌లో కాంటాక్ట్‌లో ఉండి ఉంటే నీకీ ట్రబుల్ తప్పేది.."

"ఆఁ! వెరీగుడ్! ఇచ్చిన ట్రబుల్ చాలు కదా. ఇంకా ట్రబుల్ ఇవ్వవు కదా?" అన్నాడు వ్యంగ్యాన్ని ఏ మాత్రం దాచుకోకుండా.

లొంగిపోయిన వీరుడు చేతులెత్తేసి నట్టు అతని వైపు అసహాయంగా చూసి బేలగా తలవాల్చింది అనన్య. "నన్నునమ్మాలి ధీరూ. ఫ్రెండ్‌కి యాక్సిడెంట్! లేకుంటే హఠాత్తుగా వచ్చేస్తానా? కావలిస్తే హోటల్‌కి వెళదాం.. రా.. నా ఫ్రెండ్ ఇంకా బెడ్‌లోనే ఉంది. నీకు పరిచయం కూడా చేస్తాను. కమాన్!" అంది యమధైర్యంగా. వట్టి దబాయింపే కదా? "పద చూద్దాం" అని ధీరూ రెడి అయితే కథ ఎదురు తిరుగుతుంది. ఆ సంగతి ఇద్దరికీ తెలుసు.

"ఎందుకులే నిన్ను నేను నమ్ముతాను. పూర్తిగా నమ్ముతాను. ఓకే. నీ ఫ్రెండ్‌ని మళ్ళీ కలుసుకోవాలా?" అన్నాడు ధీరూ చిన్నగా నవ్వుతూ. నిన్ను నేను నమ్మడంలేదు. ఎప్పటికీ నమ్మను. ఇక నువ్వు తప్పించుకునే మార్గం లేదు. నేను వదలను. అన్న భావాలన్నీ ఆ నవ్వులో ఉన్నాయి.

"అవసరం లేదు ధీరూ. నాకయితే వెంటనే మీ అన్నయ్యని చూడాలని ఉంది. అతనిప్పుడు ఇంకా డిప్రెస్ అయిపోయి ఉంటాడు. ముఖ్యంగా నేను కనిపించకపోతే అతనికి అంతా అంధకారంగా ఉంటుంది. మనం హైదరాబాద్ వెళ్ళిపోదాంలే ధీరూ." అంది నమ్మకంగా నిశ్చయంగా.

"దట్స్‌కూల్!" అన్నాడే గాని ధీరూ కూల్‌గా లేడు. అతని చూపులో వాలకంలో అపనమ్మకం దాగడంలేదు. ఈ అమ్మాయి మధ్యలో ఏదో ట్రిక్ వేసి పారిపోతుందన్న భయమే అతన్ని పీడిస్తోంది. అతను ఎలర్ట్‌గా ఉన్నాడు. లేడి మీదకి ఎగిరి దూకడానికి సిద్ధంగా ఉన్న చిరుత పులిలా ఉన్నాడు.

"మనం హైదరాబాద్ వెళ్ళిపోదాం. ముందసలు నేను మీ అన్నయ్య వీరూకి సారీ చెప్పాలి. చెప్పినా అతనికి అర్థమౌతుందో లేదో" అని సంజాయిషీగా గొణుగుతున్న అనన్య వైపు చిత్రంగా చూశాడు ధీరూ.

"ఐ మీన్. నేను మళ్ళీ ద్రోహం చేశానని వీరూ ఇంకా డిప్రెస్ అవుతాడు" అంది గాని అనన్య ధీరూ ముఖ కవళికల్ని సరిగ్గా అంచనా వెయ్యలేక పోయింది.

ఆ చూపుల్లో ఆ కవళికల్లో ఏదో అర్థమయింది. సగం అర్థం కాకనే జారిపోయింది. ఏమిటో తెలియలేదు.

వీరూ గురించి ఎక్కువ మాట్లాడితే ధీరూ విపరీతంగా డిస్టర్బ్ అవుతాడనుకుంటూ అనన్య ఇక మాట మార్చేసి "ధీరూ నేను హోటల్‌కి వెళ్ళి లగేజ్ సర్దుకుంటాను. నువ్వెక్కడో దిగావోకాని వెంటనే బయలుదేరుతావనుకుంటా.. నన్ను నమ్ము ధీరూ. నేనేం పారిపోను. ప్రామిస్!.."

"ఇట్స్ ఓకే. నమ్ముతానుగా. కమాన్" అంటూ లేచాడు ధీరూ, ఇద్దరూ రెస్టారెంట్ నుంచి బైటకొచ్చాక ధీరూ అనన్యకు దగ్గరగా నడుస్తూ "నేను మీ హోటల్‌కి వస్తాను. నువ్వు లగేజ్ సర్దుకున్నాక ఇద్దరం బయలుదేరదాం" అన్నాడు.

"సరే నీ ఇష్టం!" అనేసింది అనన్య. అంత సులబంగా ఆమె ఒప్పుకున్నందుకు ఆశ్చర్యపోతూనే కారు డోర్ తీశాడు ధీరూ.

క్షణాల్లో నల్లటి స్కార్పియోలో అతన్తో బాటు ఊటీ మెయిన్ రోడ్‌లో వెళుతుంటే "వావ్! సక్సెస్ నాదే" అనుకుంది అనన్య లోలోపల.

ఈ సరికి చిత్ర ఊటీ ఘాట్ రోడ్‌లో కిందకి దిగి పోతూ ఉంటుంది.

ధీరూతో బాటు తనిప్పుడు హోటల్‌కి వెళ్ళడమే మంచి ఐడియా. హోటల్‌లో ఇంకో ముప్పావుగంట పాటు లగేజ్ సర్దుతూ గడిపినా చాలు. ఆ తర్వాత అసలు నిజం చెప్పేస్తే ధీరూ ఆటకట్టు.

నేను చిత్రను కాను అనన్యని అని నిజం చెప్పేస్తే మొహం మాడిపోతుంది. ఋజువులూ, సాక్ష్యాలూ వేరే ఏం కావాలి? తన టీవీ యాంకర్ ఐడీ చాలు.

హోటల్ లో ఓ టీవీ టీంతోనే తను దిగింది. రిజిష్టర్ లో పేర్లుంటాయి. తను అనన్యనని చెప్పడానికి ఇంకేం కావాలి?

"హోటల్ లేక్ వ్యూ" అని అనన్య చెప్పగానే "తెలుసుగా" అంటూ ధీరూ ఒడుపుగా డ్రైవ్ చేస్తూ రేస్ కోర్సు రోడ్డు దాటి బోట్ క్లబ్ రోడ్డు పట్టాడు. అక్కడ ఎడమవైపు తిరగాల్సింది పోయి స్పరున దూసుకుపోయింది స్కార్పియో.

"అరే. ఇటు కాదు. ఇటు హోటల్ రాదు. కమాన్. స్టాపిట్. వెనక్కి వెళ్ళు ధీరూ." అంది అనన్య. ధీరూ పట్టించుకోకుండా స్పీడ్ పెంచి ముందుకు దూసుకుపోతున్నాడు.

సర్రున మెలికల దారి కట్ చేస్తూ క్షణాల్లో శివార్లలో కొచ్చేశాడు. టీ తోటల మధ్య దూసుకు పోతుండగా సరిగ్గా అప్పుడే అనుమానం వచ్చి అతని ముఖంలోకి చూసి అదిరిపడింది.

రాతి బొమ్మ ముఖానికి కుంకుమ పూసినట్టు జేవురించి ఉన్నాడు ధీరూ. కళ్ళల్లో నిప్పులు రాలుతున్నట్టు తీక్షణంగా చూస్తున్నాడు.

"ధీరూ వాటీజ్ దిస్? నా హోటల్‌కి తీసుకువెళతానని చెప్పి. ఇలా ఎక్కడికి తీసుకువెళుతున్నావ్? కొంపదీసి డైరెక్ట్‌గా హైదరాబాద్‌కా? నో ఈ రూట్ అటు వెళ్ళదు. ముందు కారాపు. స్టాపిట్! స్టాపిట్!" అంటూ అనన్య అమాయకంగా కారు డోర్ ఓపెన్ చెయ్యబోయి ఎలక్ట్రానిక్ లాక్ అని వెంటనే గ్రహించి సీటులో అసహాయంగా జేరగిలబడింది. ధైర్యాన్ని కూడదీసుకునే వ్యవధి కూడా లేనట్టు విలవిలలాడిపోయింది. పులి నయం. మనిషే ప్రమాదం.. మనిషే ప్రమాదం. అని మనసులో ఘోష మొదలయింది.

"ధీరూ. అయ్‌సే. స్టాప్" అని అనన్య అరుస్తూండగా ఆమె అసహాయత్వాన్ని కర్కశంగా అణిచేస్తూ ఉరిమాడు ధీరూ: "షటప్! నిన్నెక్కడికి తీసుకెళ్ళాలో నాకు తెలుసు. నువ్వు గోలచేసి ఘోష పెట్టినా దిక్కులేదు నీకు. జస్ట్ షటప్!" అంటూ దిక్కు తెలీనంత డేంజరస్‌గా కారు స్పీడ్ పెంచాడు. ప్రాణాలుగ్గబట్టుకుని అచేతనంగా ఉండిపోయింది అనన్య. ఏమయింది తనిప్పుడు? కిడ్నాప్ అయిందా? ఇంకేమవుతుంది?

●●●

## 7

**రేప్! గ్యాంగ్ రేప్!!**

ఏ స్త్రీకైనా అంతకు మించిన భయం లేదు. అంతకన్నా ఘోరం లేదు. నరకం లేదు.

రేప్ ఎలా ఉంటుందోగాని దాని గురించిన ఆలోచనే క్రూరం. ఘోరం.

కొండ రోడ్డు మీద కొండ చిలువలా స్కార్పియో మూసుకుపోతుండగా అనన్య మనస్సులో అగ్నిపర్వతాలు బ్రద్దలయ్యాయి. లావా సెగలు గక్కుతూ ఆలోచనలు అనుమానాలు బుసకొట్టాయి.

చివరికి ఏమౌతుందంటే.. తను రేప్ కావచ్చు.

ధీరూ గురించి చిత్ర చెప్పిన మాటలన్నీ, రేచు కుక్కల్లా దూసుకొచ్చి చుట్టుముట్టాయి.

ఊటీకి ధీరూ ఒక్కడూ వచ్చి ఉండడు.

అతని వెంట ఎప్పుడూ ఒక రౌడీగ్యాంగ్ ఉంటుంది.

ఏ క్షణాన అతనికి ఏ దుర్బుద్ధి పుడుతుందో తెలీదు. జేబులో ఎప్పుడూ ఓ యాసిడ్ బాటిల్ ఉంటుంది.

(ఇప్పుడు ఉందా? ఇప్పుడు ఉందా? ఇప్పుడు ఉందా?)

అతనికి బోలెడు క్రిమినల్ రికార్డు ఉంది.

ఓగాడ్! అనుకుంటూ అసహాయంగా తలవాల్చేసింది అనన్య. తల పక్కకు తిప్పాలంటే భయం.

ధీరూ వైపు చూడాలంటే భయం.

అనన్యా అనన్యా ఏమిటిది అనన్యా! ఏమౌతోంది అనన్యా? నువ్వేమిటి? ఇటువంటి ఆపదలో ఇరుక్కోవడమేమిటి? కమాన్! నువ్వు మామూలు మనిషివి కాదు. మామూలు ఆడపిల్లవి కాదు.

అసలు అనన్య అనే మాటకి అర్థం ఏమిటి?

ఇటువంటి వాళ్ళు ఇంకొకరు లేరనే అర్థం

నువ్వు అక్షరాలా అనన్యవి.

అనన్య ఈజ్ స్పెషల్. అనన్య ఈజ్ గ్రేట్.

పులి కళ్ళలోకి సూటిగా చూసి ఆ పులినే బెదరగొట్టగల దమ్మున్న అమ్మాయి అనన్య.

అనన్యకు భయంలేదు. భయమంటే అనన్యకు తెలీదు. క్రూరజంతువులన్నా భయంలేదు. జంతువుకన్నా క్రూరమైన మనిషైనా భయంలేదు. అస్సలు భయం లేదు.

ఎందుకూ భయం? వై?.. వై?..

వై. అనే శబ్దం చెవుల్లో ప్రతి ధ్వనించే సరికి దేవికారాణి ఉరిమిచూసినట్టు మెరుపు కొట్టింది.

బొంబాయి నుంచి అప్పుడప్పుడూ హైదరాబాద్ వస్తుంటుంది టీవీ జర్నలిస్టు దేవికారాణి.

అర్థరాత్రీ అపరాత్రీ అయినా ఎటుపడితే అటు సిటీలో తిరిగేస్తుంటుంది.

అపరిచితుల్ని లిఫ్ట్ అడిగి టూ వీలర్లో అయినా కారులో అయినా వెళ్ళిపోతుంటుంది.

కవిత్వం రాస్తుంది. ఫోటోగ్రఫీ అంటే ప్రాణం. దమ్మూ కొడుతుంది. మందూ కొడుతూంది.

"ఎవర్తో పడితే వాళ్ళతో ఎక్కడికంటే అక్కడికి వెళ్ళిపోతావు కదా.. భయం లేదా నీకూ?" అని అడిగితే

"భయమా? యూ మీన్ రేప్? గ్యాంగ్ రేప్?" అని నవ్వేస్తుంది. "అంతకు మించి ఇంకేం చేస్తారు? మన తప్పులేనప్పుడు ఎవరో దుర్మార్గం చేస్తారేమోననే అనుమానంతో మనమెందుకు భయపడ్డం? వై?"

"వై.. వై" అనే ప్రతిధ్వనిని అణచిపెట్టి, గుండె నిండా నిబ్బరంగా ఊపిరి పీల్చుకుంది అనన్య.

పక్క సీట్లో పులి ఉంది. పులి డ్రైవ్ చేస్తోంది. మహా అయితే పులి తనని ఇప్పుడు ఉరిమి చూస్తుంది. అయితే ఏమిటట?

నెమ్మదిగా తలతిప్పి ధీరూ వైపు నిశ్చలంగా తీక్షణంగా చూసింది అనన్య.

పులిలాంటి మనిషే. అయినా పులి కాదు, మనిషే. పులి నయం. చూపుకి భయపడుతుంది, వెనక్కి తగ్గుతుంది. ఈ మనిషి భయపడడు.

మొరుకుగా మొండిగా ముందుకు చూస్తూ చాకచక్యంగా డ్రైవ్ చేస్తున్నాడు. ఎత్తుగా వంకర్లు తిరుగుతున్న రోడ్డులో అవలీలగా దూసుకుపోతున్నాడు.

అతని మనస్సులో ఏదో ప్లాన్ ఉంది.

ఏం చేస్తున్నాడో! అతనికి స్పష్టంగా తెలుసు.

ఏం చెయ్యబోతున్నాడో ఖచ్చితంగా తెలుసు.

హోటెల్ రూంలో చిత్ర చెప్పిన మాటలన్నీ గుర్తుచేసుకుంది అనన్య. నెమ్మది నెమ్మదిగా ధైర్యం వచ్చింది.

హాండ్ బ్యాగ్ తడిమి చూసుకుంది. లోపల సెల్ ఫోన్ ఉంది. చిత్ర హాండ్ బ్యాగ్లు మార్చడం గుర్తుంది. ఇది తన బ్యాగ్ కాదు. చిత్రది.

బ్యాగ్స్లో సరంజామా కూడా మార్చింది చిత్ర.

తన ఫోన్ కూడా ఇందులో పెట్టింది.

కొంప మునిగేదేమీలేదు. ఇంతకూ ఇదో గేమ్. తనిప్పుడు అనన్య కాదు, చిత్ర.

ధీరూ కిడ్నాప్ చేసి తీసుకెళుతున్నది అనన్యని కాదు. చిత్రని. అసలు విషయం తెలియదతనికి.

విలన్‌లా దురుసుగా ప్రవర్తిస్తున్నాడు. చివరికి బఫూన్ అవుతాడు.

ఉచ్చులో పడి విలవిలలాడుతున్నది అతనే. తనుకాదు.

పెద్ద 'టఫ్‌గై' లాగా తనని కిడ్నాప్ చేసి తీసుకెళుతున్నాడుగాని తను చిత్రకాదు అనన్య అని తెలిస్తే ఖంగుతింటాడు.

ఇక్కడ ఈ డ్రామా నడుస్తుండగా అటు చిత్ర ఊటీ ఘాట్ రోడ్లు దిగిపోయి పలాయనం చిత్తగించేసిందని తెలిస్తే అప్పుడు ఈ పులిలాంటి ధీరూ పిల్లిలా అయిపోవడం ఖాయం.

ఎక్కడికి తీసుకెళతాడో తీసుకెళ్ళనీ. అదును చూసి గోప్యంగా ఫోన్ చేసేస్తే సరి!

తనెవరనుకుంటున్నాడు?

తన వెనుక ఒక టీవీ ఛానల్ ఉంది. నెట్ వర్క్ ఉంది.

'ఓ' టీవీ యాంకర్ అనన్య ఊటీలో కిడ్నాప్ అయిన వార్త దేశంలో అన్ని ఛానల్స్‌లో ఫ్లాష్ అవుతుంది. దేశవిదేశాల్లో రిలే అవుతుంది.

ఈ మూర్ఖుడికి మీడియా పవర్ గురించి ఏం తెలుసు? తను మెసేజ్ పంపాక పోలీసులు ఎంత హుటాహుటిన రంగంలోకి దిగుతారో ఊహించడం కష్టం. ఊటీ తమిళనాడులో ఉంది. ఇటు కేరళకు అతి చేరువలో ఉంది. అటు మైసూరుకు సమీపం.

ఆంధ్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు.. నాలుగు రాష్ట్రాల్లో పోలీసు యంత్రాంగం అప్రమత్తమౌతుంది.

టీవీ జర్నలిస్టు కిడ్నాప్ అంటే మాటలా? గోల గోల అయిపోతుంది.

ఎన్ని ఫోన్ కాల్స్! ఎన్ని మెసేజ్ లు! ఎన్ని వార్తాకథనాలు! ఎన్ని హై ఎలర్ట్‌లు!

ఊటీ చుట్టు పక్కల రోడ్లన్నిటి మీదా పోలీసులు నిఘాపెడతారు. ఉచ్చు బిగిస్తారు.

ఆ తరువాత ఊటీలో అంగుళం అంగుళం గాలిస్తారు.

యాసిడ్ బాటిల్ పుచ్చుకుని రౌడీయిజం చేసే సైకిక్ క్రిమినల్.. వీడికి మీడియా దెబ్బగురించి ఏం తెలుసు?

తెలుస్తుంది తెలిస్తుంది తెలిసొస్తుంది.. అనుకోగానే అనన్య పెదవుల మీదికి చిరునవ్వు చిమ్ముకొచ్చింది.

ఆపదలో హై ఎలర్ట్‌తో పనిచేసే మెదడు కంప్యూటర్ వేగంతో పరిసరాల్ని గమనించడం మొదలెట్టింది.

ఘాట్ రోడ్ మలుపు తిరుగుతూ స్కార్పియో కాస్త గుంతల్లో మిట్టల్లో ఊగుతుండగా అటూ ఇటూ చురుగ్గా చూసింది అనన్య.

ఎడం వైపు దాదాపు పదిగజాల దూరంలో "ఫిజ్జరాల్డ్స్ ఎస్టేట్" అనే బోర్డు కనిపించింది. చాలా పాత బోర్డు అది. ఎస్టేట్‌కు దారి చూపిస్తూ ఎర్రటి బాణం గుర్తు ఉంది.

ఇదో ఆధారం అనుకుంటూ మనసులోనే నోట్ చేసుకుంది. మరికాస్త దూరం వెళ్ళగా అల్లంత దూరాన పెద్ద వాటర్ ట్యాంక్ కనిపించింది, అటు ప్రక్కనే జింక్‌ల పార్కు ఉంది.

ఈ ఆధారాలతో హైదరాబాద్‌కు మెసేజ్ పంపితే చాలు. ఛానల్ ఆఫీస్‌కి పంపొచ్చు. తనతో ఊటీ వచ్చి తిరిగి వెళ్ళిన టీమ్ ఈపరికి హైదరాబాద్ చేరి ఉంటుంది. టీమ్ మేనేజర్ సుధాకర్‌కి, లేక కెమెరా మ్యాన్ ఖాన్‌కి మెసేజ్ పంపినా చాలు.

కొత్త ధైర్యంతో నిర్లక్ష్యంగా తలెగరేసింది అనన్య. నిబ్బరంగా ధీరూ వైపు చూసి స్పష్టంగా చెప్పింది..

"ఆల్ రైట్! నీ ప్లాన్ ఏమైనా కావచ్చుకాని.. అసలు విషయం తెలిస్తే తీవ్రంగా పశ్చాత్తాపపడతావు! ఎందుకైనా మంచిది.. నాతో కూల్‌గా ఉండు.. అయాం వార్నింగ్ యూ!"

"షటప్!" అంటూ ఉరిమాడు ధీరూ కర్కశంగా

అయితే క్షణాల్లో అతని ముఖంలో రంగులు తిరిగాయి. పొద్దు వాలుతున్న నీరెండ అతని చెంపల మీద మెరిసింది.

మొదట బిత్తరపోయి కూచున్న, అమ్మాయి ఇప్పుడంత ధైర్యంగా తనకే వార్నింగ్ ఇస్తోంది ఎందుకు? అన్న భావం అతని ముఖంలో స్పష్టంగా కనిపించింది.

తనకు తనే సమాధానం చెప్పుకుంటున్నట్టు వాలుగా తలూగించాడు. "నీ ట్రిక్కులు నా దగ్గర పనిచెయ్యవు.. యూ. షటప్ అండ్ కీప్‌క్వైట్" అన్నాడు.

అనన్య మళ్ళీ ఏదో చెప్పబోగా "అయ్ సే షటప్! " అని అరిచినట్లు ఉరిమి స్టీరింగ్ మీద అరచేత్తో గట్టిగా కొట్టాడు.

హారన్ బొయ్యిమంది అసందర్భంగా

"ఓకే..కూల్!" అనుకుంది అనన్య.. లోపల్లోపల నిగ్రహాన్ని, ఇంకా ఇంకా పొదివి పట్టుకుంటూ.

చూద్దాం, ఎక్కడికి తీసుకెళతాడో చూద్దాం. రేప్ చేస్తాడా? హత్యచేస్తాడా?

అతను దేనికైనా తెగించే లోపల అతని మొహం పగిలేట్టు కొట్టగల అసలు నిజం తన గుప్పిట్లో ఉంది.

స్టే కూల్ చిత్రా! అనుకుంది అనన్య. స్టే కూల్!

●●●

ఊటీలో కాలం తొందరగా నిద్రపోతుంది.

పగలు తక్కువ. రాత్రి ఎక్కువ. ఉదయం ఆలస్యం. సాయంత్రం అందమైన బద్దకం.

ముచ్చటగా ముసురు. గుసగుసగా నీడలు. దిగివచ్చే అవకాశం. ఎగబడి కమ్ముకునే ప్రకృతి.

పచ్చటి ప్రకృతి ఊదా ఛాయల్లోకి సురిగి సాయంత్రం దుప్పటి కప్పేస్తుంటే మనస్సుకే చలి, మధురోహలకే గిలి,

"జగమునే ఊటీ శాయగా.." అని పాడుకునే అలనాటి ప్రియుడు వాసు క్షణం గుర్తొచ్చి తప్పుకున్నాడు.

ఏమైంది ప్రేమ? ఎటుపోయింది ప్రణయం?

సముద్ర తీరంలో ఆనందంగా విహరించడానికి వెళ్ళి హఠాత్తుగా సముద్ర గర్భంలోకి పడిపోయినట్లయింది.

కమాన్ చూద్దాం ఈ నాటకం ఎలా ముగుస్తుందో అని అనన్య నిబ్బరంగా ముందుకు చూస్తుండగా..

తారు రోడ్డు మధ్యలో గతుకులు వచ్చాయి. స్కార్పియో ఊగింది. అది పూర్తిగా ధ్వంసమైన రోడ్డు - పాడైపోయిన బ్రిడ్జి దాటిన తర్వాత తారు రోడ్డు నుంచి ఎడమకు మట్టిరోడ్డులోకి మళ్ళింది స్కార్పియో. మట్టి కూడా మాయమై రాళ్ళు తేలాయి. ఈడ్చుకుంటూ వెళ్ళగా పెద్ద కాలవ తగిలింది.

నీళ్ళలో లాగింది బండి. వందగజాల కాల్వ దాటిన తర్వాత మళ్ళీ మట్టి రోడ్డెక్కి మలుపులు తిరిగింది.

ఈ ప్రదేశాన్ని కనిపెట్టడం సాధ్యమేనా అని కలవరపడింది అనన్య.

అంతలో ఎగిసిపడే కెరటంలా దూసుకుపోయి ఏటవాలు ఎత్తు రోడ్డు మీద వంకరటింకర మెలికలు తిరిగి విజయగర్వంతో ఆగింది స్కార్పియో.

ముసురుకొస్తున్న మసక నీడల్లో నల్లటి కటౌట్ లాగా సిల్హౌట్ లాగా నిలుచుంది పెద్ద బంగ్లా.

ఒక శిఖరం మీదకి వచ్చారు. అటూ ఇటూ ఆకాశనీలం చొచ్చుకుంటూ కిందకి దిగుతోంది.

ఒంటరి బంగ్లా, నిర్జనమైన ప్రదేశం. కటిక నిశ్శబ్దం.

ఆ బంగ్లాలో పదిమంది రౌడీలు ఉండవచ్చు. అదే ధీరూ స్థావరం కావచ్చు. ధీరూ ఏం చేస్తాడిప్పుడు?

చిత్ర చెప్పిన ఉదంతం మేరకైతే ధీరూ తనను ఇప్పుడు హైదరాబాద్ తీసుకెళ్ళాలి. అతను కూడా మొదట హోటల్ కెళ్ళి తర్వాత హైదరాబాద్ వెళదామనే అన్నాడు. మరి ఇక్కడికెందుకు తెచ్చాడు?

ఎదిరించి లాభం లేదు కాబట్టి కుదురుగా కారు దిగింది అనన్య. బ్యాగ్‌లో ఫోన్‌ని తడిమి చూసుకుంది.

ఇంతవరకూ తనకు ఒక్క ఫోన్‌కాల్ కూడా రాకపోవడం గుర్తొచ్చి కొంచెం అనుమానమనిపించింది. బహుశా సిగ్నల్ ప్రోబ్లం కావచ్చు అనుకుంది.

ఈ శిఖరం నుంచి సిగ్నల్ అసలు అందవేమో అనిపించినా కానీలే చూద్దాం అని ధైర్యం చెప్పుకుంది.

ఫోన్ బ్యాగ్ లోనే ఉండిపోయింది కాబట్టి సిగ్నల్ అందకపోవచ్చు. బయటికి తీశాకా నెమ్మదిగా సిగ్నల్ అందవచ్చు.

"చెప్పానుగా నీకు దిక్కే లేదింక... పిచ్చి పిచ్చి వేషాలు వేసి లాభం లేదు. కమాన్" అంటూ జేబు తడుముకుని తాళాలు తీసి బంగ్లా తలుపు తెరిచాడు ధీరూ. లోపలికి వెళ్ళి లైట్లు వేశాడు.

అతని ధైర్యానికి అర్థం ఉంది. అనన్య అక్కణ్ణుంచి పరిగెత్తిపోవడం పారిపోవడం అసాధ్యం.

అప్పటికి బంగ్లా తాళం వేసి ఉందికాబట్టి లోపల రౌడీలు లేరు అనుకుంది అనన్య. అయినా కాస్సేపటికి వస్తారేమో! రానీ చూద్దాం.

బంగ్లా ముందు నిలబడి చుట్టూ పరికించి చూసింది అనన్య.

అద్భుతమైన ప్రదేశం. మామూలుగా అయితే మనస్సుకు రెక్కలు రావాలి. తేలిపోవాలి. కాని ఇప్పుడు అలా లేదు.

ఈ అందం చాలా భీకరంగా ఉంది. కొంచెంలో ఎంత తేడా! ఇది కదూ డ్రామా?

●●●

బంగ్లా ఇంద్రభవనంలా ఉంది. ఏ లోటూ లేదు. అన్ని సదుపాయాలూ ఉన్నాయి. ఖరీదైన ఫర్నిచర్ ఉంది. అంతా నీట్‌గా ఉంది.

ఒక్క చూపుతో అంతా గమనించింది అనన్య.

ఇది దొంగల ముఠా స్థావరం కాదు.

సరిగ్గా అప్పుడే ఒక విషయం స్ఫురించింది. చిత్ర చెప్పిన వివరాల మేరకు ధీరూ అన్నయ్య వీరూ ప్రేమ జబ్బుతో హాస్పిటల్‌లో ఉన్నాడు. అందుకు కారణమైన చిత్రను వెతికి పట్టుకుని అన్నయ్య ముందుకు తీసుకు వెళ్ళి నిలబెట్టడమే ధీరూ లక్ష్యం.

అంతే అతనికి చిత్ర వదిన స్థానంలో ఉంది.

వదిన స్థానంలో ఉండే స్త్రీని రేప్ చేయడం గ్యాంగ్ రేప్ చేయించడం ఎంతటి పైశాచిక ప్రవృత్తిగల మగవాడికైనా అసాధ్యం.

ఒక్కసారిగా మనసంతా తేటపడింది. ఇంతసేపూ భయం కింద ఒత్తిడి కింద అంత నీచంగా ఆలోచించినందుకు లజ్జ పడింది అనన్య.

అప్పుడే ధీరూని మరికొంచెం పరీక్షగా చూసింది. అతనిలో టెన్షన్ లేదు. సందిగ్ధం లేదు. కరుగ్గా ఉన్నాడు కానీ కరెక్ట్‌గా ఉన్నాడనిపించింది.

ఇద్దరూ సోఫాల్లో కూచున్నాక ముందు ఎవరు మాట్లాడాలా అన్నట్టు ఇద్దరూ సందిగ్ధపడ్డారు.

దొరికిన దొంగలా ఉండాల్సిన అనన్య (చిత్ర) ఇలా కిడ్నాప్ అయివచ్చినందుకు భయపడక ఇంకా నవ్వగలుగుతున్నందుకు కొంచెం ఆశ్చర్యపడ్డాడు ధీరూ.

నిదానంగా సిగరెట్టు వెలిగించుకుని సుదీర్ఘంగా దమ్ములాగి పొగమేఘాలు వదిలాక ఆమె వైపు నిశ్చలంగా చూస్తూ "యూ ఆర్ రియలీ రియల్లీ ఎ డేర్ డెవిల్! నిన్ను వెంటనే స్ట్రెయిట్‌గా హైదరాబాద్ తీసుకెళ్ళకుండా ఇక్కడికెందుకు తీసుకొచ్చానో తెలుసా?" అన్నాడు

"భయపెట్టడానికి?" అంది అనన్య చమత్కారంగా ప్రశ్న గుప్పిస్తూ.

"నువ్వు అంత సులభంగా భయపడవని తెలుసు. కానీ మధ్యలో ఏ గొడవా లేకుండా నిన్ను కుదురుగా తీసుకెళ్ళడం నాకు చాలా చాలా అవసరం!" అన్నాడతను సహనమూర్తిలాగా.

నీ అవసరం నాకు తెలుసు కాని నా ఆయుధం నీకు తెలీదు. అని లోలోపలే నవ్వుకుంది అనన్య. "ఓకే చిత్రా.. లెటజ్ బీ ప్లెయిన్!. జరిగిందేదో జరిగిపోయింది.. ఏ మాత్రం ప్రతిఘటించకుండా నువ్వు నాతో హైదరాబాద్ రావాలి. మధ్యలో ఎక్కడ గాని ట్రిక్స్ ప్లే చెయ్యకూడదు. నేను మొండివాణ్ణి. నీకు తెలుసు. కానీ నిజం చెప్పాలంటే నీ ట్రిక్స్ అంటే నాకు భయం. అయినా వదిలిపెట్టను. మనం బయలుదేరే ముందు నువ్వూ నేనూ ఒక అవగాహనకు రావాలి. తప్పదు. నువ్వంత సులభంగా ఒప్పుకోవు. కాని నీకు వేరేదారి లేదు. నేను చెప్పినట్లు చెయ్యకపోతే.. చెప్పినట్టు చేస్తావన్న నమ్మకం నాకు కుదరకపోతే ఇక్కణ్ణుంచి కదలవు. కదలనివ్వను." అని నింపాదిగా చెప్పి "ప్రామిస్!" అన్నాడు వ్యంగ్యంగా.

ఓకే ఇక చాలు? అనుకుంది అనన్య. ఈ అవతారం చాలు. ఈ అవస్థ చాలు. ఇక బైటపడకపోతే ప్రమాదం అనుకుంటూ తెగించినట్టు నవ్వేసింది.

"ధీరూ. అయ్ లైక్ యూ! చిత్ర చెప్పింది రైటే! యూ ఆర్ ఏ డేర్ డెవిల్!" అంది ఒక్కోమాటా విడదీసి, పలుకుతూ.

సిగరెట్టు పీల్చడం ఆపి అతను ప్రశ్నార్థకంగా చూశాడు. "వ్వాట్?"

"చిత్ర చెప్పింది రైటే అంటున్నాను" అంది మళ్ళీ చిల్లగింపుగా నవ్వుతూ.

అతని ముఖం ఉన్నట్టుండి ఎర్రబడింది.

"స్టాపిట్! వాటీజ్ దిస్?" అని ఉరిమాడు "మళ్ళీ చెపుతున్నాను. మళ్ళీ మళ్ళీ చెపుతున్నాను. నో ట్రిక్స్! నో మోర్ ట్రిక్స్!. డోంట్ ప్లే! చంపేస్తాను."

అనన్య మనస్సు విజయగర్వంతో ఊగింది. ఇది ఇదీ తను చూడాలనుకున్న సీన్!

"సారీ ధీరూ! వెరీ సారీ వెరీ వెరీ సారీ నువ్వు తిరిగి తిరిగీ వెతికి వెతికీ అలిసిపోయావు. నన్ను బెదిరించి బెదిరించీ అలసిపోయావు.. రియల్లీ. నువ్వు కాస్త రెస్ట్ తీసుకోవడం అవసరం. కాని ఇప్పుడప్పుడే రెస్ట్ తీసుకోలేవు"

"హే! వాట్ నాన్సెన్స్. ఆల్ దిస్?"

"ఎస్.. మిష్టర్ ధీరూ! భగవంతుడి సృష్టిలో చిత్ర విచిత్రాల్లో ఇదో చిత్రం చిత్రలాంటి అమ్మాయే ఇంకొకరు ఉండడం విచిత్రం. ఇద్దరూ తారసపడ్డం మరీ మరీ విచిత్రం. చిత్రను కాపాడ్డానికి అనన్య చిత్రంగా రావడం మహా మహా విచిత్రం!"

అతను నిలువెల్లా ఊగిపోయాడు. నమ్మరాడా? ఎలా నమ్ముతాడు? సిగరెట్టు అవతల పారేసి ఒక్క జెర్క్‌తో లేచి ముందుకొచ్చాడు.

అనన్యను ఒక్క ఉదుటున ఒడిసి పట్టి భుజాల్ని బలంగా నొక్కేశాడు.

"అయ్ సెడ్ నో ట్రిక్స్! ఇంకో మాట మాట్లాడితే చంపేస్తా! ఇక అన్నయ్య ఏమైపోయినా ఫరవాలేదు. నిన్ను మాత్రం చంపిపారేస్తాను." అని ఉరిమి చూసి హుంకరించాడు.

"యూ ఆర్ రైట్! నేను చిత్రనే అయితే నువ్వాపని చేస్తే రైటేకావచ్చేమో. కానీ నేను చిత్రని కాను. అచ్చంగా డబుల్ యాక్షన్ సినిమాల్లో లాగా. చిత్రలా ఉన్న ఇంకో అమ్మాయిని. నా పేరు అనన్య!"

"నౌ అయ్ విల్ కిల్ యూ."

"ఆఁహా నువ్వు టీవీ చూడకపోతే తప్పు నాదికాదు. ఓ టీవీ చూడకపోతే ఆ తప్పూ నాదికాదు. కాని నేను నువ్వనుకునే చిత్రనుకాను. ఓ టీవీ యాంకర్ అనన్యని! ఆ సంగతి నువ్వు తెలుసుకోవడం నీకూ అవసరం నాకూ అవసరం!"

"యూ...డెవిల్!" అంటూ అతను ఇంకా పట్టు బిగిస్తుండగా ఒక్క జెర్క్‌లో విదిలించుకుంది.

"యూ విల్ రిగ్రెట్ ఎవ్రీథింగ్! పశ్చాత్తాప పడతావు ధీరూ! అయినా యూ డోంట్ వర్రీ.. నీమీద నాకు కోపం లేదు. కోపం ఉండదు. టీవీ యాంకర్‌గా నా ఐడీ చూస్తే పాస్ పోర్ట్ చూస్తే అప్పుడేం చెపుతావు? జస్ట్ ఎ మినిట్!" అంటూ హేండ్ బ్యాగ్ అందుకుని ఓపెన్ చేసి చేతివేళ్ళతో వెతికింది.

కాలం గడ్డకట్టిన క్షణాలలో ఆమె చేతి వేళ్ళు చల్లబడ్డాయి. మళ్ళీ వెదికింది. `ఓగ్గాడ్!` అంటూ ఇంకా ఇంకా తడిమి తడిమి వెదికింది.

బాగా ఓపెన్ చేసి వెదికింది.

ఐడీలేదు. పాస్ పోర్ట్ లేదు.

గబుక్కున పాతాళంలోకి జారిపోతున్నట్టు అనిపించింది.

హోటల్ రూంలో చిత్ర హడావుడిగా హేండ్ బ్యాగుల్లోంచి సరంజామా మార్చిన క్షణాల్ని గుర్తు చేసుకుంది.

కళ్ళు బైర్లు కమ్మాయిగానీ ఏమీ తోచలేదు.

సెల్ ఫోన్ మాత్రం చేతికి తగిలింది.

"సంథింగ్ రాంగ్! సమ్ మిస్టేక్! చిత్ర ఏదో మిస్టేక్ చేసింది. ఒకే. అయి విల్ కా మై ఆఫీస్! ఓ టీవీ ఆఫీసే నీకు చెపుతుంది. నేనెవరో చెపుతుంది. జస్ట్ వెయిట్!" అంటూ ఫోన్ బటన్‌లు ఆత్రంగా నొక్కింది.

షాక్ మీద షాక్.

ఇన్సర్ట్ సిమ్.. అంటోంది సెల్ ఫోన్.

ఓగ్గాడ్! సిమ్ కార్డ్ ఏమైంది?

అలాగే కూలబడిపోయింది అనన్య.

దెబ్బతిన్న పులిగాండ్రింపులు అడివంతా ప్రతిధ్వనించి ఆమె చెవుల్లో మారుమోగాయి.

ఆమెవైపు చూసి చూసి మళ్ళీ సిగరెట్టు వెలిగించాడు ధీరూ. క్రూరంగా నవ్వాడు.

"నువ్వు ఏ ఐడీ చూపెట్టినా పాస్ పోర్ట్ చూపెట్టినా నిన్నెలాగూ నమ్మను. ఎందుకో నీకు తెలీదా? " అంటూ కర కరమని శబ్దమయ్యేలా పళ్ళునూరాడు. "యూ డేర్ డెవిల్..!"

●●●

# 8

**"యూ డేర్ డెవిల్!" అంటూ కోపంతో పళ్ళు నూరిన** ధీరేంద్ర ఆ తర్వాత కొన్ని క్షణాలు రాతి బొమ్మలా ఉండిపోయాడు.

నమ్మలేని అబద్ధాలు అతి నమ్మకంగా చెపితే అంత అద్భుతంగా అబద్ధం చెప్పగలిగినందుకే ఆశ్చర్యపడే క్షణాలవి!

రాతిబొమ్మకు నెమ్మదిగా ప్రాణం వస్తున్నట్టు చిన్నగా కదులుతూ అనన్య వైపు చురుగ్గా చూస్తూ తనకు తానే చెప్పుకుంటున్నట్టు అన్నాడు ధీరూ..

"డెవిల్.. దెయ్యం.. భూతం.. పిశాచం. ఏ మాటలూ సరిపోవు నీకు. చిత్రా!. నీలాంటి ఘోరమైన ఘాతుకురాలిని వర్ణించడానికి ఏ భాషలోనూ ఏ డిక్షనరీలోనూ మాటలు ఉండవు. ఓ గాడ్! హౌ కెన్ యూ. హౌ కెన్ యూ.. ఈవెన్ థింక్ ఆఫ్ బ్లఫింగ్ సో.. సో.. డామ్... ట్రెచరస్‌లీ?.."

అని సిగరెట్టు పారేసి మరో సిగరెట్టు వెలిగించుకుని నెమ్మదిగా అంతా గుర్తుచేసుకున్నాడు.

"పారిపోయి పారిపోయి ఊటీకి వచ్చావు.. అయితే నిన్ను ట్రేస్ చేసుకుంటూ నేనిక్కడికి వస్తానని నువ్వు ఊహించలేదు. దొరికిపోయావ్! హఠాత్తుగా దొరికిపోయావ్! అయితే దొరికినట్టు ఏ మాత్రం బయటపడకుండా అత్యద్భుతంగా నటించావ్. నీ బ్రెయిన్‌లో ఎన్ని కంప్యూటర్ ప్రోగ్రాంలున్నాయో.. ఏ ఇంజినీరూ ట్రేస్ చెయ్యలేడు. కొత్త ప్రోగ్రాం ఓపెన్ చేశావ్. బ్లఫింగ్ ప్రోగ్రాం.. కొత్త ప్రోగ్రాం.. కొత్త ఐడెంటిటీ.. కొత్త పేరు. కొత్త జాబ్! వీలైతే తిరుగులేని ప్రూఫ్ ఏర్పాటు చేసుకోలేకపోయావ్. ఓకే.. నాకూ శ్రమ తప్పించావ్. సో? వాట్ నౌ? నో ఐడీ.. నో డమ్మీ పాస్ పోర్ట్! యూ ఆర్ ది సేమ్.. సింపుల్.. ట్రెచరస్ .. చిత్ర! ఓకే? ఇక కూల్‌గా గొడవలేకుండా జరగాల్సింది చూద్దాం.." అన్నాడు ధీరూ.

వెంటనే బెడ్ రూంలోకి వెళ్ళి చిన్న బ్రీఫ్ కేస్ తీసుకొచ్చి దాంట్లోంచి కొన్ని కాయితాలు తీసి చకచకా పేజీలు తిరగేసి చూపాడు.

నీట్‌గా టైప్ చేసిన కాయితాలు అవి.

పెన్ తీసి ముందుపెట్టి "కమాన్. టైమ్ వేస్ట్ చెయ్యొద్దు.. ఇదిగో ఇది నీ అఫిడివిట్ సంతకం చేసెయ్యి.. వరసగా అన్ని కాయితాల్లో బాటమ్‌లో సైన్ చేసెయ్యి. చివర్న కూడా సైన్ చేసెయ్యి.. అంతే.. వెళ్ళిపోదాం!.."

కాయితాలేమిటి? సంతకాలేమిటి?

ఆస్తి రాసిమ్మంటున్నాడా? ఏదైనా అమ్మకమా? అగ్రిమెంటా? అఫిడివిట్ ఏమిటి? ఎందుకూ?

అయోమయంగా చూస్తున్న ఆ నవ్వును అసహనంగా చూసి చూసి తల విదిలించాడు ధీరూ.

"చూడూ నేను ముందే చెప్పాను. నిన్ను ఇలాగే హైదరాబాద్ తీసుకుపోవచ్చు. స్పెషల్ బ్రాంచ్‌కి అప్పగించెయ్య వచ్చు. కానీ మధ్యలోనే నువ్వు తిక్కవేషాలు వేస్తావ్. నీ మెదడులో ఏమేం డిజైన్స్ ఉన్నాయో నేనేకాదు.. ఎవ్వరూ ఎస్టిమేట్ చెయ్యలేరు. నీ వెనక ఎంత పెద్ద గ్యాంగ్ ఉందోగాని దాని నెట్‌వర్క్ ఎంత బలమైనదో.. ఊహించడానికే భయమేస్తోంది. షుడ్ బీ సంథింగ్ వెరీ వెరీ పవర్ ఫుల్.. అండ్. రూత్‌లెస్. అయినా అదంతా నాకెందుకూ? నాక్కావలిసింది అన్నయ్య సేఫ్టీ. అన్నయ్య రిలీజ్! క్విక్ రిలీజ్!"

పిచ్చి మానవుడా పిచ్చి మానవుడా అని జాలిపడుతూనే తికమకపడింది అనన్య.

స్పెషల్ బ్రాండ్ అన్నాడేమిటి?

అన్నట్టు. హాస్పిటల్ నుంచి రోగిని రిలీజ్ చేస్తారా? డిశ్చార్జ్ చేస్తారా? రిలీజ్ అంటాడేమిటి?

చిత్ర చెప్పిన వివరాల మేరకు ధీరూ, వీరూల తండ్రి హీరాచంద్ మామూలు మనిషి కాడు కదా! కోట్లకు పడగెత్తిన పారిశ్రామిక వేత్త!

అటువంటి ఫ్యామిలీకి డాక్టర్లకేం కొరత? హాస్పిటల్ అంటే ఏం లెక్క?

కావలిస్తే వీరేంద్రకు జబ్బు నయమయేదాకా ఇంట్లోనే ఒక చిన్న నర్సింగ్ హోమ్ నడుపుకోగలరు!

అయినా హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అవుతారుగాని రిలీజ్ అవడమేమిటి?.. అనుకుంటూండగానే ధీరూ మరింత అసహనంగా ఉరిమి చూస్తూ చెప్పాడు.

"చిత్రా!. అయాం వార్నింగ్ యూ.. అలా ఏమీ తెలీనట్టు అమాయకంగా చూడకు. నీకన్నా.. నీ వెనక శక్తులంటేనే టెర్రర్ పుడుతోంది నాకిప్పుడు. అందుకే నా జాగర్తలో నేనున్నాను. పోలీసులు. స్పెషల్ బ్రాంచ్ ఇన్వెస్టిగేషన్. అదంతా లాంగ్ లాంగ్ ప్రాసెస్! వాళ్ళదేం పోయిందీ? అంతా పద్ధతి ప్రకారమే చేస్తారు.. నిన్నూ లోపల పెడతారు. అన్నయ్యనూ నిన్నూ కలిపే కేసు పెడతారు. ఇంకా నీ గ్యాంగ్ నెట్‌వర్క్ నుంచి ఎవరెవర్ని వెదికి పట్టుకుంటారో.. అంతా పెద్ద కేస్ అవుతుంది. సంవత్సరాలు పట్టొచ్చు. నో... అయ్ డోంట్ వాంట్ ఆల్ దట్!.. అందుకే ఈ అఫిడవిట్! అన్నయ్యకూ మీకూ ఏ సంబంధమూ లేదు.. యూ ట్రాప్డ్ హిమ్! యూ ఫూల్డ్ హిమ్!.. దట్స్ యువర్ అడ్మిషన్.. దాంతో కొంచెం సపోర్ట్ వస్తుంది.. మిగతా అంతా నేను చూసుకుంటాను. ఎంతైనా సరే ఖర్చుపెట్టుకుంటాను! అన్నయ్యను రిలీజ్ చేయించుకుంటాను! దట్సిట్!.."

అనన్య గుండెలొచ్చి కళ్ళలో కొట్టుకుంటున్నట్టయింది, స్పెషల్ బ్రాంచ్, పోలీసులు. ఇన్వెస్టిగేషన్! కేసు, అఫిడవిట్.. ఏమిటిదంతా?

"యూ స్టాపిట్ నౌ!" అని బిగ్గరగా అరిచి ఆపింది అనన్య. "వాట్ ది హెల్ ఈజ్ ఆల్ దిస్? నేను నిజం చెప్పాను. నువ్వు నమ్మకపోతే.. అది నీ ఖర్మ.. నీ రిస్క్! నేను చిత్రకాను.. అనన్యని! నీ దౌర్జన్యం నుంచి దుర్మార్గం నుంచి... కిడ్నాప్ అటెంప్ట్ నుంచి ఒక అమాయకురాలిని కాపాడాలనుకున్న ఓ - టీవీ యాంకర్ అనన్యని నేను. ఏదో మిస్టేక్ వల్ల.. నా ఐడీ కార్డ్ మిస్ అయింది. వేరే ప్రూఫ్‌లు కూడా మిస్ అయ్యాయి.. బట్ దట్స్ నాట్ ది ఎండ్! యూ గాట్ టు టేక్ మై వర్డ్ ఆఫ్ ఆనర్!.. నేను చిత్రని కాను.. అనన్యని!.."

"గ్రేట్ షిట్!" అంటూ దురుసుగా బ్రీఫ్‌కేస్‌లో తడిమి న్యూస్ పేపర్లూ, కటింగ్‌లూ తీసి విదిలించి ముందు పడేశాడు ధీరూ.

"కాదు.. కాదు.. కాదు.. అని బ్లఫ్ చేస్తే సరిపోయిందా? మరి.. ఇవన్నీ.. ఇవన్నీ ఏమిటి లుక్! లుక్! చూడూ. నీకు తెలీనట్టు ఫోజు పెడతావ్! ఏమిటిదంతా?.."

న్యూస్ పేపర్ కటింగ్స్ మీద అనన్య చూపులు షాక్ అవుతూ మెరిశాయి. హెడ్డింగ్‌లూ అక్షరాలూ కనుపాపల్ని కెలికాయి.

"పాస్ పోర్ట్ రాకెట్‌లో హీరాచంద్ పెద కొడుకు వీరేంద్ర"

"నకిలీ పాస్ పోర్ట్ వీసా కుంభకోణంలో హీరాచంద్ ఫ్యామిలీ"

రకరకాల ఫోటోల్లో ముఖ్యమైనవి బాక్స్ కట్టి వేశారు. చాలా ఫోటోల్లో వీరేంద్ర పక్కనే నవ్వుతూ విరగబడుతోంది...చిత్ర!

ముమ్మూర్తులా తనలాగే ఉండే చిత్ర!

అయిదారు గంటలక్రితం ఇదే ఊటీలో.. తనని బ్రతిమిలాడి హెల్ప్ అడిగి వేషాలు మార్చిన చిత్ర! తనలాంటి చిత్ర!

కాళ్ళ కింద భూమి చీలడం అంటే ఏమిటో అప్పుడే తెలిసింది.

పాతాళంలోకి పడిపోతోంది అనన్య.

ఎక్కడా ఆగడం లేదు.

ఎవరో బలంగా పట్టుకున్నారు.

ముఖాన నీళ్ళు జల్లారా? మంటలు కొట్టారా? ఇంకా ఏమౌతుంది?

●●●

అతని చేతుల్లో తనున్నట్టు చాలాసేపటికిగాని తెలియలేదు. బలంగా జెంటిల్‌గా హోల్డ్ చేసిన ఆ చేతుల నుంచి విడిపించుకోవాలని కూడా అనిపించలేదు.

అయితే కాస్సేపటికి -

వంగి చూస్తున్న అతని ముఖం ప్రతి ముఖంలా అనిపించిందో క్షణం. కెవ్వున కేకవేసి దూరంగా పారిపోవాలనిపించింది. శక్తిలేదు. మెల్లమెల్లగా కోలుకుంటూ కనురెప్పలార్చి చూసింది అనన్య.

తీక్షణంగా చూస్తూనే ఉన్నాడు ధీరూ.

కెలికి కెలికి చూస్తూ గుండెలోతుల్ని పెకలించేస్తున్నాడు.

"నో ప్లీజ్!.. బిలీవ్ మీ.. నన్ను నమ్ము.. నేను.. అనన్యని.. చిత్రని కాదు. షి ఈజ్ డిఫరెంట్.." సన్నగా గొణిగింది అనన్య.

అతను నమ్మడం లేదు. నమ్మడు అని స్పష్టంగా తెలుస్తోంది.

ఎలా యాచించాలి ఇక?

న్యూస్ పేపర్ కటింగ్స్‌లో ఉన్న చిత్రను చూస్తుంటే అంతా అర్ధమౌతోంది.

ఒక మాయతెర తొలిగిపోయినట్టు అంతా స్పష్టంగా కనిపిస్తోంది.

దారుణమైన ఘోరమైన మోసం జరిగిపోయింది.

తననూ ధీరూనూ చిత్ర అనే మోసగత్తె అద్భుతంగా బోల్తా కొట్టించి పారిపోయింది.

ఎలా ఎలా దీన్ని ధీరేంద్రకు అర్ధమయేట్టు చెప్పడం?

తేరుకుని లేచి కూచున్నాక తన చాకచక్యాన్నంతా కూడ దీసుకుంది అనన్య. కూల్ అయింది. కామ్‌గా గుండె నిండా ఊపిరి పీల్చుకుంది.

"మిస్టర్ ధీరేంద్రా! నా.. అయ్ నో.. నా అయాం నాట్ కన్‌ఫ్యూషన్!.. చెపుతాను.. అంతా చెపుతాను. యూ ఆర్. ఎ జెంటిల్మన్!.. ప్లీజ్ నన్ను నమ్మండి.. నమ్మడానికి ప్రయత్నించండి!"

అంటూ ఏ మాత్రం ఆవేశం లేకుండా తడబాటు లేకుండా చిత్ర తనకు తారసపడి తడబాటు లేకుండా చిత్ర తనకు తారసపడినప్పటినుంచి జరిగిందంతా వివరంగా చెప్పింది.

నమ్మడానికి సిద్ధమే అన్నట్టు అంతా విన్నాడు ధీరేంద్ర. ఆవేశపడలేదు. కూల్‌గా ఉన్నాడు. కూల్‌గా విన్నాడు -

అయితే అంతా విన్నాక మొదటి మాటకే వచ్చాడు.

"కమాన్! నువ్వో డేర్ డెవిల్‌వి! క్లెవర్ గర్ల్‌వి! నువ్వు చిత్రవి కావు అనుకుందాం. ఎక్స్ - వై - జడ్ - ఎవరో అనుకుందాం. కాని. నా వైపు నుంచి చూస్తే మాత్రం. నిన్ను ఏ మాత్రం నమ్మాల్సిన అవసరమే లేదు.. ఎక్స్ - వై- జెడ్ - ఎవరో ఒక వ్యక్తిగా... నువ్వే ఆలోచించి చూడు మరి.." అంటూ నాణానికి మరో వైపు అన్నట్టు తన వైపు కథ చెప్పుకొచ్చాడు.

హీరాచంద్ పెద్ద కొడుకు వీరేంద్ర చిత్ర అనే అమ్మాయిని ప్రేమించాడా? పెళ్ళి చేసుకోవాలనుకున్నాడా? ఏమో! ఎవ్వరికీ తెలియదు.

హీరాచంద్ ఫ్యామిలీకిగాని బంధుమిత్రులెవరికి గాని నెలరోజుల క్రితం దాకా చిత్ర అనే అమ్మాయి పేరైనా తెలీదు.

హఠాత్తుగా ఒక రోజు ఫెళ్ళున బ్రేక్ అయింది న్యూస్! నకిలీ పాస్ పోర్ట్స్ కుంభకోణం! అందులో పట్టుబడింది చిత్ర అనే ఓ గ్లామర్ గర్ల్!

ఢిల్లీ, బోంబే, హైదరాబాద్‌లలో ఆమెకు ఎన్నెన్నో పరిచయాలు. అన్నిట్లోకి ముఖ్యంగా ఆమెకు హీరాచంద్ పెద్దకొడుకు వీరేంద్రతో సన్నిహిత సంబంధం ఉన్నట్టు ఆధారాలు!

ఎటువంటి సంబంధం ఉన్నట్టు ఆధారాలు!

ఎటువంటి సంబంధం? ఎంతవరకు అనుబంధం?

పోలీసులు స్పెషల్ బ్రాంచ్ ఆఫీసర్లు చేసిన దర్యాప్తులో వీరేంద్ర పేరే చాలా కీలకంగా ప్రస్తావనకు వచ్చింది. వెంటనే వీరేంద్రను అరెస్ట్ చేశారు.

చిత్రతో పరిచయం ఉంది, స్నేహం ఉంది అని ఒప్పుకున్నాడు వీరేంద్ర. మంచి స్నేహితురాలు. చాలా సంస్కారంగల అమ్మాయి.

అప్పుడప్పుడూ ఆమెకు డబ్బు సాయం చేశాను అని అంగీకరించాడు వీరేంద్ర.

అంతకు మించి మరేమీ లేదన్నాడు. ప్రేమలేదు. ప్రణయం లేదు. అక్రమ సంబంధం లేదు. పెళ్ళి చేసుకోవాలనే ఆలోచన లేనేలేదు.

అంతా స్పష్టంగా చెప్పాడు ధీరేంద్ర.

అయితే పోలీసులు నమ్మలేదు.

చిత్రకోసం గాలింపు జరుగుతోంది. చిత్ర దొరికేదాకా చిత్రను విచారించే దాకా పోలీసులు ఎటువంటి నిర్ణయంగాని తీసుకోలేరు. అదీ విషయం.

అయితే వీరేంద్ర ప్రేమలో పడడం, మతిపోవడం, మానసిక వ్యథ.. వ్యాధి నయం కావడానికి చికిత్స పొందుతూ ఉండడం..

అంతా అబద్ధం! కట్టు కథ! చిత్ర అల్లిన పద్మవ్యూహం! అనన్యని బోల్తా కొట్టించి ఇరికించిన దుష్ట వ్యూహం! ఫాల్ గేమ్!

ఇంకా అర్థమైంది అనన్యకి. తను చిత్రకాదు కాబట్టి అర్థమైంది.

అర్థం కావచ్చుకాని నమ్మలేడు ధీరేంద్ర.

ఎలా నమ్ముతాడు?

అతను ఇంతవరకూ అసలు చిత్రను ఎప్పుడూ చూడలేదు. ఫోటోలు మాత్రమే చూశాడు.

చిత్ర చరిత్ర అంతా క్షుణ్ణంగా తెలుసతనికి. దేశ విదేశాలలో ఎన్నెన్నో సందర్భాలలో పోలీసుల్ని, అధికారుల్ని బోల్తాకొట్టి తప్పించుకున్న మాయలేడి చిత్ర!

దొరికిపోయినప్పుడల్లా ఏదో కట్టుకథ చెప్పి తప్పించుకోవడం ఆమెకు కూల్ డ్రింక్ తాగినంత ఈజీ!

అనన్య టీవీ యాంకర్! అనే చిన్న అబద్ధం చెప్పి తప్పుకోవడం ఏ మాత్రం కష్టంకాదు.

"నో! అయ్ కాంట్... బిలీవ్! యూ ఆర్.. యూ!.. కాదని ఎందుకనుకోవాలి? ఎలా అనుకోవాలి?" ధీరేంద్ర ప్రశ్న, కత్తుల చక్రంలా చెవుల్ని కోసేసింది.

అసహాయంగా తటపటాయిస్తూ శూన్యంగా చూస్తూ ఉండిపోయింది అనన్య.

దూసుకొచ్చి మూసుకుపోతున్న చీకటిలో కాలం గడ్డగట్టినట్లు అనిపించింది.

●●●

కిచెన్‌లో ధీరూ స్వయంగా కాఫీ చేశాడు. పొగలు చిమ్మే కాఫీ. దూసుకొస్తున్న చలిగాలిలో వేడి కాఫీ తాగుతుంటే వెచ్చగా వేడిగా అద్భుతంగా ఉంది.

కానీ ఇద్దరి మధ్య.. ఎలా ఉంది? అనుమానాలు అపనమ్మకాలు మంచుగడ్డల కన్న, కఠినంగా గడ్డకట్టాయి.

సోఫాలో అటూ ఇటూ కూచుని ఒకరినొకరు అసహనంగా చూసుకుంటూ తప్పనిసరైనట్టు కాఫీ చప్పరించడం అసందర్భంగా ఉంది.

"నో చిత్రా! నీకు వేరేదారి లేదు. అఫిడవిట్‌లో సైన్ చేసెయ్యి.. వెంటనే బైలుదేరుదాం. హైదరాబాద్‌లో స్పెషల్ బ్రాంచ్‌కి నిన్ను అప్పగించేస్తాను.. దట్స్ ఫైనల్! ప్లీజ్. ప్లీజ్. నో మోర్ గేమ్స్." అంటున్న ధీరేంద్ర వైపు చూసి పేలవంగా నవ్వింది అనన్య.

"లేకుంటే ఇక్కడే అరెస్ట్‌లో ఉంచుతానంటావ్ కిడ్నాప్ అండ్ రాంగ్ ఫుల్ కన్‌ఫైన్‌మెంట్. ఎప్పటికైనా నీకు కనీసం ఐదేండ్ల శిక్ష తప్పదు.

"ఆహా!" అంటూ వెటకారంగా తలవిదిలించాడు ధీరేంద్ర.

"అసలైన జర్నలిస్ట్ లాగా. లాయర్ లాగా చిలకపలుకులు చెపుతున్నావ్!. సరేనండీ మేడం.. శిక్ష తప్పించుకోవాలంటే. నేనేం చెయ్యాలో. అదీ మీరే చెప్పండి!.." అన్నాడు బుద్ధిగా అడుగుతున్నట్టు,

"వెరీ సింపుల్!" అంది అనన్య సింపుల్‌గానే. "నేను చిత్రను కాను వేరే అమ్మాయిని. అనన్యని. అని నువ్వు నమ్మకున్నా.. కనీసం నేను చెప్పిన మాటలో నిజం ఉందేమో అని అనుమానించాలి!"

"ఆహా! అనుమానాలకేం? చాలా చాలా ఉన్నాయ్! నీ ఫోన్‌లో సిమ్ లేదు. నీ దగ్గర ఎటువంటి ఐడీ లేదు.. పాస్ పోర్ట్ లేదు.. కనీసం నకిలీ పాస్‌పోర్ట్ అయినా లేదు." అంటూ టక్కున ఆగి చురుగ్గా చూశాడు ధీరేంద్ర.. "ఎస్!.. ఇది ఇంకో పాయింటు.. అనన్య పేరుతో ఒక ఫేక్ ఐడెంటిటీ సృష్టించుకోవాలని కూడా నువ్వు ముందుగా అనుకోలేదు. కేవలం నేను ఎదురయ్యాక వచ్చిన ఆలోచన అది! ఇక్కడ.. ఊటీలో. పబ్లిక్ రోడ్ మీద నేను ఎదురయేసరికి.. హఠాత్తుగా నిన్ను పట్టేసేసరికి. కార్నర్ అయిపోయావ్. తర్వాత. బహుశా మనం రెస్టారెంట్‌లో కూచున్నప్పుడో ఎప్పుడో ఎలాగోగాని. నీ అసలైన ఐడీ వగైరాలు అవతల పడేసి ఉంటావ్! ఊటీలో నువ్వు ఏ పేరు మీద తిరుగుతున్నావో నాకెలా తెలుసు? అనన్య పేరుతో మాత్రం తిరగడంలేదు. అందుకే ఆధారాలు లేవు. అందుకే నీ బ్యాగ్ ఖాళీ. దటీజ్ ది ట్రూత్!"

"హ! స్టాపిట్" అని అసహనంగా అరిచింది అనన్య. అసహాయంగా తల వెనక్కి వాల్చింది. అప్పుడు ఒకే ఒక్క ఆలోచన మెరిసింది.

"ఓకే మిస్టర్ ధీరేంద్రా! నీవైపు నుంచి చూస్తే అలాగే అనిపించవచ్చు. అనిపిస్తుంది. ఓకే! కాని.. నీ అనుమానాల్లోనే ఒక సమాధానం కూడా ఉంది. ఊటీలో అనన్య పేరుతో ఒక అమ్మాయి ఉంటున్నట్టు హోటెల్ రిజిస్టర్‌లో చూస్తే.. అప్పుడైనా ఒప్పుకుంటావా?"

"వాట్ డూ యూ మీన్?"

"అయ్ మీన్ .. అనన్య అనే పేరు ఒక కట్టు కథ కాదు.. కమాన్ వెంటనే మనం లేక్ వ్యూ హోటెల్‌కి వెళదాం. అక్కడ రిసెప్షనిస్టూ స్టాఫూ కూడా నన్ను, గుర్తుపడతారు. హోటెల్ రిజిస్టర్‌లో నా పేరు ఉంది. రూం నంబర్ టూ నాట్ త్రీ.. ఎస్! ఓ టీవీ టీమ్‌తో అక్కడే దిగాను.. ఆ రూం నా పేరు మీదే బుక్ అయింది.. టీమ్ మెంబర్స్ అందరూ వెళ్ళిపోయారు. నేను మాత్రం పర్సనల్ హాలిడే ఎంజాయ్ చేస్తూ. ఉండిపోయాను. టూనాట్ త్రీ రూం. ఇంకా నా పేరు మీదే ఉంది. కమాన్ లెటజ్ గో.. యూకెన్ చెక్ ఎవ్రీథింగ్.. ఎస్!"

ఆమె మాటల్లో నిజాయితీ కాదనలేనట్లు సానుభూతిగా చూశాడు ధీరేంద్ర.

"ఓకేగాని .. ఎట్టి పరిస్థితిలోనూ నిన్ను మాత్రం నమ్మలేను. అస్సలు నమ్మలేను.. అస్సలు నమ్మలేను.. నిన్ను హోటెల్ కి తీసుకెళితే .. అక్కడే సీన్ క్రియేట్ చేస్తావో?... ఇంకే బ్లఫ్ చేస్తావో చెప్పలేను. వెరీ సారీ.."

"బట్ యూ హేవ్ టు బిలీవ్ మీ.. వెరిఫై చేసేదాకా అయినా నువ్వు నను నమ్మాలి.. నా వెర్షన్ అబద్ధం కాదేమో అన్న అనుమానమైనా నీకు రావాలి. అయ్ మీన్ బెనిఫిట్ ఆఫ్ డౌట్!" అనన్య గొంతులో అసహాయమైన ఆవేదన ప్రతిధ్వనించింది.

"బెనిఫిట్ ఆఫ్ డౌట్? ఊఁ?" అంటూ సన్నగా గొణుక్కుని చివుక్కున లేచి నిలబడ్డాడు ధీరేంద్ర.

"ఓకే. ఓకే. అయ్ విల్ గివ్ యూ దట్!. వెరిఫై చేసుకోవడం కరెక్టే! కాని. నువ్వొద్దు. నువ్వు రావద్దు. నేనే వెళ్ళొస్తాను. అంతా వెరిఫై చేసుకొస్తాను.. ఓకే గంటన్నర పైనే పడుతుంది నేను వెళ్ళిరావటానికి. రెండు గంటలైనా పట్టొచ్చు. అంతవరకూ. యూ సిట్ టైట్ హియర్!" అంటూ విసురు కారు తాళాలు అందుకుని గుమ్మంలోకి వెళ్ళాడు.

ఆలోచించే వ్యవధి లేకుండా చూస్తూ ఉండిపోయింది అనన్య.

"జంబో!" అని కేకపెట్టాడు ధీరేంద్ర. "జంబో - జంబో" అని మళ్ళీ అతను కేకలు వేస్తుండగానే ఆ కేకల ప్రతిధ్వనుల్లాగా పరమ భీకరమైన అరుపులు వినిపించాయి.

చీకటిని చీల్చుకుంటూ వచ్చిన అరుపులతో బాటు క్షణాల్లో సింహంలాంటి ఒక కుక్క ప్రత్యక్షమైంది. ఆల్సేషియన్!

పదిమంది దృఢకాయుల్ని అయినా ఉన్న పళాన చీల్చి పారేయగల క్రూరత్వం దాని ముఖంలో ఉట్టిపడుతోంది.

"వాచ్ హర్!" అని దానికి ఆర్డర్ వేశాడు ధీరేంద్ర. "వాచ్ హర్!" అని స్పష్టంగా చెప్పేసి తను వెళ్ళి సర్రున స్కార్పియో స్టార్ట్ చేశాడు.

క్షణాల్లో దూసుకుపోయి మాయమైంది స్కార్పియో.

గుమ్మంలో అడ్డంగా కూచుని నాలుక వ్రేళ్ళాడేసి గసపోస్తూ అనన్య వైపు ఎగాదిగా చూస్తోంది జంబో.

దాని కళ్ళు కత్తి మెరుపుల్లా చూస్తున్నాయి.

●●●

## 9

**కదిలితే ఖబడ్దార్!**

అన్నట్టు కరుగ్గా చురుగ్గా చూస్తోంది జంబో

ఆ నాలుకే పెద్ద కత్తిలా ఉంది. తల ఎగరేసి గస పోసి చూస్తున్నప్పుడు మెరిసిన కోరపళ్ళు చాకుల్లా బాకుల్లా ఉన్నాయి.

కరుస్తా చీరేస్తా చీల్చేస్తా చంపేస్తా!

అని భయంకరంగా హెచ్చరిస్తోంది.

నిర్దాక్షిణ్యంగా మనిషిని నిలుచున్నట్టే చంపెయ్యడానికి ఖచ్చితమైన శిక్షణ తీసుకున్న జాగిలం అది.

గుండెలవిసి పోతుండగా ఒక్కొక్క అడుగూ వెనక్కి నడిచింది అనన్య. జంబో మీద నుంచి చూపు తిప్పకుండానే సోఫాలో కూలబడి పోయింది.

జంబో రెండడుగులు ముందుకు వచ్చి తనూ కూచునేసింది. కాళ్ళ మీద తల ఆన్చుకుంది గాని చూపు తిప్పడం లేదు.

దాన్ని దాటి గుమ్మం దాకా వెళ్ళడం అసాధ్యం. ప్రాణాలకే అపాయం.

అనన్య మెదడు జీరో అయింది.

తప్పించు కోవడం అంత సులభం అని ఇంతసేపట్లోనూ ఎప్పుడూ అనిపించలేదు.

ఇప్పుడూ అనిపించడంలేదు.

ధీరేంద్ర లాంటి మొండి మనిషి ఏదీ అంత సులభంగా వదిలిపెట్టడు.

వ్యూహం ఏదో పకడ్బందీగా వేస్తాడు. అతను వదిలి పెడితే గాని తను వెళ్ళడం అసాధ్యం

ఈ కుక్కను తప్పించుకుని వెళ్ళినా ఊటీ దాటి వెళ్ళడం అసలు సాధ్యకాదు. అంత దాకా ఎందుకూ? కొండ కోనల్లో అడవుల మధ్య గుట్ట మీద ఉన్న ఈ బంగళా నుంచి ఇంత చీకట్లో బైట పడినా దారి వెతుక్కుంటూ ఊళ్ళోకి వెళ్ళడమే కుదరదు. పలకరించే దిక్కే ఉండదు. బంగళా నుంచి బైట పడి రోడ్డెక్కే లోపలే ధీరేంద్ర ఎదురవడం ఖాయం. అడ్డదారిలో వెళ్ళడమా? ఎటునుంచి ఎటు? అసాధ్యాల్లోకి అసాధ్యం.

నీకు నేనూ నాకు నువ్వూ అన్నట్టు ఈ కుక్కతో గడపడమే ఉత్తమం.

ఇలా అనుకుంటూ అనన్య కుక్క వైపు చూస్తూ చిరునవ్వు నవ్వింది. అది నవ్వలేదు. తలపైకీ కిందికీ కదిపి ఇంకా క్రూరంగా చూసింది.

జంబో అనే పేరు చాలా బాగుంది. ఇంతకీ ఇది ఆడా? మగా?

సాటి ఆడదాన్ని కాస్త కనికరించు అని ప్రాధేయపడితే లాభం ఉంటుందా?

జంబోకి కొంచమైనా మనిషి భాష వచ్చి ఉంటుంది. అయితే అది ధీరేంద్ర కమాండ్స్‌ని మాత్రమే పాటిస్తుంది.

కుక్క భాష తనకి రాదు. ప్రయత్నించి లాభం ఉండదు.

జంబో వైపు చూస్తూ చూస్తూ ఉండగా అనన్యకి గబుక్కున ఏదో కవిత్వం గుర్తొచ్చింది.

వాన కురిసే రాత్రి ఇంట్లో నేనుంటే నా కుక్క మాత్రమే నాతో ఉంది. మేమిద్దరం ఎటూ వెళ్ళలేం. ఇద్దరికీ ఏమీ తోచడం లేదు. అది నా కళ్ళలోకి చూస్తూ ఏదో చెప్పబోతుంది. ఒకరి భాష ఒకరికి రాదు. ఇద్దరిలో జీవ శక్తి ఉంది. ప్రాణం ఉంది. కుక్క ప్రాణం మనిషి ప్రాణం వేరు వేరా? రెండూ ఒకటే కాదా?

రష్యన్ మహా కవి ఇవాన్ తుర్జెనీవ్ రాసిన కవిత అది..

నవ్వుకుంటూ లేచి నిలబడింది అనన్య. జంబో కూడా వెంటనే లేచి తీక్షణంగా చూసింది.

ముందుకు వెళ్ళే కదా సమస్య అనుకుంటూ అనన్య వెనక్కి వెనక్కి నడుసూ "ఫ్రెండ్స్" అంది జంబో కేసి చెయ్యి సాచుతూ.

జంబోకి అర్థమైంది చిన్నగా తోక ఆడించింది. అంతలోనే సీరియస్ అయింది. చలనం లేకుండా ఆగి చూస్తోంది.

"ఓకే.. ఫ్రెండ్స్!. అయాం నాట్ గోయింగ్.." అని దానికి చెప్పేసి ఇంట్లోకి నడిచింది అనన్య. ఇల్లు ఎలా ఉందో చూడాలని సహజ కుతూహలం..

●●●

ఇల్లు ఓ అద్భుతం.

బైట నుంచి ఎంత గంభీరంగా ఉందో లోపల అంత అందంగా ఉంది. ఖరీదైన మోడర్న్ ఫర్నిచర్.

కిచెన్‌లో అన్ని హంగులూ ఉన్నాయి. రెండు బెడ్ రూంలు ఆహ్లాదకరంగా ఉన్నాయి.

మాస్టర్ బెడ్‌రూం మరీ విలాసవంతంగా ఉంది. రూం హీటర్ అమర్చి ఉన్నా ఓ మూల ఫైర్ ప్లేస్ కూడా ఉంది. వెరీ వెరీ రొమాంటిక్.

హాల్లోంచి పైకి మెట్లున్నాయి. వెదుక్కుని స్విచ్‌లు వేసుకుంటూ పైకి వెళ్ళింది అనన్య.

ఒక హాలు. ఒక బెడ్ రూం. హాలు నుంచి బైటకి బెడ్‌రూం. తలుపు తెరవగానే జివ్వునలాగి కొట్టింది చలిగాలి.

బైట చీకటిలో పొగమంచు తెరల అవతల ప్రకృతి దృశ్యం అంతా మసక మసక. బెడ్ రూంలో లైటు వెయ్యగానే వేరే లోకం లోకి వచ్చానా అనిపించింది. పాల నురగలాంటి షీట్లు పరిచిన కింగ్ సైజ్ బెడ్. ఊదా రంగు కర్టెన్లు. పాలరాతి క్యూపిడ్ శిల్పం. గిల్ట్ ఫ్రేంలో రవి వర్మ చిత్రాలు. సుతి మెత్తటి వెలుగు పంచుతున్న షాండిలేర్.

కళ్ళు నిండే క్షణాలలోనే కాళ్ళు తేలిపోయాయి.

ఎప్పటి నుంచి అలిసి పోయింది శరీరం!

మనసూ మెదడూ ఎలా ఉన్నాయి? ఏమైపోతున్నాయి?

మేజిక్ ఏదో పనిచేస్తున్నట్టు బెడ్ మీద వాలి పోయింది అనన్య.

గుండె చప్పుడు చెవుల్లో కొట్టుకుంటోంది.

మధ్యాహ్నం పైన రెస్టారెంట్‌లో ధీరేంద్రను కలుసుకున్నప్పటి నుంచి మొదలైన టెన్షన్. కిడ్నాప్ అయిన సస్పెన్స్‌తో మెలికలు తిరిగిన టెన్షన్. చిత్ర చేసిన మోసంతో దారుణంగా అధఃపాతాళానికి క్రుంగి పోయిన టెన్షన్.

ఇప్పుడేమైంది? ఏమౌతోంది?

శరీరం వాలడంతో మెదడు మెల్లమెల్లగా రిలాక్స్ అవుతోంది. మెల్లమెల్లగా తెరలు కదులుతున్నాయి.

పొగమంచు కరుగుతోంది.

దృశ్యం తేట పడుతోంది.

టెన్షన్ తగ్గుతోంది. పరిస్థితి ఇంకా స్పష్టంగా అర్ధమౌతోంది.

కింద నుంచి జంబో చిన్నగా మూలిగిన శబ్దం ... అటూ ఇటూ కదిలిన శబ్దం.. సుతిమెత్తగా వినిపిస్తోంది.

కింద తను కనిపించక పోవడంతో జంబో మేడమీదకి వచ్చేస్తుందా? "వాచ్ హర్!"

అంటే ఎలా వాచ్ చెయ్యమని ఎంతవరకు వాచ్ చెయ్యమని అర్ధం?

హఠాత్తుగా జంబో వచ్చి ఎటాక్ చేస్తే ఏం చెయ్యాలో తోచదు. కాని తను పిచ్చి వేషాలు వెయ్యకపోతే వారి పారిపోయే ప్రయత్నం చెయ్యకపోతే.. అది ఎటాక్ చెయ్యదని ఖచ్చితంగా తెలుస్తోంది.

భయాలు తగ్గుతుండగా అనన్యకు ఇంకా ధైర్యం వచ్చింది. పులికే బయపడని అనన్య కుక్కకు భయపడుతుందా?

డిసిప్లిన్‌కి కట్టుబడాలి కాబట్టి కట్టుబడింది. అంతే. అయినా ఇప్పుడు మునిగిందేమీ లేదు. పైగా చిక్కుముడి విడిపోయే పరిస్థితే వచ్చింది. విశ్రాంతిగా కళ్ళుమూసుకుని అంతా ఎనలైజ్ చేసుకుంది అనన్య. నో. బొత్తిగా టెన్షన్ అవసరంలేదు. కాస్సేపట్లో అంతా క్లియర్ అయిపోతుంది. తను హాయిగా బైట పడుతుంది. ఎలాగంటే..

●●●

ధీరేంద్రకు నిజం తెలుస్తుంది.

హోటల్ లేక్ వ్యూలో కౌంటర్‌లో వాకబు చేసినా అసలు విషయం తెలిసిపోతుంది.

'ఓ' టీవీ యాంకర్ అనన్య పేరు మీదే రూం ఉంది. అనన్య మధ్యాహ్నం తర్వాత బైటకెళ్ళింది. ఇంకా తిరిగి రాలేదు.

ధీరేంద్రకు తల తిరుగుతుంది. పొరబాటు ఎలా జరిగిందో అర్ధమౌతుంది. పశ్చాత్తాపంతో తిరిగొస్తాడు. వచ్చీ రాగానే తనని క్షమించమని ప్రాధేయపడతాడు.

రిలాక్స్‌డ్‌గా పడుకుని నవ్వుకుంది అనన్య. టెన్షనా? ఇంకెక్కడ టెన్షన్? ఎందుకూ టెన్షన్?

ఆ టెన్షన్ ఏదో ఇక ధీరేంద్ర పడతాడు.

బోల్తా కొట్టించి పారిపోయిన చిత్రను పట్టుకోవడానికి మళ్ళీ వ్యూహం వేసుకోవాలి. ఈలోగా తనకు సారీ చెప్పి జాగ్రత్తగా హోటల్ దగ్గర దిగబెట్టాలి.

ఒక్కపూటలో కథ సైలెంట్‌గా ఎన్ని మలుపులు తిరిగింది! ఊటీ ఘాట్ రోడ్‌లా ఎన్ని మలుపులు తిరిగింది!

రాగానే ధీరేంద్ర ఏం మాట్లాడతాడో ఎలా క్షమాపణ చెబుతాడో తలుచుకుంటే నవ్వొచ్చింది అనన్యకి.

"సారీ.. వెరీ వెరీ సారీ. నేను పొరపడ్డాను.. నువ్వు చెబుతున్నా వినిపించుకోలేదు. నిన్ను కిడ్నాప్ చేసి ఘోరమైన తప్పు చేశాను. ప్లీజ్.. ప్లీజ్.. ఎక్స్యూజ్ మీ.."

అని అతనంటే.. తనేమంటుంది అప్పుడు? ఏమైనా అనవచ్చు. చాలా ఉదారంగా గంభీరంగా క్షమిచెయ్యొచ్చు.

"మిస్టర్ ధీరేంద్రా!.. నౌ. అయ్ కెన్ రియలీ టేక్ యూ టు ది పోలీస్.. కిడ్నాప్ కేసు తప్పకుండా పెట్టొచ్చు.. అక్రమంగా నిర్భంధించి నన్ను మానసికంగా చిత్రహింసలు పెట్టావ్.. హెరాస్ చేశావ్!. కానీ.. అఫ్‌కోర్స్.. ఏదో క్రిమినల్ ఇంటెన్షన్ తో కాక.. కేవలం మీ అన్నయ్యను రెస్క్యూ చేసుకోవడానికే ఇదంతా చేశాడు కాబట్టి.. నిన్ను.. ఎక్స్యూజ్ చేస్తున్నాను. పైగా విపరీతంగా పశ్చాత్తాప పడుతూ సారీ చెప్పావు కాబట్టి.. క్షమించేస్తున్నాను.. ఇట్స్ ఓకే.."

"థేంక్యూ.. థేంక్యూ అనన్యా.. నేను రఫ్‌గా మాట్లాడిందంతా కూడా.. నువ్వు.. మనసులో పెట్టుకో కూడదు. అయాం రియలీ వెరీ సారీ. అలా మాట్లాడినందుకూ నిన్ను బెదిరించినందుకూ.. సిగ్గుపడుతున్నాను.."

"ఇట్స్ ఓకే.. కానీ భవిష్యత్తులో ఇలా ఎప్పుడూ ఎవర్తోనూ తొందరపడి ప్రాబ్లమ్స్ క్రియేట్ చెయ్యవనుకుంటాను.."

"ఇంకానా?.. నో.. జన్మలో ఇలా బిహేవ్ చెయ్యను.."

క్షమాపణల పర్వం ముగిశాక అతనితో కొంచెం సున్నితంగా మాట్లాడుతుంది అనన్య..

"కిడ్నాప్ వ్యవహారం పక్కన పెడితే. మిస్టర్ ధీరేంద్రా.. నువ్వు నాతో పర్సనల్‌గా జెంటిల్‌గానే బిహేవ్ చేశావని చెప్పాలి.. దటీజ్ ది పాజిటివ్ సైడ్ ఇన్ యూ.. డూ కీపిటప్!.."

"ఓ..థేంక్యూ.. దట్స్ నైస్ .. థేంక్యూ.." అంటాడు ధీరేంద్ర చెమర్చిన కళ్ళతో.

ఇలా ఊహించుకుంటూ ఉండగా అనన్యకు మగత నిద్ర కమ్మేసింది. నిద్రా? కలా? మెలకువా? కలా?

ఉన్నట్టుండి ఎక్కడికో వెళ్ళిపోయింది. ఎవరిదో గొంతు వినిపించింది. దారి కాని దారులలో పరుగెత్తి పోయింది మనస్సు..

●●●

హేయ్ అనన్యా! అనన్యా! ఎక్కడున్నావ్? ఏమై పోయావ్? ఎక్కణ్నుంచి ఎక్కడికి వచ్చి ఎలా చిక్కుకు పోయావ్?

హైదరాబాద్ సిటి.. ఓ టీవీ ఆఫీస్.. స్టూడియో లైట్లు జిగేల్.. స్టార్ట్.. యాక్షన్.. ఇంటర్వ్యూ.. షూటౌట్.. ఫోన్ కాల్స్.. ఫాన్ కాల్స్..

ఏవీ? ఏమైపోయాయి?

ఊటీ మబ్బుల కింద ఉదా నీలినీడలలో స్నేహం ప్రేమ ప్రణయం శృంగారం యౌవన మాధుర్యం.. జీవిత సాఫల్యం..

ఏవీ ఎక్కడా?

నీ కళ్ళలో కళ్ళు పెట్టి స్వప్నాల్ని రెచ్చగొట్టి హెచ్చు వేసి చిచ్చు పెట్టి నవ్వే సుందరుడు గంధర్వుడు రాకుమారుడు.. ఏడీ.. ఎక్కడా?

ఎక్కడో గుర్రాలు పరుగెడుతున్నాయి. అవి కోరికలా?

ఏవో అద్దాలు పగిలిపోతున్నాయి. ఆశాభంగాలా?

మంచు కరిగిపోతోంది. సముద్రం వెనక్కి తగ్గుతోంది. పువ్వులు రేకులు రాల్చేస్తున్నాయి. పాప ఏడుస్తోంది. చంద్రుడు ముక్కలైపోయాడు.

చెట్లు కూలిపోతున్నాయి.

మంచు కరిగి పోతోంది

కను రెప్పకూ కనుపాపకూ మధ్య సన్నటి దారం లాగుతున్నారు ఎవరో..

అనన్యా ఏమైపోతున్నావ్.. అనన్యా..?

●●●

ఏదో జరజరమని పాకింది.

భీకరమైన అరుపు. ఏమిటది?

దడదడమని శబ్దాలేమిటి?

భళ్ళున తెరుచుకుంది తలుపు. గుండె ఝల్లుమంది.

అనన్య కనురెప్పలు బలవంతాన విచ్చుకున్నాయి.

ఫ్రేం కట్టిన బొమ్మలాగా ద్వారంలో నిలబడ్డాడు ధీరేంద్ర. అతని ఆకారం నీడగా మాత్రమే కనిపించింది.

ముఖం తెలియదు. ఎక్స్‌ప్రెషన్ తెలియదు.

అనన్యలో ఉత్సాహం చిమ్ముకొచ్చింది.

ఎస్.దీసీజ్ ది టర్నింగ్ పాయింట్.

నిజమేమిటో తేలిపోయింది. అతనింక పశ్చాత్తాపం డైలాగ్స్ మొదలు పెడతాడు అనుకుంటుండగా..

"ఓ..యూ ఆర్ రిలాక్సింగ్..!" అన్నాడు ధీరేంద్ర. ఆ గొంతులో వెటకారం ధ్వనించినందుకు ఆశ్చర్యపోయింది అనన్య.

వాటీజ్ రాంగ్? వాటీజ్ రాంగ్?

అవతల స్విచ్ ఆన్ చేశాడు. నీడ బదులు మనిషి కనిపించాడు.

"ఓహ్ కమాన్" అంటూ లేచి కూచుంది అనన్య. "మిస్టర్ ధీరేంద్రా.. పాపం నువ్వు చాలా అలిసిపోయి ఉండాలి. ఇట్స్ ఓకే.. సో?.. నీ డౌట్స్ క్లియర్ అయినట్టేగా?.. అయాం నాట్ చిత్ర.. అయాం.. అనన్య.. రైట్?"

"యూ.. డెవిల్!" అంటూ అడుగులో అడుగేసి ముందుకు వచ్చాడు ధీరేంద్ర. "ఐ సెడ్ నో గేమ్స్ అయినా నువ్వింకా గేమ్ ఆడావు! ఆడుతున్నావు! ఐ డోంట్ నో.. ఐ డోంట్ నో. నిన్నేం చెయ్యాలో తెలీడం లేదు.. ఏం చేసినా పాపంలేదు.."

"వాట్? వాట్?"

"హోటల్ లేక్ వ్యూ లో అంతా ఎంక్వైర్ చేశాను. అనన్య అనే టీవీ యాంకర్ అక్కడ రూంలో స్టే చేసిన మాట నిజమే. కాని. ఇవ్వాళ మధ్యాహ్నమే రూం వెకేట్ చేసి వెళ్ళిపోయింది. రూం నుంచి లగేజీ మోసుకెళ్ళిన బోయ్స్ కూడా సాక్ష్యం. చెకౌట్ అయి వెళ్ళి పోయింది అనన్య.."

"నో..నో.. ఇంపాజిబుల్!.. చిత్ర రూంలోనే ఉంటానంది కానీ.." అంటూ అనన్య కళ్ళు తేలేసింది. "నో.. నో. ఐ మీన్. నేను నీ దగ్గరికి వచ్చేసరికి అటు తను వెళ్ళి పోతానంది. ఊటీ దిగి పోతానంది. కానీ నా లగేజీ ఎందుకు తీసుకువెళుతుందీ?" అంటుండగానే చిత్ర చేసిన మోసం తాలూకు పూర్తి వివరం అర్థమైపోయింది.

అంతా ఆలోచించి చాకచక్యంగా పరారైంది చిత్ర.

అనన్య లాగే ఉండే చిత్ర. అనన్యే హోటల్ నుంచి చెకౌట్ అయినట్టు ఎవరికైనా అనిపించేలా ప్రతి చిన్న విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటూ వెళ్ళిపోయింది.

ఉరిమి చూస్తున్నాడు ధీరేంద్ర. కోపం కసి క్రౌర్యం దాగడం లేదు.

"అంతే కాదు మిస్ డేర్ డెవిల్!.. అనన్య ఊటీలో తిరగడానికి అద్దెకు తీసుకున్న టూవీలర్‌ని కూడా జాగ్రత్తగా రిటర్న్ చేసి మరీ వెళ్ళింది. అది కూడా వాకబు చేసి మరీ కనుక్కున్నాను. తేలిపోయింది. అనన్య అనే యాంకర్ ఊటీకి వచ్చి వెళ్ళిపోయిన మాట నిజమే. ఆ కాస్త సమాచారం నీకు ఎలాగో తెలిసింది. దాన్ని ఉపయోగించుకుని నువ్వు బ్లఫ్ చేశావ్. చేస్తున్నావ్!. ఇంతకీ అనన్య నీలాగే ఉంటుందా? ఉంటే ఉండనివ్వు. నాకేంటి? నువ్వు మాత్రం అనన్యవి కావు. చిత్రవే! చిత్ర ది గ్రేట్ చీట్!"

గుండెలో గునపాలు దిగాయి. దిగుతున్నాయి.

దారులు మూసుకుపోయాయి.

పడిపోతోంది. పడిపోతోంది.

ఇంకా ఆశ ఏముంది? ధీరేంద్రను ఇంకా ఎలా నమ్మించాలి? అతనికి ఏమూలో సందేహం ఉన్నా సానుభూతి ఉన్నా అంతా తుడిచి పెట్టుకుపోయింది.

ఒకే ఒక చిన్న మెరుపు మెరిసింది.

అతను ఒప్పుకోడు అనిపించినా ప్రయత్నించడం తప్పదు కాబట్టి అడిగింది..

"ఓకే మిస్టర్ ధీరేంద్రా!.. యూ ఆర్ ఎ జెంటిల్మన్. అనన్య అని ఒక యాంకర్ ఉందనీ ఆమె ఊటీ వచ్చి వెళ్ళిందనీ. పోనీ. అంతవరకైనా ఋజువైంది కదా! ఒక్క చిన్న లాస్ట్ ఛాన్స్ ఇవ్వు. ఇప్పటికీ మించిపోయింది లేదు.. నిజం నిప్పులాంటిది. బైటపడక తప్పదు.."

"ఇంకో ట్రిక్కా?" అన్నాడు ధీరేంద్ర ఇంకా వెటకారంగా.

"లాస్ట్ ఛాన్స్.." అంది అనన్య నిశ్చలంగా.. "ఇది తప్పదు.. తప్పితే.. నన్ను నమ్మొద్దు."

"వాటీజిట్?"

"హైదరాబాద్‌లో ఓ టీవీ ఆఫీస్‌కి ఫోన్ చెయ్యి.. నిజమేమిటో తేలిపోతుంది.."

"ఇదివరకే చెప్పాను.. ఈ ట్రిక్స్ వద్దు.. అక్కడ నీ వ్యూహంలో భాగం అయిన ఎవరికో ఇదో సిగ్నల్ కావచ్చు. నా నంబర్ నుంచి కాల్ రిసీవ్ అయితే." అంటూ ఏవేవో ఊహించుకుని తల అడ్డం తిప్పాడు "నాకెందుకు రిస్క్?"

"నేను అనన్యనని అఫిషియల్‌గా రుజువయ్యే మార్గం అదొక్కటే. ఊటీనుంచి వెళ్ళిపోయిన అనన్య. ఆఫీస్‌తో కాంటాక్ట్‌లో ఉందేమో తెలుస్తుంది. నేను పదిరోజులు లీవ్ పెట్టాను. ఆ సంగతి కన్ఫర్మ్ అవుతుంది."

"నాన్సెన్స్. అంతా కన్ఫ్యూజింగ్!. అయినా. ఓకే లెట్ మీ ట్రై." అన్నాడు ధీరేంద్ర తెగింపుగా. "నంబరేంటి?"

చెప్పింది. డయల్ చేశాడు.

అవతల రిసీవ్ చేసుకోగానే అడిగాడు. "యాంకర్ అనన్య గారితో అర్జెంట్‌గా మాట్లాడాలండీ. ఆమె నంబర్ దొరకడం లేదు.. ఆమె అంకుల్ ఒకరు హాస్పిటల్‌లో ఉన్నారు.. సీరియస్!"

అవతల ఏం చెప్పారో స్పష్టంగా వినిపించలేదు. కొద్ది క్షణాలకు కాల్ కట్ చేశాడు ధీరేంద్ర. అతని ముఖం ఇంకా భీకరంగా జేవురించింది.

"వాట్? ఏమైంది?" అంది అనన్య బెదిరిపోతూ.

"లాంగ్ లీవ్‌లో ఉన్న అనన్య ఇవాళ మధ్యాహ్నం ఫోన్ చేసి జాబ్‌కు రిజైన్ చేస్తున్నానని చెప్పింది. వ్యక్తిగత కారణాల వల్ల ఫోన్‌లో అందుబాటులో ఉండనని కూడా చెప్పింది.. వాళ్ళకూ అర్థం కావడం లేదు... ఫోన్ ట్రై చేశారు... ఏమొస్తోంది? స్విచాఫ్!"

అనన్య చెవుల్లో సముద్ర ఘోష ప్రతిధ్వనించింది.

స్విచాఫ్! స్విచాఫ్!!

●●●

## 10

**అనన్య మెదడు స్విచాఫ్ అయిపోయింది.** కెరటాలు లేని సముద్రంలా అయిపోయింది.

ధీరేంద్ర మొహంలోకి చూడాలన్నా భయమనిపించింది.

ఏమీలేదు. ఇంకేమీ లేదు. ఎదురు చెప్పడానికి లేదు. కాదనడానికి లేదు. తను చిత్రనే అని ఒప్పుకుని తీరాలి.

ఐడియా మీద ఐడియాలో ఉచ్చునుంచి బైటపడాలని ప్రయత్నించిన కొద్దీ ఉచ్చు బిగిసిందేగానీ సడలడం లేదు.

"ఐ పిటీయూ!" అన్నాడు ధీరేంద్ర పేలవంగా నవ్వుతూ.." కొత్త ఐడియా కోసం ఆలోచించి అలిసిపోకు - జస్ట్ రిలాక్స్!.. ఇక నేను చూసుకుంటాను.. టేక్ రెస్ట్!" అనేసి విసురుగా వెనుదిరిగి వెళ్ళిపోయాడు ధీరేంద్ర.

అతను మెట్లు దిగుతున్న శబ్దం అనన్య గుండెలో గునపాలు దించింది. ఘోరమైన సన్నివేశాలలో తీవ్రమైన మాటలు అవసరం లేదు. మామూలు మాటలే మంటలు పుట్టిస్తాయి.

"నేను చూసుకుంటాను" అన్న ధీరేంద్రమాట బ్లేడు అంచులా అనన్య మనస్సుని చీరేసింది.

ఏం చూసుకుంటాడిక? ఏం చేస్తాడు?

చిత్రను కానని అతన్ని నవ్వించడానికి చేసిన ప్రతి ప్రయత్నం అతన్ని తీవ్రంగా కవ్వించింది.

అతని సహనాన్ని ఇంకా ఇంకా పరీక్షించినట్టే అయింది. రౌడీమూకల్ని వెంటేసుకుని అల్లరి చేసే ధీరేంద్ర, కోపం వస్తే యాసిడ్ దాడిచేసి బీభత్సం చెయ్యగల ధీరేంద్ర.. ఇంతవరకూ తనతో చాలాచాలా మర్యాదగా ఉన్నట్టే లెక్క.

ఇంకా నమ్మాల్సిన అవసరం అతనికి లేదు. ఇంకా అతన్ని నమ్మించాల్సిన అవసరం తనకైతే ఉంది. కానీ దారిలేదు. వేరే ఐడియా లేదు.

"నేను చూసుకుంటాను" అనే మామూలు మాటతో మంటపెట్టి వెళ్ళిన ధీరేంద్ర కింద ఏం చేస్తున్నాడో ఊహించలేకపోయింది అనన్య.

తనూ కిందకి వెళ్ళి అతన్తో మాటలు కొనసాగించాలంటే ఏ మాత్రం ధైర్యం చాల్లేదు.

అతను ఆర్డర్ జారీ చేసినట్టే తనిప్పుడు ఇంకా రిలాక్స్ అయి ఇంకా రెస్ట్ తీసుకోవడమే ఉత్తమం అనుకుంటూ బెడ్‌పై వాలిపోయింది అనన్య.

తలుపు సందుల్లోంచి దూసుకొచ్చి కోసేస్తున్న చలిగాలి అప్పుడిక మరీ దుర్భరం అనిపించింది.

కొత్త ఐడియా వచ్చినా రాకునా ముందసలు మనసు స్వాధీనంలో ఉంచుకోవాలనుకుంటూ బ్లాంకెట్ నిండుగా కప్పుకుని ముడుచుకుని పడుకుంది.

ఏం చూసుకుంటాడు ధీరేంద్ర? తనని కట్టిపడేస్తాడా? చిత్రహింసలు పెడతాడా?..

ఇంకా ఏం భయపడాలో అని భయపడడం మరీ భయంకరం.. పెద్దపులైనా భయపడని అనన్య భయానికే భయపడుతోందిప్పుడు..

●●●

కణతల్లోంచి తల లోపలికి చలిగాలి దూరిపోతోంది. చలిగాలి దూరి దూరి పొగమంచుగా దట్టంగా కమ్మేస్తోంది. దూదికన్నా మెత్తటి మంచు మబ్బులా ఆవరించి మెదడును చుట్టేస్తోంది. ఊపిరాడని దశలో ప్రాణం విలవిల్లాడి పోతోంది. ఎత్తుగా ఉన్న కొండశిఖరం ఆకాశంలోకి చొచ్చుకుపోతోంది.

అనన్య పైకి వెళుతూ ఉండగా పక్కనే ఎవరో కిందకి దిగుతున్నారు. ఎవరోగానీ దిగివెళుతూ వెళుతూ తనవైపు తేరిపార జూశారు... చూసీచూడనట్టు చూశారు.. ఆడపిల్లే. తనలాంటి ఆడపిల్లే. ఎవరో ఎక్కడో చూసినట్టు అనిపించలేదు!.. లేక ఆ పిల్లకి తనను ఎక్కడో చూసినట్టు కనిపించిందా?

ఎక్కడ అది? ఎత్తయిన గుట్ట అది. ఎస్. అవును. దొడ్డబెట్టకదూ అది? తను కిందికి దిగిరాగానే ఎవరు తనవైపు అదోలా చూశారూ!

డ్రైవర్ సుబ్రమణ్యం ఓ టీవీ స్టాఫ్ డ్రైవర్ సుబ్రమణ్యం.. చలి భరించలేక తలకి మఫ్లర్ చుట్టుకున్న సుబ్రమణ్యం..

"మేడం. అదేంటి అలా వచ్చివెళ్ళిపోయారూ?" అన్నాడా? ఆ మాటే అన్నాడా!

"పైకి వెళ్ళిన కాస్సేపటికి మళ్ళీ కిందకి వచ్చారా!" అన్నాడా! అలాగే అడిగాడు కదా?

పొగచుట్టేస్తోంది. కమ్మేస్తోంది. డ్రైవర్ సుబ్రమణ్యం కళ్ళలో ఆశ్చర్యం సూదిమెరుపులా మెరిసింది నిజమే..

తాగిమాట్లాడాడా సుబ్రమణ్యం గొంతు వణికిపోతూ ప్రతిధ్వనిస్తోంది. "అంతా కన్‌ఫ్యూషన్!"

ఎవర్ని చూసి ఎవరనుకున్నాడు సుబ్రమణ్యం?...

అదే కోపం మత్తుగొంతు..

"ఇండికా డ్రైవర్ మనోడే. ఆంధ్రావాడే హైద్రాబాదోడే." సుబ్రమణ్యం మందుకొట్టే మాట నిజమే. అందరికీ తెలుసు.

"కాస్సేపు ఇండికాలో.. కబుర్లు చెప్పుకున్నామండి.." అక్కడికి ఇండికాలోనే వచ్చిందా!

టూరిస్ట్‌ల సందడి అవతల దూరంగా టీ ఎస్టేట్ రోడ్ పార్క్ చేసి ఉందా తెల్లటి ఇండికా! టూవీలర్‌లో తిరుగుతున్న తనని ఫాలో చేసిందా ఆ కారు?

మబ్బులు బిగుసుకుపోతున్నాయి.

ఇండికా కారు, చిత్ర, డ్రైవర్ సుబ్రమణ్యం. ఇండికా డ్రైవర్. హైదరాబాద్..

అవును. ఎక్కడో ఎక్కడో లింకులున్నాయి. తెలిసీ తెలీడంలేదు. మబ్బు కమ్మేస్తోంది. మసక కప్పేస్తోంది.

చిత్ర – ది విలన్.. అమ్మో! ఆమె వెనుక ఎంత మంది ఉన్నారో. ఎలాంటి వాళ్ళు ఉన్నారో! చలికి ముడుచుకుపోతుంటే చచ్చిపోతున్నట్టే ఉంది.

ఎప్పటికీ చలివదలదు. పొగమంచు వదలదు. అనన్య లేవదు. ఇక లేవదు. అనన్య లేదు ఇక లేదు. నో మోర్. అనన్యా యూ ఆర్ నో మోర్.. ఇక లేవవు. నిన్నెవరూ లేపరు. లేపలేరు. అనన్యా.. యూ ఆర్.. ఓవర్!

●●●

ఏదో జారిపోతోంది. కాళ్ళనుంచి జారి పోతోంది. ఎవరో ఏమిటో లాగుతున్నారు.

మళ్ళీ ముడుచుకుంటోంది అనన్య. మళ్ళీ జారుతోంది. మళ్ళీ లాగుతున్నారు.

గబుక్కున కళ్ళు తెరిచి చూసి అదిరి పడింది అనన్య. కప్పుకున్న బ్లాంకెట్‌ని కాళ్ళదగ్గర గుంజేస్తోంది లాగేస్తోంది.. సింహంలాంటి ఆల్సేషియన్ డాగ్ జంబో.

ఏం చేస్తోందా అని తెప్పరిల్లి చూసేలోపలే అది బ్లాంకెట్‌ని ఇంకా ఇంకా లాగేసి గసపోస్తూ నాలుక వ్రేళ్ళాడేసి అనన్య వైపు ఎగాదిగా చూసింది.

"హేయ్ జంబో!" అని కింద హాల్లోంచి అప్పుడే కేక వినిపించింది. "గెట్ హర్!.. గెట్ హర్!" అంటూ ధీరేంద్ర చేస్తున్న కమాండ్ వినేసరికి పరిస్థితి ఏమిటో అర్ధమైంది.

తనని నిద్రలేపి తీసుకురావడానికి ఒక నౌకర్ని పంపినట్టు జంబోని పంపాడన్నమాట ధీరేంద్ర.

"ఓకే .. ఓకే.. కమింగ్!.. "అని జంబోకి నవ్వుతూ చెప్పి చెదిరినబట్టలు సర్దుకుని బాత్ రూంకి వెళ్ళింది అనన్య. చలిగాలి ఇంకా ఇంకా ముదిరింది.

చల్లటి నీళ్ళు తగిలేసరికి చేతివేళ్ళు కొంకర్లు తిరిగాయి. అద్దంలో ముఖం చూసుకుంటూంటే అయోమయ ప్రపంచంలో దారి తప్పిపోయిన పేలవమైన కళ కనిపించింది.

"హే! అనన్యా! వాటీజ్ దిస్? ఇంకేమౌతావు?" అంటే "ప్చ్!.. సస్పెన్స్" అంది నిస్పృహగా అద్దంలో అనన్య.

బాత్ రూం బైటే కాపలా ఉంది జంబో. అనన్య మెట్లు దిగుతుంటే వెనకే భీకరంగా ఫాలో అవుతూ వచ్చింది.

"కమాన్! లెటజ్ హావ్ డిన్నర్!" అంటూ కిచెన్‌లోంచి చకచకా పళ్ళాలు తెచ్చి డైనింగ్ టేబుల్ మీద అమర్చాడు ధీరేంద్ర. ఊరవతల అడవిలో ఒంటరి బంగళాలో కిచెన్‌లో ఏం తయారుచేశాడు? ఏం డిన్నర్ ఏర్పాటు చేస్తాడు? అని వింతగా చూస్తోంది అనన్య.

బ్రెడ్, సాండ్ విచ్, ఆమ్లెట్స్, నూడుల్స్ ఫ్రై.. ముందుగా వేడివేడి వెజిటబుల్ సూప్..

"ఫ్రిజ్‌లో చాలా స్టాక్ ఉంటుంది.. వండడానికి ఇండక్షన్ కుకర్.. ఓవెన్.. దట్స్ ఆల్ అయ్ కెన్ డూ.." అంటూ అనన్యకు అన్నీ చూపెట్టి తను చాలా ఆకలి మీద ఉన్నట్టు తొందర తొందరగా తినడం మొదలెట్టాడు ధీరేంద్ర.

జంబో ఎటో వెళ్ళింది, దానికి టేబుల్ మ్యానర్స్ కూడా తెలుసన్నమాట.

ఏమీ మాట్లాడాలనిపించక సూప్‌తో మొదలుపెట్టి అన్నీ రుచిచూస్తూ కూచుంది అనన్య.

అసలు సమస్య ఏమీలేనట్టు ఊటీ గురించి, చలి గురించి, కార్లగురించి.. ఏవేవో చెపుతున్నాడు ధీరేంద్ర. అంతసేపూ కిచెన్‌లో కష్టపడి పనిచేసిన విసుగేమీ అతన్లో కనిపించలేదు.

రఫ్‌గా మొండిగా ఉండే అతని ముఖంలో ఒకలాంటి హోమ్లీ ఫీలింగ్‌ని మొదటిసారిగా గమనించింది అనన్య. ఎంత శత్రుత్వం ఉన్నా ఎవరో మనింట్లో మనిషి అనే భావన ఒకలాంటి ధైర్యాన్నిస్తుంది. ఇతని వల్ల ప్రమాదం ఉండదులే అనిపిస్తుంది..

ఎత్తుగా బలిష్టంగా ఉన్న, అతని ఆకారం చూస్తున్న కొద్దీ మళ్ళీ చూడాలనిపిస్తుంది.

అనన్య నూడుల్స్ ప్లేట్‌లోకి సాస్ సర్వ్ చేస్తూ "ఎలా ఉన్నా తినడానికి ట్రై చెయ్యి" అన్నాడు ధీరేంద్ర.

"ఎలా ఉండడమేంటీ? ఎవ్రీథింగ్ ఈజ్ ఫైన్! యూ ఆర్ ఎ గ్రేట్ కుక్!.. ఇవ్వన్నీ ఇలా చెయ్యడం నాకైతే ఏమాత్రం చాతకాదు" అంది అనన్య

"పొగట్టంలేదు ఉన్నమాట చెపుతున్నాను!" అన్న ధోరణిలో.

"థేంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్!."

"వెల్‌కం.."

ఇద్దరూ ఫ్రెండ్స్ అయిపోయారా? ఆకలీ అవసరమూ అనుమానాల్ని, చెరిపేస్తోందా?

అనన్య మనసులో మాటలు ముడిబడుతున్నాయి తడబడుతున్నాయి. ఇంకా ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? చెప్పి ప్రయోజనం ఏమిటి? అతని సహనాన్ని ఇంకా పరీక్షించడం తప్పదా?"

"ధీరూ!.. అయ్ విల్ టెల్ యూ ఓన్లీ వన్ థింగ్.."

ఆమె "ధీరూ" అని మెత్తగా పలికిన తీరుకు విస్మయంగా చూశాడు ధీరేంద్ర.

"ఎస్"

"తలుచుకుంటే ఇప్పుడిప్పుడే కొన్ని గుర్తొస్తున్నాయి.. దొడ్డబెట్ట దగ్గర మా యూనిట్‌లో ఉన్నప్పుడు ఎవరో నాలాంటి అమ్మాయే నన్ను క్రాస్ చేసింది. మా డ్రైవర్ సుబ్రమణ్యం. కన్‌ఫ్యూజ్ అయ్యాడు.. అయితే అతను డ్రింక్ చేస్తాడు. కాబట్టి అతని మాటల్ని పట్టించుకోవాలనే అనిపించలేదు.."

ధీరేంద్ర నవ్వుతూ చూశాడు. ఆ చూపుతో భయమనిపించింది. తిడతాడేమో. కొడతాడేమో అనిపించింది. అయినా గొంతులోకి వచ్చిన మాట.. ఆగలేదు. దాగలేదు.

"తర్వాత టీ ఎస్టేట్ దగ్గర.. చిత్ర ఫస్ట్ టైం కలిసినప్పుడు .. ఆమె అక్కడికి ఒక వైట్ ఇండికాలో వచ్చినట్టు అనుమానం.. అన్నట్టు అంతకు ముందు కలెక్టర్ ఆఫీస్ దగ్గరకూడా వైట్ ఇండికా కనిపించింది.. ఆ డ్రైవర్‌తో మా డ్రైవర్ సుబ్రమణ్యం.. కాస్సేపు గడిపాడు.. ఎందుకు చెపుతున్నానంటే.. నన్నెవరో ఫాలో చేశారు.. చిత్రే ఫాలో చేసింది.. ఆరా తీసింది.. ఇలా ఇరికించేసింది" అంటుండగా అనన్య గొంతు పూడుకుపోయింది.

"గుడ్ ట్రయల్!" అన్నాడు ధీరేంద్ర ముక్తసరిగా - అతనేమీ పట్టించుకోలేదన్నమాట. ఇక మాటలు అనవసరం. స్టోరీలు అనవసరం, అదీ అతని అర్థం

డిన్నర్ ముగిసింది.

●●●

"యూ..గో.. టేక్ రెస్ట్" అని ధీరేంద్ర మెట్లదారి చూపెట్టగానే సందిగ్ధంలో పడింది అనన్య.

అతని మనసులో ఏముందో అర్థం కావడంలేదు. తనకైతే ఒంటరిగా వెళ్ళిపడుకోవాలనీ లేదు, ఆలోచనలతో సతమతం కావాలని అస్సలు లేదు.

అతనితో ఇంకా మాట్లాడాలని ఉంది. తన పరిస్థితి ఇంకా ఇంకా చెప్పుకోవాలని ఉంది. అతన్ని నమ్మించడానికి ఏం చెయ్యాలో కనుక్కోవాలని ఉంది.

మెట్లెక్కి వెళుతూ తన మనస్సుని తనే నిలదీసి ప్రశ్నించుకుంది అనన్య. మబ్బుల చాటున వెన్నెల దాగినట్టు ఇంకేదో అభిప్రాయం కూడా తొంగిచూస్తోంది.

నమ్మకాలతో యుద్ధం జరుగుతున్న, ఈ విచిత్ర పరిస్థితిలో అసలు సమస్యని కాస్సేపు పక్కన పెట్టి అతనితో ఒక ఫ్రెండ్‌తో గడిపినట్టు గడపాలని ఉంది.

"స్లీపింగ్ విత్ ది ఎనిమీ" సినిమా గుర్తొచ్చింది.

జీవిత చిత్రాల్లో విపరీత పరిస్థితులకు అంతేలేదు. శత్రువుతో కూడా ఒక్కోసారి హాయిగా స్నేహంగా గడపాల్సి ఉంటుంది.

మేడమీద బాల్కనీలోకి వెళ్ళబోయిందిగానీ చలిగాలి విదిలించి కొట్టడంతో తలుపుమూసేసింది అనన్య.

అద్దాల్లోంచి అవతల కనిపిస్తున్న దృశ్యం నయనమనోహరంగా ఉంది. నల్లబారిన పచ్చదనం మీద పొగమంచు గోముగా రుద్దుకుంటోంది. కలల్లా ఊగుతున్న చెట్ల కొసల పైన చిన్న చిన్న ఆశల్లాంటి నక్షత్రాలు మెరుస్తున్నాయి. దూరాన కొండవాలు మీద మెరుపులు మెరిశాయి. వర్షం వస్తుందా?

వెళ్ళి బెడ్‌లో పడుకుని ముసుగు తన్నేసింది అనన్య. ఒళ్ళేకాదు మనసూ ముడుచుకుపోతోంది.

తలుపు మీద చప్పుడయింది.. తేరిపార జూసింది అనన్య. ఎవరూ లేరు. భ్రమ. తలుపు చప్పుడయినట్టు కేవలం భ్రమ.

ఏది ఏమైనాగానీ ధీరేంద్ర పైకి వచ్చి తనతో కాస్సేపు మాట్లాడి వెళితే బావుంటుంది. తెలిసీ తెలియని కోరికను ఏమీ తెలీనట్టే అణిచిపెట్టేసింది మనస్సు.

తనను రెస్ట్ తీసుకొమ్మని అతను ఏం చేస్తాడు? ఏం ప్లాన్ చేస్తున్నాడు? ఇక ఏం చెయ్యదలిచాడు?..

ఓకే. చూద్దాం. రెస్ట్ తీసుకుందాం అని కళ్ళు మూసుకుంది అనన్య..

●●●

ఫెళ్ళు ఫెళ్ళుమనీ దడదడమనీ బీభత్స శబ్దంతో హోరెత్తి పోతుంటే మగత నిద్ర చెదిరి లేచి కూచుంది అనన్య. కర్టెన్ తీసి చూసేసరికి ఒళ్ళు గగుర్పొడిచింది. ప్రకృతి అంతా అల్లకల్లోలమౌతున్నట్టు భీకరంగా కురుస్తోంది వర్షం.

వర్షధారల, దృశ్యాన్ని చీల్చేస్తున్నట్టు ధళధళమని మెరుపులు మెరుస్తున్నాయి.

ఉరుములో పిడుగులో దూరాన్నుంచి ధ్వని మీద ప్రతిధ్వనులు భూమ్యాకాశాలను అదరగొడుతున్నాయి.

ఆ మెరుపులు ఉరుములు పిడుగులు ఆ భీభత్సం అంతా ప్రకృతిలోనే గాక మనిషి మెదడులో జరిగితే ఏమౌతుంది?

మెదడే చలిపోయినట్టు ఒకే ఒక్క ఆలోచన మెరిసింది.

ఉస్! అన్నట్టు క్షణంలో అంతా తేలిపోయింది. తేలికైపోయింది. సమస్యకు పరిష్కారం అటులేదు ఇటులేదు పైన లేదు కిందలేదు. చుట్టుపక్కల ఎక్కడా లేదు సమస్యకు పరిష్కారం కేవలం సమస్యలోనే ఉంది.

నువ్వు చిత్రవి. చిత్రవే. నిన్ను తీసుకెళ్ళి పోలీసులకు అప్పచెపుతాను అంటున్నాడు ధీరేంద్ర. నువ్వు చిత్రవే అనీ నకిలీ పాస్‌పోర్ట్ కుంభకోణంలో కీలకపాత్రనీదేననీ వీరేంద్ర అనే జెంటిల్మన్‌కి ఎటువంటి ప్రమేయంగానీ లేదనీ. అఫిడవిట్‌లో ఇప్పుడే సంతకం చెయ్యమంటున్నాడు.

సో వాట్?

ఏం భూమి బద్దలైపోతుందా? ఆకాశం చీలిపోతుందా!

ధీరేంద్ర బలవంతం మీద అఫిడవిట్‌లో సంతకం చేసినంత మాత్రాన అతన్తో హైదరాబాద్ వెళ్ళి దర్యాప్తు, అధికారుల ముందు పోలీసుల ముందు తొంగిపోయినంత మాత్రాన -

తను నిజంగా చిత్ర అయిపోతుందా?

మెరుపులు మీద మెరుపులు ఇప్పుడు కదా మెరుస్తున్నాయి! తర్వాత పిడుగులేవో ధీరేంద్ర నెత్తినే పడతాయి.

ముందసలు ఈ ధీరేంద్ర నిర్బంధం నుంచి బైతపడితే పోలీసుల దగ్గరకే గనక వెళ్ళగలిగితే జస్ట్ సింపుల్! తనెవరో వాళ్ళే తేలుస్తారు! ఓ ఉ - టీవీకి ఒక్క కాల్ చేస్తే చాలు.

అంతా హాం ఫట్!

హే! ఎంత సింపుల్! ఎంత ఈజీ!

క్షణంలో అనన్య మనస్సు తేలిపోయింది. ఎగిరిగంతెయ్యాలనిపించింది - ఉన్నట్టుండి బైటకెళ్ళి వర్షంలో గంతులెయ్యాలనిపించింది.

వాచ్‌లో టైము మూడుదాటింది.

సమస్యకి పరిష్కారం దొరికిన ఉత్సాహంలో అప్పుడిక ఏం చెయ్యాలో తెలియలేదు. అసలీ డ్రామా మొదలైన క్షణంలోనే తనకీ విషయం ఎందుకు తట్టలేదా అని దిగులనిపించింది.

ఇంకా టైం వేస్ట్ ఎందుకూ అన్నట్టు కాళ్ళకి స్వంత అభిప్రాయాలేవో ఉన్నట్టు ఆటోమేటిక్‌గా మెట్లు దిగి కిందకి వెళ్ళింది. హాల్లో సోఫా అవతల్నుంచి జంబో గుర్ గుర్ర్ మని శబ్దాలు చేసి ఎలర్ట్‌గా కదిలింది.

"ఫ్రెండ్స్ జంబీ.. ఉయార్ ఫ్రెండ్స్!" అని దానికో ఫ్లయింగ్ కిస్ ఊదేసి మాస్టర్ బెడ్ రూం వైపు వెళ్ళింది అనన్య.

ఆ టైముకి ధీరేంద్ర ఆదమరచి నిద్రపోతుంటాడు అనుకుంటూ డోర్ మీద చెయ్యి వెయ్యబోతుండగానే డోర్ విసురుగా తెరుచుకుంది.

అతను నిద్రపోలేదన్నమాట, అలికిడికి అతనే ఎలర్ట్ అయి తలుపుతీశాడు...

"ఎస్?" అన్నాడు విసురుగానే. అతని కళ్ళలో ఎర్రజీరలు ఎందుకొచ్చాయి?.

"అయాం సారీ టు డిస్టర్బ్ యూ" అంది మర్యాదగా.

"సో?" ఆమె ఎందుకలా వచ్చిందో బేరీజు వేసుకుంటున్నాడు.

"మిస్టర్ ధీరేంధ్ర! ఎట్ లాస్ట్ అయాం కన్ఫెసింగ్! ఒప్పుకుంటున్నాను. నేనే చిత్రని.. ఎస్!" అనేసింది అనన్య ఫైనల్‌గా - అతని రియాక్షన్‌ని గమనించింది.

అటోక్షణం ఇటోక్షణం కొట్టుకుంటూ దొర్లిపోయాయి. ఇంకేం చెపుతాడు ధీరేంద్ర? గప్‌చుప్‌గా ప్రశాంతంగా ఇద్దరూ హైదరాబాద్ వెళ్ళిపోవడమే! తర్వాత సంగతి తర్వాత!

అనన్య వైపు చూసి చూసీ ఛాతీ ఎగరేస్తూ నవ్వి "అనుకున్నాను.. ఇటువంటి ట్విస్ట్ ఏదో పెడతావని!.." అని అతను వంకరంగా తలవాల్చడంతో అనన్య తికమకపడింది.

"మరి.. ఇంకా ఏంటి? నేను చిత్రనే సో వాట్ నౌ!.. కమాన్.. నువ్వెప్పుడంటే అప్పుడు - ఇప్పుడైనా సరే. హైదరాబాద్ వెళదాం.."

"హ! నువ్వింత ట్విస్ట్ ఇచ్చిన తర్వాత - అంత ఈజీకాదు.. ముందుగా -నేను తేల్చుకోవాల్సింది ఉందిగా.. తెల్లారనీ చూద్దాం. అందాకా డోంట్ డిస్టర్బ్ మీ.." అంటూ లోపలికి వెళ్ళి తలుపు వేసేసుకున్నాడు. లోపల్నుంచే వినిపించింది కమాండ్ "జంబో.. వాచ్ హర్!"

అనన్య మనసు నిశ్శబ్దంగా పిడుగులు పడుతున్నాయి....

●●●

## 11

**ఎల్లలు లేని మైదానంలో** హోరుగాలిలో జోరువానలో తడుస్తూ నడుస్తూ ఉండగా హఠాత్తుగా నగ్నంగా అయిపోయినట్టు విపరీతమైన సిగ్గుతో అవమానంతో వణికిపోయింది అనన్య.

ఎవ్వరూ చూడలేదా? ఎవ్వరికీ తెలీదా? అయితేనేం? ఆత్మాభిమానం ఏమైనట్టు?

ధీరేంద్ర తన అభిమానాన్ని నిశ్శబ్దంగా నిర్దాక్షిణ్యంగా అవమానించేశాడు.

అబద్ధం చెప్పినా నిజం చెప్పినా అతని దగ్గర తనకు విలువేలేదు.

"వాచ్ హర్!" అని తనకు కాపలా పెట్టిన జంబోను నమ్ముతాడు గాని అందులో వెయ్యోవంతైనా తనను నమ్మడం లేదు.

ఒక మనిషి విలువ ఇంతకన్నా పడిపోతుందా? ఇంతకన్నా ఘోరం ఉంటుందా?

మేడమీద గదికొచ్చి అవమానంతో ముడుచుకు పడుకుంది అనన్య. వెక్కి వెక్కి ఏడవాలనిపించింది.

ఎవరికి వినిపిస్తుంది ఈ వేదన - ఈ రోదన?

అలనాటి చెలికాడు తొలిప్రేమికుడు.. వాసు హఠాత్తుగా గుర్తొచ్చాడు.

ఏమైపోయావు వాసూ? ఎక్కడున్నావ్?

"వర్జిన్ కావాలని అనుకోలేదులే" అన్న వాసు మాటకి ఆ ఒక్క మాటకి అతన్ని వేలమైళ్ళ దూరానికి విసిరేసింది. వర్జినిటీ. శీలం. కేవలం శరీరం.!!

కానీ ఇదేమిటిప్పుడు? నేను నేనే అన్నా నమ్మకం లేదు. నేను నేను కాదు అన్నా నమ్మడంలేదు.

ఇంతకీ నేనెవర్ని?

అనన్యనూ కాను. చిత్రనూ కాను. నిజంలేదు. అబద్ధం లేదు ఆత్మ లేదు.

ఆడపిల్లగా కనిపించే ఒక నీడను.

ఒక దెయ్యాన్ని - పిశాచాన్ని.. అంతేనా?

ఇప్పుడిక ఏడ్చికూడా లాభం లేదు.. శక్తి అంతా లాగేసిన శూన్యంలోకి ఒక బ్లాక్ హోల్‌లోకి వెళ్ళిపోయినట్టు.. నిద్రపోయింది అనన్య.

●●●

నిశ్శబ్దానికి శబ్దం ఉంటుందా?

చెవుల్లో గీపెడుతున్నదేమిటి? మెదడులోకి పురుగులాగా కొరుక్కుంటూ వచ్చేస్తున్నదేమిటి?

శూన్యంలో నిశ్శబ్దానికి గొంతువచ్చి వెక్కిరిస్తూ ఆవులించినట్టు వికారంగా అనిపిస్తుండగా మాయ తెర తొలగినట్టు నిద్ర చెదిరి హఠాత్తుగా లేచి కూచుంది అనన్య.

హైద్రాబాద్‌లో తన అపార్ట్ మెంట్ కాదా? వెంటనే చకచకా తయారయి టీవీ ఆఫీస్‌కి వెళ్ళొద్దా?

నిన్న రాత్రిదాకా జరిగిందంతా ఒక పిచ్చికల, ఒక పీడకల కాకూడదా?

కిటికీలోకి బద్ధకంగా వస్తున్న సూర్యరశ్మిని బట్టి టైము ఎంతో తెలియలేదు. వాచీలో పదీ నలభై దాటుతోంది.

అలవాటుగా సెల్ ఫోన్ అందుకుని మెసేజ్‌లూ మిస్డ్ కాల్స్ చూసుకోబోయింది. సిమ్ లేని సంగతి అప్పుడే గుర్తొచ్చి ఫోన్‌ని విసిరేసింది.

బంగ్లా అంతా నిశ్శబ్దం. మేడదిగి కిందికొచ్చింది. హాల్లో చూసింది. జంబోలేదు. ఉంటే ఈసరికి గుర్ గుర్ మనాలి.

మాస్టర్ బెడ్ రూంలోంచి అలికిడి లేదు. తలుపు లాక్ చేసి ఉంది.

ఎక్కడికెళ్ళాడు ధీరేంద్ర! జంబో ఎక్కడ?

ఇలా హౌస్ అరెస్ట్ చేసి వెళ్ళడం బొత్తిగా బాగులేదు. కానీ ఏది మాత్రం బాగుంది గనుక?

బాత్ రూం కెళ్ళి ఫ్రెష్ అయి తయారవ్వాల్సిన అవసరం ఉంది. కానీ సరంజామా ఏదీ?

తన లగేజ్ అటునుంచి అటు హోటెల్ నుంచే మిస్ అయిపోయింది కద! తన కెమెరా నోట్ బుక్... పర్సనల్ వస్తువులన్నీ గల్లంతే! వాటన్నిటినీ చిత్ర వెళుతూ వెళుతూ పట్టుకెళ్ళింది - తర్వాత ఏం చేసి ఉంటుంది?

కొద్దిక్షణాలపాటు హాల్లో అటూ ఇటూ పచార్లు చేసి దిక్కు తోచక మళ్ళీ మేడమీదికే వెళ్ళింది.

బాల్కనీ తలుపు తోసింది. దానికి లాక్ ఏమీ లేదు.

బాల్కనీలోకొచ్చి చూస్తే ఉదయం ఎండవెచ్చదనం చిరుచలిగాలి మోసుకొచ్చిన ప్రకృతి పరిమళం హాయిగా సోకింది

దూరాన్నుంచి సరుగుడు చెట్లు హలో అన్నాయి. టీ తోటలో ఆకులమీద నీరెండ తళ తళా మెరుస్తూ గుడ్ మార్నింగ్ అంది.

కాంపౌండ్‌లో గమనిస్తే బ్లాక్ స్కార్పియో లేదు. తనని హౌస్ అరెస్ట్‌లో పెట్టి ధీరేంద్ర ఎటో వెళ్ళాడన్నమాట! మరి వాచ్ డాగ్ జంబో ఎక్కడా? అనుకుంటూ ఉండగానే బంగ్లా అవతల పొదల్లోంచి అలికిడి అయింది. గెంతుతూ దూకుతూ దూసుకొట్టింది జంబో. వచ్చీ వచ్చీ కిందనుంచి బాల్కనీవైపు తన వైపు ఎగజూస్తూ వగరుస్తూ నిల్చుంది.

"హాయ్ జంబో! గుడ్ మార్నింగ్" అనగానే అదీ "గుడ్ మార్నింగ్" అన్నట్టే కాబోలు స్పీడ్‌గా తోక ఊపింది.

అయితే బాల్కనీ నుంచి దూకిపారిపోవడం కుదరదన్నమాట అనుకుంది అనన్య నిష్కర్షగా.

అంతలో గుట్టకింద నుంచి గురగురమని శబ్దమైంది. ఏదో పాకింది. దూకింది - తిరుగుడుగా దూకుడుగా దూసుకొచ్చింది... బ్లాక్ స్కార్పియో...

అది స్ర్‌మని పైకొచ్చి కాంపౌండ్‌లోకి తిరిగొచ్చి విసురుగా ఆగగానే ఎగిరి దూకి వెళ్ళింది జంబో, డాగ్ అండ్ మాస్టర్, అదో విచిత్ర దృశ్యం.

మాస్టర్‌నే ఎటాక్ చేసేంత ఫోర్స్‌తో ఎగబడుతూ చుట్టేస్తూ తోక ఊపేస్తుంటే.. జంబోను హగ్ చేసి వదిలిపెట్టాడు ధీరేంద్ర.

"అరె.. కూల్‌డన్ బేబీ.. అయ్ గాట్ మీట్ ఫర్ యూ.. వెయిట్ వెయిట్.."

ఎంత ఉత్సాహం ఉన్నా, అతన్నీ కమాండ్‌ని మాత్రం గౌరవిస్తుంది జంబో.

కారులోంచి మొయ్యలేనన్ని పాకెట్లు, బాక్సులు, క్యారీ బ్యాగ్.. చకచకా దించాడు ధీరేంద్ర.

ప్రొద్దున్నే షాపింగ్‌కి వెళ్ళాడన్నమాట.. తయారయే వెళ్ళాడు. ఫ్రెష్‌గా స్మార్ట్‌గా ఉన్నాడు. కారులోంచి బ్యాగ్స్ దించుతుండగా అతని జబ్బల కండరాలు పొంగడం చూస్తే 'వావ్' అనిపించింది.

అక్కణ్ణుంచీ పైకి చూశాడు ధీరూ. నిష్ఠూరమంతా నొక్కిపట్టినట్టు "అలా చూస్తూ ఎంజాయ్ చెయ్యకపోతే.. వై డోంట్ యూ హెల్ప్‌మీ విత్ దీస్?"

శత్రుత్వం ఎక్కడికి పోయింది? అనుమానాలు ఏమయ్యాయి? హైదరాబాద్ ప్రయాణం మాటేమిటి? షాపింగ్ కెళ్ళి సరుకులు తెచ్చినట్టు ఈ ఫ్యామిలీ సీన్ ఏమిటిటా?

మనసున సంగీతం తిక్కగా మోగింది.

"హెల్ప్ యూ!" అంది ఉడుకుమోత్తనం నటిస్తూ.

అనన్యా! నీకు తెలుస్తోందా? ఏదో కెమిస్ట్రీ. పనిచెయ్యడం మొదలైంది. జాగర్త. జాగర్త. అని మనసు రొద..

"హౌ కెన్ అయ్ హెల్ప్‌యూ?"అని అరిచింది. కింది డోర్‌ని చూపిస్తూ చెయ్యి తిప్పి "యూ హావ్ లాక్డ్‌మీ..! నన్ను అరెస్ట్ చేశావ్!" అంది కోపంగా

నిష్ఠూరం. కోపం. ఉడుకుమోత్తనం అన్నీ ఉన్నాయి. కానీ ఏదో మెత్తబడుతోంది. మనసనే యంత్రంలో ఏవో చక్రాలు వెనక్కీ ముందుకూ ఊగుతున్నాయి, ఆగుతున్నాయి, తిరుగుతున్నాయి.

"ఓహ్!.. సారీ.. అహఁ.. నాట్ సారీ.. బట్ ఎస్.. ఓకే.. కమ్ డౌన్.." అతను ఒక్క గెంతుతో వెళ్ళి తాళం తీశాడు.

అనన్య చకచకా దిగివచ్చి జాయిన్ అయింది.

వాళ్ళిద్దరి మధ్యా ఎగబడి దూకుతోంది జంబో. దాని తోక విపరీతంగా ఊగుతోంది.

●●●

బ్రాస్, పాంటీస్‌తో సహా అన్నీ తెచ్చాడు. జీన్స్, టీ షర్ట్స్, స్వెటర్స్, స్కార్ఫ్స్.. సోప్స్, షాంపూ, కండిషనర్, పౌడర్, లిప్‌స్టిక్స్,హేర్ డ్రయర్, క్లిప్స్..

వాట్ నాట్?

తను షాపింగ్ చేసుకున్నా సరిగ్గా ఇవే తెచ్చేది అనిపించింది. అన్నిటికన్నా ఆశ్చర్యం. సరిగ్గా పర్ఫెక్ట్‌గా తన సైజ్‌లు అతనికి ఎలా తెలుసు?

"నేను చూసుకుంటాను!" అంటే ఇదా అర్థం?

హైదరాబాద్ ప్రయాణం సంగతేమిటి?

"గెట్ రెడీ.. ఫాస్ట్!" అన్నాడు ధీరేంద్ర చురుగ్గా

"తర్వాత చూద్దాం"

స్నానం చేస్తూ ఇంకా ఆశ్చర్యపోతూనే ఉంది అనన్య. ఒకటి మాత్రం నిజం.

ఇతను మామూలు మనిషి కాడు. వీడు సామాన్యుడు కాడు. చూస్తాడు. చూసుకుంటాడు. అనుకున్నది అనుకున్నట్టు చేస్తాడు....

మనస్సులో గుసగుసమొదలైంది. ఇతను ఇలా చూసుకుంటూ ఉంటే, ఇంకా కొన్నిరోజులు ఇలాగే గడపొచ్చేమో!.

అడ్వెంచర్! థ్రిల్!

ఇదేనా అనన్యా నువ్వు కోరుకున్నది? ఇది కాదా నువ్వు కోరుకున్నది?

వేడి వేడి నీళ్ళతో తలారా స్నానం చేసేసరికి వేరే ప్రపంచంలో మేలుకున్నట్టయింది.

టవల్ చుట్టుకుంటూ ఉండగా గమనిస్తే బాత్ రూం అంతా ఆవిరితో నిండిపోయింది.

అద్దంలో చూసుకోవాలంటే ముఖం కనిపించలేదు. అద్దం మీద ఆవిరి కమ్మేసింది. ఆవిరి పొరను చెరిపెయ్యబోతూ ఆగింది అనన్య.

చూపుడు వేలితో ఆవిరి పొరమీద రాసింది. అనన్య నీడ్స్ లవ్.

ఆ అక్షరాల మేరకు ఆవిరి చెదిరింది. అద్దంలోకి తొంగి చూస్తూ కొత్తగా కనిపించాయి అనన్య కళ్ళు. ఆ కళ్ళలో కొత్త మెరుపుంది.

ఏమిటా మెరుపు?...

●●●

ఫ్రెష్‌గా, నీట్‌గా తయారైన అనన్యని కళ్ళార్పకుండా చూశాడు ధీరేంద్ర. "వావ్! ఫెంటాస్టిక్! బట్టలు పరఫెక్ట్‌గా సరిపోయాయి.. అండ్ ది కలర్స్ మ్యాచ్ యూ సో వెల్!.."

"థేక్స్.. ఫర్ ఎవ్రీ థింగ్!"

"కమాన్! ఆకలెయ్యడం లేదూ?"

బ్రేక్ ఫాస్ట్ ఇంకా బాగుంది. ఇడ్లీ, పొంగల్ తెచ్చాడు. వాటిని మళ్ళీ ఓవెన్‌లో పెట్టి వేడి చేసి సర్వ్ చేశాడు.

ఈ మనిషి గూండాగిరీ చేస్తాడంటే యాసిడ్ దాడి చేస్తాడంటే.. ఎలా నమ్మడం?

"మిస్టర్ ధీరేంద్రా! ఏ మాటకి ఆ మాటే చెప్పాలి... యూ ఆర్ రియలీ వెరీ డిఫరెంట్!.. అండ్ రియలీ రియలీ నైస్ టూ మీ!...!

"ఆఁ.." అంటూ ఇక వేడి వేడి కాఫీ అందించాక అనన్యవైపు, చురుగ్గా కత్తి చూపు చూశాడు.

"బట్ యూ ఆర్ నాట్ నైస్!" అన్నాడు కరుగ్గా "ఇంకా తెలీడం లేదు... నువ్వు అనన్యవా? చిత్రవా?"

అదిరిపడింది. ఏం మొదలు పెడతాడిక?

●●●

" జస్ట్ వెయిట్... ఉయ్ విల్ సీ!.." అంటూ మాస్టర్ బెడ్ రూంలో కెళ్ళి తలుపువేసుకున్నాడు ధీరేంద్ర.

ఏం చేస్తాడు లోపల? తపస్సు చేస్తాడా? సమస్యకి కొత్త పరిష్కారం ఎలా కనిపెడతాడు?

సస్పెన్స్ భరించలేక హాల్లో అటూ ఇటూ తిరిగింది అనన్య. రాక్స్‌లో ఏవేవో ఇంగ్లీష్ బుక్స్ ఉనాయి. చేతికందిన పుస్తకం పేజీలు తిప్పి తిప్పి కాలక్షేపం చేసింది. మనసు నిలవలేదు.

పోర్టికోలో బద్ధకంగా పడుకుని లేత ఎండ వెచ్చదనాన్ని ఎంజాయ్ చేస్తోంది జంబో.

లోపల రూంలో ధీరేంద్ర గొంతు వినిపించింది. ఎవరితోనో ఫోన్ లో మాట్లాడుతున్నాడు.

"ఆఁహా అయ్ సీ!" అంటు ఏదోగాని శ్రద్ధగా వింటున్నాడు.

అక్కడే ఉండి పొంచి వినడం అవమానం అనిపించింది. నెమ్మదిగా బైటకొచ్చి పచార్లు చేసింది. జంబో నిశ్శబ్దంగా లేచి అనుసరించింది.

"ఫ్రెండ్స్ జంబో" అనేసరికి తోక ఊపింది.

అయితే ఈ ఆరితేరిన కుక్కని కవ్వించడానికీ లేదు. మోసం చెయ్యడానికీ లేదు కాంపౌండ్ లోపలే "ఫ్రెండ్స్" అనే మాట పనిచేస్తుంది గానీ తను పారిపోయే ప్రయత్నం చేస్తే మాత్రం.. ఈ కుక్క సింహమైపోతుంది.

ఏ మాత్రం రెచ్చగొట్టకూడదు

సస్పెన్స్ పరిస్థితి కొనసాగుతూనే ఉన్నా, ధీరేంద్ర ప్రవర్తించే తీరులో డిసిప్లిన్ పెద్దమనిషి తరహా గుర్తుచేసుకుంటూ "నైస్ గై" అనుకుంది అనన్య. "టఫ్ గై అండ్ నైస్ గై"

అయితే ఏమిటి?

మెల్లమెల్లగా మనస్సులో రొదకి సంగీతం వచ్చినట్టయింది. ప్రేమ అనేది ఒక్కసారి ద్వేషంలోంచి పుడుతుందంటారు.

ఇది అటువంటి సన్నివేశం అనుకోవాలా?

రేప్ చేస్తాడేమో అని భయపడ్డ మొండి మనిషి ఇంత, క్లాస్‌గా ఇంత జెంటిల్‌గా ప్రవర్తిస్తుంటే. భయం పోయింది. అనుమానం పోయింది. ద్వేషం ఎప్పుడుంది? ఎందుకు ఉంది?

ఎండ చుర్రుమనే టైముకి తలెత్తి చూస్తే ఆకాశం నిర్మలంగా మబ్బుల్లేకుండా ఉంది.

అనుమానాలు చెదిరిపోయిన మనస్సు అలానే ఉంటుంది. తనకైతే అతనిమీద అనుమానాలు లేవిప్పుడు. అతని పరిస్థితి పూర్తిగా స్పష్టంగా అర్థమైంది.

కానీ అతని సందేహాలు తగ్గిపోలేదు చెదిరిపోలేదు. ఇంకా ఎక్కువవుతున్నాయి.

"నేను చిత్రనే" అని చెప్పడంతో అతను ఇంకా ఫిక్స్‌లో పడిపోయాడు. పాపం మాయగాడల్లా అమాయకుడైపోయాడు.

ఈ పరిస్థితినుంచి అతనెలా బైటపడాలి?

తనను అరెస్ట్ చేసి అతను అరెస్ట్ అయ్యాడు!

లోపల్నుంచి ఫోన్ మాట్లాడుతూ వచ్చాడు ధీరేంద్ర. "ఆఁహాఁ .. అయ్ సీ.. ఓకే.." అంటున్నాడు. ఎవర్తో ఏం మాట్లాడుతున్నాడు?

అతని వాలకం చూస్తే బాడీ లాంగ్వేజ్ చూస్తే సరిగ్గా అప్పుడే మెరుపు మెరిసినట్టు అర్థమైంది.

అర్థమైందేదో రూఢీ చేసుకునేలోగా అతను నవ్వుతూ ముందుకొచ్చాడు. అంతసేపూ ఫోన్‌లో నడిచిన మాటలేవో ఒక కొలిక్కి వచ్చినట్టు ఫోన్ కట్ చేసేసి తెల్లగా నవ్వాడు.

ఆ నవ్వు కొంచెం వెటకారం నవ్వు.

"సో! .. టెల్ మీ.. మిస్ చిత్రా!" అన్నమాట సూటిగా బుల్లెట్‌లా దిగింది.

రాత్రి తను చిత్రనే అని చెప్పిన తర్వాత ఇదే మొట్టమొదటిసారి అతను "చిత్రా" అని పలకడం. చిత్ర అనే మాటని చాలా చాలా వత్తి పలికాడనిపించింది.

ఆ మాటతో చూపుతో నవ్వుతో తత్తరపడింది అనన్య."టెల్ యూ.. వాట్?"

"సింపుల్ థింగ్స్ - మిస్ చిత్రా. జస్ట్ కొంచె ఇన్ఫర్మేషన్ కోసం అంతే. నీ డేట్ ఆఫ్ బర్త్? ప్లేస్ ఆఫ్ బర్త్? నేటివ్ ప్లేస్?.. ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషన్స్? చిత్ర అనే పేరుకి సరిపోయేట్టు స్టాండర్డ్‌గా ఓ బయోడేటా ఉండాలి కదా!.. కమాన్ చెప్పూ.. వేరుగా గుర్తుచేసుకోవాల్సిన అవసరం లేదుకదా?.. ఆఁ..?"

అతని అభిప్రాయం అర్థమయేసరికి ఇందాకటి నిర్మలమైన ఆకాశం నిట్టనిలువునా చీలినట్టనిపించింది. ఏం చెప్పాలి ఇక? శూన్యంగా చూస్తూ ఉండిపోయింది. అతను తెల్లగా నవ్వుతున్నాడు. చాలా చాలా క్రూరంగా....

●●●

## 12

**ఆ నవ్వు చూడగానే అనన్య ఒక్కసారిగా** తికమకపడింది. అది పులినవ్వా? మనిషి నవ్వా?

ఊటీ ఘాట్ రోడ్‌లో ఎదురైన పులి గుర్తొచ్చింది.

పులి ఎదురైంది. భయపెట్టింది. కానీ అనన్య పులికి భయపడిందా? చివరికి పులే అనన్యకు భయపడిందా? ఎవరు పారిపోయారు?

అనన్య పారిపోలేదు. పులి పారిపోయింది.

అపుడు అలా జరిగింది. మరి ఇపుడూ అంతే కదా?

పులికే భయపడని అనన్య పులిలాంటి మనిషికీ, పులినవ్వులాంటి అతని నవ్వుకూ భయపడుతుందా?

నో! నెవర్! అనన్యా.. యూ ఆర్ గ్రేట్!

యూ ఆర్ నెవర్ అఫ్రైడ్! ఎస్!

ధీరేంద్ర కళ్ళలోకి నిశ్చలంగా సూటిగా చూసి చిన్నగా నవ్వింది అనన్య. ఆ నవ్వుతో అతను నివ్వెరపోయాడు.

"స్టాపిట్ మిస్టర్ ధీరేంద్రా! ఎనఫ్!" అంది అనన్య ఖచ్చితంగా. "నువ్వు నీ నోటికొచ్చిన ప్రశ్నలు అడగడం నేను ఏం చెప్పినా నువ్వు సమాధాన పడకపోవడం... ఆ సంగతి అలా ఉంచు. నేనే చిన్న డౌట్ అడిగితే నువ్వేం జవాబు చెపుతావో వినాలని ఉంది.."

"వాట్?"

"నేనేమో పరమ దుర్మార్గురాలైనట్టూ నువ్వేదో పెద్ద హీరోవైనట్టూ బుకాయిస్తున్నావు. అసలు ఈ గేమ్‌లో నువ్వే పెద్ద విలన్‌వి ఎందుకు కాకూడదూ? ఆఁ?"

"హే! కమాన్ వాటీజ్ దిస్? మళ్ళీ కొత్త గేమ్ మొదలుపెడుతున్నావా?"

"లేదు అసలు నువ్వే ఒక దారుణమైన క్రూరమైన గేమ్ ఆడుకుంటున్నావంటున్నాను"

"వాట్ డూ యూ మీన్?"

"అయ్ మీన్ నేను అనన్యను అంటే కాదూ చిత్రని అన్నావు. నువ్వు అన్నావని కాదు. నేను నిజంగా చిత్రనే. ఒప్పుకుంటున్నాను. నువ్వు అడిగినట్టు అఫిడవిట్ సంతకం చేస్తానన్నాను. నీతో హైదరాబాద్ వస్తానన్నాను. పోలీసుల దగ్గరికో ఏ దర్యాప్తు అధికారుల దగ్గరికో నువ్వు ఎక్కడికి తీసుకెళితే అక్కడికి వస్తాను అంటున్నాను. అయాం రెడీ సర్ ఎవ్రీథింగ్ అని నేను అంటుంటే నువ్విప్పుడు కొత్త ప్రశ్నలు వేస్తున్నావు. యక్షప్రశ్నలు వేసి వేసీ నేను చిత్రను కాను అన్నట్టు వేధిస్తున్నావు. అనన్యనీ కాక చిత్రనీ కాక మరెవరో మోసగత్తెని అన్నట్టు. నన్ను మానసికంగా క్షోభ పెడుతున్నావు.

ఇలా నన్ను హింసించే అధికారం నీకెవరిచ్చారు? ఎవ్వరూ ఇవ్వలేదు. నువ్వే తీసుకున్నావ్! అంటే కామన్ సెన్స్‌కీ లాజిక్ కీ అతీతంగా కేవలం నన్ను ఇరుకున పెట్టి అడ్వాంటేజ్ పొందడానికే వ్యూహం వేశావని స్పష్టమౌతోంది. అండ్ అయ్ డేర్ సే. నీ ప్లాన్ వర్కవుట్ అవదు. షూర్!."

విన్నంతసేపూ విని పకపకా వికవికగా నవ్వాడు ధీరేంద్ర.

"ఓకే! ఓకే నాకో ప్లాన్ ఉంది! నిన్ను ఇరుకున పెట్టి అడ్వాంటేజ్ తీసుకునే ప్లాన్! కమాన్ చెప్పూ.. ఎటువంటి ప్లాన్ అయి ఉంటుందదీ? కమాన్. టెల్ మీ. టెల్ మీ." అన్నాడు సినిమాలో ఎమోషనల్ సీన్‌లో నటిస్తున్నట్టు.

"ఏమో! నాకేం తెలుసు? ఎలా తెలుస్తుంది? బట్ అయ్ సస్పెక్ట్ ఇట్ వెరీ స్ట్రాంగ్లీ!" అంటుండగానే అనన్య మెదడు కంప్యూటర్ ప్రాసెసర్‌లా పనిచేసింది. చకచకా లెక్కలు తిరిగాయి. మెరుపులు మెరిశాయి.

"ఎస్! మిస్టర్ ధీరేంద్రా! ఎవ్రీథింగ్ ఈజ్ పాజిబుల్! చిత్రకోసం నువ్వు ఊటీకి వచ్చావనే మాటే అబద్ధం కావచ్చు!" అంది అనన్య మొండిగా.

"వాట్?" అదిరిపడ్డాడు ధీరేంద్ర "కొత్తగా ఈ అనుమానం ఏమిటి?"

"అయాం జస్ట్ ఎనలైజింగ్! అండ్ సీయింగ్ ది పాజిటివిటీస్.. ఓకే?"

"ఓకే.. కమాన్. కమాన్!" అంటూ చురుగ్గా కదిలి సిగరెట్టు వెలిగించుకున్నాడు ధీరేంద్ర. సస్పెన్స్ స్టోరీ వింటున్న ఫోజుతో టైట్‌గా కూచున్నాడు.

"ఓకే.. లెట్ మీ సీ" అంటూ కథ అల్లుకుపోయింది అనన్య.

"నువ్వు నాకు పేపర్ కటింగ్స్. హెడ్ లైన్స్. ఏవేవో చూపెట్టావ్. ఆ ఫోటోల్లో నాలాంటి అమ్మాయే ఉంది. ఓకే. చిత్ర అనే క్రిమినల్ గర్ల్. పాస్ పోర్ట్ రాకెట్. హీరాచంద్ ఫ్యామిలీ పేరు బజార్న పడ్డం. హీరాచంద్ కొడుకు వీరేంద్ర. ఆ స్కాండల్‌లో ఉండడం అంతవరకూ ఫైన్!"

"షటప్ యూ సిల్లీ!.. ఇంకేది కాదు ఫైన్. కొంపతీసి నేను ధీరేంద్రను కాదంటావా? యూ ఆర్ ఎ రియల్ డెవిల్.."

"హ.హ" అంటూ ఆలోచనల్ని కెలుకుతున్నట్టు కళ్ళు తిప్పింది అనన్య.

"నువ్వు ధీరేంద్రవే! కాదనను. నీ దగ్గర డ్రైవింగ్ లైసెన్స్ ఉంటుంది. పాస్ పోర్ట్ ఉంటుంది. నువ్వు మిస్టర్ ధీరేంద్ర. సన్ ఆఫ్ హీరాచంద్ అనడానికి తిరుగులేని ఎవిడెన్సెస్ ఉంటాయి. కాదనలేదు. "

"కానీ నాకు వీరేంద్ర అనే అన్నయ్యే లేకపోవచ్చంటావ్?" అన్నాడు ధీరేంద్ర కవ్వింపుగా.

"నో! అలా అనలేను నువ్వు చూపెట్టిన న్యూస్ పేపర్ క్లిప్పింగ్స్‌లో వీరేంద్రతో బాటు హీరాచంద్ రెఫరెన్స్ ఉన్నాయి. అదికాదు.."

"మరేంటింక?"

తీక్షణంగా ఆలోచిస్తూ కథలో కొత్త మెలికలు వెతుకుతున్నట్టు చెప్పింది అనన్య. "న్యూస్ పేపర్‌లో వచ్చిన న్యూస్ వెనుక ఆ పాస్ పోర్ట్ కుంభకోణం వెనుక అసలు నిజం వేరే కావచ్చు. అసలు ఆ కుంభకోణానికి మాస్టర్ మైండ్ నీదే కావచ్చు. వైనాట్ ఎందుకు కాకూడదూ?"

రివాల్వర్ నుంచి బులెట్ దిగినట్టు అదిరిపడ్డాడు ధీరేంద్ర. "ఓగాడ్! టెరిబుల్! ఫెంటాస్టిక్! ఇటువంటి ఐడియా నీకు ఎలా వచ్చిందసలు? "అంటూ క్రూరత్వాన్ని అణిచిపెట్టుకుంటూ నవ్వాడు.

"ఇంకా డెవలప్ చెయ్యి ఈ స్టోరీని క్వైట్ ఇంట్రెస్టింగ్!"

"వైనాట్? నీలాంటి వ్యక్తి ఎంత చిన్న బెనిఫిట్ కోసమైనా ఎంత పెద్ద ఘోరమైనా చేసెయ్యగలడు. నువ్వు రెక్‌లెస్ డెవిల్‌వి అనడానికి నన్నిలా కిడ్నాప్ చేసి తీసుకురావడమే తిరుగులేని ఎగ్జాంపుల్!"

"ఓకే! అయాం ఎ డేర్ డెవిల్! సో" కొనకి వచ్చిన సిగరెట్‌తో మరో సిగరెట్ వెలిగించుకున్నాడు ధీరేంద్ర. అసహనాన్ని అదుపు చేసుకోవడానికి క్షణక్షణం ప్రయత్నిస్తున్నాడు.

"దేర్ ఆర్ టూ పాజిబులిటీస్!" అంది అనన్య, మూసిన పిడికిలి నుంచి రెండు వేళ్ళు బైటకి చూపుతూ.

"నంబర్ వన్! చిత్ర అనే క్రిమినల్‌తో నీకు చాలాకాలంగా సంబంధాలు ఉండొచ్చు. అది బాహాటమైన స్నేహం కూడా కావచ్చు.. ఏదో సందర్భంలో నువ్వు ఆమెని మీ బ్రదర్‌కి పరిచయం చేసి ఉండొచ్చు. ఆమె నీతో పరిచయాన్ని అండర్ ప్లే చేస్తూ వీరేంద్రతో పరిచయానికి మాత్రం పబ్లిసిటీ ఇచ్చుకుని ఉండొచ్చు. పాస్ పోర్ట్ రాకెట్ బైటపడేసరికి చిత్ర పేరుతోబాటు వీరేంద్ర పేరు మాత్రమే బైటకి వచ్చింది. కేవలం ఈ కారణం వల్లే ఇక నంబర్ టూ..."

"క్వైట్ ఇంట్రెస్టింగ్! అదీ చెప్పు."

"వీరేంద్రను వలలో వేసుకొమ్మని చిత్రను నువ్వే ఎంకరేజ్ చేసి వాళ్ళిద్దర్నీ పొలిటిక్స్ రాకెట్‌లో పావులుగా చేసి అదను చూసి నువ్వే పరోక్షంగా పోలీసులకూ, దర్యాప్తు అధికారులకూ ఇన్ఫర్మేషన్ ఇచ్చి ఉండొచ్చు.."

"బట్ వై షుడ్ అయ్ డూ ఇట్?"

"వెరీ సింపుల్!.. దటీజ్ పవర్ పొలిటిక్స్!" అంది అనన్య గొప్ప మేధావిలా విషయాన్ని తేల్చేస్తూ.

ధీరేంద్ర ముఖం హఠాత్తుగా ఎర్రబడింది. ఆగ్రహాన్ని అదుపు చేసుకుంటూ పిడికిళ్ళు బిగించాడు. దవడ కండరాలు బిగుసుకున్నాయి.

"యూ..ట్రెచరస్ గర్ల్! యూ మీన్ టు సే.. నేను మా అన్నయ్యకు ద్రోహం చేసి. స్కాండల్‌లో, క్రైంలో ఇరికించేసి.."

"ఎస్. ఎస్. వైనాట్?" అని ధిక్కరింపుగా తలెగరేసింది అనన్య.

"వీరేంద్రను కటకటాల వెనక్కి పంపేస్తే ధీరేంద్ర విల్ బికం ది మోనార్క్! హీరాచంద్ సామ్రాజ్యాన్ని అప్పుడిక నువ్వే కైవసం చేసుకుంటావ్!.. ధీరేంద్ర జైలు శిక్షనుంచి బైటికొచ్చేలోగా కంపెనీలూ వాటాలూ, షేర్‌లూ అటూ ఇటూ ఎలా మారినా నీ గుప్పెట్లోకి రావడం ఖాయం!"

చెంప ఛెళ్ళుమంది.

అనన్య మెదడు జీరో అయింది. కాలానికే కరెంట్ షాక్ తగిలింది.

వణికిపోతూ ధీరేంద్ర వైపు చూస్తుండగా అనన్య కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. మరుక్షణం రోషంతో అతని మీద ఎదురుదాడికి చెయ్యెత్తబోయింది. ధీరేంద్ర గబుక్కున ఆమె చేతులు ఒడిసి పట్టుకుని కర్కశంగా పట్టుబిగించాడు. ఆమె చేతుల్ని నిర్దాక్షిణ్యంగా నలిపేస్తున్నాడు.

"యూ. ఫౌల్ ఉమన్! అయ్ విల్ కిల్ యూ.. కిల్ యూ." అంటూనే ఆమె కళ్ళలో వచ్చిన మార్పు చూసి వెనక్కి తగ్గాడు.

చివ్వున నవ్వింది అనన్య. వెక్కిరింపుగా ధిక్కరింపుగా సవాలుగా

"సో. దిసీజ్ యువర్ గేం.. మిస్టర్ ధీరేంద్రా?"

"హ - " అంటూ ఆమెను వదిలేసి వెనక్కి తగ్గాడు. అవమానంతో తలదించాడు కట్టుకథ విన్నందుకే కంట్రోల్ తప్పినందుకు బాధపడ్డాడు. అంతలో చురుక్కున ఆమెను కాల్చేసేలా చూస్తూ "నీ స్టోరీలో చిత్రను అంత వల్గర్ గా చిత్రించావు. అయితే నువ్వు చిత్రవి కావన్నమాట. నా బలవంతాన చిత్రవి అన్నావు గాని నిజానికి చిత్రవు కావు కదూ?"

"బ్యాక్ టు స్క్వేర్ వన్!" అంది అనన్య విజయగర్వంతో.

"ఇప్పుడు నేనెవరో ఎలా తేలుస్తావు? ఎక్కడ తేలుస్తావు. చెప్పూ?"

"గ్గాడ్!" అంటూ సోఫాలో కూలబడ్డాడు ధీరేంద్ర.

హఠాత్తుగా ఎందుకో జంబో వచ్చి అతని వైపు ఎగాదిగా చూసి తోకాడించింది. "ప్చ్! లీవ్ మీ జంబో!"

మాస్టర్‌కి మనసు బాగులేదని దానికెలా తెలిసిందో అతని వైపు సానుభూతిగా చూస్తూ గసపోస్తూ కూచుంది.

అనన్యకు ఏమీ తోచలేదు.

కథ ఎలా నడుస్తుందిపుడు?

●●●

పులి పులిలా ఉండాలి. పిల్లిలా అయిపోకూడదు.

మరీ పిల్లిలా అయిపోలేదు గానీ అసహాయంగా మెత్తబడిపోయిన ధీరేంద్రని చూస్తే చాలా జాలి అనిపించింది అనన్యకు.

ఎంతటి హీరోకైనా డెడ్ ఎండ్ దగ్గర ఏమీ తోచదు. కనీసం కొత్త ఆలోచన రావాలన్నా, వెయిట్ చెయ్యాలి. తప్పదు.

అనన్య వైపు చూడ్డానిక్కూడా ధైర్యం చాలదన్నట్టు తల విదిలించాడు ధీరేంద్ర. "ఖాళీ సిగరెట్ బాక్స్‌ని విదిలించి విసిరికొట్టి "నాన్సెన్స్" అంటూ గబుక్కున లేచి బైటకెళ్ళాడు.

జంబో కుయ్యి కుయ్యిమంటూ వెంట వెళ్ళింది. అవతల స్కార్పియో స్టార్ట్ అయి దూసుకెళ్ళింది.

గస పోస్తూ తిరిగొచ్చిన జంబో అనన్య కేసి ఎగాదిగా చూసింది. దానికే గనుక మానవ భాష వస్తే ఎన్ని ప్రశ్నలు వేసేది?

దిక్కుతోచక అటూ ఇటూ తిరిగి అనుకోకుండానే కిచెన్ లోకి వెళ్ళింది అనన్య. టైం ఎంతో తెలియకున్నా మెల్లగా ఆకలి మాత్రం తెలిసింది.

అతను తెచ్చిపెట్టిన ప్రొవిజన్స్ ఒక్కొక్కటీ సర్దుతూ అందిన వాటితో అప్పటికి ఏవో వండడం మొదలుపెట్టింది.

మోడర్న్ కిచెన్ బటన్‌లు నొక్కి చూస్తూ ఉంటే చాలు. అన్నీ రెడీ అవుతాయి.

ఓవెన్‌ని కనిపెట్టిన ఆధునిక మానవుడికి జోహార్లు సమర్పించింది అనన్య.

హాట్ సూప్. చికెన్ ఫ్రైడ్ రైస్. ఆమ్లెట్స్.

కమ్మటి వాసనలతో ఆకలి రెట్టింపు అవుతుండగా వెజిటబుల్ సూప్ సిప్ చేస్తూ గుమ్మంలో చూసి ఉలిక్కిపడింది.

ఎపుడొచ్చాడో ధీరేంద్ర విలాసంగా సిగరెట్ తాగుతూ వంట గెటప్‌లో ఉన్న అనన్య వైపు వింతగా చూస్తున్నాడు.

శత్రుత్వం శత్రుత్వమే. ఆకలి ఆకలే. యుద్ధ సమయాల్లో శత్రుదేశాల రాయబారులు డిన్నర్ టేబుల్ దగ్గర మాట్లాడుకోవచ్చు. తప్పులేదు. అనవసరం కూడా.

మౌనంగా బౌల్‌లో సూప్ పోసి అందించింది అనన్య. భుజాలెగరేసి బౌల్ అందుకున్నాడు ధీరేంద్ర. వేడిపొగలు ఊదుకుంటూ సూప్ ఒక్క స్పూన్ సిప్ చేసి "వావ్!" అన్నాడు. అతని కళ్ళల్లో మెరుపు కనిపించింది.

అనన్య గుండెల్లో ఏదో కోరస్ అపుడే మొదలైంది. అదేమిటో ఆలకించి వినే వ్యవధి లేదు.

అతను సూప్ చిప్ చేస్తూనే అన్నాడు "దిసీజ్ వెరీ నైస్! అండ్ అయాం సారీ.. ఫర్..దట్" అన్నాడు ఆమె చెంపవైపు చూస్తూ.

ఇందాక అతను చెయ్యిచేసుకోవడం గురించి గుర్తుచేసుకుంటున్నాడన్నమాట.

"సూప్ అయిపోతే.. మనం లంచ్ చెయ్యిచ్చు.." అంది అనన్య కరుగ్గా మాట మార్చి.

ఎలా ఉంది ఈ ఘట్టం ఏదో ఫ్యామిలీ సీన్ లా లేదూ? అని లీలగా అనిపించింది. "టట్ - నాన్సెన్స్!" అని అంతలోనే ధిక్కరించింది అంతరాత్మ.

"దట్స్ ఓకే" అంటూ తనే కదిలి డైనింగ్ టేబుల్ సర్దాడు ధీరేంద్ర.

కాసేపట్లో ఇద్దరూ లంచ్ ఎంజాయ్ చేశారు.

"అసలు ప్రాబ్లం తప్ప.. మిగతా అంతా బావుంది. వెరీ వెరీ ఫైన్!" అన్నాడు ధీరేంద్ర కొంచెం రిలాక్స్ అయిన మూడ్‌లో.

"ఇందాక నువ్వు ఫెంటాస్టిక్‌గా డెవలెప్ చేసిన్ స్టోరీలో. నా ఊహకి ఏ మాత్రం అందని మెలికలు ఉన్నాయి. ఫరెగ్జాంపుల్ చిత్రా నేనూ కలిపి మా బ్రదర్‌ని స్కాండల్‌లో ఇరికించేస్తే ఇంకా నిన్ను పట్టుకోవాల్సిన అవసరం ఏమిటి నాకు? నువ్వు చిత్రవి కావని నాకుతెలిసినట్టే కదా?"

"దట్స్ కరెక్ట్!.. బహుశా నేను చిత్రని కానూ అనన్యని అని నీకు తెలిసే ఉండాలి. చిత్రలాగే నేను ఉండడం గమనించి మీరిద్దరూ నన్ను ఫాలో అయి ఇలా ట్రాప్ చేసి వైనాట్? చిత్ర బదులు నన్ను పోలీసులకి పట్టించేసి.. ఎటెన్షన్ డైవర్ట్ చేసేసి ఆలోగా చిత్ర తప్పించుకునే ప్లాన్ నువ్వే వేసి ఉండొచ్చు..."

నవ్వు ఆపుకోలేకపోయాడు ధీరేంద్ర. "ప్లీజ్ స్టాపిట్! ఈ స్క్రీన్ ప్లేలు నేను టాలరేట్ చెయ్యలేనింక.. ఓకే నువ్వు చిత్రవి కావు అనుకుందాం. కానీ అనన్యవి అనుకోవడానిక్కూడా లేదే.." అన్నాడు నిజాయితీగా.

"వై?... ఎందుక్కాకూడదూ?"

"నీ దగ్గర ఒక్క చిన్న ట్రేస్ ఆఫ్ ఎవిడెన్స్ కూడా లేదు. హోటెల్ స్టాఫ్ చెప్పిన వెర్షన్ ప్రకారం అనన్య రూం వెకేట్ చేసి వెళ్ళిపోయింది. ఓ టీవీ ఆఫీస్‌కి ఫోన్ చేస్తే అనన్య లాంగ్ లీవ్ పెట్టింది. ఆ తర్వాత అలాగే లీవ్ నుంచే రిజైన్ చేసింది. ఓకే అవ్వన్నీ వదిలేస్తే అనన్య అనే బ్యూటిఫుల్ గర్ల్ ఒంటరిగా ఊటీలో ఏంచేస్తూ ఉంది? వై ఈజ్ షీ హియర్?"

అతని చూపుల్లో సుడి తిరుగుతున్న అనుమానాల్ని క్షణంలో గ్రహించింది అనన్య.

ఇండియాలో ఓ అందమైన ఆడపిల్ల ఊటీలాంటి బ్యూటిఫుల్ స్పాట్‌లో హోటల్‌లో ఒంటరిగా ఉందటే ఎవరు నమ్ముతారు?

"వై షీ ఈజ్ హియర్?" అని రెట్టించి అడిగింది అనన్య. చెవుల్లో మనస్సులో కోరస్ హోరెత్తుతోంది.

"చెపితే నమ్ముతావా?"

"కమాన్. టెల్ మీ"

అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ నవ్వకుండా చెప్పింది అనన్య.

"నాకో లవర్ కావాలి. అందుకే ఊటీలో వెతుకుతున్నాను . రియల్లీ "

ఒక వైపు నుంచి తల ఇంకోవైపు వాల్చి మొహం చిట్లించి చూశాడు ధీరేంద్ర.

"ఇది ఇంకో ట్విస్టా?"

"చెప్పుకో చూద్దాం!"

●●●

## 13

**"చెప్పుకోలేను. ఎలా తెలుస్తుంది?"** అని తల విదిలించాడు ధీరేంద్ర. అతని ముఖంలో రంగులు మారుతున్న కన్‌ఫ్యూషన్ చూస్తూ తెగముచ్చట పడింది అనన్య.

*నిజాన్ని మించిన జోక్ ఉండదు. నమ్మలేని నిజాన్ని మించిన సందిగ్ధం ఉండదు.*

"ఐనా ఊటీలో ఒక అందమైన అమ్మాయి ఒంటరిగా ఉంటూ లవర్ కోసం వెతకడం ఏమిటి?" అన్నాడు ధీరేంద్ర తనలో తాను గొణుక్కుంటున్నట్టు. "బట్ వైనాట్?" అని మళ్ళా తనకు తనే సమాధానం చెప్పుకున్నాడు. "బట్. వాట్ సార్ట్ ఆఫ్ లవర్?" అని ప్రశ్న వేసుకున్నాడు.

అనన్య వైపు మార్చి మార్చి చూశాడు. కొలిచినట్టు తరచినట్టు గుచ్చినట్టు కెలికినట్టు చూసి చూసి తలతిప్పాడు. కళ్ళలోకి మళ్ళీ గుచ్చి గుచ్చి చూశాడు.

ఆ చూపుకి అనన్య మనస్సులో సముద్రం గడ్డకట్టినట్లయింది. ఆ చూపు కాలాన్నే ఆపేస్తుందనిపించింది. హిమాలయాలను కరిగించి పాతాళందాకా వెళ్ళి రహస్య రత్నాల్ని పెకలించుకురాగల చూపు అది.

టెర్రర్ అనిపించింది అనన్యకు. అతని చూపుని తట్టుకోవడం కష్టమై చూపు వాల్చింది. కళ్ళు తిప్పుకుంది. ధైర్యాన్ని కూడదీసుకుంది.

"వాట్? నన్ను స్టడీ చేస్తున్నావా?" అంది సవాలుగా.

"ఎస్! యూ ఆర్ వెరీ వెరీ స్ట్రాంగ్! నీ చుట్టూ ఎన్నెన్ని రహస్య వలయాలు ఉన్నాయో అంతుపట్టడం లేదు."

"యూ ఆర్ ఆల్సో స్ట్రాంగ్! ఆరితేరినవాడివి కదా! నా మాటని అంత తేలిగ్గా నమ్మవు. కానీ నమ్మకుండా ఉండలేవు" చాలా ధీమాగా నవ్వింది అనన్య.

నిజం చెపితే భయం ఉండదు. వేరే ఆలోచన ఉండదు. కత్తిమీద నడిచినా నిప్పుల్లో దూకినా కాళ్ళు తెగవు కాలవు.

నిజానికి అంత శక్తి ఉంది నిజానికి.

"నువ్వు నమ్మినా నమ్మకున్నా ఇది నిజం మిస్టర్ ధీరేంద్రా!" అంది అనన్య ప్రమాణం చేసి సాక్ష్యం చెపుతున్నంత నిర్మలంగా.

"అయాం ఎ లోన్‌లీ బర్డ్! జీవితంలో చాలా చాలా ఒంటరిదాన్ని. నాకు నచ్చిన మనిషికోసం అసలు సిసలైన మగవాడి కోసం వెతుకుతున్నాను."

"రియల్లీ? అటువంటి మనిషి దొరకడం అంత కష్టమా?"

"అసాధ్యమే అనిపిస్తుంది. అయినా ఆశ చావదు. ఈ విశాల ప్రపంచంలో ఎక్కడో ఒకచోట నాలాగా ఆలోచించి నాలాగా తపించే వ్యక్తి ఉండకపోడు. అతను నాకు తారసపడాలి. అంతే!"

"గ్రేట్ హోప్!"

నవలలో సినిమాలో డైలాగుల్లాగే అనిపించాయి. అయినా మాటలు దొర్లుతూనే ఉన్నాయి.

తమాషా అనుకుంటున్నాడా అతను? అనుకుంటే మరీ తమాషాగానే ఉంటుంది. తమాషా కాకపోవడమే తమాషా.

"లవర్ కోసం ఊటీలో ఎలా వెతకాలనుకున్నావ్ మరి?"

స్పష్టంగా వెటకారమే.

ఆమెది వెటకారమని అతని అభిప్రాయం కూడా.

"వెతకడం అంటే వెయిట్ చేస్తూ చూస్తూ ఉండడం."

"ఆఁహాఁ"

"లవ్ ఈజ్ సంథింగ్ దట్ హాప్పెన్స్!"

"కరెక్ట్!"

"పనిగట్టుకుని వెతికినంత మాత్రాన ప్రేమ దొరకదు. కానీ మైండ్ అండ్ హార్ట్ అండ్ సోల్ ఓపెన్‌గా ఉండాలి లెటిట్ హేప్పెన్ అనుకోవాలి. అప్పుడు ఏమో ఎలాగైనా జరగొచ్చు. ఏ గార్డెన్ లోనో రెస్టారెంట్‌లోనో, పిక్నిక్ స్పాట్ లోనో సమ్ డ్రీమీ థింగ్ మే హాప్పెన్!"

"గ్రేట్ హోప్! అండ్ ఊటీ ఈజ్ ఎ గ్రేట్ సెట్టింగ్!" అంటూ ఆమెకు కాస్త దగ్గరగా వచ్చి నవ్వకుండా సీరియస్‌గా అడిగాడు "సో యూ ఆర్ ఓపెన్? ప్రేమకోసం ఎదురుచూస్తున్నావు రైట్?"

అనుకోకుండా తలదించుకుంది అనన్య. ఇప్పుడు డైలాగ్ లేదు. అబద్ధం లేదు. అంతా నిజమే ఉంది. కళ్ళు మూసి తల ఊపింది. తనలో తను "అవును" అని ప్రమాణం చేసి చెప్పుకుంటున్నట్టు.

గబుక్కున అప్పుడు ఆమె మనస్సులో పూలవానకురిసి చిన్న జల్లు కురిసింది.

"మే అయ్ ట్రయ్?" అన్నాడు ధీరేంద్ర మెల్లగా.

"వాట్?"

"నీ లవర్‌గా నేను పనికొస్తానా?"

"ఇదేమిటి? ట్రిక్కా? ట్విస్టా?"

"ట్రిక్కూ లేదు ట్విస్టూ లేదు నిజంగానే నేను పనికొస్తానా అని? కానీ లవ్ అంటే తెలీదు నాకు"

"ఎలా తెలుస్తుంది?" అని పేలవంగా నవ్వింది అనన్య. "మరి ఎట్లా ట్రయ్ చేస్తావ్? అయ్ డోంట్ థింక్ అయ్ విల్ లైక్ యూ"

"లెట్ మీ ట్రయ్"

"మరిప్పుడు అసలు కథ ఏమైంది? హైదరాబాద్  ఇన్విస్టిగేషన్ స్కాండల్ అంతా ఏం కావాలిప్పుడు?"

"ఆల్ దట్ కెన్ వెయిట్! నాకన్నా నీకన్నా ఏదీ ఎక్కువ కాదు!"

నిజంగా అన్నాడా? అన్నట్టు భ్రమ కల్పించాడా? నాటకంలో డైలాగ్‌లా చెప్పాడా?

"మిస్టర్ ధీరేంద్రా! అయ్ షుడ్ వార్న్‌యూ! ప్రేమా దోమా అంటూ ఉచ్చులో పడొద్దు. అదో నిప్పు సుడిగుండం జన్మకి కోలుకోలేవు."

"లెట్ మీ ట్రయ్"

అతను పట్టువదలని విక్రమార్కుడా? "మరి నిప్పూ సుడిగుండం అయితే ఒక లవర్ కావాలని నువ్వెందుకు ఎదురు చూస్తున్నట్టు?"

"ప్రేమ కొందరికే తెలుసు. నీలాంటి వాళ్ళకి ఎన్ని జన్మలెత్తినా తెలీదు"

"అందుకే లెట్ మీ ట్రయ్!"

"నా పర్మిషన్ ఎందుకూ? నీ ధైర్యం నీ ఓపిక నీ కాన్ఫిడెన్స్!" నాటకీయంగా చెయ్యిముందుకు సాచాడు. అనుకోకుండా అనన్య ఆ చేతిలో చెయ్యివేసింది.

"ఫ్రెండ్స్?"

"ఫ్రెండ్స్!"

తరువాత అంతా రకరకాలుగా జరిగింది.

వాళ్ళిద్దరూ చేతిలో చెయ్యివేసుకున్నప్పుడు మాత్రం గుమ్మం దగ్గర్నుంచి మార్చి మార్చి చూస్తున్న జంబోకి ఏమీ అర్థం కాలేదు. తోక ఆడించింది. ఆడింది. తలవాల్చి తిప్పి చూసింది.

గొప్ప కన్‌ఫ్యూషన్‌లో పడింది.

●●●

"లెటజ్ గో ఔట్" అని ధీరేంద్ర అనగానే అనన్య మనస్సు ఉత్సాహంతో గంతులేసింది. ఇరవైనాలుగు గంటలా? రోజులా? సంవత్సరాలా? కిడ్నాప్ అయినప్పటినుంచి క్షణ క్షణం ఓ నరకంలాగా గడిచింది. అసలు ఈ బంధిఖానా నుంచి విముక్తి ఉంటుందా అనిపించింది.

మొదట రేప్ భయం. తర్వాత.. నువ్వు చిత్రవి. చట్టానికి లొంగిపో అని వేధింపులు.

ఎలాగో సమస్యని వదిలించుకోవాలంటే అడుగడుగునా అనుమానాలు. చివరికి చిక్కు పరిస్థితిని పక్కన పెట్టి మనస్సుకు రెక్కలు తెప్పించిన లవ్‌టాక్!

"కమాన్ లెట్స్‌గో!" అని స్కార్పియోను స్టార్ట్ చేస్తున్న ధీరేంద్రను చూస్తున్న కొద్దీ ఇదేదో కొత్త స్వప్నం ఇప్పుడే మొదలవుతోందన్న వింత అనుభూతి కలిగింది అనన్యకు.

అనుకోనిది జరుగుతోందా? లేక సరిగ్గా అనుకున్నట్టే జరుగుతోందా? తను ఊటీలో ఉండిపోయింది ఎందుకు? ఇందుకేనా?

దారి మలుపులో ఆర్ట్‌గ్యాలరీలో రెస్టారెంట్‌లో ఎక్కడో ఎదురై ఎక్కడో చూసినట్టుందే అనిపించాల్సిన ప్రియాతి ప్రియుడు సడెన్‌గా వచ్చి కిడ్నాప్ చేసుకొచ్చి ఇక్కడ బంగ్లాలో పెట్టుకున్నాడా?

ప్రేమ ఎలా అయినా రావచ్చు. ఎటునుంచి అయినా మొదలు కావచ్చు. ఒక్కోసారి ద్వేషం నుంచి అనుమానం నుంచి అయినా పుట్టుకు రావచ్చు.

పచ్చిగాలి దూసుకొస్తుండగా స్కార్పియో మెలికలు తిరుగుతూ దిగుతోంది. ఎప్పుడు ఎక్కిందో జంబోకూడా కారు వెనకసీట్లో ఉంది. ఇద్దరి వైపూ మార్చిమార్చి చూస్తోంది.

దానికి మనిషి భాష రాదుగాని మనిషి మనసు తెలిసే ఉంటుంది. ఇద్దరు శత్రువుల మధ్య కొత్తగా పుడుతున్న స్నేహాన్ని అది ఎలా అర్థం చేసుకుంటోంది?

బంగ్లా ఉన్న గుట్ట దిగి మట్టిరోడ్డు మీద ఊగుతూ వెళ్ళి కాలవ దాటింది స్కార్పియో. మట్టి రోడ్డు మీద దాదాపు కిలోమీటర్ వెళ్ళి కుడివైపు తిరుగుతూ తారు రోడ్డెక్కింది.

"కరెక్ట్" అనుకుంది అనన్య. ఇదివరకు కిడ్నాప్ అయి వచ్చేప్పుడు మనసులో నోట్ చేసుకున్న రూట్ మ్యాప్ గుర్తుచేసుకుంది. తర్వాత ఓల్డ్ బ్రిడ్జి! తరవాత జింకల పార్క్! వాటర్ ట్యాంక్! దాటగానే పెద్ద గాల్ఫ్ ఎస్టేట్‌జ్

"ఈ ఎస్టేటులో ఎవరుంటారు?" అంది అనన్య యధాలాపంగా.

"ఫిడ్జరాల్ట్ ఉండడు" అని ఈజీగా నవ్వాడు ధీరేంద్ర. "ఊరికే తలపగలగొట్టుకోకు. రూట్ అంతా నీకు తెలిసినా నువ్వు ఎవరికైనా మెసేజ్ పంపే అవకాశం ఉండదు. ఎట్టిపరిస్థితిలో ఉండదు. అయ్ విల్ సిట్ ఇట్. నీ అంతట నువ్వు పారిపోతే జంబో విల్ టేక్ కేర్"

"చూడు మిస్టర్ ధీరేంద్రా ఉయ్ ఆర్ ఫ్రెండ్స్ నౌ అనుమానాలు ఉండకూడదు."

"ఉన్నా అవి నా కంట్రోల్ లోనే ఉన్నాయని చెపుతున్నాను."

దూసుకుపోతున్న స్కార్పియోలోంచి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ ఉండిపోయింది అనన్య. ఎక్కడికో తెలియనట్టు 'ఎయిడ్‌లెస్'గా డ్రైవ్ చేస్తూ పోయాడు ధీరేంద్ర.

పైన మబ్బులు పొర్లుతున్నాయి. చుట్టూ ప్రకృతి కదులుతోంది. ఎటుపోతే అటు పోనీ అనిపించింది అనన్యకు.

లోయలోకి వాలుగా దిగుతుండగా రోడ్డుమీద జనసంచారం కనిపించింది. కాస్త దూరం వెళ్ళగానే డప్పుల మోత, ఏదో ఉత్సవం. సందడి.

అక్కడేదో చిన్న ఊరు. కళకళగా ఉంది.

చిన్న గుడిముందు కోలాహలం.

"వావ్! ఫెంటాస్టిక్! నేవెళ్ళి గుళ్ళో దర్శనం చేసుకురానా?" అంది అనన్య ఉత్సాహంగా.

"వెళ్ళు, నీ ఇష్టం! ఓకే!" అంటూ వారగా ఆపాడు ధీరేంద్ర.

దిగి వెళుతూ చూసింది అనన్య. ధీరేంద్ర కారు దిగి సిగిరెట్టు వెలిగించుకున్నాడు. జంబో తనవైపే మిర్రి మిర్రి చూస్తోంది.

ఇక్కణ్ణించి తను పారిపోవడానికి ట్రై చేస్తే ఎలా ఉంటుంది? ఆ పల్లె జనం మధ్యకి వెళ్ళిపోయి కిడ్నాప్ నుంచి తనని కాపాడమని ప్రాధేయపడితే ఫలితం ఉంటుందా?

తను అటువంటి ప్రయత్నం చెయ్యవచ్చునని ధీరేంద్రకు అనుమానం లేదా?

ధీరూ ధీమా ఏమిటి?

ఇక్కణ్ణించి తను పారిపోయే ప్రయత్నం చేస్తే వెంటనే ఏం చెయ్యాలో అతనికి తెలిసే ఉంటుంది. పరిస్థితి చూస్తే కాసేపు అతను ఊరుకున్నా జంబో ఊరుకునేలా లేదు.

మొత్తానికి పెద్ద సీన్ అవుతుంది. తర్వాత పరిస్థితి ఏమిటో ఏమాత్రం ఊహించడం కుదరదు.

గుళ్ళోకి వెళుతున్న అనన్య వైపు జనం వింతగా చూశారు. ఆటోమేటిక్‌గా దారి వదిలారు. చిన్నగుడి. క్యూలేదు. టిక్కెట్లు లేవు.

ద్వారంలోనే కనిపించింది అమ్మవారు. ఎర్రటి పట్టుచీర. నల్లటి రాతివిగ్రహానికి కళకళగా పసుపు కుంకుమలు. పూలదండలు.

మొదట భీతి కలిగించినా తర్వాత అమ్మవారే అభయదేవత అనిపించింది.

దైవభక్తి మీద అనన్యకు నమ్మకం ఒకప్పుడు ఉంటుంది ఒకప్పుడు ఉండదు.

ఆపద వచ్చినప్పుడు ఆశతో విశ్వాసంతో అతీత శక్తిమీద భక్తికలగడం సహజం. బలహీనత అనిపించినా అదే అప్పుడు బలం.

అమ్మవారికి అసంకల్పితంగానే నమస్కారాలు చేస్తూ ప్రార్థించుకుంది అనన్య.

"తల్లీ ఇది ఎటువంటి ఆపదో తెలీదు. ఎటుపోయి ఎటు బైటపడతానో తెలీదు. కానీ అపరిచిత వ్యక్తి ఇప్పుడు సుపరిచితుడవుతున్నాడు. ఇతనితో లైఫ్‌లో కొత్త అధ్యాయం మొదలవుతుందేమో! మనస్సు నలిగిపోకుండా పశ్చాత్తాపం దహించి వెయ్యకుండా చూడు"

అది మొక్కు కాదు. తెలియని ఆశమీద ఎందుకో నమ్మకం.

స్కార్పియోలోంచి కుతూహలంగా చూస్తూ నవ్వాడు ధీరేంద్ర.

అనన్యకు ఎదురెళ్ళి రిసీవ్ చేసుకుని ఆమె కారు ఎక్కాక తనూ జంప్ చేసి కూచుంది జంబో.

"ఏం చెప్పింది అమ్మవారు?" అన్నాడు ధీరేంద్ర ఈజీగా డ్రైవ్ చేస్తూ "లేక ఈ భక్తి అంతా యాక్టింగేనా?"

అతనివైపు చివుక్కున చూసింది అనన్య. శత్రువులు మిత్రులవుతుంటే అనుమానాలు ఉండకూడదు. అవమానించడం ధర్మమే కాదు.

"ధీరేంద్రా! యూ షుడ్ నో వన్ థింగ్!"

"వాట్?"

"అయాం ఆల్సో హ్యూమన్ బీయింగ్"

ఆమెని నొప్పించినందుకు మొట్టమొదటిసారిగా బాధ కనబరిచాడు ధీరేంద్ర "సారీ వెరీ సారీ రియల్లీ"

ఆ మాటతో ఊరట కలిగింది.

"ఈ అడవులూ కొండలూ సరే ఇక్కడెక్కడా చిన్న కాఫీ షాప్ ఉండదా?"

"నాకూ తెలీదు చూద్దాం"

అప్పుడేదో సర్దుకుంది. ఇద్దరిమధ్యా ఇక ఈజీ అనిపించింది.

జంబో ధీరేంద్ర వైపు ఆర్తిగా చూస్తోంది.

దానిక్కూడా ఏదో అర్థమౌతోంది.

●●●

హోటల్ లేదు. చిన్న బడ్డీ దగ్గర కాఫీ తాగారు. దగ్గర్లో రైతులు రోడ్డు మీదకి తెచ్చి అమ్ముకుంటున్న క్యారెట్‌లు, క్యాబేజీలు, పసుపచ్చటి అరటిపళ్ళు కొన్నారు.

పొద్దు దిగిపోతోంది. పచ్చటి ప్రకృతి మీద సన్నటి మంచుతెర వాలుతోంది. చలి పెరుగుతోంది. ఈదురుగాలి విసిరికొడుతోంది.

దారి మలుపులో కారు ఆపి రెండు లోయల మధ్య కొండలు గుట్టలు పరుచుకున్న నీలి దృశ్యాన్ని తనివితీరా చూశాడు ధీరేంద్ర.

"సో హి లైక్స్ నేచర్!" అనుకుంది అనన్య. ఇతనో దుర్మార్గుడు అరాచకవాది రౌడీ ఎలిమెంట్ అంటే ఎలా నమ్మడం?

"ఆ లోయలో అదిగో ఆ కనిపించే గుట్టమీద చిన్న పెంకుటిల్లు వేసుకుని జీవితాంతం అక్కడే ఉండిపోతే ఎలా ఉంటుంది?" అన్నాడు ధీరేంద్ర.

నమ్మలేకపోయింది అనన్య. ఈ మొండి మనిషి మనస్సులో అంత రొమాంటిక్ అంత ఈస్తటిక్ అంత ఫిలసాఫికల్ ఐడియా ఉందా? లేక కేవలం తనని ఇంప్రెస్ చెయ్యడానికి చెబుతున్నాడా?

అని కూడా అనిపించింది.

"హ్యానీ డేవిడ్ థార్? వాల్డెన్ పాండ్ దగ్గర ఉన్నట్టు" అంది అనన్య.

ఇద్దరి చూపులు మెలిపడ్డాయి. వాల్డెన్  తనెందుకు చదివి ఉంటాడూ? అనుకుంది అనన్య.

తమాషాగా నవ్వాడు ధీరేంద్ర.

"హ్యానీ డేవిడ్ థార్ మహాశయునికి ధన్యవాదములు" అన్నాడు నాటకీయంగా.

"మేధావిగా ఆరితేరిన ఒక ఇంగ్లీషువాడు. జనజీవితంలో విసుగెత్తి నాగరికతకి దూరంగా ఏడాదో రెండేళ్ళో గడిపి అక్కడ ఒంటరి జీవితం తాలూకు అనుభవాన్ని ఒక్క పుస్తకంగా రాస్తే కొన్ని అచ్చుకొట్టి ప్రపంచమంతా చదివారు. చదువుతున్నారు. వాల్డెన్! గ్రేట్ బుక్! ఓకే కాని"

"కాని??"

"వేలాది సంవత్సరాలక్రితం ఇండియాలో యోగులు ఋషులు కారడవుల్లోకి వెళ్ళి దశాబ్దాల తరబడి ఘోరతపస్సులు చేసారు. కందమూలాలు ఆకులు అలమలు తిన్నారు. లెక్కలేనంత మంది ఆ తపస్సు జీవితంలోనే తరించారు. చాలామంది అడ్రెస్ లేకుండా అంతరించారు. వేదాలకు శాస్త్రాలకు భాష్యాలు రాశారు. మనోనిగ్రహంతో మహత్కార్యాలు చేశారు. వాళ్ళ గురించి చెప్పుకోవడానికి మనకు నోరు రాదు భాషలేదు. ఎందుకంటే వాళ్ళు పుస్తకాలు రాసి పబ్లిసిటీ చేసుకోలేదు. రైట్?"

కలా నిజమా అన్నట్టు కళ్ళనీ చెవుల్నీ నమ్మలేనట్టు అలా ఉండిపోయింది అనన్య. గిట్టనివాళ్ళమీద యాసిడ్ దాడి చేస్తాడంటారే ఆ నరేంద్ర ఇతనేనా? ఋషులు యోగులు తపస్సుల గురించి ఇతను మాట్లాడ్డమేమిటి?

అనన్య అపనమ్మకాల ప్రపంచం తలకిందులై తిరుగుతోంది.

"వావ్! సో యూ నో థింగ్స్ బెటర్!"

గబుక్కున నవ్వేశాడు. "సారీ సారీ నాకేం తెలీదు."

ఆ తర్వాత కారు కదులుతుంటే మబ్బుల్లో వెళుతున్నట్టు అనిపించింది అనన్యకు. జంబో బ్లాంక్‌గా చూసింది. దానికి ఏమనిపించిందో మరి.

●●●

అనన్యకు ఇప్పుడు ఆ బంగ్లా ఓ అద్భుతం అనిపించింది. బందిఖానా కాదు. బంగారు కల అనిపించింది.

రాగానే అతను కిచెన్‌లోకి వెళుతూ "అయ్ విల్ కుక్ డిన్నర్. యూ రిలాక్స్" అన్నాడు.

"నాకైతే ఏమీ వద్దు. బహుశా ఆకలి ఉండదు."

"నే చేసేది చేస్తా తినడం సంగతి తర్వాత జంబోకు కూడా ఏదైనా వండాలి"

చూసుకుంటాను అనే ఈ మనిషి ఎన్ని చూసుకుంటాడు? ఊటీలో ఇతనితోబాటు ఓ రౌడీ గ్యాంగ్ ఉండాలి అనుకుంది మొదట. వాళ్ళు ఏమయ్యారు ఎటుపోయారు? ఫోర్ల మీద ఏం నడుస్తోంది? ఆలోచించే ఓపిక లేక నెమ్మదిగా మేడమెట్లెక్కింది అనన్య.

బెడ్‌పై వెల్లకిలా వాలి కళ్ళుమూసుకుంది.

తను తనుకాదు. అతను అతను కాదు అనిపిస్తోంది.

ఉన్నట్టుండి ఇదంతా అతను చేస్తున్న ఇంకో ట్రిక్కేమోనని భయమేసింది. హెన్రీ డేవిడ్ థారో్నీ భారతీయ మహర్షుల్ని అర్థం చేసుకున్న ఈ మనిషి రేపిస్టులా కిడ్నాపర్‌లా గూండాలా ఎన్ని అవతారాలెత్తాడు? ఆపదనుంచి అన్నయ్యను రక్షించుకోవడానికి ఎన్నెన్ని సాహసాలు చేస్తున్నాడు.

హఠాత్తుగా ప్రేమపర్వం మొదలైతే దాంట్లో లవర్ పాత్రకూడా పోషిస్తున్నాడు. వీటన్నిటి వెనకా అంతరాంతరాల్లో ఈ మనిషి నిజస్వరూపం ఏమిటి?

ఇదివరకు భయంతో ఉంది. ఇప్పుడు నమ్మకంతో ఉంది. ఇతనితో ఇంకోరాత్రి బంగ్లాలో ఏకాంతంగా ఉండాలి.

భయాన కాదని నయాన లొంగతీసుకునే మార్గమా ఇది?

పులి ఎన్నివేషాలు అయినా వేస్తుంది. గోముఖ వ్యాఘ్యం అంటారు. ఈ పులి గోవు వేషం వేస్తోందా?

నమ్మితే ఇంకేమౌతుంది?

ఎదురుచూస్తోంది అనన్య. గుమ్మంలో చప్పుడైంది. తలతిప్పి చూసింది.

నవ్వుతూ నిలుచున్న ధీరేంద్ర చేతుల్లో రెండు గాజుగ్లాసుల్లో ఎర్రటి ద్రవం వింతగా సుతిమెత్తగా మెరుస్తోంది.

తాగాలా? తనూ తాగాలా? అతని ఉద్దేశం ఏమిటి?

బ్లాంక్ గా చూస్తోంది అనన్య. అతను నెమ్మదిగా ముందుకొచ్చి గ్లాస్ అందించేసరికి ఆటోమేటిక్‌గా అందుకుంది.

అంతా కలలాగే ఉంది.

కలలో ఏమైతేనేం?

●●●

## 14

**అనన్యా! నేనెవరో నీకు తెలుసు. నువ్వెవరో నాకు తెలీదు.**

అనన్యా! నువ్వెవరో నాకు తెలుసు. నేనెవరో నీకు తెలీదు.

అంటున్నట్టే ఉన్నాడు ధీరేంద్ర. అలా అనడంలేదు. అతని ధోరణి అతని చూపులు ఆ మాటల వెనక ప్రతిధ్వని అనన్య మనస్సుకే వినిపిస్తోంది.

ఎప్పుడో ఫ్రెండ్స్‌తో బాటు డ్రింక్ చేసింది అనన్య. మత్తు అంటే భయం. మనస్సు వశం తప్పుతుందని. మాటలు ఎక్కడికో వెళ్ళిపోతాయని.

ధీరేంద్ర లాంటి అపరిచితులుతో కలిసి డ్రింక్ చేయాల్సి వస్తుందని ఎప్పుడూ కలగనలేదు.

ఇది కలలో కల. నమ్మకంలో అపనమ్మకం. చలిలో వేడి.

"అయ్ లైక్ యూ డ్రింకింగ్ విత్ మీ.. యూగాట్ రైట్ స్పిరిట్!"

"హుఁ. అందుకే డ్రింక్స్‌లో ఫ్రెండ్స్‌ని స్పిరిచువల్ ఫ్రెండ్‌షిప్ అంటుంటారు. నౌ అయ్ టూ లైక్ యూ సమ్‌వేస్ ధీరేంద్రా. నిజానికి ఇదంతా ఐమీన్. నీ వర్సటైల్ పర్సనాలిటీ అంతా. నాకు చాలా పజిలింగ్ గా ఉంది. నువ్వు నేననుకున్నంత రౌడీవి కాదు. వేస్ట్ కేరక్టర్‌వీ కాదు."

గ్లాసులు ఖాళీ అయ్యాక అతను మేడదిగి వెళ్ళి బాటిల్‌తో బాటు సోడాలు తెచ్చిపెట్టాడు. అతను రెండో పెగ్ దాటాడు. ఆమె మొదటి దాంట్లోనే ఉంది. ఆ మాత్రానికే మెదడు పొరల్లో సంగీతం కదుల్తోంది.

"స్పిరిచువల్!" అంటూ నవ్వాడు ధీరేంద్ర.

"హ్యానీ డేవిడ్ థారో?" అంటూ ఆమె విస్మయానికి కారణాన్ని సరిగ్గానే ఊహించాడు.

"చదవడానికేముందిలే. ఎన్నయినా ఎంతైనా చదవొచ్చు. అప్పుడప్పుడూ పుస్తకాలు తిరగెయ్యడం ఓ సరదా నాకు. సైన్స్. లిటరేచర్, ఫిలాసఫీ. తిరగేస్తుంటాను. జురతుష్ట్ర, జెన్ బుద్ధిజం.. రోమారోలా.. మొరాలియా.. అగాధా క్రిస్టీ.. లిస్ట్ చాలా పెద్దదిలే. అయితే అవ్వన్నీ ప్రాక్టికల్ లైఫ్‌కి పనికిరావు."

"లిస్ట్ పెద్దదా?" నిండు కళ్ళతో అతనికేసి నిశ్చలంగా చూసింది అనన్య. వీధి రౌడీనా? రిసెర్చ్ స్కాలరా? దిస్ గై ఆల్వేస్ సర్‌ప్రైజెస్ మీ.. అవలేదా?

"ధీరేంద్రా! వాట్ డూ యూ వాంట్ ఇన్ లైఫ్?. జీవితంలో నీ ఎయిమ్ ఏమిటి?"

"జస్ట్ వన్ సింపుల్ థింగ్"

"వాట్?"

"బీ హేప్పీ"

నిజం అనిపించేంత, తమాషా అనిపించేంత నిజం.

అతనలా చెప్పేసరికి ఇంకే అడగాలో తోచలేదు అనన్యకు.

ఆర్గ్యుమెంటు మొదలు పెడితే అది ఎక్కడికైనా వెళుతుంది.

ఎలాగ హేప్పీ? ఏం చేస్తే హేప్పీ?

"ఏ రోజుకి ఆ రోజు. ఏ పని పడితే ఆ పని చేస్తూ చేయగలిగినందుకు హేప్పీగా ఉంటాను, అంతే!"

"దెన్. యూ ఆర్ ఆల్వేస్ హేప్పీ!"

"ఎస్. అయ్ థింక్ సో"

"యోగులు ఋషులు అన్నావు ఇందాకా. వాళ్ళనుంచీ నువ్వేం నేర్చుకున్నావ్?"

"వాళ్ళు కళ్ళు మూసుకుని ఆనందం అన్నారు. నేను కళ్ళు తెరిచి హేప్పీ అంటున్నాను."

కళ్ళు తిరిగాయి అనన్యకు.

ఒక్క గుక్కతో గ్లాస్ ఖాళీ చేసింది. మనస్సు నిండిపోయింది.

ఇంకేమీ వద్దు అనిపించింది.

●●●

డిన్నర్ ముగిసేసరికి అర్ధరాత్రి దాటింది. అన్నీ అతను చేసినవే. అద్భుతంగా ఉన్నాయనిపించింది. జంబోకు కూడా ఏదో పెట్టాడు. అది హేప్పీగా ఆరగించి మూలకెళ్ళి ముడుచుకుని పడుకుంది.

అతను అన్నీ సర్దేస్తూ ఏవేవో మాట్లాడుతూనే ఉన్నాడు.

మాటల మీద కాదు అతని మీదే ఉంది అనన్య మనస్సు.

వీడేనా? కావలసిన వాడేనా? ఇంతకన్న ఇంకెవ్వరూ అవసరం లేదా? అనిపించింది.

"సో గుడ్ నైట్. వెళ్ళగలవా మేడమీదికి?" అన్నాడు.

హౌ పొలైట్ అండ్ డీసెంట్! మత్తులో మెత్తగా నవ్వుకుంది అనన్య. ఏకాంతంలో అందమైన ఆడపిల్లతో ఇంత బుద్ధిగా బిహేవ్ చెయ్యడం కూడా ఇతనికి చాతనౌతుందా? లేక కేవలం డీసెంట్‌గా బిహేవ్ చేస్తూ తన మనస్సు దోచుకోవాలనుకుంటున్నాడా? ఊరించాలనుకుంటున్నాడా?

అపుడే ఓ తమాషా ఆలోచన మెదిలింది.

"ధీరూ ఐ వాంట్ టు సే సంథింగ్!"

"ఎనీ థింగ్ న్యూ?

"నాకిప్పుడు ఎవ్రిథింగ్ న్యూ. ఒక తమాషా అయిన నిజం చెప్పాలని అయ్ మీన్. చెప్పెయ్యాలని ఉంది" అంటూ మెట్లెక్కింది. అతను ఫాలో అయ్యాడు.

"తాగినప్పుడు అంతా నిజమే చెపుతారంటారు ఎవరైనా" అంది అనన్య.

"కరెక్టే కాని. తాగి చెప్పాను కాబట్టి నిజమని నమ్మించెయ్యొచ్చు అనుకోవచ్చు."

"యూ ఆర్ వెరీ క్లెవర్. అసలు నిజం ఏమిటంటే నేను నేను కాను."

"వండ్రఫుల్! అవునని ఎవరన్నారని?"

"నీకు అర్థం కావడంలేదు. నేను చిత్రని కాను. అనన్యనీ కాను. నిజానికి నా పేరు వైశాలి నా అసలు పేరు వైశాలి.ఆం"

మేడమీద బెడ్ రూం దగ్గర ఆమె ఆగింది. అతను నవ్వుతూ చూశాడు. "ఓకే వైశాలీ గుడ్ నైట్!"

"నువ్వు నమ్మడం లేదు కదూ? నేను చెప్పింది అసలు నిజం"

"ఓకే అన్నాను కదా ఏం? మత్తులో చెపుతున్నాననా? "

ఆ ఒక్క క్షణం చుట్టూ యుగయుగాల సంకోచం గడ్డకట్టింది.

విదిలించుకుంది అనన్య.

అతని ఛాతీ మీద అరచేత్తో తట్టింది.

"నౌ అయ్ లైక్ యూ. నా కలల్లో నా ప్రియుడితో గడిపేటప్పుడు నాకో మధురమైన పేరుండాలని వైశాలి అని పెట్టుకున్నాను. ఆ పేరులో గొప్పతనం ఉంది. క్లాసిక్‌గా ఉంటుంది. అర్థమేమిటో నాకెందుకు? అయ్ జస్ట్ లైక్ ది సౌండ్ వై...శా...లి"

"ఓ దట్స్ యువర్ ఫ్యాన్సీ నేమ్. డ్రీమ్ నేమ్?

"జస్ట్ ఫర్ మై డ్రీమ్ బోయ్. హౌడూ యూ లైకిట్?"

మెల్లగా నడిపిస్తూ బెడ్ దగ్గరికి తీసుకెళ్ళి పడుకోబెట్టాడు. అతని స్పర్శ కొత్తగా వింతగా అనిపించలేదు. చాలా సహజంగా ఉంది. "దట్స్ ఎ వెరీ స్వీట్ నేమ్. గ్రేట్ నేమ్. అయ్ .. రియలీ లైకిట్. వైశాలీ"

అతను వైశాలీ అనగానే గబుక్కున అతణ్ణిలాగి చెంపమీద ముద్దుపెట్టుకుంది. అతనే ఆశ్చర్యపోయాడు. మీద పడిపోకుండా నిలదొక్కుకున్నాడు.

మనిషే, పులికాదు. మీద పడలేదు.

"వైశాలీ ఏమిటో వైశాలికే తెలీడు" అతని వైపు మధురంగా చూసి కళ్ళూ మూసుకుంది.

"సన్నీ. అండ్ ఫెంటాస్టిక్! సో గుడ్ నైట్" అంటూ అతను లైట్ ఆఫ్ చేసి బెడ్ ల్యాంప్ వేసి నీడలా వెళ్ళిపోయాడు.

ఒక కల దూరమైపోయినట్టు నిట్టూర్చింది అనన్య. గుండె లయ తప్పికొట్టుకుంది.

ఆశ్చర్యాన్ని మించిన అద్భుతం. ఎక్కణ్ణించి వచ్చింది ఈ వైశాలి? మత్తుకు ఇంత మహిమ ఉందా?

పెదవులకి అతని చెంప మళ్ళీ సోకినట్లయింది. తనకే తెలీకుండా తనలో ఇంకేదో కోరిక ఉందా? శక్తిఉందా?.

●●●

"గుడ్ మార్నింగ్" అంటూ ప్రొద్దున్నే బెడ్ కాఫీతో నిద్రలేపాడు ధీరేంద్ర. నిద్రలోంచి కాదు. కలల్లోంచి మేలుకొల్పినట్లయింది. అతను పలకరించకపోతే అలాగే కలల్లో కూరుకుపోయి మాయమైపోయేదాన్నేమో అనిపించింది. నిద్రకాదు. మత్తుకల.

వేడి వేడి పొగల కాఫీ చప్పరిస్తుంటే రాత్రి మత్తు ఘడియలు లీలగా గుర్తొచ్చాయి. అన్నీ గుర్తున్నాయా కొన్ని, మరిచిపోయానా అనిపించింది.

ఎవరో తోసినట్లు అతన్ని ముద్దుపెట్టుకున్న సంగతి గుర్తొచ్చి లజ్జతో చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి.

"అయ్ లైక్ దిస్ వైశాలీ కాన్సెప్ట్" అన్నాడు ధీరేంద్ర కాఫీ పొగలమీదుగా. కిటికీ నుంచి వస్తున్న సూర్యరశ్మిని చూస్తూ చాలా పొద్దెక్కింది. అతను ఎప్పుడో తయారయినట్టున్నాడు. జీన్స్ మీద వైట్ టీ షర్ట్‌లో సింపుల్‌గా ఎలిగెంట్‌గా ఉన్నాడు.

"అనన్య. చిత్ర అవును కాదు. వీటిలో నువ్వూ నేనూ విసుగెత్తిపోయాం. కాస్సేపు వీలైనంత సేపూ నువ్వూ నేనూ. జస్ట్ సింపుల్ మనుషులుగా ఉండడానికి ఈ వైశాలి కాన్సెప్ట్ బావుంది. ఓకే. నౌ గెట్ రెడీ. ఉయ్ విల్ స్పెండ్ ఈజ్ ఈజీ టైమ్"

అనన్యకు భయం లేదు. ఎవరితోగానీ తనకు తనే గాని గిల్టీగా ఫీల్ అవదు.

"ధీరూ రాత్రి నేను ఎగ్జయిట్ అయ్యాను. అయ్ మీన్ ఎక్కువ ఫ్రీగా బిహేవ్ చేశాను. యూనో."

"ఫర్గెట్! ఆ మాత్రాన లూజ్‌గా అనుకుంటానా? లేక అడ్వాంటేజ్ తీసుకుంటానా? రాత్రీ అలా బిహేవ్ చేసింది నువ్వు కాదు.. వైశాలి! అయ్ నో"

"స్నేహం కోసం ప్రేమకోసం. కల్మషం లేని సహజీవనం కోసం పరితపించే అద్భుత మూర్తి వైశాలి. దట్స్‌మై ఐడియల్ మీ అండ్ దట్ వైశాలీ లైక్స్‌యూ."

ఎగిరిగంతెయ్యలేదను. ఆనందంతో ఊగిపోలేదు. ఆమె చెప్పిందేమీ న్యూస్ కాదతనికి. అతనేమిటో అతనికి తెలుసు. ఇంకొకరు గురించినపుడు చిన్న సంతోషం. అంతే.

లవర్ కావాలని ఆమె అంటే "లెట్ మీ ట్రై" అన్నవాడు ఇతనేనా అనిపించింది. ఇతను ట్రై చెయ్యడం కాదు ఇతని కోసం ఏ అమ్మాయి అయినా "లెట్ మీ ట్రయ్" అనుకోవాలేమో అనిపించింది.

"వైశాలీ లైక్స్‌మీ?" గమ్మత్తుగా తలతిప్పాడు.

"చూద్దాం ఎంతవరకో"

వ్యంగ్యమే. కానీ ఇప్పుడు చిరాకు అనిపించలేదు. అనన్యకు. పైగా అదే బావుందనిపించింది.

●●●

జంబోకు ఏమీ తోచడం లేదు. స్కార్పియో చుట్టూ తిరిగింది. కాంపౌండులో అటూ ఇటూ గస్తీ తిరిగింది. కాంపౌండ్ నుంచి బైటకీ అటునుంచి ఇటూ ఎగిరి దూకింది. తర్వాత నెమ్మదిగా బంగ్లా లోపలికి వచ్చి ఎటుపడితే అటు నడిచింది. జంబోకు ఆలోచనలు ఎక్కువగా ఉండవు.

మాస్టర్‌ని ఫాలోకావాలి. మాస్టర్ చెప్పింది చెయ్యాలి ఎంత దూరంలో ఉన్నా మాస్టర్ పిలిస్తే పలకాలి. మాస్టర్ పిలుపు కోసం చెవులు రిక్కించి వినాలి.

సోఫా చుట్టూ మాస్టర్ చుట్టూ తిరిగింది జంబో. మాస్టర్ పట్టించుకోవడం లేదు. మాస్టర్ సీరియస్‌గా మేడంతో మాట్లాడుతున్నాడు.

"వాచ్ హర్" అనేవాడు ఇదివరకు. ఇప్పుడు అనడంలేదు. అయినా వాచ్ చేస్తుంది జంబో. అలా ట్రైనింగ్ అయింది.

మాస్టర్ ఇప్పుడు మేడంతో నవ్వుతూ మాట్లాడుతున్నాడు.

ఇద్దరివైపూ మార్చిమార్చి చూసింది జంబో. వాళ్ళేదో వేరే లోకంలో ఉన్నారు. తనని పట్టించుకోరు అనిపించింది.

గుర్రుగా చూస్తూ ఇవతల కొచ్చేసింది జంబో.

ఈ మనుషులింతే ఎప్పుడెలా ఉంటారో తెలీదు అన్నట్టు తల విదిలించింది. అవతలికి ఒక్క జంప్‌తో దూకి పచ్చటి పచ్చికలో వెల్లకిలా పడి సూర్యరశ్మిని ఎంజాయ్ చేస్తూ దొర్లుతూ ఉండిపోయింది.

●●●

"లవర్ ఎందుకు కావాలి? హజ్బెండ్ ఎందుకు వద్దూ అంతే.. ప్రేమంటే నమ్మకం ఉంది. పెళ్ళిమీద నమ్మకం లేదు." అంది అనన్య మనసులో మాటని విడమరిచి చెబుతూ. "అయితే పెళ్ళిచేసుకోను అనడంలేదు.. అటువంటి కమిట్‌మెంట్‌కు ముందు ఖచ్చితంగా స్పష్టంగా అతను లవర్ అయి ఉండాలి. పెళ్ళవగానే అధికారం వచ్చి లవర్ కాస్తా హజ్బెండ్ అయిపోయే అవకాశం ఉంది. అలాగ జులుం చెలాయించడనే గ్యారంటీ ఉంటేగాని. అయ్ కాంట్ యాక్సెప్ట్!"

ధీరేంద్ర కన్‌ఫ్యూజ్ అయ్యాడు. "ట్రై చేస్తాను అన్నాను. బట్ నాకే సందేహంగా ఉందిప్పుడు. మొదట్నుంచీ నీ మీద జులుం చేస్తూనే వచ్చాను. అఫ్ కోర్స్. దట్స్ ఫర్ డిఫరెంట్ పర్సస్. మరి నేనేమీ గ్యారంటీ ఇవ్వలేకేమో కదా!"

ఒక మహారాణి తన ఎదురుగా నిలుచున్న సామంత రాజును చూసినట్టు చూసింది అనన్య "ఇప్పుడు మేం అడగలేదు"

"ఇంతకీ వైశాలి గారికి పెళ్ళి అంటే అంత అగౌరవం. సస్పిషన్.. ఎందుకో?"

"ఓ దట్స్ బికాజ్ ఆఫ్ మై మమ్మీడాడీ. నేను చిన్నగా ఉన్నప్పుడే వాళ్ళు విడిపోయారు. మమ్మీ లండన్‌లో డాడీ ఎక్కడో జర్మనీలో సెటిల్ అయ్యారు. అని ఎవరెవరో చెప్పారు. బట్ అయ్ డోంట్ నో. వాళ్ళు మళ్ళీ వేరే మ్యారేజెస్ చేసుకున్నారు. ఎక్కడున్నారో ఏమిటో నాతో టచ్‌లో కూడా లేరు"

"సారీ వెరీ సారీ"

ఇంకా చెప్పుకొచ్చింది అనన్య. తన ఒంటరి జీవితం. హాస్టళ్ళలో మగ్గిన వంటరితనం. ఎవరో దూరపు బంధువుల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడడం చదువుకూ ఉద్యోగానికీ స్ట్రగుల్. స్నేహాల్లో అంతరాలు. ప్రేమలో గాయాలు. దాచకుండా అన్ని చెప్పుకొచ్చింది.

"వన్ గై లవ్డ్ మీ నో డియర్లీ.. బట్ చివరికి నా శీలాన్ని శంకించాడు"

"పెళ్ళికాదు కదా?"

అనన్య ముఖం ఎర్రబడింది. ఎందుకు ప్రస్తావించానా అనిపించింది.

"కన్నెపిల్లే కావాలని నేను అనుకోలేదులే" అన్న వాసూ కఠోరమైన స్వరం సముద్రపు హోరులా ప్రతిధ్వనించింది.

"ప్లీజ్ లీవిట్. దట్స్ డిఫరెంట్!"

అంతలో అతని మొబైల్ మోగింది. నంబర్ చూసుకుని "హలో" అంటూ అవతలికి వెళ్ళాడతను.

అంతా చెప్పుకునేసరికి మనసంతా కెలికినట్లయింది అనన్యకు. వింటూ వింటూ అతను వ్యక్తం చేసిన సానుభూతి ఎంతో ఊరట కలిగించింది. "దిస్ గై హాజ్ సంథింగ్ ఇన్ హిమ్!" అనిపించింది.

లోతైన మనిషి. నమ్మదగిన మనిషి. మొండిమనిషి.

కానీ అతను తనను నమ్మడు. అదే సమస్య.

ఫోన్ కాల్స్ మాట్లాడి మాట్లాడి హడావుడిగా వచ్చాడు ధీరేంద్ర.

"మాటల్లో మనం టైం మర్చిపోయాం తెలుసా? ఆకలెయ్యట్లేదూ? కాని నేను అర్జెంట్ గా బైటకెళ్ళాలి."

"ఎక్కడికి?" అని అడిగేసి ఎందుకు అడిగానా అనుకుంది అనన్య.

చురుగ్గా చూసి జవాబు చెప్పకుండా హడావుడిగా బైటకెళ్ళడానికి తయారయ్యాడు. "కొంచెం టైం పడుతుంది. ఈవినింగ్‌కి వచ్చేస్తాను గాని. ఏదైనా చేసుకుని తిను. ప్లీజ్. టేక్ కేర్!"

తొందర తొందరగా వెళ్ళిపోయాడు. రెక్కలొచ్చి ఎగిరిపోయినట్టు స్కార్పియో దూసుకుపోయింది. "వాచ్ హర్!" అన్నాడా? అనలేదా? కారు శబ్దంలో వినిపించలేదు.

కమెండోలా దూసుకొచ్చి గుమ్మంలో ప్రత్యక్షమైంది జంబో.

ఓగ్గాడ్! వాట్ ఎ డాగ్!

●●●

హఠాత్తుగా అతను వెళ్ళిపోయేసరికి శూన్యం ఆవరించింది. ఒంటరిగా ఆ ఇంట్లో ఎలా ఉండడం? గుమ్మంలోంచి కిటికీల్లోంచి కనిపించే ప్రకృతిని చూసి చూసి విసుగెత్తింది. చుట్టూ నిశ్శబ్దం తప్ప మరేం లేదు. ఎప్పుడో ఎక్కణ్ణుంచో పక్షికూతలు. అంతే. గాలి కదలదు. చెట్లు బొమ్మల్లా ఉండిపోయాయి. ఆకాశం మబ్బులేకుండా అనంతంగా అసందర్భంగా ఉంది.

గుమ్మంలోంచి బైటికెళితే జంబో అభ్యంతరం చెప్పలేదు. కానీ ఫాలో చేస్తూ ఉండిపోయింది. దాన్ని వదిలించుకుని పారిపోవడం అసాధ్యం.

బంగ్లాలో తచ్చాడి అలిసిపోయింది. ఆకలి లేదు. దప్పికా లేదు. ఒంటరితనం నిస్సారం. ఊటీ అయినా దుర్భరం.

టీవీ ఉందికాని ఛానల్స్ రావు. కంప్యూటర్ లేదు. ఫోన్ లేదు.

డివిడి ప్లేయర్ చెక్ చేసి ఏదో ఇంగ్లీష్ సినిమా పెట్టుకుని చూసింది. కాస్సేపటికే బోర్ కొట్టి ఆపేసింది.

వేడిగా కాఫీ చేసుకుని తాగుతుండగా అనుమానం వచ్చింది.

ఎక్కడి కెళ్ళాడు? ఎందుకెళ్ళాడు ధీరేంద్ర?

ఇది వరకు చిత్ర చెప్పిందే నిజమైతే అతని తాలూకు గ్యాంగ్ ఏదో ఊటీలో ఉండాలి. వాళ్ళెవరో ఫోన్ చేసి ఉండాలి.

ఆధారం లేని ఆశకు రెక్కలు వచ్చినట్టు ఒక్క మెరుపు మెరిసింది.

అసలైన చిత్ర దొరికిందా? ఎక్కడో దొరికిపోయిందా?

ధీరేంద్రకి చిత్రగా దొరికిన తను అసలైన చిత్రకాదని అతనికి అనుమానం రాగానే అతని అనుచరులకు ఆదేశాలు వెళ్ళి ఉండాలి. అంచెలంచెలుగా అటూ ఇటూ మైసూర్, హైదరాబాద్, కోయంబత్తూర్ రూట్ లందు నిఘాపెట్టి ఉండాలి.

ఎక్కడోగాని ఎలాగో గాని అసలైన చిత్ర దొరికిపోయే ఉండాలి.

అందుకే ధీరేంద్ర రిలాక్స్ అయి తనతో 'లవ్‌టాక్'లో పడ్డాడా?

ఒక్కసారిగా మనసు ఉల్లాసంగా ఎగిరిపోయినట్లయింది. కాని అనుమానాలు అంత తేలిగ్గా వదలవు.

సస్పెన్స్ వదలాలంటే ధీరేంద్ర తిరిగికావాల్సిందే

ఎదురుచూస్తూ కూర్చుంది అనన్య. ఇంకో రకంగా కూడా ఎదురుచూస్తోంది. 'లవ్' అంటోంది మనసు.

●●●

## 15

**"లవ్" అంటున్నది అనన్యకాదు. చిత్ర కాదు వైశాలి! ఎవరీ వైశాలి?** ఎక్కణ్ణుంచి వచ్చింది ఈ వైశాలి? అనాది స్త్రీ శక్తి మనస్సులో అగాధాల్లో వసంతాల్లో మత్తుగా ఆర్తిగా పొర్లుతున్న ప్రేమమూర్తి వైశాలి!

"అయ్ లవ్ యూ.. వైశాలీ" అనుకుంది అనన్య అసంకల్పితంగా.

"అయ్ నీడ్ లవ్! ఆల్ అయ్ నీడ్ ఈజ్ లవ్!" అన్నది వైశాలి గొంతు.

ప్రేమ కావాలి అంతులేని ప్రేమ కావాలి. షరతులు లేని ప్రేమ కావాలి! లవ్!

కొండలమీద నీడలు కదులుతుండగా ఎదురుచూస్తూ కూచుంది అనన్య. బాల్కనీలో అటూ ఇటూ తిరుగుతూ కలవరపడింది.

పారిపోవాలనుకున్న అనన్య ఎదురుచూస్తూ ఉందిప్పుడు. నరకం నుంచి పారిపోవాలనుకుంది. ఇప్పుడా నరకమే స్వర్గం అనిపిస్తోంది.

ఇక్కడే ఉండాలి. ఇతనితోనే ఉండాలి అనిపిస్తోంది. ఇతను ఎవరైనా కానీ, ఇతనితో ఏమైనా కానీ తను ఏమైనా అయిపోనీ ఇతనే ఇతనే కావాలి అని గుండెకొట్టుకుంటోంది.

కాస్సేపు కనిపించి కాస్సేపు మాయమైపోతోంది జంబో. బంగ్లా మీద కన్నేసే ఉందేమో. దాని కళ్ళుగప్పి పారిపోవాలని అనిపించడంలేదు.

ఇద్దరు మనుషుల మధ్య ద్వేషం కాస్త స్నేహంగా మారడానికి ఆ నోరులేనితోనే సాక్ష్యం. దానికి ప్రేమ తెలుసునేమో? ఆశ్చర్యపోతుందేమో?

ఆకలి అనిపించక అలాగే గడిపేసింది అనన్య. కాస్సేపు బెడ్‌లో పడుకుని దుప్పటి ముసుగు తన్నేసి మత్తుగా పొర్లుతూ గడిపింది. చిన్న అలికిడి అయినా అది కారు శబ్దమేమో అనుకుని ఉలిక్కిపడింది. అతని అడుగుల శబ్దమేమో అని ఉత్కంఠతో ఎదురుచూసింది.

సాయంత్రమైంది. అతను రాలేదు. చీకటి పడింది. చుక్కలు పొడుచుకొచ్చి వెక్కిరించాయి. చలిపెరిగింది. దిగులు అనిపించింది. అతను రాలేదు భయమేసింది. అతను రాడా అనిపించింది. బంగ్లాలో లైట్లు వేసుకుని టెన్షన్‌తో పరిపరివిధాల పోయింది. తన సంగతి మరిచేపోయాడా? ఇలా విధించాలనుకున్నాడా?

జంబో హఠాత్తుగా వచ్చి బంగ్లా అంతా అటూ ఇటూ తిరిగింది. అనన్యకేసి ఎగాదిగా చూసి ఏదో అడగబోయినట్టు కుయ్యి కుయ్యిమని మానేసింది. మళ్ళీ వెళ్ళిపోయింది.

"వేరీజ్ మాస్టర్?" అని అనన్య అడుగుతున్నా అది వినిపించుకోలేదు.

ఒంటరిగా దిగులుపడుతూ ఉండిపోయింది అనన్య. రాత్రి ముదిరింది. ఒక్క విసురుతో వర్షం మొదలయింది.

●●●

కాళ్ళలో కోరలు దిగబడ్డాయి. ముడుచుకుపోయి పడుకున్న అనన్య కాళ్ళను పీకిపెట్టి లేపింది జంబో.

ఉలిక్కిపడి లేచింది అనన్య. చలి జివ్వున కొట్టింది. జంబో అవతారం భీకరంగా ఉంది. అది పూర్తిగా తడిసిపోయి ఉంది. ఒళ్ళంతా బొచ్చు అణిగిపోయి ఒక గొంగళిని ఉండ చుట్టినట్టుగా ఉంది. దాని కళ్ళు మామూలుగా లేవు తీవ్రంగా మెరుస్తున్నాయి. ఎలర్ట్‌గా ఉన్నా ఆందోళన కనిపిస్తోంది.

ఎగిరిపడి అనన్యను చేతులమీదా నడుము మీదా గోకేసింది. "జంబో వాటీజ్ దిస్? ఏమైంది? ఏంటీ?"

అంటుండగానే అనన్య మనస్సులో అలారం మోగింది.

జంబో అసహనంగా లాగేస్తోంది. వెంట రమ్మని అర్థం. వెంటే వెళ్ళింది అనన్య. బైట జోరున వర్షం. విసిరి కొడుతోంది.

వర్షంలోకి దూకింది జంబో. నువ్వు రావా అన్నట్టు అనన్య కేసి దిగులుగా చూసింది.

"అరే. ఏమైందీ? మాస్టర్ ఎక్కడా?" అంటూనే వర్షంలోకి దూకింది అనన్య. వెన్నులో చలి మెలికలు పడింది.

దూకుతోంది జంబో. ఆగి వెనక్కి చూస్తోంది. అనన్య గుండె లయ తప్పింది. చీకట్లో వర్షాన్ని చీల్చుకుంటూ జంబో వెంట వెళ్ళింది. బంగ్లా గేటు దాటి రోడ్డు మలుపు దాటికిందకి దిగి ఎంతెంత దూరం.

అక్కడ కారు హెడ్ లైట్ల ఫోకస్ అవుతూనే ఉన్నాయి. చెట్టుకు ఢీ. డ్రైవింగ్ సీట్లో అచేతనంగా ఒదిగిపోయి ఉన్నాడు ధీరేంద్ర.

"ధీరూ! ధీరూ!" అనన్య గొంతు పూడుకుపోయింది. జంబో ఎగబడి చూస్తోంది.

అతని చెయ్యిపట్టి నాడి చూసింది అనన్య. దగ్గరగా చెవిపెడితే గుండెలయ వినిపించింది. అమ్మయ్య అనుకున్నా ఆదుర్దా ఆగలేదు. స్టీరింగ్ కొట్టుకుని అతని నుదురు చిట్లి గాయమైంది. పైకన్నా లోపలికే ఎక్కువ గాయమైనట్టుంది. షాక్ వదల్లేదు. స్పృహ లేదు.

ఇంజన్ ఆఫ్ అయి ఉంది. అతను సీటునుంచి పక్కకి ఒరిగిపోయి ఉన్నాడు.

ఆపదలో ఎలర్ట్ అయిన అనన్య మనస్సు అతివేగంగా పనిచేసింది. ఎలా సాయం చెయ్యాలా అని జంబో ఆరాటపడుతోంది. అరిచి కేకలు పెట్టినా చుట్టూ ఎవ్వరూ లేరు, రారు.

చీకట్లో మెరుపు "థేంక్ గాడ్" అనుకుంది అనన్య. డ్రైవింగ్ వచ్చి ఉండడం ఎంత మంచిదైంది. స్కార్పియో ఎప్పుడూ నడపలేదు. మారుతి 800 చాలాసార్లు నడిపింది. శాంత్రోతో కూడా డ్రైవ్ చేసింది. అదీ చాలా రోజుల క్రితం. అయినా ఇప్పుడు తప్పదు.

ధీరూని ఒడుపుగా లాగి పక్క సీటుకి చేర్చి సర్దడానికి అరగంట పైనే పట్టింది. తర్వాత గుండె దిటవు చేసుకుని కారు స్టార్ట్ చేసింది. లక్కీగా స్టార్ట్ అయింది. బానెట్ బాగా పాడైంది. ఇంకేమీ కాలేదు.

ఇదివరకు మిట్టమీదనుంచి కిందకి రోడ్డు దిగి చెట్టును ఢీకొట్టి ఆగింది కారు. చెట్టుకే గనుక తగలకుంటే ముందు లోయలోకి వెళ్ళిపోయేది. ఇప్పుడు అనన్య ఫీట్ చెయ్యాల్సి వచ్చింది. రివర్స్‌లో కారు మళ్ళీ రోడ్డెక్కించాలి. అదీ అలవాటు లేని కారు. చెట్టునుంచి వెనక్కి వెళ్ళాక మంచి గ్రిప్‌తో డ్రైవ్ చెయ్యకపోతే మళ్ళీ చెట్టుకే ఢీ. లేదా సరాసరి లోయలోకి.

అంత చలిలో అంత వానలో కూడా ముచ్చెమటలు పోశాయి.

***మహిమలు అద్భుతాలు ఉన్నాయో లేవోగాని మనిషి శక్తి సమయానికి సరిగ్గా పనిచెయ్యడమే అసలైన మహిమ అసలైన అద్భుతం.***

బండి రోడ్డెక్కేసింది. జంబో చెంగున లోపలికి గెంతింది.

కారు దూసుకుపోయింది.

●●●

చెట్టంత మనిషి అపస్మారకంలో ఉన్నాడు. అతణ్ణి కారులోంచి దించి బంగ్లాలోకి చేర్చడం ఎలా? కుండపోత వర్షం పెరుగుతోందేకానీ తగ్గడం లేదు. ఒక్క జంబో తప్ప వేరే తోడు లేదు. అది ఏం చేస్తుంది? ఎగాదిగా చూస్తుంది. తోక తిప్పుతూ అటూ ఇటూ తిరుగుతూంది. మూగగా రోదిస్తోంది. గుర్ గుర్ మంటోంది. హఠాత్తుగా దానికే గనుక మనిషి రూపం వస్తే అమాంతం ధీరూని మోసుకెళ్ళిపోదూ?

"ధీరూ ధీరూ" అని ఎంతగా తట్టిలేపినా అతను కదల్లేదు మెదల్లేదు. ప్రాణం ఉన్న బొమ్మలా పడిపోయే ఉన్నాడు.

అతి కష్టం మీద మెల్ల మెల్లగా లాగి జరిపేసరికి కారు డోర్ పక్కనుంచి ఒక మూటలాగా కిందికి దొర్లి పడిపోయాడు.

వర్షం అతని మీదే దాడి చేస్తోంది. ఈటెలు దిగినట్లు దిగుతోంది. అయితే అదే అదృష్టమన్నట్లు చినుకుల ధాటికి ధీరూ కొంచె కదిలాడు. మూలిగాడు.

అనన్యకు ధైర్యం వచ్చింది. ప్రకృతి ఇలా సహకరిస్తోంది అనిపించింది.

"ధీరూ ప్లీజ్ కొంచెం కొంచెం లే. డోంట్ వర్రీ నేనొచ్చాను. బంగ్లా దగ్గరికొచ్చాం. యూ ఆర్ సేఫ్. యూ విల్ బీ ఆల్ రైట్" అంటూ ఆదుర్దాగా అతణ్ణి లేపడానికి శక్తినంతా ఉపయోగించింది.

ఆ మాటలే తన భాషలో చెపుతున్నట్టు జంబో కుయ్యి కుయ్యిమంటూ ధీరూ వళ్ళంతా గోముగా రాసేస్తూ అందిన చోటల్లా నాలుకతో తడిమింది.

అది కూడా పనిచేసినట్టు ధీరూ ఇంకాస్త కదిలాడు. లేవదీయబోతే కొంచెం తనూ లేవడానికి ప్రయత్నించాడు.

"జస్ట్ ట్రై ధీరూ. యూవిల్ మేకిట్. నాలుగడుగులు లోపలి కెళదాం. బంగ్లా లోపలికి కమాన్ ధీరూ"

స్మారకం లేకున్నా ఆ మాటలు అతనిలోకి దిగుతున్నాయి. మూలుగుతూనే కదిలాడు. అనన్య పొదవి పట్టుకుని కదిలేసరికి అతనూ కాళ్ళు నిలదొక్కుకుంటూ లేచాడు.

పూనకం వచ్చినట్టు ఊగిపోతూ అతణ్ణి లాగింది అనన్య. ఒక్క ఉదుటున లేచాడు. ఆమె భుజాల మీద ఒరిగాడు. ఆ బరువుకి అనన్య తూలింది.

అయినా అతని బరువును మోస్తూ నడిచింది.

మెట్లెక్కబోతూ ఇద్దరూ పడిపోయారు.

జంబో అసహాయంగా ఆదుర్దాపడింది.

అనన్య కోలుకుని శక్తి కూడదీసుకుని మళ్ళీ ధీరూని లేవదీయడానికి పావుగంట పట్టింది. "గాడ్. హెల్ప్ మీ" అని ప్రాధేయపడింది. ఇదే ఆఖరు అన్నట్టు శక్తినంతా చేతుల్లోకి దూకించి "ధీరూ కమాన్" అంటూ లాగింది. అద్భుతం జరిగింది. నిద్రలో నడిచినట్లు అతను అనన్య మీద ఒరిగిపోతూ అడుగులో అడుగు వేస్తూ మెట్లెక్కేశాడు "థేంక్ గాడ్"

జంబో ఛెంగు ఛెంగున దూకింది.

కాస్సేపట్లో ధీరూని బెడ్ మీద పడేసి వగరుస్తూ అతనివైపు చూసింది అనన్య.

ఇతనెవరు? నేనెవరు? ఇదంతా ఎందుకిలా జరిగింది?

నీటి బొమ్మలా వణికిపోతూ నిలుంది అనన్య. ఇప్పుడే కొత్తగా చూస్తున్నట్టు అతని వంటి మీద చెయ్యేసి చూసింది. కాలిపోతోంది. మూలుగుతున్నాడు.

ఏమైందతనికి? లోలోపల ఏమైంది? షాక్‌తో ఏమైంది? ఎలా కోలుకుంటాడు?

చకచకా కదిలింది అనన్య. కాపాడాలి. అనుకోగానే కాపాడుకోవాలి అని వినిపించింది ప్రతిధ్వని.

కాపాడుకోవాలి.

●●●

క్షణక్షణం అతనికి సపర్యలు చేస్తూ ఉండిపోయింది అనన్య. చకచకా తన బట్టలు మార్చుకుంది.

బెడ్ మీద స్పృహ లేకుండా ఉన్న అతణ్ణి అటూ ఇటూ కదిలించి తడిబట్టలు తీసెయ్యడానికి విశ్వప్రయత్నం చెయ్యాల్సి వచ్చింది.

ఆచ్ఛాదనలు తొలిగించాక అతని శరీరాన్ని చూసిన కొద్దీ అలాగే చూస్తూ ఉండాలనిపించింది. సిగ్గుపడకుండా చాలాసేపు అలా చూసింది. ఎందుకంటే అతను స్పృహలో లేడు కాబట్టి. కానీ సిగ్గనే అనిపించింది.

కోరికకు మూలం శరీరమా? మనసా?

శరీరం లేనిదే మనస్సు ఎక్కడ ఉంటుంది?

అతనికి పొడి బట్టలు ఎలాగో చుట్టబెట్టింది. వేడి వేడి నీళ్ళతో ముఖం మీద టవల్‌తో అద్దింది. అరచేతులూ పాదాలు రబ్ చేసింది.

బైట వాన తగ్గనే లేదు. ప్రకృతి తమాషా చూస్తున్నట్టు కవ్విస్తూ కురుస్తోంది. తెరపి ఇవ్వడం లేదు.

ఒక దుప్పటి కప్పుకుని ముళ్ళబైటకెళ్ళి కారు నుంచి ఫస్ట్ ఎయిడ్ కిట్ పట్టుకొచ్చింది. ధీరూ నుదిటి మీద గాయాన్ని శుభ్రంగా కడిగి బాండ్ ఎయిడ్ వేసింది.

అయితే అతని జ్వరం తగ్గలేదు. తల చిన్నగా షేక్ అవుతోంది. షాక్ నుంచి ఇంకా కోలుకోలేదా? మెడ దగ్గర వెన్నుపూసలకు ఏమైన్ డామేజ్ జరిగిందా? అతని బట్టల్లో సెల్ ఫోన్ కోసం ఎంత వెదికినా దొరకలేదు.

తెల్లారేదాకా ఏ ఉపద్రవం లేకుండా ఎలా చూసుకోవాలి?

అంతసేపూ హైరానా పడుతు అటూ ఇటూ తిరుగుతూనే ఉంది జంబో.

''ఓకే జంబో మాస్ట వ్ల్ బీ ఆల్‌రైట్'' అనేసరికి అది తోక ఊపుతూ ఆనందం ప్రకటించింది.

ధీరూ సన్నగా మూలిగాడు. ఏదో కలవరించాడు ఛాతీ వణికింది కనురెప్పల కింద కళ్ళు అసహనంగా కదిలాయి. ఏమౌతుంది?

కోమాలోకి వెళ్ళిపోతాడా? హాస్పిటల్‌కి ఎలా తీసుకెళ్ళాలి ఇప్పుడు? చూస్తూ కూచుంది అనన్య. ఊటీ వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా జరిగినవన్నీ చిత్రంగా కళ్ళముందు మెదిలాయి.

లవర్ కోసం కలవరింత. పిచ్చిగా ఆర్తిగా అన్వేషణ. చిత్ర హఠాత్తుగా పలకరించడం. వేషాల మార్పు. ధీరూను బ్లఫ్ చెయ్యడం అనన్య - చిత్ర. చిత్ర... అనన్య. మెలికలో మెలికలు. అనుమానాలు. అవమానాలు. శత్రుత్వం నుంచే పుట్టుకొచ్చిన స్నేహం నమ్మకం విశ్వాసం .

పారిపోవచ్చు. అయినా పారిపోలేదు. ఎందుకు? ఎందుకు?

ప్రేమకావాలా? ఎవరు ఎవరికిస్తారు? ఎవరు తీసుకుంటారు?

దుప్పటికప్పినా వణుకుతూనే ఉన్నాడు ధీరూ.

పాలు వేడి చేసి తెచ్చి నెమ్మదిగా స్పూన్‌తో తాగించాలని ప్రయత్నించింది. లాభం లేదు. అతను పూర్తిగా స్పృహలో లేడు స్పూన్ పెదవి దగ్గర పెట్టినా అతనికి తెలియడం లేదు.

భయమేసింది. ఇప్పుడేమీ చెయ్యకపోతే అతను ఏమైపోతాడు? ఏమైనా అయితే ఎవరిది బాధ్యత.

ఎప్పుడో చూసిన సినిమా సీన్‌లూ నవలల్లో దృశ్యాలూ గుర్తొచ్చాయి.

లైఫ్ ఈజ్ స్ట్రేంజర్ దాన్ ఫిక్షన్ ఇంతకన్న, చిత్ర కథ ఏముటుంది?

అనుకోకుండా కాదు అనుకునే అతనికి చేరువ అయింది. అరచేతుల్తో అతణ్ణి తడుముతూ దుప్పట్లోకి దూరింది.

మనిషికి మరో మనిషి.

మగ మనిషికి ఆడమనిషి. మగ..ఆడ.

అయితే సెక్స్. సెక్స్ కాకుంటే ఆర్తి. తల్లీ బిడ్డ ఫ్రెండ్స్. ఎవరైనా ఎలా అయినా స్పర్శ కావాలి.

నరనరానికీ తెలియాలి. నీ కోసం ఒకరున్నారు. ఇదుగో ఉన్నారు. తోడుగా. వెచ్చగా.

జంబోకు అంత కల్చర్ ఎలా వచ్చిందో మరి. నెమ్మదిగా అవతలికి తప్పుకుంది.

●●●

జ్వరం సుడి తిరిగింది. ఇద్దరినీ చుట్టేసింది. వేడి వర్షం కురుస్తునే ఉంది. 'ధీరూ ధీరూ' అంటూ అల్లుకుంది అనన్య.

మంచుకొండల అదుగున స్త్రీ శక్తి ఆర్తిగా కదులింది. ఎవరో కావాలి అనుకున్నాను. నువ్వేకావాలి నీకు నేను వద్దా నువ్వు వేరా? నేను వేరా? '' ధీరూ ధీరూ''

అతను మూలుగుతున్నాడు. చాలాసేపటికి చైతన్యం వచ్చినట్టు కదిలాడు. వెచ్చదనం చొచ్చుకున్నట్టు ఉలిక్కిపడ్డాడు.

''ధీరూ.. ధీరూ!''

''ఊఁ'' అని పలికాడు.

''నేను ధీరూ. నేను. అనన్యని..''

''ఆఁ?''

''చిత్రని.''

''ఆఁ హాఁ?''

''కాదు. అనన్యని''

నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. ''ఎవరూ?''

అతనికేమీ తెలియడం లేదు. మెదడు మీద తల బరువు ఉన్నట్టు నుదురు చిట్లించాడు.

''నేను చిత్రని..''

''ఊఁ'' తల విదిలించాడు. కళ్ళు చిట్లించి చూశాడు. కళ్ళలోకి తెలివి వచ్చింది.

''ఊఁఊ''

''ధీరూ. నేను చిత్రనే ఎస్!''

ఈసారి మాటకూడా సరిగ్గా వచ్చింది ''నువ్వు చిత్రవి కాదు. సారీ.. అసలు చిత్ర దొరికింది. దొరికిపోయింది.. సారీ!''

ఎక్కడో పిడుగులు పడ్డాయి. జ్ఞానోదయం అయింది.

''బోంబేలో ఎయిర్ పోర్ట్‌లో పట్టుకున్నారు. ఫేక్ పాస్‌పోర్ట్‌తో పారిపోతుంటే పట్టుకుని అరెస్ట్ చేశారు. మా వాళ్ళకి మెసేజ్ వచ్చింది. వెరీ వెరీ సారీ.. అయాం రియల్లీ సారీ''

గబుక్కున చుట్టుకుంది అతణ్ణి. ''ఓగ్గాడ్! గాడ్!''

అతను అలిసిపోయి వగరుస్తున్నాడు. ఆర్తిగా అల్లుకుంది అనన్య.

''నో.. నొ.. నేను. నేను అనన్యని ధీరూ జస్ట్ అనన్యని. నీకు తెలుసా? నేను నీ అనన్యని..''

పిచ్చిపిచ్చిగా మెరుపులు మెరిసాయి. వెలిగిపోతూ నవ్వాడు ధీరూ. ''నో నువ్వు అనన్యవి కాదు.''

''మరి?''

''అయ్ సీ. యూ. .. యూ ఆర్. వైశాలి..రైట్?

''నా వైశాలి.. రైట్?''

''ఎస్! నీ వైశాలి..ఎస్''

తొంగిచూసి అవతలికి వెళ్ళిపోయింది జంబో. వరండాలో సంతోషంగా గంతులు వేస్తోంది.

తెల్లార్లూ వర్షం కురుస్తూనే ఉంది.

## సమాప్తం